॥ గీతోపనిషత్ ॥



- మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 2వ అధ్యాయము - సాంఖ్య యోగము)

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ", డా|| కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "*జగద్గురు మందిరము*" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "*పరహితము పరమధర్మ*" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

ముందుమాట

భగవద్గీత సర్వోత్కృష్టమైన గ్రంథము. కర్మాచరణమునకు, ధర్మాచరణమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు, మోక్షపదమునకు ప్రామాణిక గ్రంథము. భగవద్గీతపై అనేకానేక వ్యాఖ్యానములు గలవు. ఇకపైన గూడ రాగలవు.

నావాణి యందు గీతా వ్యాఖ్యానము, "గీతోపనిషత్" అను శీర్షికగా పాఠకులకు అందింపబడినది. ప్రతి అధ్యాయము తనదైన సందేశము నందించుట గీతయందలి విశిష్టతయగుటచే అధ్యాయమున కొక పుస్తకముగా సామాన్య పాఠకులకు భగవంతుని సందేశము నందించు ప్రయత్నము "ధనిష్ఠ" సంకల్పించినది. మాస్టర్ పార్వతీకుమార్ గారిచే అందించబడిన వ్యాఖ్యానము సామాన్యులకు కూడ స్ఫూర్తి కలిగించు విధముగ నుండుటచే ఈ ప్రచురణ చేపట్టితిమి. మొదటిగ సాంఖ్యయోగము ముద్రించుటకు సంకల్పించితిమి. మిగిలిన ఆధ్యాయములు గూడ కాలక్రమమున ప్రచురించ బడగలవు.

– ధనిష్ఠ

పరిచయము

భగవద్గీత యోగశాస్త్రము. అందు బ్రహ్మవిద్య నిక్షిప్తమై యున్నది. అది ఉపనిషత్తు కూడ. భగవద్గీత యందు జ్ఞానపరముగ తెలుపబడని విషయము లేదు. ఆచరణాత్మకముగ గూడ తెలుపబడని విషయము లేదు. అది పరిపూర్ణ గ్రంథము. పురాణ పురుషుడు శ్రీకృష్ణుడు మానవుల నుద్దేశించి యిచ్చిన యోగమార్గమది.

భగవద్గీత యందు పదునెనిమిది అధ్యాయములు గలవు. పదునెనిమిది సోపానములలో జీవుడు దైవముగమారు మార్గము లేక జీవాత్మ పరమాత్మను చేరు మార్గము తెలుపబడినది. ప్రతి అధ్యాయమునందు సృష్టి రహస్యమొకటి తెలుపబడినది. అవగాహనతో ఆచరించు జీవునకు మార్గము సుగమము.

గీత ఆచరణాత్మక గ్రంథమగుటచే ఆచరణమే ఈ మార్గమునకు ప్రధానము. పారాయణములు స్ఫూర్తి కొరకే. ఆచరణయే

వికాసము కలిగించును. యజ్ఞార్థము కర్మాచరణ మాచరించు వారికే భగవద్గీత తెలియనగును. ఇతరులకు పాండిత్యమునకే పనికివచ్చును గాని మార్గము లభ్యము కాదు.

నిత్యజీవితమున నిర్దిష్టమగు యోగమార్గమును అనుసరించుటకు, దివ్యానుభూతిని అనునిత్యము ఆస్వాదించుటకు దైవము యోగమార్గము నందించెను. కర్మము, ధర్మము, దైవము, సృష్టి విజ్ఞానము వివరింపబడినది. అసంగుడై సృష్టియందెట్లు దివ్య వైభవమును కొనియాడుచు జీవించదగునో తెలిపెను. ఇట్టి భగవద్గీత పరిష్కారము కోరు మానవునకు కరదీపిక.

ఆధునిక యుగమున గీతాసూత్రముల ఆవశ్యకత ఇందు గోచరించగలదు. ఈ వాఖ్యానములు పాఠకులకు స్ఫూర్తి కలిగించినచో ఈ ప్రయత్నము యజ్ఞార్థఫలమే కాగలదు.

- పార్వతీకుమార్

విషయ సూచిక

సందేశము

గీత, గంగ, గోవింద, గాయత్రి అను గకారముతో ప్రారంభింపబడు ఈ నాలుగింటి యందు ఏ ఒకటి యైనను హృదయము నందు స్థితి గొనినచో మానవుడు పునీతుడు కాగలడు. సాక్షాత్తు పరమపురుషుడే ఈ లోకమునకు దిగివచ్చి అందించిన అద్భుతమైన సందేశము భగవద్గీత. సంస్కృతము తెలియనివారు కనీసము గీతను అధ్యయనము చేయుట కొఱకైనను సంస్కృతమును నేర్చుకొనుడు అని జాతిపిత మహాత్మాగాంధీ ఉద్బోధించెను. ఈ గీతను అధ్యయనము చేయనివాడు సంస్కృతిని నిరసించినవాడే. అతడు భారతీయుడు కాజాలడు. భగవద్గీత బ్రహ్మవిద్యా సారము, సమగ్రమైన యోగము నందించు మార్గదర్శి. ఉపనిషత్తుల సమస్త సారమును గీతయందు దర్శించవచ్చును.

1

మనోవిజయము

శ్రీభగవా నువాచ :

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥ 2

భగవంతుని మొట్టమొదటి శాసనము కశ్మలమును వీడమని. "కుతస్త్వా కశ్మలమ్ ఇదమ్" అని శ్రీకృష్ణుడు ప్రశ్నించుచు తన దివ్యోపదేశమును అందించినాడు. కశ్మలం అనగా మనో వ్యాకులత్వము. అది మోహముచే కలుగును. దాని వలన శోక మేర్పడును. పిరికితన మావరించును. మనస్సు మలినము చెందినదై సమస్తమును గజిబిజి చేయును. అనాచార్యము నాదరించుట జరుగును. స్వర్గము అనగా సువర్గము. అనగా వైభవము నుండి పడద్రోయును. అపకీర్తిని కట్టబెట్టును. ఎట్టి విపత్కర పరిస్థితుల యందును మనసు వ్యాకులము చెందకుండటయే స్థితి ప్రజ్ఞత్వము. భాగవతుల జీవితమున దీనిని ప్రస్ఫుటముగ గమనించవచ్చును. సులభముగ, త్వరితగతిని మనసు చెదరువారు బలహీనులు. వారిచే ఎట్టి ఘనకార్యములు నిర్వర్తింపబడవు.

“అనార్యము, నరకము, అపకీర్తి కట్టబెట్టు మనోవ్యాకులము నిన్నెట్లావరించినది?’’ అని భగవంతుడు అర్జునుని (నరుని అనగా మనలను) ప్రశ్నించుచున్నాడు. మనోవ్యాకులము నుండి విముక్తి చెందుటకు మార్గమును బోధించుచున్నాడు. కనుకనే భగవద్గీతకు మనో విజయమని కూడ పేరు కలదు.

2

మేలుకొలుపు (ఉత్తిష్ఠ)

క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే ।
క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥ 3

ఎట్టి పరిస్థితుల యందును క్లైబ్యమును పొందవలదని, హృదయ దౌర్బల్యము వలదని, అది క్షుద్రమైనదని, కర్తవ్యము నందు నిలబడుమని, పారిపోవలదని, భగవానుడు మరియొక శాసనము చేయుచున్నాడు.

నరుడు సహజముగ తేజోవంతుడు. కావున క్రీనీడలు లేక చీకట్లు క్రమ్ముటకు అవకాశములేదు. ఎంత నల్లమబ్బు అయినను తాత్కాలికమే కాని సూర్యునివలె శాశ్వతము కాదు. తాత్కాలికమగు సంఘటనల యందు తన సహజత్వమును కోల్పోవుట అజ్ఞానము. అర్జునుడు సహజముగ తేజోవంతుడు. పరాక్రమవంతుడు. పరంతపుడు అనగా శత్రువులను తపింప చేయువాడు మరియు పరమును గూర్చి తపించువాడు. అనగా దైవమును గూర్చి తపించువాడు. అట్టి తపము కారణముగ లోపల,

బయట శత్రువులు జయింపబడుదురు. దైవము అనగా విశ్వ వ్యాప్తమైన తేజము. దానిని గూర్చి తపించువానికి ధైర్యమెట్లు కలుగగలదు. దాని నుండి విడివడుట, తాత్కాలిక సన్నివేశమునకు ముడిబడుట కారణముగ అధైర్యము, మనో దుర్బలత్వము కలుగును. దైవమును ఆశ్రయించుటయే అట్టి సమయమున పరిష్కారము.

"పరంతపుడవైన ఓ నరుడా! కర్తవ్యమున మేల్కొనుము. క్షుద్రమైన హృదయ దౌర్బల్యమును వీడుము. అధైర్యమును పొందకుము. ఇది నీకు తగదు" అని భగవానుడు శాసించు చున్నాడు.

గమనిక : ఈ శ్లోకమున భగవానుడు నరుని 'పరంతపుడని' సంబోధించుటలో గంభీరార్థము కలదు.

3

శరణాగతి

కార్పణ్య దోషోపహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।
య చ్ఛ్రేయ స్స్యా న్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ 7

మనోవ్యాకులతను చెందినవాడు, మోహమున పడినవాడు, పిరికితనముచే భయము ఆవహించినవాడు, శోకతప్తుడు, హృదయమును దుర్బలత్వమునకు తాకట్టు పెట్టినవాడు, అవగాహనయందు తికమక గలవాడు, కర్తవ్యమును గ్రహింపలేనివాడు, విచక్షణను కోల్పోయినవాడు, ధర్మ విషయమున సందేహము కలిగి సంకటమున పడినవాడు, అట్టి విషమస్థితి నుంచి బైట పడుటకు తెలిసిన వారిని ఆశ్రయించవలెను. ఈ ఉపాయమును గీత నిస్సందేహముగ స్థాపించుచున్నది. గీతోపాయమును అందు కొనిన బుద్ధిమంతునకు తన గీత మారగలదు.

"శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్" (2-7) అని

అర్జునుడు కోరుటయే అతనికి తరణోపాయమును చూపినది. నేను నీకు శిష్యుడను, నన్నాజ్ఞాపింపుము, నిన్ను శరణు పొందితిని అని అర్జునుడు ప్రార్థించెను. తరించెను.

మనము కూడ క్లిష్ట సమయముల యందు పఠింపవలసిన ఏకైక మంత్ర మిదియే. భగవంతుని సంబోధించుచూ “నేను నీ శిష్యుడను, నిన్ను శరణాగతి చెందితిని, నన్ను శాసింపుము” అని మరల మరల ప్రార్థింపవలెను. ఈ ప్రార్థన ఎంత ఆర్తితో చేసినచో అంత పరిష్కారము దొరుకుటకు వీలుపడును. అర్జునుడు తానేమి చేయవలెనో తెలియగోరు చున్నాడు. చేసిపెట్టమని అడుగుట లేదు.

సోమరితనము కలిగినవాడు గురువు తనకు చేసిపెట్ట వలెనని ఎదురు చూచుచుండును. దారి చూపుటయే గురువు వంతుకాని నడచుట శిష్యుని వంతుయే. ఇట్టి గురుశిష్య సంప్రదాయమును అందించిన ఉత్తమమైన సంప్రదాయము మనది. శరణాగతి చెందిన శిష్యునకు గురువు బోధ చేయుటకు ఉన్ముఖుడగును. ఉపాయమును చూపిన గురువుయందు సందేహము పడుట కూడదు. సందేహమున్నచో గురువునే అడిగి పరిష్కరించు కొనవలెనుగాని, ఇతరులతో చర్చించుట, సంప్రదించుట నీచము.

అర్జునుడు కర్తవ్యమును సంపూర్ణముగ నెరుగుటకు శ్రీకృష్ణుని మరల మరల ప్రశ్నించెను. అది పరిప్రశ్నమే. “పరి

ప్రశ్నము చేయు శిష్యునియందు సద్గురువునకు వాత్సల్యము హెచ్చుగును. పరిప్రశ్నము లేక గురువును ప్రశ్నింపరాదు. పరిప్రశ్నము చేసినపుడు సద్గురువైనచో కోపము రాదు. గురువునకు కొన్ని అర్హతలు కలవు. సద్గురువు తపస్వి అయి వుండవలెను. తనను తాను తెలిసినవాడై వుండవలెను. ధర్మము నాచరించువాడై యుండవలెను.

ఈ గురుశిష్య సంబంధము అత్యంత పవిత్రము. దీనిని నిర్మలముగ నుంచుకొనుట శ్రేయస్కరము. క్లుప్తముగ నుంచు కొనుట మరియు శ్రేయస్కరము. బజారు కెక్కించుట కుసంస్కారము.

4

తృష్ణ - తృప్తి

న హి ప్రపశ్యామి మమాపనుద్యా
ద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్ ।
అవాప్య భూమా వసపత్న మృద్ధం
రాజ్యం సురాణా మపి చాధిపత్యమ్ ॥ 8

సంజయ ఉవాచ :

ఏవ ముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।
న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥ 9

త మువాచ హృషీకేశః ప్రహస న్నివ భారత ।
సేన యో రుభయోర్మధ్యే విషీదంత మిదం వచః ॥ 10

ప్రపంచమున నున్న సమస్తమైన ప్రతికూల శక్తులను అణచి వేసినను, దేవతలపై ఆధిపత్యమును సంపాదించినను, సమస్త సంపదలను పొందినను, పదవులను ఆక్రమించినను, ఇవి ఏవియును మనుష్యుని మానసిక అశాంతిని తొలగింపలేవని భగవద్గీత బోధించుచున్నది. "*నహిః ప్రపశ్యామి మాం అపనుద్యాత్ శోకం, ఉచ్ఛోషణమ్*" (2-8) అని అర్జునుడు పలికినాడు.

అర్జునుడు మహావీరుడు. అతని నామమే వైభవోపేత సంపదను సూచించును. ఇంద్రునితో సమానముగ భూమిపై వైభవముల ననుభవించినాడు. ఇంద్రుని సింహాసనమున కూడ 5 సంవత్సరముల పాటు ఇంద్రునితో కలసి ఆసీనుడైనాడు. స్వర్గలోకసుఖములను అన్నింటిని అనుభవించినాడు. మహావీరుడని పేరు పొందినాడు. సుందర రూపునిగ శ్లాఘింపబడినాడు. ఇహ లోకమున అతడు పొందని విజయముగాని, సౌఖ్యముగాని లేదు. అట్టివాడు 'ఉచ్ఛోషణం' అనగా మిగుల తాపము కలుగ చేయునట్టి 'శోకం' అనగా దుఃఖమును ఏ విధముగా పోగొట్టుకొనవలెనో? తెలియజాలక దీనుడై యుద్ధమున నిలబడి యున్నాడు. ఏది దుఃఖమును పోగొట్టగలదో దానిని తెలియకున్నానని భగవానునితో పలికినాడు.

పదవులు, బాహ్యసంపద, ఆధిపత్యము ఇత్యాదివి, మనుష్యునికి శాంతి నియ్యజాలవనియు, శాంతముగ నుండువానికి మాత్రమే అవి విభూతులుగ యుండుననియు గీత యందలి ఈ శ్లోకము ద్వారా తెలియనగును. హిరణ్యకశిపుడు, రావణుడు, అర్జునుని మించిన పరాక్రమవంతులు. వారు స్వర్గమును కూడ ఆక్రమించినారు. అయినప్పటికిని శాంతి కలుగలేదు.

బహిః కరణములద్వారా ప్రపంచమున సాధించబడునది ఏదియు అంతరంగమున శాంతిని స్థాపించలేదు. కేవలము అంతః కరణ శుద్ధిచే పొందు ఆత్మానుభూతియే శాంతిని, తృప్తిని ఇచ్చును. అంతః తృప్తిలేని వానికి బాహ్యపుష్టి, తుష్టి నియ్యజాలవు. ఈ విషయమున ప్రాచీనులు ఎఱుక కలిగి నిర్మలము, నిరాడంబరము

లగు జీవితము నేర్పరచుకొనినారు. నవీన యుగమున రజోగుణ దోషమున మానవుడు అంతులేని దాహమున పడినాడు. తృప్తిని వదలి తృష్ణతో ఆరాటపడుచు తిరుగాడుచు అమూల్యమైన జీవనమును వ్యర్థము గావించుకొనుచున్నాడు. ప్రాచీనులకన్న తనకెక్కువ తెలుసను గర్వమున పడినాడు. ఎక్కువ తెలిసి జీవితమున తక్కువ సుఖపడుట మరింత మూర్ఖత్వము. భగవద్గీత యందు ఈ శ్లోకమున, శ్లోకము యొక్క నిజస్వరూపము చక్కగ ప్రతిపాదింపబడినది. పరిశుద్ధ జీవనము, నిర్మలమైన మనస్సు, విశాల హృదయము, ఇత్యాది సద్గుణములను సాధించుకున్నవాడు అదృష్టవంతుడు.

5

నిజమైన తెలివి

శ్రీభగవా నువాచ :

అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాం శ్చ భాషసే ।
గతాసూ నగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥ 11

శోకింపదగని విషయములకై శోకించుట, శోకింపదగిన విషయములకై శోకింపకుండుట, జరిగిపోయిన విషయములను గూర్చి ఆలోచించుట, ప్రస్తుతమును మరచుట అను నాలుగు విధములుగా తెలివిగల మానవుడు కూడ తన జీవితమును చిక్కుపరచుకొను చున్నాడు.

నష్టము, తనవారి మరణము, అపజయము, అసౌకర్యము, అపనింద, యిత్యాది విషయములందు తెలివైన మానవుడు కూడ శోకించుట చూచుచున్నాము. భగవానుని దృష్టిలో అవి శోకనీయ మైన అంశములు కానేకావు. కాలము జీవితమున ద్వంద్వముగా సన్నివేశముల నందించుచుండును. కీర్తిని అనుసరించి అపకీర్తి, జయమును అనుసరించి అపజయము, లాభము ననుసరించి నష్టము, సౌకర్యము ననుసరించి అసౌకర్యము, జననము ననుస రించి మరణము వుండుట సృష్టి ధర్మము. వీని గురించి శోకించుట

తగదని గీతావాక్యము. కాలానుగతములై యివి వచ్చి-పోవు చుండును.

శోకింపదగిన ముఖ్య విషయము ఒకటి కలదు. ధర్మము ననుసరించ నపుడు శోకించవలెను. అది రాబోవు శోకములకు కారణము గనుక. అధర్మము నాచరించునపుడు శోకించవలెను. అదియునూ రాబోవు శోకలములకు హేతువు గనుక. వివేకము గల మానవుడు దీక్ష బూనవలసినది ధర్మము ననుసరించుట యందు. మనోవాక్కాయ కర్మలు ధర్మము ననుసరించునపుడు మానవుడు శోకించుటకు తావు లేదు.

ధర్మము కర్తవ్యము రూపమున ఎప్పటికప్పుడు గోచరిస్తూ వుంటుంది. కర్తవ్యము కాలము రూపమున ప్రస్తుతింప బడు చుండును. ప్రస్తుత మందించు కర్తవ్యమును ధర్మముతో ననుస రించుటయేగాని, మరియొక మార్గము యోగజీవనమున లేదు. జరిగిపోయిన విషయములను గూర్చి నెమరువేసుకొని దుఃఖించుట మిక్కిలి అవివేకము.

అర్జునునకు ప్రస్తుత కర్తవ్యము ధర్మయుద్ధము చేయుట. దానిని వదలి, మిథ్యావాదము చేయుట కర్తవ్య విముఖత్వమే. కర్తవ్యమునందు, దైవమునందు, ప్రస్తుతమునందు మేల్కొనమని గీతావాక్యము శాసించు చున్నది. అదియే నిజమైన తెలివి.

6

దివ్యజ్ఞానము

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
నచైవ న భవిష్యామ స్సర్వే వయ మతః పరమ్ ॥ 12

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాంతరప్రాప్తిః ధీర స్తత్రన ముహ్యతి ॥ 13

ఈ సృష్టియందు ఏ వస్తువుగాని ఒకప్పుడు లేకుండ ఇప్పుడు వుండుట సంభవింపదు. అట్లే ఇప్పుడుండి ఇకముందు ఉండకపోవుట కూడ సంభవింపదు. ఎప్పుడునూ అన్నియును వుండి యున్నవే కాని ఒకప్పుడు లేనివి కావు. ఒకే వస్తువు స్థితి మార్పులు చెందుచున్నప్పుడు ఆ వస్తువునకు అంతకు ముందు స్థితి లేకుండుట. క్రొత్త స్థితి ఏర్పడుట, అదియును మరల మారుట ఒక రసాయనికచర్యగ జరుగుచుండును. ఈ స్థితి మార్పు నిత్యము జరుగు చుండుటచే వుండుట, లేకుండుటగ వస్తువులు గాని, జీవులుగాని కనిపించుచుందురు.

బాలకుడు యువకుడైనపుడు ఇట్టి మార్పే జరుగుచున్నది. బాలకుడు లేకుండుట యువకు డుండుటగ ఒకే జీవుడు

ప్రస్తుతింపబడి యున్నాడు. అటులనే యువకుడు మధ్య వయస్కుడు, వృద్ధుడు అగుట, మరణించుట కూడ గమనించు చున్నాము. మరణించినవాడే మరల పుట్టుచున్నాడని తెలియుటకు సూక్ష్మలోకముల అవగాహనము, దర్శనము కలిగి యుండ వలెను. అది తెలిసినవాడు జీవుడు శాశ్వతుడనియు, సూక్ష్మ స్థూల స్థితులు పొందుచుండుననియు తెలియగలడు. కేవలము స్థూల స్థితులు మాత్రమే తెలిసిన వారికి పూర్ణజ్ఞానము లేక తికమక పడు చుందురు. సూక్ష్మ స్థితులు కూడ తెలిసినవాడే, తెలిసినవాడు. సూక్ష్మస్థితి యందుండుట కూడ తెలిసినవాడు కావున శ్రీకృష్ణుడు స్థూలమున మరణించిన వాడిని సైతము సూక్ష్మ లోకములలో గుర్తించి కొనితెచ్చి తల్లికి, గురువునకు, బ్రాహ్మణునకు, జ్ఞానము నందించినాడు. సూక్ష్మస్థితుల అవగాహనము, దర్శనమే దివ్య జ్ఞానము. యోగము ఆ స్థితుల నందుటకు మార్గము. అట్టి యోగమునకు అధిష్ఠాన దైవము శ్రీకృష్ణుడే. అందుచే అర్జునునకు స్థూల, సూక్ష్మ స్థితులను, జీవులకు జరుగు స్థితి మార్పులను బోధించి యోగమున ప్రవేశపెట్టెను.

7

వచ్చి పోవునవి - ఓర్పు

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోऽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ 14

వెండితెరపై పాత్రధారులు వచ్చిపోవుచుందురు. వివిధములైన సంభాషణములు వారి నడుమ జరుగుచుండును. సన్నివేశములు నిరంతరము సాగుచుండును. సమస్య లేర్పడుచుండును. మరియు పరిష్కరింప బడుచుండును. సుఖపూరితములు, దుఃఖపూరితములు, ఉద్రేకపూరితములు, రాగద్వేషపూరితములు మరెన్నెన్నియో సమస్యలు వచ్చిపోవు చుండును. అనంతముగా పాత్రధారులు వచ్చిపోవుచుందురు. దృశ్యములు వచ్చిపోవు చుండును. సన్నివేశములు వచ్చిపోవుచుందురు.

వెండితెరపై వచ్చిపోవుచున్న సమస్త దృశ్యములకు వెండి తెరయే ఆధారము. ఎన్ని విషయములు వచ్చిపోవుచున్నను వెండి తెర వెండితెరగానే యుండునుగాని, స్థితి మార్పు చెందదు. పౌరాణికము, సాంఘికము, జానపదము అగు ఎన్ని చిత్రములు తెరపై ప్రదర్శింపబడినను, వాని వాసన లేక ప్రభావము వెండితెర కుండదు. సినిమాహాలులోని వెండితెర వంటిదే సృష్టిలోని చైతన్యము.

చైతన్యము ఆధారముగా లోకములు, లోకులు ఏర్పడుదురు. వారి నడుమ సన్నివేశములు కాలము రూపమున ఏర్పడుచుండును.ఇందేదియు చైతన్యము నంటదు. సృష్టిలోని ఈ చైతన్యమునే దైవమందురు. దాని నాశ్రయించుటచేత జీవులు కూడ సమస్యల కతీతముగ ప్రశాంతముగ జీవించనగును. దాని నాశ్రయించుటకే వివిధ మార్గములు.

సృష్టియందలి ఈ చైతన్యము త్రిగుణాత్మకముగ ఏర్పడినపుడు లోకములు, లోకులు, సన్నివేశ ములు ఏర్పడును. అనగా సినిమా యుండును. శుద్ధచైతన్యముగా నున్నపుడు సినిమా లేక వెండితెర యుండును. సినిమా వేయబడు నపుడు కూడ వెండితెర ఉన్నప్పటికి అందలి సన్నివేశములను, సమస్యలను చూచువారికి వెండితెర మరపునకు వచ్చును. వెండి తెర గుర్తున్నవారికి సన్నివేశము లన్నియు వచ్చిపోవునవివలె కనుపించును. సుఖము - దుఃఖము; సౌకర్యము- అసౌకర్యము; లాభము-నష్టము; ధనము- పేదరికము; జననము-మరణము; రాత్రి-పగలు మొదలగున వన్నియు వచ్చిపోవునవియే. శ్రీకృష్ణుడు అట్టి చైతన్య స్వరూపుడు కనుక ఈ సృష్టి యందలి సమస్తము వచ్చిపోవునవియే అనియు, "నేను" అను చైతన్యము శాశ్వత మనియు, అట్టి శాశ్వత ప్రజ్ఞ యందు నిలబడిన వానికి మొత్తము సృష్టి అంతయు ఒక సినిమా కథవలె ఆనందము నందించు ననియు బోధించెను. అనిత్యములు మరియు వచ్చిపోవు విషయముల యందు ఓర్పు వహించమని బోధించెను.

ఓర్పుగల వానికి సమస్తము అధీనమున నుండును. ఓర్పు

లేనివాడు దుఃఖపడును. సృష్టి యందలి సమస్త విజయములకును ఓర్పు ప్రధానమని భగవానుడు బోధించెను. "తితిక్షస్వ భారత" ఓ భారతీయుడా! ఓర్పు వహించుము! అని గీత నిర్దేశించుచున్నది. ఓర్పుతో తాను చైతన్య స్వరూపుడనని మరల మరల గుర్తు తెచ్చుకొనవలెను. అట్లు గుర్తు తెచ్చుకొనుట వలన జీవితము నందలి సమస్తమైన సన్నివేశములు వచ్చిపోవునవియే అని తెలియ గలదు. ఈ అభ్యాసము వలననే ఎవనికైనను తెలియుట యుండునుగాని, చదువుట, వినుట వలన మాత్రము కాదు. ఓర్పును మించిన గుణము లేదని, దానిని ముందు పొందుమని గీతోపనిషత్తు ప్రప్రథమముగా బోధించుచున్నది.

ఓర్పు వలననే శ్రీరాముడు, ధర్మరాజు, హరిశ్చంద్రుడు, నలుడు ఇత్యాది దివ్యాంశ సంభూతులు లోకము లన్నిటిని జయించగల్గిరి. ఓర్పు మనిషిని మహాత్మునిగ మార్చు ఉత్ప్రేరకము. ఎన్ని సద్గుణము లున్నప్పటికిని ఓర్పు లేనిచో అవి రాణించవు.

8

అమృతత్వము - అర్హత

యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ ।
సమదుఃఖ సుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే ॥ 15

వ్యథ చెందని మనసు కలవాడు అమృతత్వ స్థితిని పొందుటకు అర్హుడని గీత బోధించుచున్నది. త్రిగుణాత్మకమైన సృష్టియందు అవస్థితి చెందినటువంటి మానవ ప్రజ్ఞకు వ్యథ సహజము. ప్రతి మానవుడు సహజముగ వజ్రచైతన్యవంతుడై ఉన్నప్పటికీ చైతన్యము త్రిగుణముల యందు బంధింపబడి నప్పుడు వ్యథ కవకాశమేర్పడును. మరికొంత అవస్థితి చెంది ఇంద్రియముల యందు అనగా ఇంద్రియార్థముల ననుసరించు స్థితియందు బంధింపబడినపుడు అట్టివ్యథ తీవ్రత చెందును. సత్యవంతుడైన మానవ ప్రజ్ఞ మేల్కాంచగనే చైతన్యవంతునిగ ఏర్పడును. చైతన్యవంతమైన మానవప్రజ్ఞ త్రిగుణములలోనికి, ఇంద్రియముల లోనికి ప్రవేశించుట తప్పనిసరి. అట్టి ప్రవేశమున తన సహజ స్థితిని మరచినచో మాయ ఆవరణమున చిక్కును. అనగా ప్రజ్ఞ త్రిగుణాత్మక మగును. త్రిగుణాత్మక మగు తన

ప్రజ్ఞను త్రిగుణములకు అతీతముగ కూడ అభ్యాసవశమున స్థిరపరచుకొన వచ్చును.

త్రిగుణములలోనికి మరియు ఇంద్రియములలోనికి అవతరణము చెందుచున్న చైతన్యము తన సహజ స్థితిని కోల్పోనవసరము లేదు. సూర్యుని కిరణము గ్రహగోళాదులను చేరునపుడు సూర్యుని వదలి, గ్రహములను చేరుటలేదు కదా! సూర్యకిరణము వ్యాపనము చెందుచున్నట్లుగ మనకు తెలియును. కిరణము సూర్యుని యొద్దనూ ఉన్నది. మరియు ఏడు గోళముల వద్దకూ ఏక కాలమున చేరుచున్నది. అట్లే మానవచైతన్యము కూడ ఏకకాలమున సప్తకోశములనూ వ్యాపించి యుండ గలదు. అట్టి వ్యాపనమును అభ్యాసము చేయు పురుషుడు శ్రేష్ఠుడు. మోక్షమునకు అర్హత కలిగి యున్నవాడు. మోక్షమునందు సహజ ముగ నున్నవాడు. పురుషుడు అను పదమును ఉపయోగించుటలో భగవానుని యొక్క రహస్య సూచన కూడ ఒకటి ఇక్కడ గమనింప దగి యున్నది. ఏడంతస్తుల పురమున ప్రవేశించి, ఏడంతస్తులనూ వ్యాపించియున్న ప్రజ్ఞవు నీవు సుమా! అని తెలుపుటకే "పురుషమ్", "పురుషర్షభ" అని పలికినాడు.

జీవిమున వ్యథ చెందువారు తమ్ము తాము మరచిన వారనియు, సత్యాన్వేషణమున ఓర్పు వహించి తనను తాను గుర్తుకు తెచ్చుకొనుచు వ్యథ చెందక జీవించువారే అమృతత్త్వము నకు తగిన వారనియు గీతోపనిషత్తు బోధించుచున్నది.

9

ఉన్నది పోదు - లేనిది రాదు

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోఽంత స్త్వనయో స్తత్త్వదర్శిభిః ॥ 16

అవినాశి తు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్ ।
వినాశ మవ్యయ స్యాస్య న కశ్చి త్కర్తు మర్హతి ॥ 17

సృష్టిలో లేనిది భావమునకే రాదు. ఉన్నది భావమునకు రాకపోదు. అందుకే చమత్కారముగా "సృష్టిలో లేనిదంటూ లేదు" అని అంటారు. లేనిది భావనకే రాదు. భావనలోకి వచ్చినది ఉండకుండా పోదు. అందుకే దైవము లేడనుట తెలివి తక్కువ. లేనిచో భావమునం దెట్లేర్పడును? లేనిది భావమునకు రాదు కదా ! ఉన్నది మనకి కనపడనప్పుడు లేదందుము. మనకు కనపడనిది లేదనుట పసితనము. దయ్యములు ఉన్నవా? అను ప్రశ్న వచ్చినపుడు కూడా సమాధాన మిదియే. లేనిది భావించము కదా! మనకు తెలిసిన విషయము లన్నియు ఉన్నవియే. కానిచో కొందరికి ఉండవచ్చు. కొందరికి ఉండకపోవచ్చు. ఉండుట, లేకుండుట, గ్రహించువాని స్థితిని బట్టి ఉండును. కొందరికి సూక్ష్మ లోకములున్నవి. వాని అనుభూతి కూడ ఉన్నది. కొందరికి లేదు.

అనుభూతి లేనివారు లేవందురు. అనుభూతి కలుగనంత వరకు లేదన్నది వారికి సత్యము కాని, శాశ్వత సత్యము కాదు.

అటులనే ఏదియైనను ఒకప్పుడుండుట, మరియొకప్పుడు ఉండ కుండుట ఉండదు. మన తాత ముత్తాతలు, మన ముందు తరముల వారు, ముందు యుగములవారు ఉన్నారా అను ప్రశ్నకు సమాధానము ఉన్నారనియే! ఉండుట కేవలము భౌతికము కాదని తెలియవలెను. సృష్టి యందలి ప్రతివస్తువూ స్థూలముగగాని, సూక్ష్మముగగాని శాశ్వతముగ ఉండి యుండును. స్థూలముగ అగుపించినపుడు ఉన్నదనుకొనుట, అగుపించనపుడు లేదను కొనుట అవివేకము. దశరథుని అంత్యక్రియల అనంతరము ఇపుడు దశరథుడు లేడు కదా! కావున రాజ్యము చేపట్టుము అని పలికిన మంత్రి జాబాలికి రాముడు ఇచ్చిన సమాధానము ఈ సూత్రము ననుసరించియే యుండును.

నిజమునకు సృష్టియందు పుట్టునది, పోవునది ఏమియు లేదు. స్థూలముగ అగుపించినపుడు పుట్టినదందుము, సూక్ష్మస్థితి చెందినపుడు పోయినదందుము. ఇది పరిమితమైన అవగాహనము. ప్రళయమున కూడ లోకములు, లోకేశులు, లోకస్థులు బీజప్రాయ ముగ నుండి సృష్టి ఆరంభమున దివ్య సంకల్పము నుండి మరల పూర్వ పద్ధతినే దిగివచ్చుచుందురు. కావున ఉన్నది లేకపోలేదు. లేనిది ఎప్పటికినీ లేదు. జీవుల ప్రళయమున దైవము నందుండు టయే ఉండునుగాని, కరగిపోవుట, కలయుట లేదు. అట్లగు పించును. అందువలన తెలిసినవారు ఈ సమస్తమును ఎప్పుడునూ ఉన్నదిగను, శాశ్వతముగను భావింతురు. కాలచక్రమున సూక్ష్మము

నుండి స్థూలమునకు, స్థూలము నుండి సూక్ష్మమునకు వచ్చిపోవు చుండును గాని, అసలు లేకుండుట ఉండదని వారి జ్ఞానము. గ్రహమునకు గ్రహమునకూ మధ్య గల చోటు యందు ఏమియు లేదని ఇటీవలి వరకు శాస్త్రజ్ఞులు అనుచుండిరి. అది అంతయు దైవముతో నిండియున్నదని ఆత్మజ్ఞానులు తెలుపుదురు. ఈ శతాబ్దమున చోటంతయూ శూన్యము కాదని, పూర్ణమని శాస్త్రజ్ఞులు తెలుసుకొనుచున్నారు. అటులనే సూక్ష్మ లోకముల వికాసము లేనివారు, దివ్య శరీరధారులైన మహర్షులు, పరమ గురువులు, దేవతలు లేరనుచుందురు. క్రమ వికాసమున వీరందరు ఉన్నారని ఒప్పుకొనక తప్పదు.

పదార్థమయ ప్రపంచము కూడ లేకపోవుట లేదని గమనించవలెను. వేదాంతులు పదార్థమును, పరమార్థమును రెండు విషయములుగ తెలుపుచు ఒకటి నిరాకరించి, రెండవ దానిని ఆదరింతురు. నిజమునకు అవి రెండును ఒకటియే! పరమార్థము స్థూలస్థితి చెందినపుడు పదార్థమగును. పదార్థము సూక్ష్మత చెందినపుడు పరమార్థ మగును. ఒకటియే స్థితి భేదముచే రెండుగా అగుపించునుగాని రెండు లేవు. మంచు గడ్డ అగుచున్నది మరల నీరగు చున్నది అని తెలియవలెను.

గీతోపనిషత్తునందు స్థాపింపబడిన అత్యంత ప్రధానమైన మూల సూత్రములలో ఈ సూత్ర మొకటి. ఈ సూత్రమును గూర్చి బాగుగ ధ్యానము చేయవలసిన అవసరము విద్యార్థులకు కలదు.

10

మార్పు - మహత్మ్యం

అంతవంత ఇమే దేహా నిత్య స్యోక్తా శ్శరీరిణః ।
అనాశినోఽప్రమేయస్య తస్మా ద్యుధ్యస్వ భారత ॥ 18

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥ 19

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।
కథం స పురుషం పార్థ కం ఘాతయతి హంతి కమ్ ॥ 21

ఈ సృష్టి మొత్తమును పరిశీలించి చూచినచో సమస్తమును మార్పు చెందుచున్నట్లు గోచరించును. మార్పు చెందు ఈ సమస్తమునకు మార్పు చెందని ఒక కేంద్రము కలదు. అది మార్పు చెందువానిలో మార్పు చెందక యుండును. అది ఆధార ముగా సమస్తమును ఉద్భవించి, వృద్ధిపొంది, లయమగు చున్నది.

ఉద్భవము, వృద్ధి, లయము, మరల ఉద్భవము, అనంతముగ సాగుచుండును. లయమైనపుడు వృద్ధిపొందిన విషయము సూక్ష్మమై ఈ కేంద్రమునందు యిమిడియుండును. మరల కాలము ననుసరించి ఉద్భవించుట, వృద్ధిపొందుట జరుగుచున్నది. ఉదాహరణకు మనలో బాల్యము నుండి వృద్ధాప్యము వరకు అనుదినము మార్పులు జరుగుచునే యున్నప్పటికీ దైనందినముగ ఆ మార్పులను మనము గమనించము. కారణమేమన సహజముగా మార్పు చెందని ఆ కేంద్ర ప్రజ్ఞయే మనము. మనమాధారముగా అనేక భావములు కలిగినవి. ఆ భావములు మార్పుకూడ చెందినవి. భాషణములు కూడ అట్లే! ఎన్నెన్నో భావములు, భాషణములు, చేతలు, వాటియందు ఎన్నెన్నో మార్పులు! ఇన్నిటి యందు "నేనున్నా"నను ప్రజ్ఞకు ఏ మార్పూలేదు.

ఈ ప్రజ్ఞ గుణాతీతము, కాలాతీతము కూడ! దీనినుండి సమస్త భావములు, కాలానుసారముగ వృద్ధి చెంది, ప్రవర్తించి, ఈ నేనను ప్రజ్ఞలో మరల కలియుచున్నవి. ఈ ప్రజ్ఞనే ఆత్మ యందురు. అది నిత్యముగను, నాశరహితముగను, కొలతలకు అతీతముగను, జనన మరణముల కతీతముగను ఉండును. ఉండుటయే దీని సహజ లక్షణము. దీనినుండి పుట్టిన వాటికి చంపుట, చచ్చుట ఇత్యాది లక్షణము లుండును. ఇది మాత్రము శాశ్వతముగ నుండును. కావుననే భీష్మాదులు మరణించినను, మరణించుట అనగా ఆ మరణము వారి దేహములకు, భావములకే గాని, వారికి కాదని, వారింతకు ముందు కలరని, ఇక ముందును ఉందురని భగవానుడు తెలిపెను. వారిని దేహము

లుగా కాక దేహులుగా అనగా దేహములను ధరించినవారిగా చూడుమని జ్ఞానదృష్టి కల్పించబూనెను.

దేహములు నిత్యము కావనియు, దేహులు నిత్యులనియు, చంపకుండినను దేహములు కాలక్రమ మున మరణించుననియు, అట్టి దేహములు ధర్మ యుద్ధమున మరణించుటచే అందలి ప్రజ్ఞలకు ఉత్తమ సంస్కారములు కలుగుననియు, కావున యుద్ధము చేయుమనియు భగవానుడు బోధించినాడు.

ఇందొక మహోపదేశము కలదు. “దేహి నిత్యుడు కావున దేహమును ధర్మాచరణమునకై వినియోగించుచు, అట్టి ఆచరణ మున వలసినచో మరణించుటకైనను మానవుడు వెనుతీయ రాదని” ఉపదేశము. ధర్మము ఎటు పోయినను మనము ఉండవలె ననుకొనుట కాక, మనకేమైనను ధర్మము నిలబెట్టుట గీత ప్రతిపాదించు ముఖ్యమైన సూత్రము.

11

యోగవిద్య - అభ్యాసము

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ 22

చినిగిన, చివికిన బట్టలను విడచి, క్రొత్త బట్టలు వేసుకొనుట బుద్ధి. వాటినే సర్దుబాటు చేసుకొనుట లోభత్వము. అది మోహము నుండి జనించును. శరీరములు కూడ వస్త్రముల వలె చివుకుట, చినుగుట జరుగును. అప్పుడు వానిని వదలి క్రొత్తవి ధరించుటకు సంసిద్ధత కావలెను. అది జ్ఞానము వలన కలుగును. తాను శరీరము కాదని, శరీరము తాను ధరించిన వస్త్రమని, ధర్మముతో కూడిన అర్థకామములను తా ననుభవించు టకు ప్రకృతిచే ఈయబడిన వాహనమని, చినిగినచో మరియొక క్రొత్త వస్త్రము ప్రకృతి ఇచ్చునని తెలియుటయే ఈ జ్ఞానము.

వస్త్రములు మార్చినవాడు తాను మారుచున్నానని అనుకొనుట లేదు. పూర్వవస్త్రములలో తా నెట్లుండెనో తనకు జ్ఞప్తి యున్నది. అటులనే దేహములు మార్చినను, అంతకు ముందు

దేహములో తా నెట్లుండెనో తెలియు విద్య కలదు, అది యోగవిద్య. అది తెలిసినవారు దేహములను మార్చుట వస్త్రములను మార్చు నంత సులభముగా చేయుదురు. ఈ విద్య కోల్పోవుటచే బికారుల వలె చివికినవి, చిరిగినవి అయిన వస్త్రములను పట్టుకొని అజ్ఞాన మున జీవులు వ్రేలాడుచున్నారని గీత ఘోషించుచున్నది. పాత బట్టలు వదలవలె నన్నుచో క్రొత్త బట్టలున్నవను దృఢ విశ్వాస మేర్పడవలెను కదా! అట్లేర్పడుటకు నిర్దిష్టమైన, క్రమబద్ధమైన అభ్యాసము కలదు. అదియే యోగ విద్యాభ్యాసము. అట్టి విద్యను బోధించు యోగ శాస్త్రమే గీత.

12

ఆత్మ

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥ 23

అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ ।
నిత్య స్సర్వగత స్థాణు రచలోఽయం సనాతనః ॥ 24

అవ్యక్తోఽయ మచింత్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే ।
తస్మా దేవం విదిత్వైనం నానుశోచితు మర్హసి ॥ 25

ఆత్మతత్త్వము నెఱిగిన వారికే ఆత్మను గూర్చి పూర్ణమైన అవగాహన యుండును. ఎఱుగుట యనగా అనుభవ పూర్వకముగా నెఱుగుట. బోధనా పూర్వకముగ కాదు. బోధనా పూర్వకముగ ఆత్మను గూర్చి తెలుపుట కేవలము సమాచారము నందించుటయే.

ఆత్మ దర్శనమునకు నిర్దిష్టమైన సాధనా మార్గము కలదు. అదియే యోగవిద్య. అట్టి యోగవిద్యను ప్రతిపాదించు ప్రపంచ గ్రంథము భగవద్గీత యొక్కటియే!

ఆత్మ స్వరూపుడైన శ్రీ కృష్ణ భగవానుడు రెండవ అధ్యాయమున ఆత్మతత్త్వమును ప్రతిపాదించినాడు. అటుపైన ఆత్మదర్శనము జరుగుటకు వలసిన సోపానము లేర్పరచినాడు. ఆచరణ పూర్వకముగా భగవద్గీతను అందించటం జరిగింది. అనుసరించుటయే సజ్జనుని కర్తవ్యము.

"ఆత్మ" ఆయుధముచే ఛేదింపబడనిది. అగ్నిచే దహించ బడనిది. నీటిచే తడుప బడనిది. గాలిచే ఎండిప బడజాలదు. ఆత్మ నిత్యము. అంతటా వ్యాపించి యున్నది. స్థిరమైనది. చలనము లేనిది. తుది, మొదలు లేనిది.

"ఆత్మ" ఇంద్రియములకు గోచరము కాదు. మనస్సుచే చింతింప శక్యము కాదు. ఇట్లు ఆత్మను గూర్చి వివరించినపుడు పాఠకునకు అది సమాచారమే గాని, అనుభవపూర్వకము కాదు. దానిని అనుభూతి చెందుటకే "భగవద్గీత" యను యోగ శాస్త్రమును భగవానుడే జాతి కందించినాడు. ఆచరణమే దీనికి ప్రధాన సూత్రము.



13

ఆత్మ - అద్భుతము - ఆశ్చర్యము

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేన
మాశ్చర్యవ ద్వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవ చ్చైన మన్య శ్శృణోతి
శ్రుత్వా ప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥ **29**

ఆత్మను గూర్చి చెప్పుచున్ననూ, వినుచున్ననూ, చదువుచున్ననూ, అట్లెన్నిసార్లు ఒనర్చిననూ ఆత్మానుభవము కలుగదు. ఆచరణ పూర్వక మైనచో అనుభూతమై పూర్ణముగ తెలియును. లేనిచో గాలిని మూట కట్టుకొనినట్లు ఎప్పటికప్పుడు దానిని గూర్చిన భ్రాంతియే మిగులును. సృష్టియందు అన్నిటికన్నా అద్భుతమైనది, ఆశ్చర్యకరమైనది 'ఆత్మ' యొక్కటియే!

ఇంద్రియ నిగ్రహము, బాహ్య విషయములయెడ నైరాశ్యము మరియు వైరాగ్యము, చిత్త నైర్మల్యము, అంతర్ముఖ తపస్సు సాధించిన ధీరునికే ఆత్మదర్శనము కలుగును. అట్టివాడు దుర్లభుడు.

14

అశోకత్వము

దేహీ నిత్య మవధ్యోఽయం దేహే సర్వస్య భారత ।
తస్మా త్సర్వాణి భూతాని న త్వం శోచితు మర్హసి ॥ 30

అవ్యక్తముగ నున్నది వ్యక్తమైనపుడు పుట్టినదనుకొనుట, వ్యక్తమైనది అవ్యక్తమును జేరునపుడు చచ్చిన దనుకొనుట అజ్ఞానము. సృష్టి సమస్తమూ ఒక దిశగా వ్యక్తమగుచుండగా, మరియొక దిశగా అవ్యక్తమును చేరుచూ మరల వ్యక్తమగు చుండును. వ్యక్తము కానపుడు సూత్రప్రాయముగను, వ్యక్తమగు నపుడు రూపాత్మకముగను ఒకే తత్త్వము నిలచియున్నది. చోటు లోని కనపడని నీరు వర్షమైనప్పుడు వ్యక్తముగను, భూమికి చేరి ప్రవహించునపుడు 'నది' యగును. ఉత్తర దక్షిణ ధృవములందు కఠినమైన మంచుగడ్డ యగును. సూర్యరశ్మిచే మరల క్రమశః చోటును చేరును. మరల అవ్యక్త మగును. కాలక్రమమున మరల వర్షముగ వ్యక్తమగును.

సృష్టిలోని సమస్త వస్తువులూ అట్టివే. వ్యక్తావ్యక్తముగ చక్ర

భ్రమణమున అగుపించుచూ అదృశ్యమగుచూ, నిరంతరమూ వుండును. ఈ ధర్మమును తెలిసినవాడు దేనికిని శోకింపడు. అతనికి జననము - మరణము అనునవి మిథ్యా పదములే. కనుక జీవుల పుట్టుకయం దుత్సాహము, మరణమునందు దుఃఖము వానికి కలుగవు. పుట్టునవి - చచ్చునవి అని ఏమియూ లేవు. శాశ్వత దర్శన మొక్కటే యుండును. దానియందతడు ఉపస్థితుడై యుండును. ఇట్టి దర్శనము మాత్రమే సమస్త శోకముల నుండి జీవుని తరింపజేయగలదని 'గీతోపనిషత్తు' బోధించు చున్నది.

15

ధర్మము

అథ చేత్త్వ మిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।
తతః స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి ॥ 33

అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్ ।
సంభావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ 34

భయాద్రణా దుపరతం మన్యంతే త్వాం మహారథాః ।
యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥35

అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।
నిందంత స్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥ 36

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మా దుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥ 37

ఈ ప్రపంచమున నిరపాయముగ జీవించుటకు, నశింప కుండుటకు ధర్మ మొక్కటే పట్టుకొమ్మ. భారతీయ వాఙ్మయము సమస్తమునూ ధర్మాచరణనే బోధించును. గీతోపనిషత్తుకూడా ధర్మపరిపాలనముననే పరిపూర్ణముగ సమర్థించును. ఎవరి ధర్మము వారు పరిపాలించినపుడు సంఘము సుభిక్షమగును.

'కలి' ప్రభావమున ప్రతియొక్కరు స్వధర్మమును నిర్లక్ష్యము చేయుట జరుగుచున్నది. ఎవరు ఏ పనినైననూ చేయవచ్చునను అవగాహన కలిప్రభావమే. కుక్క పని గాడిద చేయరాదు. గాడిద పని గుఱ్ఱము చేయరాదు. ఏనుగు పని ఎలుక చేయరాదు. ఆవు పని పిల్లి చేయరాదు - అని ఎవరునూ తెలుపనక్కరలేదు కదా! అట్లే క్షత్రియుడు బ్రాహ్మణుని పని, బ్రాహ్మణుడు వైశ్యుల పని, వైశ్యులు క్షత్రియుల పని యిట్లు కలగాపులకముగా అందరునూ అన్ని పనులూ చేయుట ధర్మమును వెక్కిరించుటయే.

అర్జునుడు క్షత్రియుడగుట వలన ధర్మ రక్షణకై యుద్ధము చేయుట అతని కర్తవ్యము. వేదాంతివలె తత్త్వమును పలుకుట అసమంజసము. అతని తత్త్వము కూడా మిడిమిడి జ్ఞానమే. తాను చేయవలసిన పని చేయుటకు అసౌకర్యముగ నుండుట వలన మరియొక మార్గమును చూసుకొనువాడు, అపకీర్తి పాలగు టయేగాక, పాపమును పొంది నశింపగలడు. ధర్మ ప్రవర్తనమున మరణించిననూ, జయించి బ్రతికిననూ అట్టి జీవుడు ముక్తుడై యుండును. అధర్మమును ఆచరించువాడు, ఆచరించుచూ జీవించువాడు శవము కన్నా హీనమని ధర్మము బోధించుచున్నది. ధర్మాచరణమున మరణించిననూ తనకిష్టమే ననియు, అధర్మా చరణమున జీవించుట హేయమనియు నిష్కర్షగ గీతోపనిషత్తు బోధించుచున్నది.

16

భయము - భద్రత

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥ 40

మానవ జీవితమున ప్రస్తుత కాలమున భద్రత లోపించినది. భయ మావరించినది. ప్రాథమిక విద్య నేర్చు పసివాని నుండి పరిపాలనము చేయు పరిపాలకుని వరకూ ఎవరును నిర్భీతిగా జీవించుట లేదు. పిల్లలకు చదువు భయము, యువకులకు వృత్తి - ఉద్యోగ భయము, మధ్య వయస్కులకు అభివృద్ధిని గూర్చి భయము, అధికారులకు పదవీ భయము, ధనకాముకులకు ధన భయము, కీర్తి కాముకులకు అపకీర్తి భయము, అందరికీ అనారోగ్య భయము, జీవితమంతా భయం భయం. ఇవికాక, హత్యలు, మారణ హోమాలు, అభద్రత, వివిధమగు ప్రమాదాలు, యిన్నిటి యందు దినమొక గండముగ జీవితము సాగుచున్నది.

నిస్సహాయుడైన మానవుడు కలియుగము కదాయని, సమస్తమును సరిపెట్టుకొనుచున్నాడు. భౌగోళికముగా యిప్పుడు భూమికి చక్రవర్తి భయమను పిశాచమే. అది కారణముగా భద్రత

ఎండమావిగ భావించబడుతూ యున్నది. కానీ, భద్రపథమును భగవద్గీత సూక్ష్మముగ తెలిపియున్నది. ఆ పథము శాశ్వతముగా భయమును నివారించును. ఎంత స్వల్పమైననూ, అతి చిన్న దైననూ ఏదో నొక ధర్మమును దైనందినముగ ఆచరించిన జీవునకు ఎంత పెద్ద భయమైననూ నివారణమగును. నిరంతరత్వము, శ్రద్ధాభక్తులు, ఒక ధర్మము ననుసరించుటలో పాటించిన జీవునకు సమస్త భయమూ పటాపంచలగును. కలియుగము కటిక చీకటి వంటిది. కటిక చీకటిలో చిన్న దీపము కూడా చక్కని వెలుగునిచ్చి దారి చూపును. అట్లే నిరంతరమూ నిర్వర్తింపబడుచున్న చిన్న ధర్మము ఎంతపెద్ద భయమునుండైనా రక్షించగలదు.

"స్వల్పమపి అస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్" అని భగవానుడు వాగ్దానము చేసెను. దీనిని విశ్వసించి ధర్మమాచరించు జీవునకు భయపడుటకు తావుండదు. భయంకరమగు భయమును అతి స్వల్పమైన ధర్మాచరణ మాలంబనముగా దాటుడు. ఇట్లు మార్గమును సుభద్రము చేసుకొనుడు.

17

వ్యవసాయము

వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥ 41

భారతదేశమున పండితులెందరో కలరు. చాలామందికి చాలా విషయములు తెలియును. వేదాంతము మొదలుకొని నీతికథల వరకును అందరూ అన్నియూ చెప్పగలరు. బోధకులకు, గురువులకు, మహాత్ములకు లోటులేని పుణ్యభూమి. సనాతనమైన దేవాలయములు, ఆధ్యాత్మికతను పెంపొందించు ఆశ్రమములు లెక్కకు మిక్కుటములు. అన్ని సమస్యలకూ పరిష్కారములు తెలుపగలిగిన మేధాసంపత్తి తగుమాత్రము గలదు.

ఇంత జ్ఞానము కలిగియున్ననూ భరతజాతి యింతటి దుస్థితి యందు వుండుటకు కారణమేమి? పేదరికము, అనాగరికత, దురాచారము యింత విజృంభణము చేయుటకు కారణమేమి? భారతదేశమున రాణించలేని భారతీయులు, విదేశములలో రాణించుటకు కారణమేమి?

ఇన్నింటికీ కారణ మొక్కటియే. మనకు చాలా విషయములు తెలియును. కాని, వాటిని ఆచరించు స్ఫూర్తి లేదు. అన్నమెట్లు వండుకొని తినవలెనో బాగుగ తెలిసి, వండుకొనుటకు బద్ధకించు జాడ్యము జాతిని పీడించుచున్నది. ఆచరణ శూన్యతయే కారణముగ సమస్త జ్ఞానము అక్కరకు రాకుండ యున్నది. వ్యవసాయము తెలిసియూ చేయని రైతునకు ధాన్యమెట్లు లభింపదో, తెలిసిన విషయము లాచరించని వానికి నిష్కృతి లేదు. బుద్ధిని పరిపరి విధములుగ పోనీయక తెలిసిన విషయములందు నిర్దిష్టముగ నియమించి ఆచరించమని గీతోపనిషత్తు నిర్దేశించుచున్నది. ఈ సూత్ర మంగీకరింపని వానికి జీవితము ఒక ఎడారి!

18

అనర్హుడు

భోగైశ్వర్య ప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్ ।
వ్యవసాయాత్మికా బుద్ధి స్సమాధౌ న విధీయతే ॥ 44

భగవంతుడు రస స్వరూపుడు. రసాస్వాదనము చేయుటకే జీవనము. అదియే వైభవము. అట్టి వైభవమును పొందుటకు ఈ క్రిందివా రనర్హులని భగవానుడు బోధించుచున్నాడు.

1) కర్మఫలములం దాసక్తి గలవాడు,
2) పుణ్యము కొరకు మంచిపని చేయువాడు,
3) కోరికలతో నిండిన మనస్సు కలవాడు,
4) భోగములయం దాసక్తి కలవాడు,
5) జ్ఞాన సముపార్జన చేయనివాడు,
6) ఐశ్వర్యములను సంపాదించుటకు ప్రయాస పడువాడు,
7) తెలిసినదానిని ఆచరించనివాడు-

పైవారందరూ వారి మనస్సుచే మోసగింపబడినవారు. వారు దైవ ధ్యానమును చేయలేరు. రసానుభూతిని పొందలేరు.

19

తుదిమెట్టు

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥ **45**

మానవ జీవితము త్రిగుణములతో అల్లబడి నిర్వర్తింపబడుచున్నది. కొంత తడవు రజోగుణము పనిచేయుచుండగ విజృంభించి పనిచేయుట యుండును. అటుపైన తమోగుణ మావరించి కాళ్ళు బారజాపుకొని యుండుట, అనారోగ్యము పొందుట, విశ్రాంతిని కోరుట యుండును. చేయుట, చేయకపోవుట అను రెండు స్తంభముల మధ్య తిరుగాడుచూ జీవుడు క్షణ కాలము, రెండు గుణములను తనయం దిముడ్చుకొను సత్వగుణమును అతిస్వల్పముగ రుచిగొనును. సత్వగుణ రుచి నిజమైన ఆనంద మును కలిగించి అట్టి ఆనందము కొరకై అన్వేషించుట జరుగు చుండును. ఈ అన్వేషణముననే కాలము వ్యయ మగుచుండును.

రజస్సు, తమస్సు అనెడి గుణములు మనస్సున ద్వంద్వము లున్నంతకాలము జీవుని యిటు నటు లాగుచుండును. సత్వ గుణము ద్వంద్వముల కతీతమైనది. అందు రజస్సు - తమస్సు యిమిడి అదృశ్యమగును. జీవితము ద్వంద్వముల క్రీడయని

గుర్తించిన జీవుడు, అవి కాలానుగుణముగ వచ్చిపోవు చుండునని తెలుసుకొన్నాడు. ప్రజ్ఞ మనస్సుయందుగాక, బుద్ధియందు స్థిరపడును. అప్పుడు సత్వగుణము నిత్య సత్యముగ నుండును. అనగా రజస్సును, తమస్సును అధిష్ఠించి యుండును. అట్టివాడే త్రిగుణములు దాటిన వాడగును. అతడికే పూర్ణమైన రసానుభూతి అందిన ఫలము. ఇతరులకు అందని ద్రాక్ష పండే!

"నిస్త్రైగుణ్యో భవ అర్జునా" అని కృష్ణుడు సుతిమెత్తగ అర్జునుని హెచ్చరించుటకు కారణమిదియే. నిత్య సత్యమే పరిపూర్ణ జీవనానుభూతికి ప్రాతిపదిక.

వేదములు కూడా త్రిగుణాత్మకములైన విషయములనే తెలుపుచున్నవి కాని, తదతీతమైన స్థితికి చేర్చుట లేదనియు, యోగవిద్య ఒక్కటియే పరిష్కారమనియు భగవానుడు స్పష్టముగ తెలిపియున్నాడు.

20

ఆచరణ - ఎఱుక

యావానర్థ ఉదపానే సర్వత స్సంప్లుతోదకే ।
తావా న్సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥ 46

వేద మపారము. జ్ఞానమునూ అపారమే. తెలియవలసినది ఎప్పుడునూ యుండును. తెలిసిన దానిని ఆచరించుట అను మార్గమున మరికొంత తెలియుట యుండును. ఈ మార్గమున తెలియుటలో అనుభవము వుండును. అనుభూతి యుండును. మరియూ తెలిసినది అక్కరకు వచ్చును.

ఊరికే తెలుసుకొనుట వలన ఉపయోగములేదు. అది అక్కరకు రాదు. అనుభూతి నీయదు. అనుభవమూ కలుగదు. ఆచరణము లేని జిజ్ఞాస జీవుని భ్రష్టుని చేయగలదు. ఆచరణము లోనే సమస్తమూ అనుభవమునకు వచ్చును. ఊరకే తెలుసు కొనుట వలన మెదడు వాచి, తెలిసిన వాడనను అహంకారము బలిసి జీవుడు భ్రష్టుడగును.

బ్రహ్మమును తెలిసిన వారందరూ ఆచరణ పూర్వకముగా

నెఱిగిన వారే. బోధనలను వినుటవలన, గ్రంథములను పఠించుట వలన, తెలియునది పుస్తక విజ్ఞానమే. ఆచరించు వారిదే అసలు విజ్ఞానము. తెలుసుకొనుట, తెలిసినది ఆచరించుట అనునవి అనుశ్యూతముగ ఉఛ్వాస నిశ్వాసములవలె సాగుట క్షేమము. అది తెలిసిన వారే తెలిసినవారని, యితరులు మిధ్యాచారులని భగవంతుడు బోధించి యున్నాడు.

భారతీయులకిదియే ప్రస్తుత కర్తవ్యము. ఉదాహరణకు, దాహము కలిగిన వానికి బావి కనపడి నప్పుడు, అందుండి తనకు వలసిన జలములను గ్రోలి తృప్తి చెందుట క్షేమము. అంతియేకాని, అసలా బావియందు ఎంత నీరున్నది? దినమున కెంత ఊరు చున్నది? ఎంతమంది ప్రతి దినమూ త్రాగినచో బావి ఎండక యుండును? అను జిజ్ఞాసలో పడినచో, గొంతెండి చనిపోవుటయే యుండును. చదివిన వారందరూ తెలిసినవారు కారనియు, రామకృష్ణ - వివేకానందులవలె ఆచరించినవారే తెలిసినవారని తెలియవలెను.

21

కర్మాధికారము

కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫల హేతుర్భూ ర్మా తే సంగోఽ స్త్వకర్మణి ॥ 47

ఎన్ని జన్మలెత్తిననూ, ఎంత మేధస్సును పెంచుకొనిననూ, ఎన్ని గ్రంథములు చదివిననూ, ఎన్ని విజయములు పొందిననూ, ఎంత ధనము, కీర్తి సంపాదించిననూ మానవుడు ఎందులకో జీవితమున ప్రాథమిక సూత్రముల ననుసరించుటలేదు. భారత దేశమున వేలాది సంవత్సరములుగా సగటు భారతీయునికి భగవానుడు తెలిపిన ఈ క్రింది సూత్రము తెలియును కానీ ఆచరింపము. ముమ్మాటికీ ఆచరింపము. అందువలనే జీవన విభూతి లేదు.

సూ॥ "కర్మ చేయుటయందే నీ కధికారము కలదు గాని,
ఫలముల యందు నీ కెప్పుడూ అధికారము లేదు."

ఈ సూత్రము విననివారు లేరు. అంగీకరించి, అనుసరించు వారునూ లేరు! ఇంతకన్న జీవితమున మాయ ఏమి కలదు? కేవలము ఫలము కొరకే ప్రాకులాడు జాతికి నిష్కృతి

లేదేమో!! అను నిస్పృహ కలుగక తప్పదు. అధికారములేని ఫలములయందే అమితాసక్తి మానవ మేధస్సు కనబరచును కాని, తన అధికారములోని కర్తవ్యమును మాత్రము నిర్వర్తించుము. ఇది ఏమి లీల! రోగికి ఔషధము చేదుగా నుండును. అందు వలననే ఔషధము స్వీకరింపక మానవుడు మరల మరల మరణించుచున్నాడు.

కేవలము కర్తవ్యమునం దాసక్తి కలిగి ఫలితమునందు అనాసక్తత కలుగవలెనన్నచో రెండే రెండు ఉపాయములు గలవు. ఒకటి - యోగేశ్వరుల జీవిత చరిత్రలను పఠించి, స్ఫూర్తి చెంది, అట్లు జీవించుటకు ప్రయత్నించుట; రెండవది - మనమధ్య తిరుగాడుచున్న యోగులను గుర్తించి ప్రత్యక్షముగ పై తెలిపిన సూత్రమును దర్శించి, తద్వారా స్ఫూర్తి చెంది, అట్లు జీవించుటకు ప్రయత్నించుట. ఇతరములైన మార్గములు కష్టతరములు.

ఇట్టి ప్రాథమిక సూత్రమును మరచి, పండితులు గీతా పారాయణమునకు కూడా ఫలితమును నుడివిరి. ఫలిత మాశింపక కర్తవ్యమును ఆచరింపుమని లేదా నిర్వర్తింపుమని బోధించు గ్రంథరాజమునకే పండితులు పంగ నామములు పెట్టిరి. వీరు 'కలి' చే నియమింపబడినవారే కాని, తెలిసినవారు కారని తెలియు చున్నది కదా !

నిజముగ జీవితమును పండించుకొనదలచినచో భగవద్గీత యందలి ఈ ఒక్క వాక్యము చాలును.

22

కర్మ సూత్రము

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ **48**

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ ।
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥ **49**

చేయు పనుల ద్వారా మనలను మనమే బంధించుకొనుట ఏమి తెలివి? తెలివైన వాడిననుకొనువాడు కూడా తన తెలివితోనే తన జీవితమును చిక్కుపఱచుకొను చున్నాడు కదా! వీరు కొరమాలిన తెలివికలవారే కాని, నిజమైన తెలివిగలవారు కారు. ఒక పని చేయునప్పుడు, దాని నుండి పుట్టు పనులను, చిక్కులను, కష్ట-నష్టములను పూర్తిగ బేరీజు వేసుకొనవలెను. ప్రస్తుతమునకు సౌకర్యముగ నున్నదని, లాభము కలుగుచున్నదని, జయము చేకూరునని, చేయుపనులు అటుపై వికటించగలవు. పెద్దలు యిచ్చిన నానుడిలో ముఖ్యమైన దేమనగా - "పాపము చేయు నపుడు చమ్మగ నుండును. ఫలితము లనుభవించునపుడు చేదుగా నుండును."

కరడుకట్టిన స్వార్థముతో తనకు లాభించునని ప్రతి మానవుడు దాని తరంగముల ప్రభావము తెలియక ఉరుకులు పరుగులు వేయుచూ యితరులను దోచుకొనుచున్నాడు. మానవుడు రాక్షసుడై హద్దూ-పద్దూ లేక భూమి సంపదను, వృక్ష సంపదను, జంతు సంపదను దోచుకొనుచున్నాడు. ఎక్కువ దిగుబడికై వృక్షములు మరియు జంతువుల జన్యువులను కూడా రసాయనక చర్యలతో ఒత్తిడి కలిగించుచున్నాడు. ఇది అంతయూ తనయొక్క మేలునకే అనుకొని చేయుచున్నాడు. చేయు పనులనుండి పుట్టబోవు మహత్తర మైన విపత్తులను గమనించుటయే లేదు. పంచభూతముల సమన్వయమును కూడా భంగపరచుటకు సిద్ధపడిన మానవుడు, ఈనాడు తాను చేసిన పనికి కలుగు ఫలిత మెట్లుండునోనని భయ భ్రాంతుడై జీవించుచున్నాడు. మంచుపర్వతములు కరుగునని, సముద్రములు పొంగునని, అగ్నిపర్వతములు బ్రద్దలగునని, అనివార్యమైన రోగములు ప్రబలునని, జీవనపు అల్లిక చెడిపోవు చున్నదని దుఃఖ పడుచున్న మానవుడు ఈ విపత్కర పరిస్థితికి తానే కారణమని తెలుసుకొనవలెను. తన స్వార్థచింతన తగ్గించు కొని పరహితము పెంచుకొనినచో జీవన విధానమున మార్పు ఏర్పడి పరిష్కారము లభింప గలదు.

ఈనాటి మానవుని తెలివి ఆత్మహత్య గావించుకొను వాని తెలివి వంటిది. శాస్త్ర విజ్ఞానము పెరుగుదల, సంస్కారముల తరుగుదల కారణముగ అతి వేగముగ ప్రమాదమువైపు పరుగిడు చున్నాడు. మనము చేయుపనులు పదిమందికి పనికి వచ్చునట్లు చేసినచో బంధస్థితి నుంచి మోక్షస్థితి వైపు మార్గమున మలుపు రాగలదు.

ప్రతి జీవియు తన జీవన నిర్మాణ పథమున ఎప్పటికప్పుడు జీవితముపై తన స్వామిత్వమును పరికించుచుండవలెను. అట్లు కానిచో వృత్తి, కుటుంబము, సంఘము, అతనిని బంధించగలవు. జీవితము ముందుకు సాగుచున్నకొలది, బాధ్యతలు పెరిగిననూ మనసున బంధము పెరుగరాదు. బంధములు పెంచుకొను మార్గము చావుతెలివి. ఉదా : మంచి గదిని నిర్మాణము చేసుకొను వాడు తన చుట్టునూ ఇటుకపై ఇటుక పేర్చుకొనుచూ నలువైపులా గోడను నిర్మించుకొనినచో బయటకు పోవు దారిలేక తను నిర్మించిన గదియే నిర్గమశూన్యమగు దుర్గమై తాను సమాధి చెందుటకు కారణమగును.

ప్రతివ్యక్తియూ ఈనాడు తన పెరుగుదల రూపమున ఈషణ త్రయమున విపరీతముగ బంధించుకొనుచూ తన గోరీని తానే నిర్మాణము చేసుకొనుచున్నాడు. అంతియేకాదు, తనంత తెలివిగ యితరులు గోరీలు కట్టుకొన కూడదని పోటీపడుచూ అందమైన గోరీని నిర్మాణము చేసుకొను చున్నాడు. జీవితమును ఒక కారాగారముగ నిర్మించుకొనుటగా కాక, రాకపోకలు గల ఒక గృహముగ నేర్పాటు చేసుకొనుటకు వలసిన సూత్రమునే భగవానుడు-

"మాకర్మ ఫలహేతుర్భూ"

అని హెచ్చరించి యున్నాడు. చిన్నతనముననే ఈ ఎఱుక కలిగినచో జీవిత మానందమయ మగుటకు అవకాశముండును. తిమింగలముచే పట్టబడిన తరువాత తెలిసినచో బంధమోచనము కష్టతరము. ఎవరైననూ వచ్చి రక్షించవలసినదే కాని, తనను తాను రక్షించుకొనలేడు. అట్టివానికి గజేంద్రుడు చేసిన ప్రార్థనయే శరణ్యము.

23

కర్తవ్యము - పాప - పుణ్యములు

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృత దుష్కృతే ।
తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥ 50

బుద్ధిలోకములో నుండి పనిచేయువాడు పుణ్య కర్మలని, పాప కర్మలని విభజించి ఫలితముల నుద్దేశించి పనులు చేయడు. ఆ భావమును విసర్జించి తన కర్తవ్యమును నిర్వర్తించును. ఫలితములపై ఆశ లేనివానికి పుణ్య పాపముల విభజన వుండదు. అతనికి కర్తవ్యము మాత్రముండును. కర్తవ్యమును మాత్రమే ఉద్దేశించుకొనుచు వివేకముతో పనిచేయు వానిని కర్మఫలములు బంధించవు. పుణ్యపాపముల విభజనము మనోలోకములకు సంబంధించినది. బుద్ధిలోకములకు సంబంధించినది కాదు. బుద్ధి లోకమున కర్తవ్యము ధర్మ సంరక్షణము ననుసరించి యున్నది. ధర్మ రక్షణమునకై కృష్ణుడు 'ఆయుధము పట్టను' అను మాటను ప్రక్కన పెట్టి భీష్ముని పైకి సుదర్శనముతో దుమికెను. ఆడిన మాట తప్పను అని భీష్మించి భీష్ముడు పెళ్ళిని, సంతతిని నిరాక

రించి కురు వంశమునకు నష్టము కలిగించెను. సత్యవతీదేవి వేడుకొనినను వినలేదు. ధర్మమును కర్తవ్యము రూపమున అనుసరించుటయే బుద్ధియుక్తమగు జీవనము. అట్టి జీవనమున ఫలాసక్తి లేకుండుట కౌశలముతో గూడిన కర్మయోగ మగును.

24

మనీషి

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛం త్యనామయమ్ ॥ 51

యదా తే మోహకలిలం బుద్ధి ర్వ్యతితరిష్యతి ।
తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥ 52

శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి ॥ 53

బుద్ధితో యోగించి, ఫలములను త్యజించి, కర్తవ్యమును నిర్వర్తించు యోగికి నిస్సంగము ఏర్పడగలదు. అతనికి కర్తవ్యమే యుండునుగాని, వ్యక్తిగతమగు ఆశయములు, గమ్యములు వుండవు. అనగా తాను, తన కర్తవ్యము మాత్రమే యుండును. మరణించ కూడదని యుండదు. పుట్టకూడదని కూడ యుండదు. మరణించకూడదని, పుట్టకూడదని, పుణ్య కర్మలను ఆచరించు వారు కళాసక్తితో ఆచరించు వారే తప్ప వారికి పుట్టని, చావని స్థితి కలుగనేరదు. శ్రీకృష్ణుడు తెలిపిన యోగజీవులు ఎట్టి సిద్ధుల కొఱకును ప్రయత్నింపరు. అమరత్వము కొఱకు, బ్రహ్మత్వము

కొఱకు ప్రయత్నముండదు. ఉండుటయే యుండును. కర్తవ్య ముండును. వారికి నిస్సంగము పరిపూర్తి యగుటచే కోరకయే సమస్తమును లభించగలదు. వారి చేతలయందు కళాసక్తి లేదు గనుక బంధము నుండి విడువబడిన వారలై యుందురు. బంధము లేక యుండుటయే పరమ పథము. అట్టివారు శరీరము నందు కూడ యుందురు. శరీరము వారిని బంధింపదు. ఎటు చూచినను ఫలమునందు ఆసక్తిలేని కర్తవ్య కర్మమే శ్రేయోదాయకమని భగవంతుడు బోధించుచున్నాడు.

బుద్ధి, మోహమును, మాయను, అజ్ఞానమును విసర్జించి, తాను అను వెలుగుగా నున్నప్పుడు నిర్మలమైన బుద్ధి అని తెలియబడుచున్నది. నిర్మలమైన బుద్ధి ఏర్పడవలె నన్నచో సతతము లోపల, వెలుపల ఆత్మానుసంధానము చేసుకొను చుండవలెను. దీనిని దైవయోగము అందురు. అనగా బుద్ధిని దైవముతో జత పరచుట. ఇది నిరంతరము సాగినప్పుడు బుద్ధి నిర్మలమగును. అట్టి బుద్ధితోనే నిష్కామముగ కర్మల నాచరించిన జనన మరణ రూప బంధమునుండి కూడ జీవుడు విడుదలను పొందును అని భగవానుడు చెప్పియున్నాడు. అట్టి బుద్ధియే ధర్మముతో కూడిన కర్తవ్యములను సతతము నిర్వర్తించగలదు. అట్టి నిర్వర్తనమే కర్మలయందు కౌశలము అని తెలిపి యున్నాడు. బుద్ధి, ఆత్మయందు యోగించగ, అట్టి బుద్ధితో యోగించిన మనస్సు కర్మలను క్షేమముగను, కౌశలముగను నిర్వర్తించ గలదని అర్థము. యోగము చెందని మనస్సు కౌశలముగ కర్మలను

నిర్వర్తించుట జరుగదు. అట్టి మనస్సే కౌశలము పేరున కుటిలత్వము ననుసరించును.

కావున బుద్ధిని సదా ఆత్మతో అనుసంధానము చేయవలెను. అట్టి బుద్ధి క్రమశః నిర్మలమగును. చీకటిని దాటిన బుద్ధిగా వెలుగొందును. అనగా మాయా వర్ణమును దాటి యుండును. అట్లు దాటి యుండుటకు కారణము ఆత్మానుసంధానమే. అట్టి బుద్ధి కర్మలను సహజముగనే నిర్లిప్తముగను, బంధములు కలిగించని విధముగను, నిర్వర్తించుచుండును. ఏది వినినను, ఏది చూచినను వికారము చెందదు. చలనము లేని ఇట్టి బుద్ధిని పొందుట కర్తవ్యమని భగవానుడు బోధించుచున్నాడు.

25

స్థిత ప్రజ్ఞుడు

అర్జున ఉవాచ :

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కి మాసీత వ్రజేత కిమ్ ॥ **54**

శ్రీభగవా నువాచ :

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ **55**

ఆత్మ ధ్యానమునందు స్థిరమైన స్థితిగొన్న బుద్ధి, స్థిరబుద్ధి. అట్టి బుద్ధి కలవాడు స్థితప్రజ్ఞుడు. అనగా స్థిరమైన ప్రజ్ఞ కలవాడు. ఆ సన్నివేశములను బట్టి అతని ప్రజ్ఞ కలత చెందదు. మోహము కలిగిననే కదా కలత చెందుట! ఆత్మజ్ఞాన రతునికి మోహ ముండదు గనుక కలత కూడ నుండదు. అతడు ముక్తజీవి. అతని గుణ గణములు శ్రీకృష్ణుడు ఉదహరించుచున్నాడు.

1. సమస్తములైన కామములను బొత్తిగ వదలివేసినవాడు స్థితప్రజ్ఞుడు. కర్తవ్యమేగాని కామములేని స్థితి ఇది. కర్తవ్యమును కామమును ఎప్పటికప్పుడు బుద్ధితో విచక్షణ చేసి కర్తవ్యమునే

నిర్వర్తించువాడు స్థిరప్రజ్ఞ కలవాడు. ఇష్టాయిష్టములు, లాభనష్టములు, సౌకర్య అసౌకర్యములు, జయాపజయములు, బేరీజు వేసుకొని పనిచేయువారు కామమునకు లోబడినవారు కాని కర్తవ్యమునకు కాదు.

2. సతతము తన ప్రజ్ఞను దైవీప్రజ్ఞతో అనుసంధానము చేసి తుష్టితో జీవించువాడు స్థితప్రజ్ఞుడు. ఈ రెండవ గుణము నాశ్రయించి, మొదటి గుణమును పొందవలెను.

26

స్థిత ప్రజ్ఞుడు

దుఃఖేష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే ॥ **56**

స్థితప్రజ్ఞుని బుద్ధి కష్టములందు కలత చెందదు. సుఖముల యందు ప్రత్యేకమైన ఆసక్తి చూపదు. సన్నివేశములయందు భయపడదు. ఇతరుల ప్రవర్తన వలన క్రోధము చెందదు. అతని మనస్సు సహజముగ మౌనముగ నుండును. (ఆత్మ మననము చేత మౌనము వహించి యుండును.)

పై ఐదు గుణములు ఎవని ప్రవర్తనమున గోచరించునో అతడు స్థితప్రజ్ఞుడుగ తెలియబడు చున్నాడని భగవానుడు బోధించుచున్నాడు.

27

స్థిత ప్రజ్ఞుని లక్షణములు

యః సర్వత్రా నభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

ఏ విషయమునందు ప్రత్యేకమైన అనురాగము లేనివాడు, అట్టి కారణముగ అశుభ విషయములను పొందినపుడు ద్వేషము పొందనివాడు, శుభ విషయములు పొందినపుడు అందు అనురక్తి చెందనివాడు స్థితప్రజ్ఞుడని తెలియవలెను.

శుభాశుభ విషయములు వచ్చి పోవుచుండును. సమస్త సన్నివేశములు కూడ కాల ప్రభావమున ఒకింత సేపు వుండి అటుపై లేకపోవును. అట్టి వానియందు ఆసక్తి కలిగియుండుట లేక అనాసక్తి కలిగియుండుట తెలియని తనమే. తాత్కాలిక విషయములయందు రసానుభూతి కూడ తాత్కాలికమే కనుక అట్టి జ్ఞానమును కలిగి వానియందు తాత్కాలికముగ ప్రతి స్పందించి మరచువాడు స్థితప్రజ్ఞుడు.

స్థితప్రజ్ఞ అను బుద్ధి శాశ్వత విషయమైన ఆత్మ తత్త్వము నందు రతి గొని వుండుట వలన చిల్లర విషయముల యందు ఆసక్తిగాని, అనాసక్తి గాని యుండదు. ధనవంతునికి ఒక పావులా పోయినను, ఒక పావులా వచ్చినను తేడా ఉండదు కదా!

28

స్థిర చిత్తము

యదా సంహరతే చాయం కూర్మోఽంగానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 58

తాబేలు ఆధ్యాత్మిక సాధకునకు చక్కని సందేశ మిచ్చుచున్నది. పరిస్థితులను బట్టి తాబేలు తన సర్వాంగములను తన లోనికి ఉపసంహరించుకొని అనుకూల పరిస్థితులు ఏర్పడి నపుడు మరల అంగములను విస్తరించును. పురోగమనము, తిరోగమనము తెలిసిన ప్రజ్ఞ- తాబేలు ప్రజ్ఞ. మానవుడుకూడ నట్లే పురోగమనము, తిరోగమనము తెలిసి యుండవలెను. కాలము, దేశము ననుసరించి అనుకూల సమయమున మనస్సు, ఇంద్రియములు, శరీరమును ఉపకరణములుగ బహిర్గతు డవవలెను. కర్తవ్యము నిర్దేశింపబడని సమయములందు అంతర్గతు డవవలెను. అవసరమును బట్టి బహిర్గతు డగుట, అవసరము లేనపుడు అంతర్గతు డగుట నేర్చు కొనవలెను.

ఇంద్రియార్థముల వెంటబడు ఇంద్రియ ప్రజ్ఞను ఉపసంహరించుకొనుట వలననే చిత్తము స్థిరమగును. ఇచట దోషము

ఇంద్రియముల యందు లేదు. సాధకుని యందే యున్నది. సాధకుడు తిరోగమనమును సంకల్పించినంతనే ఇంద్రియముల నుండి, మనస్సు నుండి, బుద్ధిలోనికి ప్రజ్ఞ మరలగలదు. అట్లు మరల్చుకొనుటకు దైవచింతన చక్కని ఉపాయము. దైవస్మరణమున నిలచినచో ఇంద్రియార్థముల వెంట ఇంద్రియములు పరుగెత్తవు. అపుడు ప్రజ్ఞ చంచలము గాక నిలచును. కర్తవ్యమును బట్టి ప్రజ్ఞను బహిర్ముఖము చేయవచ్చును. ఈ కారణముగ తాబేలు బొమ్మను చూచుట- పై సందేశమును గుర్తు తెచ్చుకొనుట సాధకునకు ఉపకరించును.

29

ఆత్మ చింతన

విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 59

దైవచింతన లేక ఆత్మచింతన దీర్ఘకాలము జరిగిన వానికి విషయ చింతన తొలగుటయే కాక క్రమశః వాని వాసన కూడ తొలగిపోగలదు. దైవమును నమ్ముట వేరు, దైవము నచ్చుట వేరు. నచ్చినపుడే మనస్సునకు ఆసక్తి కలుగును. అట్టి ఆసక్తి వలన మనస్సు దైవమునందే రమించుటకు పదే పదే కోరుకొను చుండును. అనురక్తి దైవము పైకి మరలక అది హెచ్చు చుండును. ప్రబల మగుచుండును. అది కారణముగ తాత్కాలిక సుఖ సంతోషములకన్న శాశ్వత సంతోషమునందు రుచి కలుగుటచే విషయ వాసనలయందు కూడ క్రమశః ఆసక్తి తొలగిపోవును. ఇంద్రియార్థముల వెంట తీరుబడి లేక తిరుగువాడు ఎట్లు ప్రవర్తించునో అట్లే తీరుబడి లేని దైవచింతన యందు మనస్సు పాదుకొని ఇంద్రియార్థములందు కూడ దైవమునే గుర్తించుట జరుగుచుండును. ప్రకృతి దైవీప్రకృతిగ గోచరించును. తన ప్రకృతి దైవీప్రకృతి కాగ సమస్తము నందలి దైవమునే చూచుచు స్థిర

మతియై యుండును. అతనిని దైవము తప్ప మరి ఇతరములు ఆకర్షించవు. అట్టివాడు 'స్థితప్రజ్ఞుడని' భగవంతుడు తెలుపు చున్నాడు.

జీవుడు ఆహారమును అనేక రకములుగ స్వీకరించు చున్నాడు. కేవలము భోజనమే ఆహార మనుకొనరాదు. పంచేంద్రి యముల నుండి, మనస్సు నుండి (అనగా భావము నుండి) రక రకములైన విషయములను తన లోపలికి మనిషి స్వీకరించు చున్నాడు. ఈ ప్రవృత్తి కూడ ఆహారమే.

ఇక్కడ ఆహారము వాసనాపరముగ నుండును. ఈ వాసనలు జన్మ జన్మలలో జీవుడు ప్రోగుచేసుకొని తనతో తెచ్చుకొనుచుండును. మాలిన్య పదార్థములను ప్రోగుచేసుకొని తెచ్చుకొను జంతువువలె జీవుని మనస్సు ఈ వాసనలను కూడ శుభవాసనలతో పాటు కొనితెచ్చుకొనును. ఈ ఆహారమును విసర్జించుట నిజమైన నిరాహార దీక్ష.

ఉదాహరణకు భోజనమును గూర్చిన ఆసక్తి భుజించని సందర్భములలో ఉండినచో అది వాసన యగును. భార్య లేని సమయములో భర్తకు భోగాసక్తి యుండుట వాసన యగును. ఇట్లే ధనము గూర్చి, ఇతర చిల్లర విషయముల గూర్చి అవి లేని సందర్భమున భావించుట వాసనయే.

ఈ వాసనలు కూడ ఆహారముగ సంకేతింపబడినవి. వీటియందు రతి చెందినవాడు సతతము అశుద్ధ ఆహారమును భావముచే స్వీకరించుచుండును. వీని విసర్జన సులభమైన

విషయము కాదు. ఆత్మ విచార మొకటియే పరిష్కారము. ఆత్మ తత్త్వమును గూర్చి వినుట, మననము చేయుట బాగుగ సాగినచో నిత్యానిత్య వస్తువివేక మేర్పడి ఆత్మజ్ఞానమునందు రుచి కలుగును. ఆ జ్ఞానము అగ్ని వంటిది. అగ్ని సమక్షమున ఏదియును నిలువక అగ్నిలో లయమగును. ఆ విధముగ వాసన లంతమొందును. అట్టివాడు ఇంద్రియార్థ విషయములను స్వీకరింపనట్టి దేహము కలవాడై యుండును. అతడు స్థితప్రజ్ఞుడు. అతడే నిరాహారి.

30

ఇంద్రియములు - సౌలభ్యము - ప్రమాదము

యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥ 60

ఇంద్రియ నిర్మాణము సృష్టి నిర్మాణ మహా యజ్ఞమున అత్యంత ప్రాధాన్యము గలదు. సృష్టి నిర్మాణమున జీవులకు దేహము లేర్పరచి, ఆ దేహములందు జీవుని ప్రతిష్ఠాపన చేసి, దేహము ద్వారా సృష్టి వైభవమును అనుభవింపచేయుట సృష్టి సంకల్పములో నొక భాగము. జీవుని దైవమునుండి ప్రత్యగాత్మక వ్యక్తము చేయుట ఒక మహత్తర ఘట్టము. ఏకము, అనేకమగుట ఒక యజ్ఞముగ సాగినది. జీవులేర్పడిన వెనుక వారికి దేహము లేర్పరచుట మరియొక మహత్తర యజ్ఞము. జీవులకు, దేహము లకు పరస్పరత్వ మేర్పరచి జీవ చైతన్యమును ఇంద్రియముల ద్వారా బాహ్యమునకు ప్రకటింపచేయుట ఒక రసవత్తర ఘట్టము.

ఇదియే భాగవతమున ప్రచేతసుల కథగ వివరింపబడినది. జీవుని బహిర్గతుని చేయుటకు బృహత్తర ప్రయత్నము జరిగినది.

అందులకు ఇంద్రియము లేర్పరచి, ఇంద్రియముల ద్వారా జీవుని ఆకర్షింపబడు విషయము లేర్పరచవలసి వచ్చెను. క్రమశః జీవుడు ఇంద్రియములనుండి బహిర్గతుడగుట నేర్చెను. ఇంద్రియార్థము లందు బాగుగ రుచిగొని బహిర్గతుడిగ వుండిపోయెను. అందు వలన భగవానుడు ఇంద్రియములు జీవుని బలాత్కారముగ లాగుచున్నవని తెలుపుచున్నాడు. ఇంద్రియ నిర్మాణము అందు కొఱకే.

ఆత్మసాధన మార్గమున జీవుడు ఇపుడు తిరోగమనము నేర్వవలెను. తిరోగమనము మాత్రమే నేర్చిన చాలదు. తిరోగ మనము తెలియకున్న సృష్టి వ్యూహమున చిక్కును. ఇదియే అభిమన్యుడు పద్మవ్యూహమున చిక్కుట. అట్లు చిక్కువాడు నశించును. ఈ ఇంద్రియ వ్యాపారమునుండి బయల్పడుటకు కూడ మరల మహత్తర ప్రయత్నమే చేయవలెనని భగవానుని హెచ్చరిక.

31

మత్పరత్వము

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

ధ్యాయతో విషయాన్ పుంసః సంగ స్తేషూపజాయతే ।
సంగా త్సంజాయతే కామః కామాత్క్రోధో௨భిజాయతే ॥ 62

క్రోధా ద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

ఇంద్రియములను ఇంద్రియార్థముల వెంట పరిగెత్తకుండ నియమించుటకు భగవాను డొక ఉపాయమును తెలుపుచున్నాడు. అది ఏమన దైవమునందు చిత్తమునకు రుచి ఏర్పరచు టయే. మనస్సు రుచిని కోరును. రుచించు విధముగ మనస్సునకు దైవము నందించవలెను. అపుడు మనస్సు దైవమున రుచి గొనును. ఈ ఉపాయము తెలిసిన ఋషులు వివిధములైన రుచి మార్గముల నేర్పరచిరి. భజనము, సంకీర్తనము, పూజనము, శ్రవణము, అభిషేకములు, హోమములు, స్తోత్రములు మొదలగు వేలాది పద్ధతులను అందించుటలో ఋషులుద్దేశించిన దేమనిన,

అందు జీవున కేది రుచించునో దాని ద్వారమున దైవమును రుచిగొని దైవాసక్తుడగునని. ఒక్కసారి దైవమునందాసక్తి ఏర్పడినచో అది ధర్మమునం దాసక్తిగ కూడ నేర్పడి క్రమశః ఇంద్రియముల నుండి తరింపు ఏర్పడును. 'మత్పరుడవై' యుండుము, అని భగవానుడు బోధించుటలో చక్కని ఉపాయము కలదు. ప్రజ్ఞను సుప్రతిష్ఠము చేయుటకు ధర్మాచరణము దైవారాధనమని తెలియవలెను.

దైవమును చింతించువాడు స్థితప్రజ్ఞు డగును. విషయములను చింతించువాడు సంసారి యగును. దైవమునందాసక్తి దైవమును కోరును. ప్రాపంచిక విషయములందాసక్తి వివిధ విషయములను కోరును. కోరిక తీరినచో మదము పెరుగును. తీరనిచో కోపము పెరుగును. రెండు విధములుగ అవివేక మావరించును. అవివేకము కారణముగ మఱపు కలుగును. మఱపు కారణముగ బుద్ధి నాశనము సంభవించును. అట్టివాడు సమ్మోహితుడై నశించును. ఈ విధముగ విషయవాంఛ పతనమును గావించును. కర్తవ్యమును మరచి కోరికను పెంచు కొనువారికి ఇట్టి వినాశము తప్పదని భగవంతుని హెచ్చరిక.

32

ప్రసాదము

రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్ ।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ **64**

ప్రసాదమనగా మనో నిర్మలత్వము. మనో నిర్మలత్వమును పొందుటకు మనస్సు స్వాధీనము కావలెను. మనస్సు స్వాధీనమగుటకు రాగద్వేషాది ద్వంద్వములను అధిగమించవలెను. ద్వంద్వముల నధిగమించిన మనస్సుతో ఇంద్రియముల నుండి ప్రవర్తించు మానవుడు మనో నిర్మలత్వమును పొందుచున్నాడు.

ప్రసాద స్వీకరణము అనగా సాధారణముగ కట్టె పొంగళి, చక్రపొంగళి, చిత్రాన్నము ఇత్యాది ఆహార పదార్థములను పూజాది కార్యక్రమములు జరిగిన తరువాత భుజించుట అని భావింతురు. కేవలము భుజించుటే అయినచో అది భోజనమగును.

భోజనమునకు, ప్రసాద స్వీకరణకు వ్యత్యాసము కలదు. నిర్మలమైన మనస్సు గలవాని ప్రసాద స్వీకరణము విశిష్టముగ నుండును. అతడు రుచియందు రాగముగాని, రుచి లేకపోవుట

యందు ద్వేషము గాని భావింపక, రుచియందు యుక్తుడైయుండక ప్రశాంతము, నిర్మలము అగు మనస్సుతో అందించిన ప్రసాద మును బ్రహ్మమని భావన చేయుచు, బ్రహ్మమునకు సమర్పణగా ఇంద్రియముల ద్వారమున గైకొనును. ఇట్లే మిగిలిన ఇంద్రియ వ్యాపారము లందు కూడ ప్రవర్తించును. ఇట్లు ప్రవర్తించువాని మనో నిర్మలత్వము ఇంద్రియార్థముల కారణమున చెడదు. ప్రశాంతత చెదరదు.

అట్లుకాక ప్రసాదములో ఉప్పెక్కువయిన దనియు, కార మెక్కువైన దనియు, పోపు తక్కువైనదనియు ప్రసంగించువారు నిర్మలచిత్తులు కాలేరు. కారణమేమన ఇంద్రియార్థముల యందు గల రాగ ద్వేషములు. ఇట్టి రాగ ద్వేషములు సన్నివేశములయందు, ఇతర జీవులయందు, కర్తవ్యముల యందు, కార్యముల యందు గోచరింప జేయువాడు ప్రశాంతతను పొందలేడు. మనో నిర్మ లత్వము ఎండమావివలె మురిపించునుగాని అనుభూతికి అందదు.

భగవానుడు మనో నిర్మలత్వమును పొందుటకు ఒక ఉపాయమును సూటిగా సూచించుచున్నాడు. అది యేమన "నిర్వర్తించుచున్న కార్యము నందు కర్తవ్యమునే దర్శింపుము. రాగ ద్వేషములను ప్రతిబింబింప కుండుము." "రాగద్వేష వియుక్తైః" అని తెలుపుట ఇందులకే. అట్టివానికే మనసు స్వాధీనము కాగలదు. అట్టివాడు కర్మల యందున్నను నిర్మలత్వము కోల్పోవును. చేయు పనులలో కర్తవ్యము నుండి కామ ముద్భవించి

నచో అది రాగద్వేషములకు, కామక్రోధములకు, లోభమోహములకు, ఈర్ష్య అసూయలకు దారితీయును. అట్టివానికి మనస్సు వశము కాదు. జీవితమను ప్రసాదమును అనుభవించలేడు. ప్రసాదమును అనుభవించువాడే దేహమును గూడ ఒక రాజ ప్రాసాదముగ అనుభవింపగలడు.

పై శ్లోకమున రాగద్వేష విముక్తుడగుట, అట్టి మనస్సుతో ఇంద్రియ ద్వారమున కర్మలను నిర్వర్తించుట, తత్కారణముగ మనస్సు స్వాధీనమగుట, అట్టి స్వాధీనమైన మనస్సు నిర్మలత్వమును, శాంతిని పొందుట సోపానములుగ తెలుపబడినది. ఇది ఉత్కృష్టమైన సాధనాంశము.

33

ప్రసాద స్థితి

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే ।
ప్రసన్న చేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥ 65

బుద్ధిమంతుడగు సాధకుడు సద్గ్రంథములందు వాడిన పదములను శ్రద్ధాభక్తులతో, పరిశీలనా దృష్టితో గ్రహించుట నేర్వవలెను. అపుడే గ్రంథస్థ విషయము నందలి లోతులు లేక రహస్యములు బయల్పడగలవు. ఈ దృష్టి శ్రద్ధాళువుల కుండును. కావున గ్రంథ పఠనమునకు శ్రద్ధ అత్యంత అవసరము.

ఉదాహరణకు పై శ్లోకమున ప్రసాదము స్వీకరించుటచే సర్వ దుఃఖములు నశించుననియు, ప్రసన్నమైన మనస్సు కలుగు ననియు, అట్టి మనస్సు బుద్ధియందు స్థిరపడుననియు తెలుపబడి యున్నది. ఇది కారణముగ భగవత్కార్యముల యందు ప్రసాదము నకు విశేష స్థాన మేర్పడినది. నిజమునకు ప్రసాదమనగా తిండి పదార్థము కాదు. ప్రశస్తమైన మనో నిర్మలత్వము. పూజ, అభిషేకము, హోమము మొదలగు దైవారాధన కార్యములను సత్వగుణ ప్రధాన ముగ నిర్వర్తించు వానికి ఏర్పడు స్థితి "ప్రసాద స్థితి."

అతడు పై కార్యములను సత్వగుణ ప్రధానముగ నిర్వర్తించుటచే అందలి ఫలితముగ మనో నిర్మలత్వమును పొందుచున్నాడు. అట్టి మనో నిర్మలత్వము కారణముగ వృద్ధి గావింపబడిన అతని చేతస్సు బుద్ధియందు స్థిరపడుచున్నది. అది ప్రసాద ఫలితము. కేవలము 'పొట్ట' నిండ ప్రసాదము మెక్కువానికి ఈ స్థితి కలుగదు. వారు మరియొక ప్రసాద భక్తులు. భగవంతుడు తెలిపిన ప్రసాదము సామాన్యు లెరిగిన ప్రసాదము కాదని తెలియవలెను.

పూజాది కార్యక్రమములను డంబాచారముగ, కీర్తికొరకు నిర్వర్తించువారు రజోగుణ దోషము కలిగిన వారు. వీరు ఎన్ని పూజలు నిర్వర్తించి నప్పటికిని మనశ్శాంతి కొరవడును. ఆరాటములు, తత్సంబంధిత వికారములు, వారి ప్రవర్తనల యందు గోచరించుచుండును. వారి నుండి అనుస్యూతము అశాంతి ప్రసరించుచుండును.

శాస్త్రవిధుల నుల్లంఘించి, పూజాది క్రతువులను తమ ఇష్టము వచ్చినట్లు చేయువారు తమోగుణ దోషము కలవారు. వీరు చేయు క్రతువులు వీరినే బంధించగలవు. దుష్ఫలితములు గూడ ఏర్పడగలవు.

యజ్ఞార్థ కర్మలు, దైవకార్యములు మనోనిర్మలత్వమును చేకూర్చ వలెను. అదియే ప్రసాద స్థితి. తెలుగువారు "సాద, సీద" అను పదములను వాడుచుందురు. ఒక వ్యక్తి నుద్దేశించి అతడు సాద, సీద మనిషి అని అనుచుందురు. నిజమునకు వారి ఉద్దేశ్యము స్పష్టత, ముక్కుసూటితనము కలవాడని తెలుపుటకు పై పదములు

వాడుదురు. సాద అన్న పదము స్పష్టతకు సంకేతమైనచో ప్రసాద అను పదము ప్రశస్తమైన స్పష్టత అని తెలియవలెను. అట్లే సీద అను పదమును ప్రసీదగా భావించ వలెను. ఇట్టి పరిశీలనా బుద్ధి చదువరు లేర్పరచుకొందురు గాక !

ప్రసాద స్థితి వలన సర్వదుఃఖములు నశించుట సహజము. ప్రసాద మనగా మనో నిర్మలత్వము అని ఇదివరకే తెలుపబడినది. రాగద్వేషాది ద్వంద్వములు లేక దీర్ఘకాలము కర్తవ్యములను నిర్వర్తించు వానికి ఈ నిర్మల స్థితి ఏర్పడునని కూడ ఇదివరకే తెలుపబడినది. రాగద్వేష విముక్తునకు మాత్రమే కదా ప్రసాదస్థితి. ద్వంద్వములతో ముడి తెగినవానికి కర్తవ్యమే ఉండునుగాని, దాని ఫలితము లిట్లుండవలెనని ఆశయ ముండదు.

ఇది భగవానుని ముఖ్యమైన బోధ. "నీ ధర్మమును నీవు నిర్వర్తింపుము. ధర్మ నిర్వహణ యందు ప్రశాంతత యున్నది. అట్టి ప్రశాంతత ఫలితములను కోరినపుడు లేదు. జయము, అపజయము నీ కనవసరము. కర్తవ్య నిర్వహణమే నీవంతు." అని అర్జునునకు మరల మరల బోధించినాడు కదా. జీవుని మనస్సు కర్తవ్యము నందే నిమగ్నమై నపుడు "ఇట్లు జరుగవలెను, ఇట్లు జరుగరాదు" అను భావములందు చిక్కుకొన నపుడు అతనికి దుఃఖ కారణమే లేదు. కావున దుఃఖమే లేదు.

అట్టి నిర్మలత్వము నొందిన మనస్సు మిక్కుటముగ, శీఘ్ర ముగ బుద్ధియను వెలుగునందు నిలచును. **64, 65** శ్లోకములు జీవచైతన్యము ఇంద్రియార్థముల నుండి బుద్ధిని చేరు సోపాన మును వివరించుచున్నవి.

34

చిత్త శుద్ధి

నాస్తి బుద్ధి రయుక్తస్య న చాయుక్తస్య భావనా ।
న చాభావయతః శాంతి రశాంతస్య కుతః సుఖమ్ ॥ 66

ప్రజ్ఞ బుద్ధియందు స్థిరపడుటయే బుద్ధియోగము. అట్లు బుద్ధియందు నిలబడవలెనన్నచో మనస్సు నిర్మలము కావలయును. మనస్సు నిర్మలము కావలెనన్నచో ఇంద్రియములు ఇంద్రియార్థ ముల యందు తగులుకొని యుండరాదు. తగులు కొనక యుండుటకు సాధకుడు ద్వంద్వ భావముల నుండి బయల్పడ వలెను. సృష్టి యందలి ద్వంద్వములు జీవుని బంధించునని తెలుసుకొని ద్వంద్వముల యందు ఉదాసీనుడుగా నుండుట, కర్తవ్యము నందు ఉన్ముఖుడై యుండుట నిరంతరము సాధన సాగవలెను. ఇది యొక్కటియే ఇంద్రియముల యందు చిత్తము తగులు కొనక శుద్ధిగ ఉండుటకు ఉపాయము. మరియొక మార్గము లేదు. ద్వంద్వములు మనసున ఉన్నంతకాలము అవి రాగద్వేషములుగ పని చేయుచునే యుండును. అది కారణముగ మనస్సు నందలి ప్రజ్ఞ బుద్ధి లోనికి ఊర్ధ్వగతి చెందకపోగా

ఇంద్రియములలోనికి అధోగతి చెందగలదు. కావుననే కర్మకు కర్తవ్యమే ప్రధానముగాని కామము కాదు.

కామ ప్రేరితుడుగాక కర్తవ్య ప్రేరితుడై జీవించుట భగవంతు డందించు చున్న ఉపాయము. అట్లు జీవించు వానిని ద్వంద్వము లంటవు. మనస్సు నిర్మలమగును. అట్టి మనస్సు బుద్ధియందు స్థిరపడు అర్హతను పొందును. ఇట్లు రాగద్వేష విముక్తుడు కాని వానికి సుఖశాంతులు ఉండజాలవు. కామము ప్రధానము కాగా ఇంద్రియ ద్వారమున మనస్సు పరిపరి విధముల పరిగెత్తుచు అలసిపోవుటయే గాని సుఖశాంతు లెట్లు దొరుక గలవు?

నిజమునకు సుఖశాంతులను కోరుట కూడ కామమే. కోరినంత మాత్రమున సుఖశాంతులు జీవునకు కలుగవు. వాటికై యత్నించుట కూడ నిష్ప్రయోజనము. వానిని పొందుటకు కోరికను తీవ్రము, తీవ్రతరము చేయుట ఉపాయము కాదు. వానిని పొందవలెనన్నచో జీవుడు నిరంతరము తనను కర్తవ్య నిర్వహణ మందు నియమించుకొను చుండవలెను. కర్తవ్య నిర్వహణము చేయువానికి పుట్టలు పుట్టలుగ భావములు జనింపవు. కామ ప్రవృత్తి కర్తవ్య ప్రవృత్తిగ మారును. అట్టి కర్తవ్యోన్ముఖునకు కామము లేకుండుట వలన కర్మఫలములపై కూడ ఆసక్తి యుండదు. దీర్ఘ కాలము కర్తవ్యమునే ఆచరించు చుండుటవలన చిత్తశుద్ధి ఏర్పడి సుఖశాంతులు ఆవరించగలవు. మరియొక మార్గము లేదు.

35

అంకుశము

ఇంద్రియాణాం హి చరతాం యన్మనోఽనువిధీయతే ।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయు ర్నావ మివాంభసి ॥ 67

నీటియందుతేలు నావ గాలినిబట్టి పోవుచుండును. గాలి వాలును బట్టి నావ పలుదిక్కులకు ఈడ్వబడు చుండును కదా! అట్లు పలు విధములుగ ఈడ్వబడుట నావకు ప్రయాణ మెట్లు కాగలదు?

ముక్కుతాడు వేయని ఎద్దు చేలయందుబడి పంటను విధ్వంసము చేయుచు, చిందులు వేయుచు తినినంత తిని, మిగిలినది పాదములతో త్రొక్కుతూ స్వైర విహారము చేయును. అట్టి ఎద్దు పొలమున కెట్లు ఉపయోగపడగలదు?

కళ్ళెములేని గుఱ్ఱములతో గూడిన రథము, గుఱ్ఱములెటు లాగినచో అటుపోవును. తత్కారణముగ రథము నశించునుకదా !

శిక్షణము, మావటి లేని మదపుటేనుగు అపాయకరము కదా !

అట్లే రాగద్వేషముల ననుసరించుచు, ఇంద్రియముల

ద్వారా ఇంద్రియార్థముల కొరకై పరువెత్తు మనస్సు మనుజుని హరించును.

నావ పయనించవలె నన్నచో తెరచాప, చుక్కాని ఏర్పరచ వలెను. ఎద్దు ఉపయోగపడవలె నన్నచో ముక్కుకు తాడు బిగించి, శిక్షణ నిచ్చి అరక కట్టించవలెను. గుఱ్ఱములు ప్రయాణమునకు వినియోగపడవలె నన్నచో కళ్ళకు గంతలు కట్టి, కళ్ళెము వేసి పగ్గములు పట్టి నడిపించవలెను. మదపుటేనుగు బలము విని యోగపడవలె నన్నచో అంకుశముతో మావటివాడు అధిష్ఠించి యుండవలెను. అట్లే ఇంద్రియములను, మనస్సును అధిష్ఠించి మానవ ప్రజ్ఞ జీవనయానము వైభవోపేతముగా నిర్వర్తించ దలచు కొన్నచో కర్తవ్యమను అంకుశముతో మనసును నడిపించవలెను. లేనిచో ప్రజ్ఞ హరింపబడునని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు.

36

హెచ్చరిక

తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

పొరబడని, హెచ్చుతగ్గులు లేని స్థిరమైన జ్ఞానము వలయునా? అట్టి జ్ఞానమును ప్రతిష్ఠింప జేయుటకు ఉత్సాహించు చున్నావా? అట్లయినచో నీ పంచేంద్రియముల వినియోగము పరిశీలింపుము. వాక్కు, కర్మేంద్రియముల వినియోగమును కూడ పరిశీలింపుము. వానిని కర్తవ్యమునకే వినియోగించుట, ఇతర సమయముల యందు విశ్రాంతి నిచ్చుట అను దీక్షను స్వీక రింపుము. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు కేవలము కర్తవ్యమునకే వినియోగింపబడుటచే విషయాసక్తి గొనక అప్రమత్త ములై చురుకుగ ఉండగలవు. కర్తవ్యము గోచరించినపుడెల్ల ప్రతి స్పందించగలవు. లేనిచో విశ్రమించ గలవు. విషయానురక్తి అను వ్యాధిని కర్తవ్యమను ఔషధముతో పరిపూర్ణముగ నిర్మూలించుము. ఇట్లు ఇంద్రియార్థముల నుండి ఇంద్రియములను సర్వవిధముల నిగ్రహించ వచ్చును.

భగవంతుడు పై శ్లోకమున "సర్వశః" అను పదమును వాడినాడు, అనగా సర్వ విధముల పరిపూర్ణముగ ఒకించుక కూడ విషయాసక్తి లేకుండగ నిర్మూలించినవే జ్ఞానము స్థిరపడును. నావ ఎంత కట్టుదిట్టముగ నున్నను చిన్న రంధ్రము కారణముగ మునిగి పోవును గదా! నీటి కుండకు ఎంత చిన్న చిల్లు పడినను నీరు కారిపోవును కదా! అట్లే జ్ఞానము సుప్రతిష్టమై యుండవలెనన్నచో విషయాసక్తి యను రంధ్రమునకు తావీయరాదు సుమా! అని భగవానుడు హెచ్చరించుచున్నాడు.

37

చీకటి - వెలుగు

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ 69

మునులకు, యోగులకు ఈ జగత్తున కనబడునది సామాన్యులకు కనపడదు. సామాన్యులకు గోచరించినది సంయమ ముగల యోగులకు గోచరించదు. యోగులకు, మునులకు విశ్వ మంతయు వ్యాపించి ఉన్న ఒకే ఒక చైతన్యము గోచరించును. ఆ మహాచైతన్యమే పెక్కు విధములుగా ఎట్లు నర్తించుచున్నదో గోచరించును. వైవిధ్యము గల ఆ నర్తనము యొక్క వైభవమును దర్శించుచు వారానందింతురు. వారియందు స్వ-పర భేదములు గాని, సంఘము నందలి స్థితిగతులు గాని, జీవులయందలి భేద ములు గాని భాసింపవు. ఉదాహరణకు ఒక మనిషి ఎట్టి విలువైన వస్త్రములు ధరించెనో, ఎటువంటి ఆభరణ ములు ధరించెనో, అతని రూపురేఖ లెట్లున్నవో యోగి గమనించడు. ఎదురుగా నిలబడిన జీవమును, జీవచైతన్యమును మాత్రమే దర్శించును. జాతి మత కుల లింగ భేదములు గోచరింపవు.

సమాన్యులకు జాతి మత కుల లింగ భేదములు గోచరించును, ఆకారములు, వాని వికారములు గోచరించును. వస్త్రాభరణములు యొక్క విలువ గోచరించును. ఎదుటివారి తప్పులు గోచరించును. సంఘమున గల ఇంద్రియార్థములు గోచరించును. మరెన్నెన్నో చిల్లర విషయములు గోచరించును. కాని యోగులకు గోచరించు జీవచైతన్యము, దాని వెలుగు, వైభవములు సామాన్యులకు గోచరించవు.

పై విధముగ యోగులకు గోచరించునవి జీవులకు గోచరించకుండుట యోగుల పగలు, జీవులు రాత్రియని భగవంతుడు చమత్కారముగ తెలిపినాడు. అట్లే జీవులు చూచు లౌకిక విషయములు యోగుల దృష్టిని ఆకర్షించవు. గనుక జీవుల పగలు యోగులకు రాత్రి అనికూడ తెలిపినాడు.

మునులు, యోగులు, ఆత్మ సంయమము చెందిన వారిని, దర్శన జ్ఞానము కలిగివారిని, సతతము మననము నందుండు వానిని కూడ భగవానుడు ఈ శ్లోకమున తెలియజెప్పినాడు. సంయమ మనగా ఇంద్రియములు మనస్సునందు, మనస్సు బుద్ధి యందు, బుద్ధి నేను అను ప్రజ్ఞ యందు ఇమిడి యుండుట. అట్టివాడు "జాగర్తి"గ నుండును. అనగా మేలుకొని ఉండును.

'పశ్యతః' అనగా సమస్తమునందు మేలుకొని యున్న దానిని మెలకువతో దర్శించు చుండును. 'ముని' అనగా దర్శించిన దానిని అదే సమయమున మననము చేయుచుండును. అట్టివాని దృష్టికి చీకటి లేదు. అనగా కనపడకుండుట లేదు.

38

కామ స్వరూపం

ఆపూర్యమాణ మచలం ప్రతిష్ఠమ్
సముద్ర మాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతి మాప్నోతి న కామ కామీ ॥ 70

సముద్ర దర్శనము శుభకరమని పెద్దలు తెలుపుదురు. సృష్టియందు సముద్రమునకు ఒక విశిష్ట స్థాన మున్నది. సముద్ర మునందు నదుల నుండి, వాగుల నుండి, వర్షపాతము నుండి ఎంత జలము చేరినను సముద్రము పొంగదు. ఇదియొక విశిష్ట స్థితి. ఎన్ని విషయములు సముద్రమున చేరినను సముద్రమట్లే యుండును. దానియందు సమస్తము ఇముడును. ఇతరములు వచ్చి చేరుట వలన సముద్రము ఎల్లలు దాటదు. దానికి స్థిరమైన హద్దుమీరని ఉనికి కలదు. అది పూర్ణమైనది. అనగా నింపుటకు అవకాశము లేనిది. నిండియున్నది గనుక నింపుటకు వీలుపడదు.

అట్లే శాంతిని పొంది బుద్ధియందు స్థిరపడిన వానిని మరియే భోగ్య విషయములు మరింత శాంతిని, తృప్తిని కలిగింప జాలవు. అతడు శాంతిగను తృప్తిగ నుండుటచే భోగ్య విషయములు

మరింత శాంతిని, తృప్తిని ఇచ్చుట జరుగదు. నిండిన సముద్ర మున మరింత నీరు చేర్చిన ఎట్లు పొంగదో శాంతి, తృప్తితో నిండిన మనస్సు మరి యే ఇతర విషయములకు పొంగదు.

సముద్రము నుండి సూర్య కిరణములు జలములను ఊర్ధ్వగతికి కొనిపోయి నను సముద్రమింకదు. అట్లే విషయలేమి కారణముగ శాంతుని చిత్తము క్రుంగదు. పొంగుట-క్రుంగుట సముద్రమునకు, శాంతచిత్తునకు లేవు. ఇదియే బ్రహ్మానంద స్థితి. బుల్లి బుల్లి కోరికల యందు జీవిత మంతయు సతమతమగు వానికి ఈ స్థితి దుర్లభము. ఊహించుటకైననూ వీలుపడనిది. భగవానుడీ విధముగ తన నిజస్థితిని అర్జునునికి సూచన ప్రాయ ముగ తెలిపినాడు. ప్రస్తుతము అర్జునుడున్న పరిస్థితికి భగవంతు డందించిన ఉదాహరణము అగ్రాహ్యాము (బొత్తిగా అర్థము కాని విషయము). అయినను బీజప్రాయముగ అత్యుత్తమ విషయ మును శిష్యునియందు ఆవిష్కరించుట సద్గురువు యొక్క దూర దృష్టి మరియు కరుణ అని తెలియవలెను.

39

శాంతి సూత్రము

విహాయ కామాన్ య స్సర్వాన్ పుమాం శ్చరతి నిస్స్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి ॥ 71

ఏ మనుజుడైతే రాగద్వేషములను విడుచునో, ఎవడైతే విషయముల యందు ఆసక్తి విడుచునో, మమకారమును అహంకారమును విడుచునో అట్టివాడు శాంతిని పొందునని భగవానుడు ఈ శ్లోకమున తెలుపుచున్నాడు. ఇందు నాలుగు స్థితులను వివరించుచున్నాడు.

ఇందు మొదటిది కామ విసర్జనము. సర్వమతముల యందు, సర్వశాస్త్రముల యందు కామమును విసర్జింపుమని తెలుపబడు చునే యుండును. కర్తవ్యము ననుసరించుట వలన మాత్రమే కామము విసర్జించుటకు వీలుపడునని తెలియవలెను. కర్తవ్య మనగా చేయవలసిన పని. కామ మనగా చేయదలచిన పని. తాను తలచిన పనులు చేయుటకాక, వలసిన పనులను చేయుట ముఖ్యము. ఇవి ఆరోహణ క్రమమునకు గడప వంటివి.

అట్లు కర్తవ్యమును మాత్రమే చేయ దీక్ష పూనిన వానికి మార్గమున అనేకానేక విషయములు కన్పట్టుచుండును. అందను రక్తి కొన్నవాడు కర్తవ్య విముఖుడు కాగలడు. విషయానురక్తుడు కర్తవ్యపాలనము చేయలేడు. అందుచే విషయాసక్తిని విసర్జించుచు, కర్తవ్యము నిర్వర్తించుచు సాగిపోవలెను.

అటుపైన సాధకునకు మమకార మను అవరోధ మేర్పడును. నాది అను భావమే మమకారము. తన శరీరము, తన వారు, తన సంపద అనునవి మమకార స్థానములు. తనది అనుకొనినదంతయు నిజమునకు దైవమునదే అని భావించుట సాధనగ సాగవలెను. శరీరమునకు, తనను ఆశ్రయించిన వారికి, తన చుట్టూ ఏర్పడిన సంపదకు యజమాని దైవమే యనియు, తాను కేవలము ధర్మకర్త అనియు భావింపవలెను. ధర్మకర్త యనగా వాని యందు తన ధర్మము నిర్వర్తించుటే గాని యాజ మాన్యము కాదు. ఇట్టి భావనను స్థిరపరుచుకున్నవానికే మమకార మను పొర తెగును.

అహంకారము వర్జించుట తుది మెట్టు. కర్తవ్యమును చేకొని కామమును వర్జించుట, కర్తవ్య పాలనమున ఆకర్షణీయమగు విషయముల యందు అనురక్తిని వర్జించుట, “తనది” అను భావమును వర్జించుట అను మూడు సోపానములను అధిరో హించిన సాధకుడు “తాను” అను భావమును కూడ వర్జించుట తుది మెట్టు.

నిజమునకు తానులేడు. తానుగ దైవమే యున్నాడు. కాని తా నున్నాడననుకొను చున్నాడు. అట్లనుకొనుటయే అహంకారము. తనకొక ప్రత్యేక అస్థిత్వము లేదు. దైవమే జీవుడుగా నుండగ, జీవుడు తా నున్నాడనుకొనుటయే మొదటి మాయావరణము.

బంగారము లేక ఉంగరము లేదు. మట్టి లేక కుండ లేదు. సముద్రము లేక కెరటము లేదు. దైవము లేక జీవుడు లేడు. ఈ జ్ఞానము పూర్ణ జ్ఞానమునకు తుది మెట్టు. దీని నధిరోహించు టకు “తా నుండుట అనగా నేమి?” అను అంశముపై విచారణ తీవ్రముగ సాగవలెను. సమాధానము దర్శించినపుడు అహంకారము నశించును. నిరహంకారి యగును. అతనిది స్థిరమైన శాంతి.

అహంకారికి శాంతి లేదు. మమకారికి అసలు లేదు. విషయాను రక్తునకు బొత్తిగ శాంతి లేదు. కాముకునకు అశాంతి స్థిరముగ నుండును. ఈ నాలుగ సోపానములు అధిరోహింప జేయుటకే పదునెనిమిది అధ్యాయముల గీతోపదేశము. ఈ సోపానముల నధిరోహించుటనే ఉపనిషత్తులు సూచించుచున్నవి. యోగవిద్య బోధించుచున్నది. బ్రహ్మవిద్య ఘోషించుచున్నది.

40

బ్రహ్మ నిర్వాణము

ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ ! నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాఽస్యా మంతకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥ 72

ఇది సాంఖ్యయోగ మను అధ్యాయమునకు చిట్టచివరి శ్లోకము. ఈ శ్లోకమున భగవంతుడు అంతకుముందు శ్లోకము లలో వివరించిన సోపాన క్రమమునకు గమ్యమును నిర్వర్తించు చున్నాడు. అర్జునుడు ప్రజ్ఞయందు స్థితి గొన్నవాని లక్షణములను గూర్చి నాలుగు ప్రశ్నలు శ్రద్ధాభక్తులతో శ్రీకృష్ణుని అడిగెను. స్థిత ప్రజ్ఞుని లక్షణము లేవి? అతడేమి పలుకును? ఏ రీతిగ నుండును? ఎట్లు సంచరించును? అనునవి ఆ ప్రశ్నలు. ఈ ప్రశ్న లన్నిటికిని సమాధానములు వివరించుచు శ్రీకృష్ణుడు క్రమశః 71వ శ్లోకము చేరునప్పటికి నిరహంకార స్థితిని ఆవిష్కరించెను.

నిరహంకార స్థితి చేరినవారికి సమస్తము వ్యాపించియున్న తత్త్వమే తానుగా నున్నదనియు, మరియు సమస్త జగత్తు అదియే నిండియున్న దనియు తెలియును. అంతటిలో నిండియున్నది, అన్నిటియందు నిండినది, తనయందు కూడ నిండియుండుటచే తాను, ఇతరము అను భేదము నశించును. అంతటిలో నిండిన

తత్త్వమును బ్రహ్మము అందురు. ఈ తత్త్వమును దర్శించిన వాని స్థితి బ్రాహ్మీ స్థితి. ఇది పొందినవానికి తాను కానిది ఏమియు కనపడదు. తానే సమస్తమై యుండుటచే మరియు సమస్తమే తానుగ నుండు టచే మరియొకటి లేని స్థితి ప్రాప్తించుటచే మోహము, అంత్య కాలము అనునవి కూడ లేకుండును.

మరియొకటి లేని స్థితిని గూర్చి భగవానుడు భాషణము చేయుచున్నాడు. ఇదియొక అద్భుతమైన స్థితి. అనిర్వచనీయమైన స్థితి. అంతకుముందున్నవి అపుడుండవు. అంతకుముందు గోచ రించిన సత్యములు కూడ నుండవు. స్వప్నమున అనేకానేక రూపములను, సన్నివేశములను, భావములను అనుభూతి చెందుచున్న జీవుడు మేల్కాంచినపుడు స్వప్నము లోని విశేషము లన్నియు, మేల్కాంచినపుడు ఎట్లు లేవో, అట్లే బ్రహ్మమునందు మేల్కాంచినవానికి ఈ సమస్త సృష్టియు, అందలి జీవులు, లోకములు స్వప్నమని తెలిసి నవ్వుకొనగలడు. అతని ఆనందము నకు అవధులు లేవు. అదియే బ్రహ్మానందము.

గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 3వ అధ్యాయము - కర్మయోగము)

మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

“ధనిష్ఠ” అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు “ధనిష్ఠ” 1992లో జన్మించినది.

“ధనిష్ఠ”, డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

“ధనిష్ఠ” ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - “*జగద్గురు మందిరము*” గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. *"పరహితము పరమధర్మ"* మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

ముందుమాట

భగవద్గీత సర్వోత్కృష్టమైన గ్రంథము. కర్మాచరణమునకు, ధర్మాచరణమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు, మోక్షపదమునకు ప్రామాణిక గ్రంథము. భగవద్గీతపై అనేకానేక వ్యాఖ్యానములు గలవు. ఇకపైన గూడ రాగలవు.

నావాణి యందు గీతా వ్యాఖ్యానము, "గీతోపనిషత్" అను శీర్షికగా పాఠకులకు అందింపబడినది. ప్రతి అధ్యాయము తనదైన సందేశము నందించుట గీతయందలి విశిష్టతయగుటచే అధ్యాయమున కొక పుస్తకముగా సామాన్య పాఠకులకు భగవంతుని సందేశము నందించు ప్రయత్నము "ధనిష్ఠ" సంకల్పించినది. మాస్టర్ పార్వతీకుమార్ గారిచే అందించబడిన వ్యాఖ్యానము సామాన్యులకు కూడ స్ఫూర్తి కలిగించు విధముగ నుండుటచే ఈ ప్రచురణ చేపట్టితిమి. మొదటిగ సాంఖ్యయోగము ముద్రించితిమి. రెండవ గ్రంథముగా కర్మయోగము ముద్రించబడినది. మిగిలిన అధ్యాయములు గూడ కాలక్రమమున ప్రచురించ బడగలవు.

– ధనిష్ఠ

పరిచయము

కర్మనిర్వహణము, కర్మ స్వరూప స్వభావములు, కర్మ కారణముగ బంధము, కర్మ కారణముగ మోక్షము, కర్మ సిద్ధాంతము శ్రీకృష్ణ పరమాత్మ వివరించినట్లుగా మరెవ్వరును వివరింపజాలరు. భగవద్గీత యందు అత్యంత ప్రాధాన్యము వహించు సూత్రము నిష్కామకర్మము. కర్మమును నిష్కామముగ ఫలాసక్తి లేకుండ, సంగము లేకుండ సమర్పణ బుద్ధితో నిర్వర్తించుట ఎట్లో భగవానుడు తానుగా ప్రతి సన్నివేశమున తాను నిర్వర్తించి మనకు ఎఱుక పరచినాడు. ఇంతకు మించిన కర్మజ్ఞాన మెచ్చటనూ లేదు. తాను సంపూర్ణముగ నాచరించి బోధించుటచే శ్రీ కృష్ణు డొసగిన కర్మజ్ఞానము పరిపూర్ణము. మానవులకు వలసినది కర్మజ్ఞానమే. తెలిసి ఆచరించుట వలన సుఖశాంతులు కలుగ గలవు. శ్రద్ధాళువులైన సాధకులకు ఈ చిన్న పుస్తకము కర్మాచరణమున సహాయకారిగా నుండగలదు.

విషయ సూచిక

సందేశము

కర్మయోగము పేరున శ్రీ కృష్ణు డిచ్చిన కర్మసూత్రములు క్లుప్తముగ ఈ క్రింది విధముగ నున్నవి.

1. చేయుచు నేర్చుకొనుచుండవలెను. అపుడే వృద్ధి.

2. కర్తవ్యము మేరకే కర్మలను నిర్వర్తించవలెను. భాషణమైననూ అంతే.

3. కేవలము పనియందు మాత్రమే శ్రద్ధ, భక్తి, ఆసక్తి కలిగి యండవలెను. కర్మ నిర్వహణమున యితరముల యందు ఆసక్తి, శ్రద్ధను చెరచును.

4. ఇతరుల పనులలో చొరబడక, నీ పని నీవు నిర్వర్తింపుము.

5. చేయుపని ఎక్కువ తక్కువలు లేక యుండవలెను. దానినే సమాచరణ మందురు.

6. చతుర్ముఖ బ్రహ్మ చేయు సృష్టియందు అతనికి వ్యక్తిగత లాభము లేదు. ఆనందమే యున్నది. కావున కర్తవ్య

నిర్వహణమే గాని అందు లాభనష్టములు చూడకుడదని బ్రహ్మోపదేశము.

7. తోటిజీవులకు శ్రేయస్సుగా కర్మల నాచరించుటయే, నిజమగు దేవతారాధనము.

8. ఇతరుల కొనర్చు సేవ ఆనందము కలిగించును. కేవలము తన ఆనందము కొరకు చేయు పనులలో యితరుల శ్రేయస్సు లేనిచో దుఃఖమే కలుగును.

9. నిష్కామ కర్మము, కర్మనుండి మోక్షము నీయగలదు. కామ్య కర్మ బంధము కలిగించును.

10. సృష్టి యందొక ధర్మచక్ర మున్నది. జీవులన్నియు ధర్మ చక్రము ననుసరించి, ఒకరి కొకరు సహకరింతురు. మానవుడు కూడ అట్లే సహకరించనిచో, చక్రము బంధించును.

11. సత్కర్మలనుండి సత్ఫలితములు కలుగవచ్చును. (సంపద, కీర్తి.) ఫలితముల యందు ఆసక్తి కలిగినచో బంధము కలుగును.

12. సంఘశ్రేయస్సే ప్రధానముగా జనకాది రాజర్షులు జీవించిరి. సంఘశ్రేయస్సే చేయుట కర్తవ్యమైన పని.

13. పెద్దలను చూచి పిన్నలు అనుకరింతురు. కావున పెద్దలు బాధ్యతతో మెలగవలెను.

14. తెలిసినవారు ఫలమందాసక్తి లేనప్పటికిని, కార్యములను అత్యంతాసక్తితో నిర్వర్తింతురు. ఆసక్తి పని యందేగాని, ఫలితమందు కాదు.

15. తెలిసినవారు, కర్మలను ఎక్కువ తక్కువ లేకుండ నిర్వర్తించి, ఫలితములను మనస్సున విడచి యుందురు.

16. అహంకారి తానే చేయుచున్నానని భావించుచు బంధించు కొనును. నిజమునకు ప్రకృతి గుణములే అతనిచేత కర్మలను నిర్వర్తింపజేయు చున్నవి.

17. అహంకారికి మూఢత్వము, మోహత్వము ఎక్కువగ నుండును.

18. ఆశ, మోహము లేక కర్తవ్యమును నిర్వర్తించుచు ఫలితము లను దైవమున కర్పించుట శరణాగతి.

19. శరణాగతి మార్గమున ఆశ, మోహములే కాక అసూయను కూడ వదలి, శ్రద్ధతో కార్యములను నిర్వర్తించుచు ఫలితములను దైవమునకు సమర్పింపవలెను.

20. బుద్ధి, విచక్షణ కలిగి కర్తవ్యమును ఫలాపేక్ష లేకుండ నిర్వర్తించుట యొక మార్గము. బుద్ధికి కూడ మోహము కలిగినపుడు, దైవమునకు సమర్పణ చెంది కార్యములు నిర్వర్తించి, ఫలితములను దైవమునకు సమర్పించుట మరి యొక మార్గము.

21. జ్ఞానులు సైతము ప్రకృతి గుణములతో నడిపింప బడుచుందురు. కావున నిగ్రహ మార్గము కన్న, అనుగ్రహ మార్గము మిన్నయైనది.

22. ఇంద్రియ సృష్టి అంతయు ద్వంద్వమే. ఇంద్రియ నిగ్రహము కన్న, దైవానుగ్రహమునకై ప్రయత్నించుట శ్రేయస్సు.

23. తన ప్రవృత్తికి సరిపడు కార్యములనే చేయవలెను గాని, సంపద, కీర్తి, గౌరవము, అధికారము కలుగునని యితర మార్గముల జీవించరాదు.

24. సృష్టి యొక అగ్ని కార్యము. అగ్ని కార్యమున మలినములు పుట్టుట తప్పవు. మనస్సున, శరీరమున కలుగు మలినము లను ప్రతినిత్యము నిర్మూలించుకొనుట కర్తవ్యము.

1

ప్రాథమిక సూత్రములు

అర్జున ఉవాచ :

జ్యాయసీ చే త్కర్మణస్తే మతా బుద్ధి ర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥ 1

వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోఽహ మాప్నుయామ్ ॥ 2

శ్రీభగవా నువాచ :

లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయాఽనఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥ 3

న కర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ 4

న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్ ।
కార్య తే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥ 5

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।
ఇంద్రియార్థా న్విమూఢాత్మా మిథ్యాచార స్స ఉచ్యతే ॥ 6

చేయుట - నేర్చుట :

"పనులు చేయుచు నేర్చుకొనవలెనా? నేర్చుకొనుచు చేయవలెనా?" రెండునూ ఒకటే. సామాన్య జీవితమున జీవుడు లేచినది మొదలు ఏదియో ఒకటి చేయుట తప్పనిసరి. దంత ధావనము, స్నానము, వస్త్రధారణము, భోజనము, సంఘమున ఏదియో ఒక పని, విలాసము, విశ్రాంతి తప్పనిసరి పనులు. చేయుట తప్పనిసరి యైనప్పుడు చేయుచు నేర్చుకొనవచ్చును. నేర్చుకొనుటకు చేయుటను ఆపనక్కరలేదు. ఇది కృష్ణుని మతము. చేయుచు నేర్చుకొనుట తెలివి. చేయుచు నేర్చుకొనుట అనినను, నేర్చుకొనుచు చేయుట అనినను ఒకటే. నేర్చుకొనని వాని చేతలలో నిపుణత పెరగదు. కౌశలము పెరగదు. కావున పనులు కుశలముగా జరుగవు. అడ్డంకులు వచ్చును. లోపల, బయట ఘర్షణము పెరుగును. పనులు చేయుట యందు నిపుణత పెరగవలెనన్నచో ఎట్లు చేయవలెనో కూడ నేర్చుకొను చుండవలెను. నేర్చుకొనకుండ చేయువాడు దుఃఖపడును. నేర్చుకొనుచు చేయువాడు సుఖపడును.

ఒక పనినిగాని, ఒక వృత్తినిగాని, వ్యాపారమునుగాని, ఉద్యోగముగాని, సంఘసేవ గాని, స్వాధ్యాయముగాని, తపస్సు గాని చేయువాడు ప్రతిదినము ముందు రోజు కన్న బాగుగ చేయుటకు పూనుకొనవలెను. ప్రతి పని పెద్దదికాని, చిన్నది కాని నిన్నటి కన్న ఈ రోజు ఇంకొంచెము బాగుగ చేయుటకు నేర్పు

కావలెను. చేయుట వలన కూడ నేర్చుకొనవచ్చును. నేర్చుకొనుచు చేయవచ్చును. చేయుచు, ఎట్లు నేర్వవలెనో భగవంతుడు తెలిపిన విషయమును కర్మయోగ మనిరి.

చేయక ఊరక నేర్చుకొనుట, చేయుచు నేర్చుకొనకుండుట నిష్ప్రయోజనము. చాలమంది ఈ ఉపాయము తెలియక నేర్చు కొనుటకు చేయుట నాపుదురు. చేయనివాని జ్ఞానము అనుభవైక జ్ఞానము కాదు కదా! అట్టివారు మిథ్యాచారులుగ, మూర్ఖులుగ దిగజారుదురు. శరీరమును, యింద్రియములను, మనసును నియోగించుటకే దైవమందించినాడు. వానిని వినియోగింపక పోవుట ఎవని తరము కాదు. వానిని నియమించి సద్వినియోగము చేయుట కర్తవ్యము. అందువలన వాటిని అరికట్టక, దమింపక నియమించి వినియోగించుట నిజమైన యోగము. ఎట్లు నియమించి వినియోగించవలెనో ఈ అధ్యాయమున(కర్మ యోగమున) దైవము తెలుపుచున్నాడు.

ఆవశ్యకత :

కర్మల నెట్లు ఆచరించవలెనో, ఎట్లాచరించినచో చేయు కర్మల నుండి బంధము లేర్పడవో భగవానుడు కర్మయోగమున తెలియపరచుచున్నాడు. తాను తెలిపిన విధముగ సృష్టిలో కర్మల నాచరించుచు ముక్తసంగులై జీవించుచున్న వారిని కూడ కర్మయోగమున దైవము పేర్కొనినాడు. కర్మ స్వరూప స్వభావము లను ఎరుగక తెలిసినవారు కూడ పొరపాట్లు చేయుట జరుగు

చున్నది. కర్మ నిర్వర్తించు విధానము విద్యాభ్యాస కాలముననే తెలుసుకుని అట్లాచరించుటకు యుద్యుక్తుడైనవాడు జీవితమను రంగస్థలమున ప్రవేశించుటకు, కౌశలముగ వర్తించుటకు, తదను భూతిని నిత్యమును అనుభవించుటకు అర్హత కల్గి యుండును. ఈ విద్య మృగ్యమగుటచే ఆధునిక మానవుడు ఎన్ని సౌకర్యములు కలిగి యున్నప్పటికిన్ని దుఃఖము చెందుచునే యున్నాడు. ఘర్షణ పడుచునేయున్నాడు. తీవ్రమైన విరోధములకు, రోగములకు గురియగు చున్నాడు.

తృప్తి :

జీవితమున ప్రశాంతతత, సుఖశాంతులు, తృప్తి, మంచి తనము, ఆనందము ముఖ్యము. వీటికి పదవులతోగాని, సంపదతో గాని, గొప్పదనముతోగాని, అధికారముతోగాని సంబంధము లేదు. అవి కలిగినచో కర్మయోగి వైభవము కలిగినవా డగుచున్నాడు గాని వాని కొఱకై ప్రత్యేక ప్రయత్నముండదు. కర్మయోగ మనగా కర్మ లెట్లు నిర్వర్తించవలెనో అను విధానముతో అనుసంధానము చెంది జీవించుట. ఆ విధానమును భగవంతుడు చక్కగ విశద పరచినాడు. ప్రాథమికమగు కర్మయోగ సూత్రములను అనుస రించనివారు జీవితమున నేల విడచి సాము చేసినవారగుదురు. వారు చతికిల పడకతప్పదు. మిథ్యాచారులై తమను తాము మోసము చేసుకొనుచు, ప్రపంచమును దూషించుచు గమ్యము లేక అందినదల్ల సంగ్రహించుచు జీవింతురు.

కర్మయోగ సూత్రములను పునాదిగా నేర్పరచుకొనని జీవనము పునాదిలేని ఇల్లువలె స్థిరత్వము లేక, ఎపుడు కూలునో యను భయముతో జీవించుట యుండును. ఆలస్యమైనది అని తలపక దీక్షతో ఈ సూత్రములను పాటించుటకు ప్రయత్నించు వాడు ప్రశాంత జీవనమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు అర్హత పొందును.

(3అ-1 నుండి 6 శ్లో॥)

2

శ్రద్ధ - భక్తి

యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేఽర్జున ।
కర్మేంద్రియైః కర్మయోగ మసక్త స్స విశిష్యతే ॥ 7

తమను తాము కర్మలయందు బంధించుకొనక జీవించు విధానము శ్రీకృష్ణుడు ఈ క్రింది విధముగ తెలుపుచున్నాడు. వీనిని శ్రద్ధతో అధ్యయనము చేసి అనుసరించిన వానికి జీవితము ఒక క్రీడగ సాగును. అట్లు కానిచో జీవితమున బంధము తప్పదు.

అసక్తస్స, ఆరభతే, కర్మయోగమ్ :

ప్రతిదినము కర్మల నాచరించువాడు సంగము లేక ఆచరించినచో అతడు ఉత్తమ కర్మిష్ఠిగ నుండగలడు. సంగము లేక కర్మలాచరించుట యనగ, తన కర్తవ్యమును తను శ్రద్ధా భక్తులతో నిర్వర్తించుట. ఫలితములవైపు మనస్సును పోనీయ కుండుట. అనగా తినునపుడు, మాటాడునపుడు, పనులు చేయుచున్నపుడు వానియందు పరిపూర్ణమైన శ్రద్ధ, భక్తి ఉండ వలెను. వానిని నిర్వర్తించు తీరు తెలుసుకొని అట్లే నిర్వర్తించుచు

నుండవలెను. ఎక్కువ తక్కువలు చేయరాదు. ఫలితముల వైపుకు మనస్సును పోనీయరాదు. విద్యార్థులకు విద్యయందు శ్రద్ధ ఉండవలెను గాని మార్కుల యందు గాదు. పని చేయువాడు పనియందు శ్రద్ధగాని నెలసరి భత్యమునందు కాదు. ఇట్లు సమస్తమునందు శ్రద్ధాపూరిత కర్తవ్య నిర్వహణమే కాని, ఇతరము లందు ఆసక్తి జనింపరాదు. ప్రస్తుత మెప్పుడును కర్తవ్యమునే బోధించుచుండును. దానిని గ్రహించి నిర్వర్తించుటే మార్గము. చిన్నతనము నుండి ఈ పద్ధతి నభ్యసించినచో మనిషి కర్మ నిర్వహణమున శ్రేష్ఠముగ నిలచియుండును. (3-7)

3

నియత కర్మ

నియతం కురు కర్మ త్వం కర్మజ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః ॥ 8

నియమింపబడిన కర్మను మాత్రమే చేయుట రెండవ సూత్రము. తన పని తాను చేయుట, అదికూడ శ్రద్ధతో చేయుట ముఖ్యము. తనది కాని పని తాను చేయుటవలన జీవుడు బద్ధుడగును. తన పని ఏమో తాను తెలుసుకొని హద్దులు మీరక నిర్వర్తించవలెను. తన పనిలో లోపములు లేకుండ నిర్వర్తించుటే తనకు ముఖ్యము. ఇతరుల పనులలో జొరబడుట, వారి పనుల లోని లోటుపాటులను చర్చించుట, విమర్శించుట తగదు. అట్లు చేయువారికి తమ పనులను నిర్వర్తించుకొను సామర్థ్యము తగ్గును. శ్రద్ధ తగ్గును గనుక సామర్థ్యము తగ్గును. ఇతరుల పనులలో తలదూర్చువారు వడ్రంగము పనిచేయుటకు పూనుకొనిన కోతివలె దుఃఖపడుదురు. తమకు నియమించిన పని చేయకపోవుట వలన జీవనయాత్ర కుంటుపడును. అందుచేత దైవము ఏకాగ్రతతో, నియంత్రిత పని నియమముతో, శ్రద్ధతో ఆచరింపుమని రెండవ ఆదేశము చేసినాడు. (3-8)

4

సమాచరణము

యజ్ఞార్థా త్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః ।
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగ స్సమాచర ॥ 9

యజ్ఞార్థం కురు కర్మాణి :

నియమితమైన కర్మను శ్రద్ధాభక్తులతో సంగము విడిచి చేయవలెనని తెలిపిన శ్రీకృష్ణుడు, చేయు కర్మ యజ్ఞార్థమై యుండవలెనని మూడవ సూత్రమున పలికినాడు. అనగా కర్మము లోకహితార్థముగ చేయుమని అర్థము. లోకహితమే తన హితము. అందుచేత కర్మమునకు ప్రాణసమానమైన లక్షణము పరహితము. లోకమునకు హితము కానిది తనకు కూడ హితము కాదు. ఇది తెలిసి కర్మల నాచరించవలెను. సంఘద్రోహము, దేశద్రోహము, జీవద్రోహము చేయు కర్మల నుండి బంధము కలుగును. ఇతర జీవులకు అహితము, హింస కలుగు పనులు చేయరాదు. మనస్సున ప్రధాన ముగ పరహితమే గోచరించవలెను. చేయు పనులందు పరహితమే ప్రతిబింబించవలెను.

సంగము లేక, నియత కర్మను లోకహితముగ ఒనర్చుట వలన జీవుడు బంధింపబడుటకు ఎట్టి అవకాశమును ఉండదు. అట్టివాడు సమాచరుడై యుండును. అనగా ఆచరణమున సమత్వము కలిగి యుండును. (3-9)

5

ఉపదేశము

సహ యజ్ఞాః ప్రజా స్సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వో௨ స్త్విష్టకామధుక్ ॥ 10

యజ్ఞేన ప్రసవిష్యధ్వం :

బ్రహ్మదేవుడు సృష్టించినపుడు జీవులు, లోకములు, లోక పాలకులు ఏర్పడిరి. అవ్యక్తమైన తత్త్వము నుండి బ్రహ్మదేవుడు వాహికగ సమస్తము కొనిరాబడినది. బ్రహ్మదేవుడు పై కార్యమెందు లకు చేసినాడు? దాని వలన అతనికేమి ప్రయోజనము? వ్యక్తి గతముగ ఏ ప్రయోజనము లేదు. సృష్టి నిర్మాణము ఒక బృహత్తర పథకము. అట్టి కార్యములు నిర్వర్తించుట వలన బ్రహ్మదేవునకు ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనము లేదు. చతుర్ముఖ బ్రహ్మ స్థితికి (అస్తిత్వమునకు) కారణము సంకల్పము. సంకల్పము అవ్యక్త మగు బ్రహ్మమునుండి పుట్టి బ్రహ్మ నేర్పరచుకొన్నది. ఆ సంకల్పము ననుసరించి బ్రహ్మదేవు నేర్పరచుకొని అతని నుండి కోటానుకోట్ల జీవులుగాను, సప్తలోకములుగాను, అందలి అంతర్లోకములుగాను,

లోకపాలకులుగాను, ప్రకృతి శక్తులుగాను, కాలము దేశములు గాను, శబ్దముగాను వర్ణముగాను, అంకెలుగాను, రూపములు గాను ఏర్పడినది. ఆ దివ్యసంకల్పమును అనుసరించి వ్యక్తిగత ప్రయోజనములను చూడక అత్యంత బాధ్యతాయుతమైనటు వంటి కార్యమును బ్రహ్మదేవుడు నిర్వర్తించినాడు. అందు బ్రహ్మ దేవునకు ఎట్టి కామము లేదు. సంగము లేదు. మోహము లేదు. లోభముగూడ లేదు. ఇట్లు నిర్వర్తించు కార్యమునే యజ్ఞ మనిరి. పై విధముగ నిర్వర్తించుటచే సమస్త సృష్టికిని చతుర్ముఖ బ్రహ్మ ఆరాధ్యుడైనాడు. అట్టి బ్రహ్మ చేసిన ఉపదేశమొకటి గలదు. అదియే "యజ్ఞేన ప్రసవిష్యధ్వం" అనగా "యజ్ఞములు చేయుచు వృద్ధిని పొందుడు."

బ్రహ్మదేవుడు యజ్ఞమును చేసి వృద్ధిని పొంది ముక్తుడుగా దైవమందు నిలచినాడు. మీరును అట్లే యజ్ఞార్థముగా జీవించుచు నావలెనే వృద్ధి పొందుడు అని ఉపదేశమిచ్చినాడు. బుద్ధిమంతు లైనవారు ఈ విషయమును గ్రహించి తదనుగుణ్యముగ జీవిత మును క్రమశః మలచుకొనవలెను. తాను నిర్వర్తించి తద్వారా వృద్ధిపొంది అనుభవ పూర్వకముగ అందించిన ఉపదేశమిది. సృష్టికి చతుర్ముఖ బ్రహ్మ ప్రథమస్థానమున నుండుట కిదియే ఉపాయము. కావున యజ్ఞార్థ కర్మము మనసునకు పట్టునట్లుగ అవగాహన చేసుకొనవలెను. అటుపై ఆచరించవలెను. అట్లు కానిచో బంధములు తప్పవు. (3-10)

6

ఆరాధనము

దేవా న్భావయతానేన తే దేవా భావయంతు నః ।
పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ ॥ 11

శ్రేయః పర మవాప్స్యథ :

దేవతలు మానవులకు సహాయము చేయగలరు. దేవతలకు ప్రీతి కలిగించు మార్గము యజ్ఞార్థ జీవనమే. దేవతలు సంతుష్టులైనచో మానవులకు సంతుష్టిని, వృద్ధిని యొసగుదురు. మానవుల వృద్ధికి సహకరింతురు. దేవతలను ఆరాధించుట యనగా మానవుడు గూడ దేవతలవలె పరహిత ధర్మమునకు తన జీవితమును సమర్పించవలెను. దేవతలట్లే సమర్పించుటచే సృష్టి ప్రణాళిక నెరిగి సృష్టిని నిర్వహణము చేయుచున్నారు. తమవలెనే ఏ మానవుడు పరహిత కార్యములకు సమర్పణ చెందునో అట్టి మానవుడు దేవతల ఆశీర్వచనము పొందును.

శ్రీకృష్ణుడు తెలిపిన భగవధారాధనము యిదియే. స్తుతి కొరకు, స్ఫూర్తి కొరకు ఆరాధనములు సలిపినను పరహితము సలుపని జీవితము జీవులకు హితముగా నుండనేరదు. దేవతారాధన

మనగా పరహితధర్మము నాచరించుట. స్వహితమును ఆశింప కుండుట. ఇది సర్వ శ్రేయోదాయకము. పరమ శ్రేయోదాయకము. పరమశ్రేయస్సు దీనివలననే కలుగునని "శ్రేయః పర మవాప్స్యథ" అని పలికినాడు.

నందగోపుడు వర్షాదులు కురియుటకై ఇంద్రుని ఆరాధించ వలెనని సంకల్పించినాడు. బాలకృష్ణుని అడుగగా, ఇంద్రుని ఆరాధన పూజాది కార్యక్రమములుగా కాక, తోటిజీవుల శ్రేయస్సుగా కర్మ నాచరింపుమని బాలకృష్ణుడు తెలిపినాడు. భగవద్గీతలో శ్రీకృష్ణు డిచ్చిన పరమోత్కృష్టమైన ధర్మమిది. అతడు దేవతాప్రీతికై యజ్ఞ యాగములను, పూజాభిషేకములను, హోమములను తనకుగా తాను ఎన్నడును నిర్వర్తించలేదు. నిర్వర్తిస్తున్న వారిని గౌతమ బుద్ధునివలె ఖండించలేదు. తనను సలహా అడిగినవారికి మాత్రము దేవతారాధన మనగా పరహిత జీవనమే అని తెలియజెప్పినాడు. దైవమొక్కడే. అతని కార్యమునే దేవతలు చేయుచున్నారు. వారు నిష్కాములు. జీవులు గూడ దేవతలను మార్గదర్శకులుగ నెంచు కొని, ఆ మార్గమునే నడచినచో దివ్యత్వము పొందగలరు. దేవత లను, గురువులను మార్గదర్శకులుగా భావించుట, గౌరవించుట, పూజించుట తగుమాత్రముగ జరుగుచుండవలెను. అవియే ప్రధాన కార్యములైనచో ముక్తజీవనము దుర్లభము. పరమ శ్రేయస్సునకు పరహితమే పరమధర్మమని శ్రీకృష్ణుడు, శ్రీరాముడు నిర్వర్తించి బోధించినారు. అదియే సనాతన ధర్మమార్గము. జీవుల శ్రేయస్సే దైవారాధనముగ సాగుట కృష్ణుడు తెలిపిన కర్మబంధ విమోచన మార్గము. (3-11)

7

పరహితము

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తా నప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥ 12

యః అప్రదాయః, సహస్తేన ఏవః :

పరహిత కార్యములను నిర్వర్తించుచు తద్వారా దేవతల ప్రీతి నందినవాడు భోగ్యమగు అనేక విషయములను వారి యనుగ్రహముగ పొందుచుండును. అట్లు విశేషములైన భోగము లను గూడ అనుగ్రహింపబడును. అనుగ్రహింపబడిన భోగ్య విషయములు తనకు తానే అనుభవించుట దొంగతనము. అట్టి దొంగ మరల పతనము చెందగలడు.

లభించిన భోగ భాగ్యములు ఇతరుల శ్రేయస్సు కొరకు వినియో గించువాడు బుద్ధిమంతుడు. తనకు తానే అనుభవించు వాడు మూర్ఖుడు. అట్టి మూర్ఖుడు తన ప్రవర్తనము ద్వారా తానే పతనము చెందుచుండును. తాను పరహిత కార్యము లొనర్చుటచే దేవతానుగ్రహము పొందినవాడు. దేవతలు అనుగ్రహించుటకు

కారణము తనయందు పరహిత బుద్ధి యున్నదని. భోగ్యవిషయము లభ్యముకాగానే, పరహిత ధర్మము మరచుట కృతఘ్నుత్వమగును. అందించిన ప్రతి భోగ్యవిషయమును పరహితమునకే సమర్పించుట వృద్ధికి కారణమగును. అట్లు కానిచో వృద్ధి యాగును. పతనము ప్రారంభమగును.

పరహిత బోధనలు విన్న పేద బ్రాహ్మణుడొకడు తనకుగల రెండు అంగవస్త్రములలో ఒక దానిని గౌతమబుద్ధునకు సమర్పించెను. ఆనందముతో ఏకవస్త్రము ధరించి బాటను పోవుచున్న పేద బ్రాహ్మణుని చూసి, ఆదేశపు రాజు, విషయము తెలుసుకొని బ్రాహ్మణునకు పది అంగవస్త్రముల జంటను అందించినాడు. లభ్యమైన పది అంగవస్త్రముల జంటలను బ్రాహ్మణుడు మరల దానము చేసి ఏకవస్త్రుడుగ నిలచి అమితానందము పొందినాడు. పై విషయము తెలిసిన రాజు బ్రాహ్మణునియందు మిక్కిలి సంతసించి ధన కనకములు, ధాన్యము బ్రాహ్మణున కందించినాడు. అవియును గూడ మండలము రోజులలో ఇతరుల శ్రేయస్సునకు వినియోగించి మరల ఏకవస్త్రుడుగ చరించసాగినాడు. ఈ విషయము తెలిసిన రాజు ఆనందభరితుడై, బ్రాహ్మణునకు సస్యశ్యామలమైన అగ్రహారము నిచ్చినాడు. అగ్రహారమునంతను బౌద్ధసన్యాసులకు ఆశ్రమముగ నేర్పరచి పేద బ్రాహ్మణుడు పరమానందభరితుడై బుద్ధుని సాన్నిధ్యము పొందినాడు. రాజు మిక్కుటముగ ఆనందము

పొంది పరహితమార్గమున పరిపూర్ణముగ నడచుటకు సంకల్పించి, దీక్షగ లోకహితమును ఆచరించి రాజర్షియై దైవసాన్నిధ్యమున నిలచినాడు. ఇట్లు తనదగ్గర ఉన్నటువంటి విద్యగాని, తెలివిగాని, శక్తిగాని, ధనాదులుగాని ఇతరుల శ్రేయస్సు కొరకై వినియోగించు వాడు సృష్టియందు నిజమైన రాజుగ నిలచును. అట్లు జీవించని వారు ఎప్పుడును పేదలే. పేదలేగాదు దొంగలు కూడ అని కృష్ణుడు కర్మానుష్ఠాన రహస్యమును తెలిపినాడు. (3-12)

8

మోక్షము - బంధము

యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మ కారణాత్ ॥ 13

యజ్ఞశిష్టాశిన స్సన్తో ముచ్యన్తే సర్వకిల్బిషైః :

కర్మానుష్ఠాన మార్గమున మలినముల నుండి విముక్తి చెందుటకు భగవానుడీ సూత్రము పలికినాడు. ఇతరులకు పెట్టి తాను తినువాడు పవిత్రుడగును. తనకు తాను తినువాడు అపవిత్రుడగును. ఇది సృష్టి ధర్మము. వ్యాపారము చేయువాడు తన సంస్థ యందలి సమస్త కార్యవర్గమునకు జీతభత్యములను ఏర్పరచి, ప్రభుత్వమునకు ఈయవలసినది, సంఘమునకు ఈయవలసినది ఇచ్చి, కుటుంబ సభ్యులకు కూడ అందించవలసినది అందించి, అటుపైన తననుగూర్చి భావించవలెను. అట్లు చేసినచో యజ్ఞమున మిగిలిన అవశిష్టమును భుజించినవాడగును. అందరి పరితృప్తి తరువాత తన తృప్తి. అందుచేత అతని యందు తన శ్రేయస్సు కన్న ఇతరుల శ్రేయస్సు మిన్నగ యుండును. అదియే పవిత్రతకు కారణము. అదే విధముగ ఒక అధికారి, ఒక యజమాని తన

ఆశ్రయములో (లేక పరిధిలో) నున్నవారి క్షేమమును నిర్వర్తించి అటుపైన తనను గూర్చి అలోచింపవలెను. ఇది ధర్మము.

అందరికన్న ముందుగ భోజనము చేయుట, అందరికన్న ముందుగ తాను పొందుట, ముందుగ అనుభవించుట మొదలగున వన్నియు అపవిత్రమగు కార్యములు. పోటీపడి ఇతరుల కన్న తాను ముందు పొందవలెనను భావనతో జీవించువాడు, మానసికముగ బంధితుడు. అతడు యావజ్జీవ బంధితుడే. ఈ విషయము తెలియక ఆధునిక యుగమున పోటీలు ఎక్కువ అయినవి. తత్కారణముగ అశాంతి ఎక్కువైనది. తత్కారణముగ ఘర్షణలు, హత్యలు, మారణ హోమములు జరుగుచున్నవి. తోటి వారి శ్రేయస్సును గమనించని వాడు నరపశువేగాని నరుడు కాదు. నరపతి కాదలచినచో లోక హితమునకై పాటుపడవలెను గాని పశువువలె కుమ్ము లాడుచు, దౌర్జన్యముతో దోచుచు భోగించువాడు భయంకరముగ బంధింప బడును.

తెలిసి నిర్వర్తించిన వారికి కర్మలు మోక్ష కారణము. తెలియక నిర్వర్తించువారికి కర్మలు బంధకారణము. మోక్షము పేరున మోహ పడిన జీవులు ఎన్నో రకములుగ ఇతర ఉపాయముల నాలోచింతురు. కర్మ మార్గమున మోక్షము సులభమని తెలిసినవారు తమ వంతు కర్మను యజ్ఞార్థముగ నిర్వర్తింతురు.

ఒక మనిషి పవిత్రతకు, అపవిత్రతకు మూలకారణము అతని కర్మానుష్ఠాన విధానముననే యున్నది. కర్మను జీవ శ్రేయోదాయకముగ నిర్వర్తించిన పవిత్రుడగుచు అగ్నిహోత్రునివలె ప్రకాశించును. లేనిచో అంధకారమున పడును. (3-13)

9

ధర్మచక్రము

ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయ తీహ యః ।
అఘాయు రింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥ 16

ఏవం ప్రవర్తితం చక్రం :

సృష్టి చక్రమున ధర్మచక్ర మొకటి యున్నది. ఆ ధర్మ చక్రమున నిలచినవారు బ్రహ్మమునందు నిలచి అక్షరులై దీపించు చున్నారు. ఆ ధర్మ చక్ర మిట్లున్నది.

1. బ్రహ్మము నుండి వేదము పుట్టును.
2. వేదము నుండి సృష్టి పుట్టును. సృష్టితో పాటు సృష్టి ధర్మమునూ పుట్టును.
3. సృష్టి, ధర్మము ననుసరించుచు ఏర్పడును. అదియే సృష్టికర్మ.
4. పై సమస్తమును యజ్ఞార్థమే. సృష్టియందలి జీవులు గూడ అదే యజ్ఞార్థ ధర్మమును అనుసరించుచు మరల బ్రహ్మమును చేరుదురు.
5. ధర్మ మాధారముగ ఈ చక్రము తిరుగుచుండును.

ఈ చక్రము ననుసరించి ఎవరు జీవింతురో వారు బ్రహ్మము నుండి దిగివచ్చినవారై, సృష్టి వైభవమును అనుభవించుచు మరల బ్రహ్మమును చేరుదురు. అనుసరింపనివారు ధర్మచక్రము నుండి విడివడుటచే బంధముల చిక్కుకొని దుఃఖముల ననుభవించు చున్నారు.

ధర్మచక్రమును వీడినవారు మనస్సు, ఇంద్రియములు, శరీరమునందు బంధింపబడి భోగములయందు చిక్కుకొని ఎడతెరపి లేక నానావిధ యోనుల యందు జన్మ మెత్తుచున్నారు. వీరందరు సృష్టి ప్రయాణమున రైలుబండి దిగినవారివలె గమ్యము చేరక ప్రయాణమాగి వ్యర్థముగ జీవించుచున్న వారిగ తెలియ వలెను. సృష్టి చక్రమునగల ధర్మచక్రము వృత్తాకారపు రైలుమార్గము వంటిది. ఈ మార్గమున రైలుబండి నెక్కిన జీవులు ధర్మమును ఆచరించుచు ప్రయాణము సాగించుచుండవలెను. ప్రయాణము నకు నియమములు వేద మేర్పరచిన శాశ్వత ధర్మములే. వానిని అనుసరించనివారు ఈ రైలుబండి నుండి దింపివేయ బడుదురు. అది కారణముగ ప్రయాణ మాగును. మరల ప్రయాణము సాగించవలె నన్నచో ధర్మనియమములను అనుష్ఠానము చేయ వలసిన బుద్ధి ఏర్పరచుకొనవలెను. లేనిచో వ్యర్థజీవనము సాగు చుండును. సృష్ట్యంతమున వీరు లయము చెందినను మరల బ్రహ్మమునుండి దిగివచ్చినపుడు అదే స్వభావ ముతో, అదే విధమైన అధర్మ ప్రవర్తనముతో మరల బంధింపబడుదురు.

మరణము గాని, సృష్టిలయము గాని జీవునికి ముక్తస్థితి ప్రసాదింపలేవు. అనుభవపూర్వకముగ ధర్మమే గతియని తెలిసి నిరహంకారుడై దాని ననుసరించినవాడే ముక్తమార్గమున మరల ప్రయాణము సాగించగలడు. ధర్మమునకు ప్రమాణము వేదము. వేదమునకు ప్రమాణము ఋషులు. (3-16)

10

అసక్తత - సమాచరణము

తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః ॥ 19

ఆసక్తి లేక కర్మ లాచరించిన వానికి పరమపదము లభించగలదని ఈ సూత్రము తెలుపుచున్నది. ఆసక్తి లేక కర్మ లెట్లాచరించగలరు? ఆసక్తి లేనివా డేపనియు చేయడే! దీని రహస్యమేమి? భగవంతుడు గీతయందు పలుమార్లు "అసక్తః" అని పలుకుతుంటాడు. ఈ పలికిన అసక్తత ఫలములకు సంబంధించినది. పనికి సంబంధించినది కాదు. పనిచేయు వానికి పనియందే ఆసక్తి యుండవలెనుగాని ఫలమునందు కాదు. ఫలమునం దాసక్తత యున్నవానికి పనియందు శ్రద్ధ చెడును. పనియందు శ్రద్ధ యున్న వానికి పనియే సౌఖ్యము నిచ్చును. ఫలములు పొందుట, పొందకపోవుట అతనిని బాధించవు. పని యందు సక్తుడవు కమ్ము, ఫలములయం దసక్తుడవు కమ్ము. ఇచ్చట పని యనగా పరహితముతో కూడినది అని మరల మరల చెప్ప నక్కరలేదు. నియత కర్మను అనగా చేయవలసిన కర్మను ఫల

ములయం దాసక్తిలేక యజ్ఞార్థముగ ఆచరించవలెనని భగవానుడు పలుకుతునే యున్నాడు. నిజమునకు ఫలములయం దాసక్తి లేకుండ కర్మ నాచరించవలెనని ఈ అధ్యాయమున 7వ శ్లోకము నందు, 9వ శ్లోకమునందు పలికినాడు. అట్లాచరించినచో పరమును లేక దైవమును పొందవచ్చని వాగ్దానము చేయుచున్నాడు. నిష్కామ కర్మమే మోక్షమునకు మార్గమని, అట్లు నిర్వర్తించినవానికి మోక్షము అరచేతి యందుండునని, ఇది తన శాసనమని తెలిపినాడు.

పై శాసనమునకు అనుపానముగ ఫలాపేక్షలేక, కర్మా చరణము అనునిత్యము జరుగవలెనని తెలుపు చున్నాడు. "సతతం" అని పలుకుటలో ఫలాసక్తి శాశ్వతముగ విసర్జించబడవలెనని తెలుపుచున్నాడు.

ఫలాసక్తి లేనిచో ఏ కార్యమైనను చేయవచ్చునా? అను సందేహమును గూడ నివృత్తి చేయుటకై "కార్యం కర్మ"ను ప్రస్తావించి నాడు. అనగా తాను చేయవలసినపని ఫలాసక్తి లేక ఎల్లపుడు చేయవలెనని.

ఫలాసక్తిలేక చేయవలసిన పని చేయువాడు ఎట్లైనా చేయ వచ్చునా? అను సందేహమును నివారించుటకు "సమాచర" అని తెలిపినాడు. సమాచరణ మనగా సమ్యక్ ఆచరణము. సమ్యక్ ఆచరణ మనగా ఎక్కువ తక్కువలు లేక నిర్వర్తించుట. అనగా కర్మ నిర్వర్తనము ఒక నిర్మల ప్రవాహమువలె సాగవలెనుగాని ఒడుదొడుకులతో కాదని యర్థము. మార్గమున ఒడుదొడుకు

లున్నను ప్రవాహ వేగమునకు ఒడుదొడుకులు అవసరము లేదు. కొన్ని దినములు విపరీతముగ పనిచేయుట, కొన్ని దినములు చతికిల పడుటగా కర్మ జరుగరాదు. జరుగు కర్మయందు, వేగము నందు ఒక నిశ్చలత యుండవలెను. భూమి, ఇతర గ్రహములు చరించు విధానము సమాచర అను పదమునకు తగినట్లుగ నుండును. వృక్షముల యొక్క పెరుగుదల యందుగూడ ఈ లక్షణములు చూడవచ్చును. సమాచరణము సృష్టి ప్రవాహమునకు ముఖ్య లక్షణము. (3-19)

11

సంఘ శ్రేయస్సు

కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।
లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్ కర్తు మర్హసి ॥ 20

కర్మమంతయు సంఘముతో ముడిపడి యున్నది. సంఘము నడుచుటకు కర్మము ప్రధానము. వివిధములైన వృత్తి, ఉద్యోగ, వ్యాపారముల ద్వారా ప్రతివారును సంఘమునకు తోడ్పాటు చేయుచు సంఘము నుండి లభించిన దానిని పొందుతూ జీవించుట జరుగుచున్నది. సంఘమునకు శ్రేయోదాయకమైన కార్యముల నొనర్చుట ద్వారా సంఘమున జీవించుటకు జీవు డర్హత పొందుచున్నాడు. వివిధ పద్ధతులలో సంఘమునకు జీవులసేవ లభ్యమగును. సంఘమునకు తోడ్పాటు చేయు ఆశయముతోనే సంఘమున పనిచేయవలెను. అట్లు పనిచేయు వారిని సంఘము సహజముగ మన్నించును, గౌరవించును, ఆదరించును కూడ. ఇట్లు సంఘమున ఆదరణము పొందినవారు,

గౌరవము పొందినవారు, ఇతరులు కూడ అదే మార్గమున ప్రవర్తించుటకు స్ఫూర్తిని కలిగింతురు.

అందువలన కృష్ణుని కర్మ సిద్ధాంతమున అసక్తత, నియత కర్మ, సమాచరణము, యజ్ఞార్థ జీవనములతో పాటు సంఘమున స్ఫూర్తిదాయకముతో గూడ నుండవలెనని తెలుపుచున్నది.

(3-20)



12

పెద్దలు - ప్రమాణములు

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ 21

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ 22

యది హ్యహం న వర్తేయం జాతు కర్మ ణ్యతంద్రితః ।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥ 23

ఉత్సీదేయు రిమే లోకా న కుర్యాం కర్మ చేదహమ్ ।
సంకరస్య చ కర్తా స్యా ముపహన్యా మిమాః ప్రజాః ॥ 24

యద్యదాచరతి శ్రేష్ఠ :

లోకమున పెద్దలు ఏమి చేయుచున్నారో గమనించి ఇతరులు కూడ వారి ననుకరింతురు. అందువలన పెద్దవారుగా గమనింపబడువారికి కర్మ నిర్వహణమున ఎక్కువ బాధ్యత గలదు. తమను అనుకరించువారు ఎవరికైతే యుందురో వారికి కర్మ నిర్వహణము నందు ఒక అదనపు బాధ్యత ఏర్పడును. తల్లి

దండ్రులను పిల్లలు అనుకరింతురు. ఉపాధ్యాయులను విద్యార్థులనుకరింతురు. గురువులను శిష్యులనుకరింతురు. వివిధ రంగములలో ఉత్తమ శ్రేణికి చెందినవారిని ఆయా రంగములలో పనిచేయువా రనుకరింతురు.

అందువలన అనుకరింపబడు వారికి అనుకరించువారి యెడల బాధ్యత యున్నది. అదికారణముగ గుర్తింపుపొందిన పెద్ద వారు వారి కర్మనిర్వహణ విధానము ప్రమాణముగ నుండవలెను.

అనుకరించువారు అనునిత్యము తాము ప్రమాణముగ నేర్పరచుకున్న పెద్దవారిని అనుసరింతురు. వారు పొగత్రాగినచో వీరును త్రాగుదురు. వారికి అపరిశుభ్రపు అలవాట్లు ఉన్నచో వీరును అట్లే యుందురు. వారసత్యము లాడినచో వీరును ఆడుదురు. వారు బాధ్యతారహితముగ ప్రవర్తించినచో, వీరును అట్లే చేయుదురు. వారేమి చేసిన వీరును అట్లే చేయుటకు ప్రయత్నింతురు. అందువలన ప్రత్యేకముగ వారి కవసరము లేకపోయినప్పటికిని, చిన్నవారి మేలుకోరి పెద్దవారు కొన్ని కొన్ని విషయములలో మార్గదర్శకులై ప్రవర్తించవలసి యుండును.

నిజమునకు శ్రీకృష్ణునకు సాందీపని యొద్ద చేరి విద్య నభ్యసించు అవసరము లేదు. అయినను ఇతరుల శ్రేయస్సుకోరి అట్లాచరించెను. వివాహముతో పనిలేదు. అయినను సంఘ మర్యాదలు పాటించి వివాహమాడి సంతతిని కనెను. యుద్ధము

చేయవలసిన పని అసలేలేదు. అయినను క్షత్రియ జన్మ మెత్తుట వలన యుద్ధమునందు పాల్గొనెను. శ్రీరాముని జీవితము గూడ చాల విషయములలో అట్లే నిర్వర్తింపబడినది. శ్రీరాముని ఆదర్శముగ గొనిన భారతీయులు సర్వసామాన్యముగ ఏకపత్నీ వ్రతమును ఆచరించుదురు. భారతీయ సంప్రదాయమున నేటికిని ఈ భావము అధికముగ అనుసరింపబడు చున్నది. ఒక స్త్రీకి ఒక పురుషుడు. ఒక పురుషునకు ఒక స్త్రీ. ఈ సంప్రదాయము కేవలము భరతభూమియందే ఇంకను నిలచియున్నది.

భరత సంప్రదాయమునకు వెన్నెముకగ నిలచిన ఋషు లందరును ముక్తసంగులే. వారికీ ప్రపంచమున ఏమియును అవసరము లేదు. పంచభూతములు వారి వశమై యుండును. అయినప్పటికిన్ని ఇతర జీవులకు ప్రామాణికముగ నుండవలెనను బాధ్యతాయుత భావముతో వారు వివాహ మాడిరి. గృహస్థ జీవితమును నిర్వర్తించి చూపిరి. సంఘమున ఉద్యోగ వృత్తి వ్యాపారములను కూడ నిర్వర్తించిరి. అట్లు కానిచో సంఘధర్మము దెబ్బతినును. ఈ యంశము ననుసరించియే ఏసుక్రీస్తు, బుద్ధుడు మొదలగు మహాత్ములను గూడ భరతధర్మము పరిపూర్ణ మానవునిగ పరిగణించలేదు. ఈ మహాత్ములను అనుకరించువారు కూడ వారివలె వివాహమాడక, కోరికలను అణగద్రొక్కుకొని సతమత మగుచున్నారు. పశ్చిమ దేశములలో మతాధికారులు లైంగిక చర్యలకు పాటుపడుచు నేరగ్రస్తులగుట ఆధునిక కాలమున

గమనించబడుచునే యున్నది గదా! సాధారణ మానవులను మనస్సులో నుంచుకొని వారికి అనుకరణీయముగ నుండు శ్రేష్ఠమగు మార్గమును పెద్దలు నిర్వర్తించుట శ్రీకృష్ణుని కర్మ సిద్ధాంతమున మరియొక ముఖ్య లక్షణము.

ప్రస్తుత కాలమున దేశనాయకులు, మతాధికారులు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, వైద్యులు, అగ్రశ్రేణి వ్యాపారస్తులు, అధికారులు పనిచేయు విధానము బాధ్యతారహితముగ యున్నది. అదికారణముగనే జనబాహుళ్యము గూడ బాధ్యత తప్పినది. క్రమ శిక్షణ తరిగినది. శ్రద్ధ లోపించినది. బాధ్యతలయందు పోటీ పడుటగా కాక హక్కులయందు పోటీపడు మ్లేచ్ఛ ధర్మము భరత భూమిని కూడ కబళించినది. ఇట్టి స్థితికి పెద్దలే కర్తలు. పెద్దలే బాధ్యులు. వీరు జనులను చెడగొట్టిన వారగుచున్నారు.

(3-21, 22, 23, 24.)

13

కర్మ - ప్రతిఫలాసక్తి

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథా౽సక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥ 25

కుర్యాత్ విద్వాన్ అసక్తః చికీర్షులోక సంగ్రహం :

తెలిసినవారు ఫలాసక్తి లేనివారై, లోక కళ్యాణమును నెరవేర్ప సంకల్పము గలవారై కర్మలను నిర్వర్తించవలెను.

ఫలాసక్తి గలవారు పట్టుదలతో, శ్రద్ధతో, దీక్షతో అహర్నిశలు ఫలముల నాశించి నిర్విరామముగ కృషి సల్పుదురు. ఫలాసక్తి లేనివారు అట్టి పట్టుదల, శ్రద్ధ, దీక్ష, ఏకాగ్రత, ఓర్పు కలిగి యుండరు. ఫలమునం దాసక్తి లేదు గనుక పనియందు గూడ ఆసక్తి లేకపోవుట మనస్సు ధర్మము. వేతనములేని పని మనస్సునకు రుచింపదు. తృణమో, పణమో లభించకుండ పనిచేయవలెనన్నచో నిర్విరామ కృషియుండదు. శ్రద్ధ ఉండదు. దీక్ష, పట్టుదల ఉండదు. ఇది లోక సహజము.

చిన్నపిల్లవాడు భోజనము చేయుటకు ఆశ కలిగింతురు. చదువుకొనుటకు చాక్లెట్లు, బిస్కెట్లువంటి ఆశ కల్పింతురు. ఏ పని చేయవలెనన్నను కూలివానివలె మనస్సు, పారితోషికము

నాశించును. ఈ మనోస్థితి నుండి బుద్ధిలోకములోకి పెరగనిచో వివిధములైన ఆశలు పెనుభూతములై, జీవితమున బంధములు పెరుగుట, జీవుడు వివశుడై దుర్గతి చెందుట జరుగును.

చిన్నపిల్లలు ఆశకు లోబడుదురు. చిన్నపిల్ల లనగా పరిణతి చెందని వారు. వారికి ధర్మ స్వరూపము, కర్మ స్వరూపము ఇంకనూ తెలియదు. ముందు శ్లోకములలో తెలిపిన విధముగ, కర్మ, ధర్మ స్వరూపముల నెరిగినవాడు ఏమి చేయవలెను? వాని ననుస రించుటయే బంధమోచన మార్గమని తెలిసి అనుసరించవలెను. అనుసరించినపుడు తమ మనోతత్త్వమే తమకు అడ్డుపడు చుండును. ఫలముల నాశింపక పనిచేయుట క్రొత్తగా అలవాటు చేసుకొనవలెను. పాత అలవాటు వలన మనసు ఫలితముల నాశించును. అది బలవంతముగ నుండును. క్రొత్త అలవాటునకు అంత బలముండదు. అందుచే ఫలాసక్తి లేక పనులు చేయవలె నన్నచో మనసు నిరసించును. అశ్రద్ధ చూపును. దీక్ష, పట్టుదల ఉండవు. నిర్లక్ష్యభావము, అహంభావము పెరుగును. ఇది ఎప్పటికప్పుడు నిర్మూలించుకొనుచు, పై తెలిపిన సద్గుణములతో ఫలాసక్తిని విడచి పనిచేయుట శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు.

ఫలాసక్తి లేకపోవుటే బంధమోచన మార్గముకాని, అదియే రూపమున నున్నను జీవుని బంధించును. ఫలాసక్తి ధన రూపము గను, గుర్తింపు రూపముగను, కీర్తి గౌరవము రూపమునను, ఆధిక్యత రూపమునను జీవునియందు పొంగుచుండును. దాని నెప్పటి కప్పుడు నిర్మూలించుకొనుచు, అత్యంత ఆసక్తి కలవానివలె కర్మల నాచరించవలెనని భగవంతుడు తెలుపుచున్నాడు. (3-25)

14

సదాచరణ

న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్తః సమాచరన్ ॥ 26

జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ :

సదాచరణమే అత్యుత్తమ బోధ. సామాన్యముగా జీవులు అజ్ఞానముచే కర్మలాచరించు చుందురు. వారు ఫలాసక్తి గలవారు. చంచలబుద్ధి కలవారు. వారికనేకానేక సద్విషయములను బోధించినచో బుద్ధియందు తికమక కలుగును. అజ్ఞానులకు జ్ఞానబోధ చేయుటకన్నా జ్ఞానులు తామాచరించుచు, వారలచే నేర్పుతో ఆచరింపచేయవలెను. ఆచరించిన దానిని చూచి అట్లే ఆచరించుట అల్పబుద్ధులకు సులభము. తామాచరింపక చేయు సద్బోధలను అల్పజ్ఞానులగు శ్రోతలు తమకు తోచిన విధముగా నాచరింతురు. సామాన్యముగా చేసిన బోధ వినువారలనుబట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క రకముగ వినిపించును, అనిపించును. ఒకే విషయము వైవిధ్యముగ ప్రకాశించును. పాత్ర పవిత్రతను బట్టి

పదార్థము రుచి మారునట్లు శ్రోత చిత్తశుద్ధిని బట్టి, విషయము లవగాహన యగును. అందుచేత విని యాచరించుట కష్టము. ఆచరించిన దానిని చూచి, అట్లే ఆచరించుట సులభము. **సాధన లేని బోధన బాధను మిగుల్చును.** కావున సిద్ధుడు తానాచరించుచు, ఇతరులచే అట్లాచరింపచేయుట శ్రేష్ఠము. అనుయాయులు కూడ, ఆచరించువారిని అనుసరించుట క్షేమము. (3-26)

15

గుణత్రయ సృష్టి

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకార విమూఢాత్మా కర్తాహ మితి మన్యతే ॥ 27

సమస్తమును తానే నిర్వర్తించుచున్నాడు అని తలచుట అహంకారము. మూఢత్వ మున మానవుడట్లు భావించుచున్నాడు. కర్మములన్నియు ప్రకృతి నుండి పుట్టిన గుణములచే ఏర్పడు తున్నవి. సమస్త కర్మలకును గుణత్రయమే కారణము. వాని యందు జీవుడు ఉపస్థితుడై యున్నాడు. తానుండుటచే వానికి కదలిక కలదు. తాను లేనిచో వానికి కదలిక లేదు. ప్రకృతి జడమే. అందు చైతన్యము చేరినపుడు వివిధములుగ వర్తించును.

ఉదాహరణకు విద్యుత్ పరికరములన్నియు జడములే. అనగా తమంత తాము పనిచేయవు. విద్యుత్తు సాన్నిధ్యమిచ్చినచో ఒక్కొక్క పరికరము ఒక్కొక్క రకముగ పని చేయును. వైవిధ్యము పరికరముల యందు వున్నదిగాని, విద్యుత్తుయందు లేదు. విద్యుత్తు ఎప్పుడును విద్యుత్తే.

అట్లే, జీవుని సాన్నిధ్యమున అతని త్రిగుణాత్మక ప్రకృతి

వర్తించుచుండును. నర్తించుచుకూడ నుండును. అదియును జీవుడు స్వభావముతో సంగమము నొందినప్పుడే.

స్వభావములో సంగము చెందుటచేతనే అతడు జీవుడు. లేనిచో దేవుడే. దేవుడు సంగము లేక సృష్టి యందుండును. ప్రకృతి తన గుణములతో అంతయు అల్లిక చేయును. గుణములలోనికి దిగిన జీవుడు అహంకారియై చేయుచున్నా ననుకొనును.

లేనిచో స్వభావము జడమై యుండును. తాను చేయువాడు కాడు. స్వభావమే చేయించును. స్వభావమున కాకర్షణ చెందుటచే జీవుడు బంధింపబడుచున్నాడు. తానే చేయుచున్నట్లు భ్రమపడు చున్నాడు. తన యాధారముగ నిజమునకు గుణములు అంతయు చేయుచున్నవి. తాను కర్త కాదు. సాక్షి, ఆధారము, ప్రకృతికి ఆలంబనము. చేయునది మాత్రము ప్రకృతియే. ఇది తెలిసినవాడు తెలిసినవాడు. తెలియనివాడు అహంకారి. అట్టివాడు మూఢాత్ము డని భగవానుడు తెలుపుచున్నాడు. (3-27)

16

సృష్టి రసాయనము

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః ।
గుణాగుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥ 28

సృష్టి యంతయు ఒక రసాయనము. పురుషుని సాన్నిధ్యమున ప్రకృతిశక్తులు రసాయనము చెంది, సృష్టిగ వర్తించుచున్నవి. గుణములు గుణములయందు అహర్నిశలు రసాయనము చెందుచూ, సృష్టికార్యము నడచుచున్నది. సమస్తమగు కర్మకాండ గుణముల నుండియే పుట్టుచున్నది. అందుచే జీవుడు సంగము లేక వీని యందు ప్రవర్తించినచో ముక్తుడుగ నుండును. సంగము కలిగినచో బద్ధుడగును. సంగము లేక కర్మ లాచరించుటయే కర్మలయందు కౌశలము. సంగము వలననే జీవుడు ద్వంద్వములకు చిక్కును.

నిజమునకు ప్రకృతి రమణీయత, ఆకర్షణీయత చూచువానిని బట్టి యుండును. స్త్రీ, పురుష శరీరములుగ కన్పట్టుచున్నది రక్తమాంసాదులతో నిర్మించబడిన రూపమని తెలిసిన జీవుడు

వికారము చెందడు. లేనిచో వికారము చెందును. ఆకర్షణమునకు లోనగుట జీవునకు జరుగుచున్నదిగాని, ఆకర్షించు కార్యక్రమము ప్రకృతికి లేదు. సృష్టి ఆకర్షణముగ నున్నను, అట్టి ఆకర్షణమున కతీతముగ నున్నవారు గలరు. ఆకర్షణమునకు లోనైనవారునూ గలరు. ఈ భేదము సంగము లేకుండుట, ఉండుట వలన కలుగు చున్నది. అసంగుని సృష్టి ఆకర్షింపలేదు కదా! సనక సనందనాదు లట్టివారు.

సంగము ఒక బలహీనత. అసంగమే బలము. అసంగుడు ముక్తుడు. అతడు గుణముల వ్యాపారమున బడడు. అట్టివాడే యథార్థమును తెలిసినవాడు. (3-28)

17

సంగము - అసంగము

ప్రకృతే ర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।
తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవి న్నవిచాలయేత్ ॥ 29

కర్మసంగులు గుణములచే మోహము చెంది దేహేంద్రియములచే నిర్విరామముగా కర్మలు చేయుచుందురు. కామము ప్రధానముగా ఆ కర్మలు సాగుచుండును. సృష్టి తత్త్వము తెలిసిన జ్ఞానులు గుణ సంగము లేక దేహేంద్రియములచే కార్యములు నిర్వర్తింతురు. కర్తవ్యమే ప్రధానముగ వారి కార్యములు సాగును. ఇరు తెగలవారు కర్మలు చేయుచుందురు. కాని ఫలిత మొకటి కాదు. మొదటి తెగవారు సృష్టియందు మోహము చెంది, గుణ సంగులై కోరికయే ప్రధానముగ కర్మల నాచరించి అందు బద్ధులగుచున్నారు. రెండవ తెగవారు కోరిక బదులుగా కర్తవ్యము నాశ్రయించి కర్మలు నిర్వర్తించుట వలన సంగదోషము లేక జీవన విభూతిని పొందుచున్నారు.

బుద్ధిమంతులు కామము, కర్తవ్యములయందు విచక్షణ కలిగి యుండవలెను. కర్తవ్యమునకు ఫలితమాసించుట యుండదు. కర్తవ్య నిర్వహణమున కామము లేదు. కామ్యకర్మలు కర్తవ్యములు

కావు. మాట, చేతల కుపక్రమించునపుడు కర్తవ్యమా కాదా అని పరీక్ష చేసుకొని చూసినచో, కామ్యమో కర్తవ్యమో సులభముగ తెలియును. ఇట్టి పరీక్ష చేసుకొననిచో బుద్ధి భేదము కలుగును. మూఢత్వము కలుగును. మోహము కలుగును. అహంకారము కలుగును. అజ్ఞానము కలుగును. కర్మలయందు మునుగును అని భగవానుడు నాలుగైదు రకములుగ హెచ్చరించియున్నాడు. కర్తవ్యమునే ఆసక్తితో నిర్వర్తించుట భగవానుడు తెలిపిన సుళువు. చేయవలసినదా? చేయదలచినదా? వలసినదే అయినచో కష్ట నష్టములు, జయాపజయములు, లాభనష్టములు చూచుకొన నవసరము లేదు. చేయదలచినదైనచో ద్వంద్వము లుండును.

కావున ప్రకృతియొక్క గుణములచే సమ్మోహితులైనవారు కామ్య కర్మలే చేయుదురు. అట్లు చేయగూడదని తెలుపువాడు తెలిసినవాడు కాదు. ఎట్లు చేయవలెనో తెలుపుట ప్రధానము. కామ్యకర్మ నుండి కర్తవ్య కర్మకు క్రమశః మళ్ళించుట జ్ఞానులు చేయవలసిన పని. సామాన్యముగ పండితులు, గ్రంథములు చేయకూడనివి తెలుపుట ఎక్కువగ జరుగును. చేయవలసిన దానియందు రుచి కల్పించి, చేయదలచిన వాని నుండి క్రమముగ తప్పించుట జ్ఞానులు, యోగులు చేయవలసిన పని. అంతియే గాని కర్మము సంగము కలిగించునని భయపెట్టరాదు. కర్మము కామ్యమైనచో సంగముండును. కర్తవ్యమైనచో అనుభూతి యుండును.

శ్రీరాముని జీవితము కర్తవ్య నిర్వహణమునకు ప్రమాణము. అతడు సంగములేక కర్తవ్యమును నిర్వర్తించినాడు. (3-29)

18

శరణాగతి

మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా ।
నిరాశీ ర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

భగవంతుడు కర్మలయందు శరణాగతి మార్గమును కూడ నందించినాడు. సమస్త కర్మలను తనయందు సన్యసించి, ఆశా మమకారము లేక, నిర్వర్తించుచుండుమని ఆదేశించినాడు. 'సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు', 'బ్రహ్మార్పణమస్తు' అను పదములు వినుచునే యున్నాము. రెంటియర్థము ఒకటే. చేయుటయందలి సుళువులు బుద్ధిబలముచే గ్రహించుట సుళువు కాదు. కొన్ని సమయములందు విచికిత్స యుండగలదు. చేయవలసినదా, చేయదలచినదా అనునది సులభముగ తేలదు. అపుడేమి చేయవలెను? ఇట్టి ప్రశ్నలు నరులకు సహజమే. చేయవలసినది కానిచో కర్మఫల మేర్పడునేమో, చేయవలసినది చేయకుండినచో అందుండి కూడ ఫలితములు ఏర్పడునేమో. చేయవలెనా? వలదా? అను ప్రశ్నలు పుట్టవచ్చును. ధర్మజ్ఞునికైననూ సంకటము

కలిగించు సన్నివేశములు పురాణములయందు కోకొల్లలుగా నున్నవి. ఇట్టి సమయమున విచికిత్స కన్న దైవమునకు సమర్పణముచెంది, తోచినది చేయుటయే శరణ్యము. కాని శరణాగతి మార్గమునకు దైవము రెండు నియమముల నేర్పరచి నాడు. ఆశ, మోహము అనునవి దరిచేరనీయక తోచినది దైవార్పణ బుద్ధితో చేయుట.

అర్జునుడు విచక్షణాపరుడే. ధర్మపరుడే. కర్తవ్య నిర్వహణ మున చెదరనివాడు. అట్టివానికే యుద్ధము చేయవలెనా? వద్దా అను ప్రశ్న పుట్టినది. అట్లు పుట్టుటకు కారణము పితామహుని యందు, గురువు నందుగల మోహమే. ఇతరులను సంహరించుట కతడు సంసిద్ధుడే. కాని తాతయందు మోహము వలన కర్తవ్యమున చెదరెను. ఏమియు పాల్పడక చతికిలపడెను. అట్టి మోహబద్ధునికి కర్తవ్యమును గూర్చి వివరించిననూ అది యందదు. అందువలన శరణాగతి మార్గమును దైవము బోధింపవలసి వచ్చినది. నరులకిట్టి సంకటములు సహజమే. అట్టి సమయమున దైవార్పణముగ కార్యములు నిర్వర్తించుట యిచట తెలుపబడినది. కర్మ మార్గమున దైవమిచ్చు తుది పరిష్కార మిదియే. భారము భగవంతునిపై వేసి ఆశామోహములు లేక తోచినది చేయుట అనునది సూత్రము.

(3-30)

19

శరణాగతి సూత్రములు

యే మే మత మిదం నిత్య మనుతిష్ఠంతి మానవాః ।
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః ॥31

శరణాగతి మార్గమును తెలిపిన భగవంతుడు మరిరెండు నియమములను కూడ సూచించుచున్నాడు. మొదటి నియమములు ఆశను, మోహమును వదలి కర్మమును సమర్పణ బుద్ధితో నిర్వర్తించుట. మరిరెండు నియమములు శ్రద్ధ కలిగి అసూయ లేకుండుటగ తెలిపినాడు. అనగా దైవమునకు సమర్పణము చేసుకొని తన బుద్ధికి తోచినది తాను చేయుటకు మొత్తము నాలుగు నియమము లీయబడినవి.

1. మోహము లేకుండుట.
2. ఆశ పడకుండుట.
3. అసూయ లేకుండుట.
4. శ్రద్ధ కలిగియుండుట.

పై నాలుగు నియమములు సర్వకర్మలయందు, సర్వ కాలములందు పాటించుట శరణాగతి కాగలదు. “నిత్యం అనుతిష్ఠంతి” అనుటలో ఎల్లప్పుడునూ అనుసరించ వలెనని హెచ్చరిక. అట్లు నిర్వర్తించు వానిని దైవమే నడుపును. తనను శరణుపొందిన వానిని తానే రక్షించునని, మోక్షము నిచ్చునని దైవము యొక్క వాగ్దానము. ఈ మార్గమునకు దైవమునందు పరిపూర్ణ విశ్వాసమే పునాది. అది అరుదు.

ప్రస్తుతకాలమున శరణాగతి తమ ఆశలను, కోరికలను తీర్చుకొనుటకే ఆస్తికులు చేయుచున్నారు. వీరి శ్రద్ధయును అంతంత మాత్రమే. అనసూయత్వము అసలే కరవు. మేము గురువునకు, దైవమునకు శరణాగతి చెందినాము అనుచుందురు. అట్టివారు పై నాలుగు నియమములు గమనించుచున్నారేమో పరిశీలించుకొనవలెను. (3-31)

20

ఎంపిక

యే త్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।
సర్వజ్ఞాన విమూఢాం స్తాన్ విద్ధి నష్టా న చేతసః ॥ 32

బుద్ధిమాంద్యులకు కర్తవ్యమేదో, కామమేదో తెలియదు. కామమే కర్తవ్యమని నిర్వర్తించుటవలన వారు బంధింపబడు చున్నారు. బుద్ధిమంతులకు కర్తవ్యము సూటిగ గోచరించును. వారు దానినే ఆచరింతురు. కావున బుద్ధిమాంద్యుల కొరకు దైవము కరుణతో శరణాగతి మార్గమును వాగ్దానము చేసెను. బుద్ధి ననుసరింప లేనివారు దైవము నాశ్రయించ వచ్చునని తెలిపినాడు. బుద్ధి ప్రచోదనము కాక, శరణాగతి నచ్చక బ్రతుకు జీవులమాట యేమి?

తమను తామైనా ఉద్ధరించుకొనవలెను లేదా సమస్తము నుండి ఉద్ధరించు వానిని ప్రార్థించుచూ శరణము పొందవలెను. రెండును చేయని వారిని ఎవరు రక్షింప గలరు? ఎవరునూ రక్షింపలేరు.

“కర్తవ్యమును నిర్ణయించుకొనుచు చేయుము లేదా నేను చెప్పినట్లు చేయుము.” అని అర్జునునితో శ్రీకృష్ణుడు పలికినాడు. నీ కర్తవ్యము సరియైనది అగుచో అది నిన్ను బంధించదు. సరియగు నిర్ణయము చేసుకొనలేననిపించినచో, నా నిర్ణయమును పాటించుము. అప్పుడు నీ బాధ్యత నాదే. రెండింటిని కాదన్నచో నష్టపడుట తప్పదు. అటుపైన నీ యిష్టము అని దైవము అర్జునుని ద్వారా నరులకు తెలుపుచున్నాడు. ఎంపిక చేసుకొనవచ్చునని నరునికే నిర్ణయము వదలినాడు. (3-32)

21

నిగ్రహము - అనుగ్రహము

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్ జ్ఞానవా నపి ।
ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥ 33

భగవానుడు బుద్ధినికాని, తననుకాని ఆశ్రయించి కర్మమును చేయమని తెలుపుచు మరియొక ముఖ్యాంశమును ఆవిష్కరించుచున్నాడు. ఇది తెలిసినచో దైవమునకు శరణాగతియే మార్గమని, ఇతర మార్గములు పూర్ణశ్రేయోదాయకము కాదని తెలియును. ఇది తెలియుట ముఖ్యము.

ఎంత జ్ఞానవంతుడైనను ప్రకృతిలోని వాడేగదా! త్రిగుణముల కీవలివాడు జీవుడు, ఆవలివాడు దేవుడు. ప్రకృతినుండి పుట్టిన జీవులు ప్రకృతిని దాటలేరు. తమ ప్రకృతికిలోనై మాత్రమే జీవించగలరు. జ్ఞానవంతుడైననూ యింతియే సుమా, అని శ్రీకృష్ణుడు హెచ్చరించుచున్నాడు. కావున ప్రకృతిని దాటుటకు దైవముయొక్క అనుగ్రహము, ప్రకృతియొక్క కరుణయు ముఖ్యము. రెండునూ ఒకటియే. బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు వంటి లోకపాలకులు కూడ ప్రకృతిమాయలో పడినవారే. పౌర

పాట్లు చేసినవారే. మరల దైవానుగ్రహముచేత, తమ స్థితియందు నిలిచిరి. ఇక మానవులందలి జ్ఞానులెంత? వారి నిగ్రహమెంత? భగవంతుని అనుగ్రహమునకై ప్రయత్నింపవలెను గాని, నిగ్రహ మార్గము ననుసరించుట కాదు. మనో దేహేంద్రియములు ప్రకృతి యధీనమున నున్నవి. తన యధీనమున యున్నవని భావించు వాడు అవివేకి, అహంకారి. అందువలన చివరకు మిగులునది శరణాగతి మార్గమే. తమను, తమ జీవితమును, తమ కార్యక్రమ ములను పరిపూర్ణముగ దైవమునకు సమర్పించి, అతని అనుగ్రహము కొరకే జీవించుట కర్మ సంగములేని మార్గము. అహంకారమునకు లోబడియే బుద్ధి పనిచేయును. అహంకారము ప్రకృతికి లోబడి యుండును. అనగా గుణములకు లోబడి యుండును. కావున జ్ఞానియైననూ, దైవమునకు శరణ మనవలసినదే. మరియొక మార్గము లేదు.

దీనివలన తెలియవలసిన ముఖ్యాంశమేమనగా, సమస్తము నందు దైవచింతన పెంచుకొనుటయేగాని, "కామము పారద్రోలుడు, ఇంద్రియములను నిగ్రహింపుడు, సద్భావములే కలిగి యుండుడు, సత్ప్రవర్తనమే ఆశ్రయింపుడు" అని నినాదములు చేయుచు, బోధలు చేసినచో అవి యన్నియు నిరుపయోగములు. ప్రకృతి వశులగుటచేత ఎవ్వరునూ నిర్వర్తింపలేరు. దైవము నాశ్ర యింపుడు, దైవచింతనము పెంచుకొనుడు, అనురక్తితో భజింపుడు, దైవమును కామింపుడు, ప్రేమింపుడు అను వాక్యములు పై నినాదముల కన్న మిన్నగ పరిష్కార మందించును. (3-33)

22

ఇంద్రియ సృష్టి - ద్వంద్వములు

ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।
తయోర్న వశ మాగచ్ఛేత్తౌ హ్యస్య పరిపంధినౌ ॥ 34

సృష్టి నిర్మాణమున ఇంద్రియసృష్టి ఒక ప్రధాన ఘట్టము. ఇంద్రియములే లేనిచో మానవుడు బహిఃప్రపంచముతో ప్రతి స్పందించలేడు. ఇంద్రియముల ద్వారానే రుచి, స్పర్శ, వాసన, చూపు, వినికిడి అనుభవించుచున్నాడు. దేహ పోషణకు, దేహ రక్షణకు తగుమాత్రము దేహానుభూతికి ఇంద్రియము లవసరము. ఇంద్రియములే లేనిచో మానవుడు తన శరీరమును తానుగ పోషించుకొనలేడు. రక్షించుకొనలేడు. దశేంద్రియములు ప్రచేతస ప్రజ్ఞలు. అవి రుద్రుని ఆజ్ఞగా ఇంద్రియము లందు పనిచేయు చున్నవి. ఈ ప్రజ్ఞలు దివ్యములు.

సృష్టియందు ఇంద్రియార్థము లున్నవి. మానవునియందు ఇంద్రి యము లున్నవి. ఇంద్రియార్థముల ద్వారా దేహ పరిపోషణ, తదనుభూతి కావించుకొనవచ్చును. రుచిలేనిచో మానవుడు

భుజించునా? భుజించి దేహమును పోషించుట కర్తవ్యము. అందులకు రుచి సంధానకర్త. భుజించుటకు రుచి కాని, రుచి కొరకు భోజనము కాదు. హితమును మితముగ భుజింపుమని ఆదేశము. మితి మీరినచో హితవస్తువు విషమగును. ఇట్లే యితర ఇంద్రియముల విషయమున కూడను మితిమీరి నపుడెల్ల తీపి అనుభవము చేదుగ మారును. ఆహారము వలన పుష్టివంత మైన శరీరమును ఏర్పరచుకొనవచ్చును. ఆహారము వలన అనారోగ్యమును కూడ పొందవచ్చును. ఇట్లు మితిమీరినపుడెల్ల ద్వంద్వానుభూతి కలుగును. ద్వంద్వములయందు చిక్కినచో బంధములు కలుగును. బంధములు దుఃఖములను కలిగించును. సర్వ విషయములయందు మితి ఒక మార్గము. **మితి తప్పినచో గతి తప్పును.** ద్వంద్వములే మానవునకు శత్రువులని దైవము హెచ్చరించుచున్నాడు. వాని కింద్రియములు ముఖద్వారములని తెలుపుచున్నాడు. (3-34)

23

స్వధర్మము

శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్ ।
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥ 35

ప్రతి మానవునకు తనదైన స్వభావము ఒకటి యుండును. తదనుగుణమైన కార్యమునందు నిమగ్నమైనచో శ్రేయస్సు కలుగును. లేనిచో భయము కలుగును. కొందరికి ఉపాధ్యాయ వృత్తి నచ్చును. కొందరికి పదిమందిని రక్షించుట నచ్చును. కొందరికి వ్యాపారము నచ్చును. మరికొందరికి శరీర శ్రమ నచ్చును. తనకు తానుగ పరిశీలించుకొని చూచినచో తన ప్రవృత్తి కేమి నచ్చునో తనకు తెలియగలదు. దానినే శ్రద్ధతో నిర్వర్తించినచో శ్రేయస్సు కలుగును. ఆనందము కలుగును. తృప్తి కలుగును. అట్లుకానిచో ఘర్షణలు, భయము కలుగును.

ఆధునిక యుగమున మానవుడు స్వభావమును బట్టి కార్యక్రమము నేర్పరచు కొనుట మరచినాడు. డబ్బును బట్టి పని యెన్నుకొనుచున్నాడు. ఏది యెక్కువ డబ్బునిచ్చునో అది

చేయవలెనని తల్లిదండ్రులు కూడ ప్రోత్సహింతురు. ప్రవృత్తిని బట్టి వృత్తి నిర్ణయము జరుగుటలేదు. ధనార్జనము, సంఘమునందు కీర్తి, గొప్పదనము కలిగించునవి చేయుటకే ప్రవర్తించు చున్నాడు. ఘర్షణమున కిదియే మూలము.

ఇష్టములేక డబ్బు కొరకు ఉద్యోగము చేయువారు, యిష్టము లేకపోయినను ఉపాధ్యాయ వృత్తియందున్న వారు, అట్లే వ్యాపారులు, రక్షణాధికారు లున్నారు. ఎవరిని ప్రశ్నించినను వారు చేయు పనులయందు వారికి తృప్తి లేదు. ఆనందము లేదు. మీదు మిక్కిలి భయముండును. కుశలమా అని ప్రశ్నించి నచో త్రికరణశుద్ధిగ ఎవ్వరును కుశలమని చెప్పలేరు.

తన శ్రేయస్సు తనకు గల ధనముపై యాధారపడి యున్నదని భ్రమపడి అట్టి ధనార్జనకు వీలుగనుండు వృత్తితో ముడిపడి అది తన ప్రవృత్తికి విరుద్ధమగుట వలన ఘర్షణము చెందుచు, భయ పడుచు, రోగములు తెచ్చుకొనుచు నశించుచున్నారు.

ధనార్జన ప్రధానమగుట ఒక కారణము కాగ, తన పనికన్న పొరుగువాని పని బాగున్నదని మరియొక భ్రమ యగుచున్నది. కోతి పని కోతి చేయవలెను, వడ్రంగిపని వడ్రంగి చేయవలెను అను సూత్రము ప్రధానము. కుక్క పని కుక్క చేయవలెను, గాడిద పని గాడిద చేయవలెను. తన పనికన్న కుక్కపని బాగున్నదని గాడిద కుక్కపని చేసి భంగపడినది. గొప్పకు ఒక కోతి వడ్రంగి

పనిచేసి, ప్రాణసంకటము తెచ్చుకున్నది. ప్రస్తుతము మానవుల ప్రవర్తనము యింతకన్న ఉత్తమముగ నున్నదని చెప్పలేము కదా! ప్రవృత్తిచే అర్జునుడు యోధుడు. ధర్మరక్షకుడు. వీరుడు. ధర్మరక్షణము చేయక మరియేమి చేసినను అతడపహాస్యము పాలగును. అపహాస్యమగుట మహావీరునకు మరణముకన్న దుర్భరము. యుద్ధభూమినుండి పారిపోయినాడని నలుగురూ నవ్వినచో అర్జునుడు బ్రతుకలేడు. పిరికివాడని హేళన చేసినచో భరించలేడు. ధర్మరక్షణ చేయని పాపి అనిపించుకొనినచో బ్రతుకడు. అతనికి స్వాభిమానము మెండు. అట్టివాడు నేను యుద్ధము చేయను, తపస్సునకు పోయెదను అని పలుకుట మోహము వలన కలిగినది. భగవంతుడు స్వధర్మమే శ్రేయస్సు, అందు మరణించినను శుభమే. అధర్మము నిన్ను నశింపజేయును అని తెలిపినాడు.

భగవద్గీతయందు తెలుపబడిన అత్యంత ప్రధానమైన సూత్రములలో స్వధర్మము ఒకటి. యుక్త వయస్సునందు స్వధర్మము తెలిసి, వృత్తి నెంచుకున్నవాడు ధన్యుడు. (3-35)

24

అగ్నికార్యము

సామాన్య మానవుడు కావలెనని పాపము చేయడు. కాని స్వభావము బలముగ ఆకర్షించి అతనిచే పాపములను నిర్వర్తించు చుండును. పాపము చేయుచుంటిని అని తెలిసియు అందుండి బయటపడలేడు. దీనికి కారణమేమి? అని అర్జునుడు ప్రశ్నించినాడు.

నిజమునకు భగవంతుడు సమాధానము యిచ్చియే యున్నాడు. తెలిపినను మరచుట మానవ సహజము. మరల తెలుపుట ఉపాధ్యాయుల ధర్మము. సద్గురువు ధర్మము. గుణములు గుణములతో ప్రవర్తించుననియు, ప్రకృతి గుణము లచే మోహపడుట సహజమనియు, జ్ఞానులు సైతము గుణా కర్షణము కారణముగ నిగ్రహమును కోల్పోవుదురనియు తెలిపి యున్నాడు. మరల ప్రశ్నించుటచే భగవంతు డిట్లనుచున్నాడు.

గుణములలో మొదటిది రజస్సు. అది యిచ్ఛను కలిగించును. ఆకర్షణను కలిగించును. కోరిక కలిగించును. దీని

మరియొక నామమే కామము. కామమును విచక్షణతో నిర్వర్తించు కొనవలెను. విచక్షణకు బుద్ధి యాధారము. మనుష్యుని బుద్ధి కర్మాధీనమై యుండును. కావున అది అక్కరకు రాదు. అందు వలన దైవము బుద్ధి తనయందు స్థిరపడవలెను. దానికి దైవమే శరణ్యము. సరియగు దైవారాధనము మనయందలి దైవబుద్ధి కేంద్రమును మేల్కొల్పును. అది ధర్మమునకై మ్రొగ్గి యుండును. అపుడాకర్షణలు పనిచేయవు. కావున దైవారాధనమునకు ఫలశ్రుతి బుద్ధి ప్రచోదనము. బుద్ధియందు స్థిరపడినవాడు పూర్ణ విచక్షణ దైవానుగ్రహముగ పొందియుండును. అపుడు రజోగుణ మతనిని స్పృశింపదు. కామము ధర్మయుక్తమై వర్తింపబడుచుండును. మనసు, యింద్రియములు బుద్ధియందు సంయమము చెందగ, బుద్ధి దైవముతో అనుసంధానము చెందుటచే గుణాతీతుడై గుణముల యందు ప్రవర్తించుట జరుగును.

ఇట్లు బుద్ధియందు స్థిరపడుటకు బుద్ధి ప్రచోదనమునకై దైవారాధనమును ప్రతినిత్యము నిర్వర్తించవలెను. అనునిత్యము సాగవలెను. అద్దమును ప్రతినిత్యము శుభ్రపరచుకొననిచో దానిపై దుమ్ము చేరును గదా. దీపము వెలిగించినచో కొండె ఏర్పడుచున్నది గదా. అన్నము వండినచో పాత్రకు మసి యగుచున్నది గదా. దంతధావనము, స్నానము చేసినను మరునాటికి శరీరము మలినములను కలిగి యుండును కదా. సృష్టియంతయు ఒక

అగ్నికార్యము. అగ్నికార్యమున పొగ, మసి తప్పవు. వాటిని నిత్యము శుభ్రపరచుకొనవలెను. లేనిచో మసి తప్పదు. మసికి మరొక పేరే పాపము. కావున దైవధ్యానము, ఆరాధనము అను నిత్యము చేసుకొనుచు జీవించుట శరణ్యమని దైవము తెలిపెను. జ్ఞానులకైనను మరియొక మార్గము లేదని తెలిపెను.

గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 4వ అధ్యాయము - జ్ఞానయోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధన మనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ", డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "*జగద్గురు మందిరము*" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. “పరహితము పరమధర్మ” మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

ముందుమాట

భగవద్గీత సర్వోత్కృష్టమైన గ్రంథము. కర్మాచరణమునకు, ధర్మాచరణమునకు, భక్తి జ్ఞాన వైరాగ్యములకు, మోక్షపదమునకు ప్రామాణిక గ్రంథము. భగవద్గీతపై అనేకానేక వ్యాఖ్యానములు గలవు. ఇకపైన గూడ రాగలవు.

'నావాణి' యందు గీతా వ్యాఖ్యానము, ***"గీతోపనిషత్"*** అను శీర్షికగా పాఠకులకు అందింపబడినది. ప్రతి అధ్యాయము తనదైన సందేశము నందించుట గీతయందలి విశిష్టత యగుటచే అధ్యాయమున కొక పుస్తకముగా సామాన్య పాఠకులకు భగవంతుని సందేశము నందించు ప్రయత్నము "ధనిష్ఠ" సంకల్పించినది.

మాస్టర్ పార్వతీకుమార్ గారిచే అందించబడిన ఈ వ్యాఖ్యానము సామాన్యులకు కూడ స్ఫూర్తి కలిగించు విధముగ నుండుటచే ఈ ప్రచురణ చేపట్టితిమి. మొదటగ 'సాంఖ్యయోగము' ముద్రించితిమి. రెండవ భాగముగా 'కర్మయోగము', మూడవ భాగముగా 'జ్ఞానయోగము' ముద్రించబడినవి. మిగిలిన అధ్యాయ ములు గూడ కాలక్రమమున ప్రచురించబడ గలవు.

- ధనిష్ఠ

సందేశము

శ్రీకృష్ణుడు తెలిపిన జ్ఞానయోగము విశిష్టమైనది. ఇచట జ్ఞాన మనగ పుస్తక జ్ఞానము కాదు. గ్రంథపఠనము వలన ఏర్పడిన జ్ఞానము కాదు. వేదాది గ్రంథముల నధ్యయనము చేయుటవలన వచ్చిన జ్ఞానము కాదు. భగవద్గీతను పఠించుట, ఆరాధించుట– యిత్యాది చేయుటవలన కూడ శ్రీకృష్ణుడు తెలిపిన జ్ఞానము రాదు. ప్రస్తుతము జ్ఞానయజ్ఞము పేరున విపరీత ధోరణులలో విషయ పరిజ్ఞానము పంచిపెట్టబడు చున్నది. పుస్తక ప్రచురణలు, జ్ఞానప్రచారములు విపరీతముగ సాగుచున్నవి. వానిని పఠించుచు, హృదయస్థము చేయుచు, పదిమందితో పలుకుచు జ్ఞానుల మైతిమని మోహము చెందుట పరిపాటి. వక్తలు, ప్రవక్తలు శ్రీకృష్ణుడు తెలిపిన జ్ఞానమార్గమున గాక, వారిదైన మార్గమున వారు నడచుచున్నారు.

కేవలము యోగులు మాత్రమే నిజమగు జ్ఞానమును నిర్వర్తించు చున్నారు. యజ్ఞార్థ జీవనమే జ్ఞానమని శ్రీకృష్ణుని ఉపదేశము. యజ్ఞార్థ జీవన మనగ యాగములు చేయుట కాదు. తాను, తనకున్నది సర్వమును పరుల హితమునకే సమర్పణము చేయుట యజ్ఞము. అట్లు నిష్కామ కర్మయజ్ఞమును నిర్వర్తించు యోగ సాధకునకు మనసు నిర్మలమై, జ్ఞానము లోనుండి భాసించును. కామ్యకర్మల యందు నిమగ్నుడైన వానికి జ్ఞానము నేతి బీరకాయ లోని నేయి వంటిది. శరీరము, యింద్రియములు, మనస్సు, ప్రాణము, బుద్ధి, తాను, తనకున్న ధనము, తనకున్న పరివారము

అంతయు పరుల శ్రేయస్సు కొరకు వినియోగించుటవలన వ్యక్తిగత కర్మము శిథిలమై, మనసు నిర్మలమైనపుడు బుద్ధిద్వారా ప్రసరించు వెలుగు సర్వవిషయములను అవగతము చేయగలదు. రామకృష్ణ పరమహంస మొదలుగా గల యోగు లందరు అట్లే తెలుసుకొనిరి.

పరహితము జీవన విధానమై, అట్లు జీవించు వారిని ఆశ్రయించి, వారికి శుశ్రూషలు గావించుచు, వినయవంతులై నిరహంకారులైన వారికి మాత్రమే జ్ఞాన మందిన ఫలమగును. ఇతరులకు అందీ అందక తికమక గావించును. వారును తెలిసీ, తెలియని విషయ పరిజ్ఞానముతో యితరులను తికమక పెట్టుదురు.

శ్రీకృష్ణుడు జ్ఞానయోగ మను యీ అధ్యాయమున పండ్రెండు యజ్ఞములను తెలిపినాడు. వీనిని నిర్వర్తించు వారికి జ్ఞానము పొందుట కర్హత కలుగును. అట్టి అర్హత కలవారు గురు శుశ్రూషచే ఉపదేశము పొందగలరు. అనగ జ్ఞానమును సమీపింపగలరు. జ్ఞానము దైవమునకు మరియొక పేరు.

సత్సాధకులు వారి వారి స్ఫూర్తినిబట్టి, యిందు తెలుపబడిన యజ్ఞములను నిర్వర్తించుకొనగలరు.

విశాఖపట్నం
అవ్యయ, ఆశ్వయుజ పౌర్ణమి

- మాస్టర్ పార్వతీకుమార్

7-10-2006

విషయ సూచిక

1

ఉపదేశము

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహ మవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మను రిక్ష్వాక వేఽబ్రవీత్ ॥ 1

నేనీ యోగమును సూర్యుని కుపదేశించగ సూర్యుడు వైవస్వత మనువున కుపదేశించెను. అతడు ఇక్ష్వాకున కుపదేశించెను అని భగవానుడు పలికినాడు గదా! 'నేను' అంతర్యామి యగు వాసుదేవ ప్రజ్ఞ కాగ సూర్యుడహంకార స్వరూపుడగు సంకర్షణ ప్రజ్ఞ. అతని కుపదేశమై సిద్ధి పొందుటచే అతని నుండి అంతర్యామి ప్రజ్ఞ మనువునకు ఉపదేశ పూర్వకముగ చేరినది. అతని బుద్ధి అంతర్యామిచే వెలిగింపబడినది. అతని నుండి అంతర్యామి ఉపదేశపూర్వకముగ భూమికి రాజుయైన ఇక్ష్వాకునకు చేరినది. ఇక్ష్వాకును చేరిన అంతర్యామి ప్రజ్ఞ భూమిని నాలుగు పాదముల ధర్మమును నిలిపి పాలించినాడు. అట్లు యోగము పరిపూర్ణమైనది.

ఇక్ష్వాకు అనగా మనస్సు. మనస్సు శరీరమునకు రాజు. మనసే ఇంద్రియముల ద్వారా శరీరమును పోషించును,

నడిపించును, పాలించును కూడ. దివ్యత్వము మనసును చేరినచో మనసు దివ్యమై శరీర ధాతువులయందు వలసిన మార్పులేర్పరచి వాసనలను పారద్రోలి దివ్యకార్యమునకు సమర్పించును. అపుడే యోగము పరిపూర్ణమైనట్లు. అంతర్యామి అవతరించినట్లు. అందరి లోని అంతరాత్మ అహంకారము, బుద్ధి, మనసుల లోనికి ప్రవహించుట వలన అవతరణము జరుగును. అపుడు శరీరము దివ్యమై ఇంద్రియముల ద్వారా పరిసరములకు దివ్యత్వమును ప్రసరింపచేయును. అవరోధములు లేక ఇంద్రియముల ద్వారా ప్రసరింప చేయగలవు. అట్టి స్థితి నొందిన మనస్సును అనిరుద్ధు డందురు. హృదయమున నిలచి తన చూపు, మాట, స్పర్శ, సాన్నిధ్యాదులతో అందరిని ప్రచోదనము గావించును. అట్టివాడు పరిపూర్ణ యోగి.

వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు నాలుగును అంతర్యామి ఆవాసములు. అవి మనలో అంతర్యామి ప్రజ్ఞగను, అహంకార ప్రజ్ఞగను, బుద్ధిగను, మనస్సుగను యున్నవి. చివరి మూడింటి యందు దైవము నిలచినచో యోగము పరిపూర్ణ మగును. ఇట్లు దైవమే యోగము తానుగ నందించుచున్నాడని ఉపదేశ మార్గమును, రహస్యమును భగవానుడు తెలిపెను.

2

కర్తవ్యపాలనము

ఏవం పరంపరాప్రాప్త మిమం రాజర్ష యో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥ 2

పరంపరా ప్రాప్తముగ అందించబడిన నిష్కామ కర్మ యోగమును ఋషులైన రాజులు లేక రాజులైన ఋషులు తెలుసుకొని నిర్వర్తించెదరు. చాలకాలము గడచుటచే దీనిని క్రమముగ పాలకులు, ప్రజలు మరచిరి. తత్కారణముగ యోగము నష్టమైనది. జీవులు సంసారమున త్రిప్పలు పడుచున్నారు.

శ్రీకృష్ణుడు తెలిపిన యోగము ప్రాథమికముగ నిష్కామ కర్మయోగము. భూమిజీవులు కామ మాధారముగనే కర్మ చేయుదురు. కామము లేనిచో వారికి కర్మమే లేదనిపించును. నిజమునకు కర్మలు రెండు విధములు. కామ్యకర్మలు, కర్తవ్య కర్మలు. కర్తవ్యమున కామమునకు చోటు లేదు. కర్తవ్య కర్మలే నిర్వర్తించు వానికి క్రమముగ కామము తప్పును. అపుడింద్రియ జయము కలుగును. ఇంద్రియములను జయింత మన్నను ఎవ్వడునూ జయించలేడు. ఇంద్రియములు దివ్యములు. శరీర

రక్షణకై రుద్రుని అనుగ్రహముగ ప్రచేతసులచే నిర్మింపబడినవి. వానిని కర్తవ్య కర్మలకే వాడినపుడు అవి సహకరించును. జయింప నవసరము లేదు. జయించు బుద్ధి రాజసము. యోగమునకు వలసినది సత్త్వగుణము. సత్త్వమునకు లొంగనిది సృష్టిలో యేమియును లేదు. కర్తవ్యములను మాత్రమే నిర్వర్తించు జీవునకు సత్త్వగుణము బలపడును. తత్కారణముగ ఇంద్రియములు సహకరించును. దీనిని భగవంతుడు కార్యంకర్మ, నియతకర్మ అనినాడు. కర్తవ్యపాలనమే కర్మాచరణముగ జీవితము సాగుట యోగమున ప్రథమ పాఠము. దీనియందు సిద్ధి కలుగని వారికి యోగము లేదు. ఇది నిశ్చయము.

భూమిజీవులు ఫలితముల కొరకే జీవించుచున్నారు. కావున వారి యోగసాధన అంతయు బూడిదలో పోసిన పన్నీరే యగుచున్నది. యోగమున ప్రవేశించు బుద్ధి కలవారు మొదట జీవితమును కర్తవ్యోన్ముఖముగ నడిపించవలెను. ఇది సాధ్యపడనిచో యోగమునందు జేరుట నిరర్థకము. ప్రస్తుతము ప్రజల మనస్సులయందు ఫలితములు సాధించుటే ఒక మహాయజ్ఞముగ సాగుచున్నది. విద్య, ఉద్యోగము, వ్యాపారము, రాజకీయము, ఆధ్యాత్మిక ప్రచారము, వైద్య విధానము అన్నిటియందు ఫలితమాశించి పనిచేయుటయే యున్నది. కావున యోగము అదృశ్యమై యున్నది.

3

రహస్యము

స ఏవాయం మయా తే౽ద్య యోగః ప్రోక్తః పురాతనః ।
భక్తో౽సి మే సఖా చేతి రహస్యం హ్యేత దుత్తమమ్ ॥ 3

పురాతనము, శ్రేష్ఠము, రహస్యము అగు ఈ యోగమును నీవు నా మిత్రుడవు, భక్తుడవు అగుటచే నీకిపుడు నాచే తెలుపబడినది. అని భగవంతుడు పలుకుటలో చాల విశేషము ఉన్నది.

శ్రీకృష్ణుడుగ తానిపుడు అర్జునునకు తెలుపుచున్నను నిష్కామ కర్మయోగము సృష్టి ఆరంభము నుండి యున్నదని తెలుపుచున్నాడు. తాను స్థాపించినదని తెలుపుట లేదు. అందులకే అతడు జగద్గురువు. సద్గురువు లెవరును తాము ఒక నూతన మార్గమును స్థాపించితిమని పలుకరు. పలుకువారు సద్గురువులు కారు. యోగము, జ్ఞానము పురాతనములు. తమకు తెలిసినపుడు తమకు నూతనమే కాని అది ఎప్పుడును సనాతనమే. తెలిసిన దానినే మరల మరల తెలియజెప్పుట నిజమగు యోగులు, జ్ఞానులు చేయుదురు. అంతకు ముందు లేనిది తామిపుడు తెలుపుచున్నామని పలుకువారు జ్ఞానులు, యోగులు కాజాలరు.

మానవులకు మరపు సహజము. మరచిన వారికి గుర్తు చేయుట పెద్దల కర్తవ్యము. కొన్ని విషయములు గుర్తు చేసినచో గుర్తు యుండును. కాని జ్ఞానపరము, యోగపరమగు విషయములు ఎన్నిమార్లు గుర్తు చేసినను మరపు కలుగుచుండును. అందువలన ఈ యోగము రహస్యమై నిలచినది అని భగవానుడనుచున్నాడు. యోగము రహస్యముగ నుండుట ఎవరో స్వార్థముతో దానిని దాచిపెట్టుట వలన కాదు. జ్ఞానము కూడ నంతే. తెలిపినను మరపు వచ్చుట వలన అది నిజముగ రహస్యమై యున్నది. నిజమునకు గుర్తు కలిగి ప్రవర్తించినచో అంతకన్న ఉత్తమమైన జీవనము లేదు. అందుచే దైవము దీనిని ఉత్తమము, రహస్యము, సనాతనము అగు యోగమని పలికెను.

సన్నిహితుడవు, శ్రద్ధ కలవాడవు కనుక నీకు తెలుపుచున్నాను అని అనుటలో కూడ విశేషమున్నది. అర్జునుడు జన్మతః శ్రద్ధ కలవాడు. అతని శ్రద్ధ కారణముగనే దైవమగు శ్రీకృష్ణుని దర్శించిన వెంటనే సన్నిహితుడగుటకు ప్రయత్నించెను. శ్రద్ధ కలిగి దైవమునకు సన్నిహితు లగుటకు సంసిద్ధులగు వారికి మాత్రమే యోగ మందించవలెనని మరియొక సూచన. అనగా యోగము సంతర్పణము చేయరాదు అని హెచ్చరిక.

4

పరిణామము

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।
తా న్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥ 5

సృష్టియందు జీవులకు పునర్జన్మ లుండునని, కొందరు వాటి నెరుగుదురని, కొందరెరుగరని ఒక సత్యమును భగవానుడు ప్రతిపాదించినాడు. తనకును, అర్జునునకు అనేక జన్మలు గడచిన వని, తా నన్నిటిని ఎరుగుదునని, అర్జును డెరుగడని తెలుపుటలో పై సత్య మున్నది.

జన్మలు గడచుచున్నను తా నెవరో తెలిసియున్నవారు యోగులు, ఋషులు, సిద్ధులు. తెలియనివారు అజ్ఞానులు. అజ్ఞానులు మృత్యువుతో సమస్తమును మరతురు. యోగులు మృత్యువును దాటుట తెలిసినవారు. కనుక వారికన్ని జన్మలును జ్ఞప్తి యందుండును. వీరినే చిరంజీవులని కూడ అందురు. మృత్యువును దాటుటకు అనంతుడైన ఆదిశేషువు యోగవిద్య నందించెను. భగవంతుని ఆదేశము కూడ అందరును యోగులు కావలెననియె.

కలియుగమున అజ్ఞానవశమై ఇతర మతము లేర్పడి, జీవునకు పునర్జన్మలు లేవని, ఒకే జన్మమని ప్రచారమున్నది. ఇది అజ్ఞానము. జీవుని స్వభావములో దైవీ ప్రకృతి ఏర్పడుటకు పరిణామ మార్గమొకటి కలదు. ఈ పరిణామ మార్గమున జీవులు పాశవిక ప్రవృత్తి నుండి మానవతా ప్రవృత్తిలోనికి పెరుగుదురు. అటుపైన దైవీ ప్రవృత్తిలోనికి పెరుగు సందర్భమున యోగవిద్యా ప్రవేశము కలుగును. యోగ విద్యయందు పరిపూర్ణత చెంది జీవుడు మృత్యువును దాటి అమరుడై భూమి మీద యుండును. అట్టి జీవుని భూసురు లందురు. అట్టివారు బ్రహ్మోపాసన చేయుచు బ్రహ్మమును పొందుదురు. అనగా బ్రహ్మమే వారి రూపమున వుండును. వీరినే బ్రహ్మర్షులందురు. వీరు జీవులకు తరణోపాయము చూపించుచు సద్గురు పరంపరగ నేర్పడి యున్నారు. వశిష్ఠ అగస్త్య లట్టివారు.

శ్రీకృష్ణుడు అట్టి యోగీశ్వరుల గమ్యము. అతనికి సృష్ట్యాది నుండి జరుగుచున్న జీవుల కథ తెలిసియున్నది. అతడికి అర్జునుని యొక్క పూర్వజన్మలు తెలియుటలో ఆశ్చర్యము లేదు. సద్గురువు లకు కూడ జీవుల పూర్వజన్మల అవగాహన యుండును. వాని ననుసరించియే వారు జీవులకు హితము కలిగించు చుందురు. ఇది యొక సత్యము.

5

జీవాత్మ - పరమాత్మ

అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్ ।
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా॥ 6

ఈ శ్లోకమున శ్రీకృష్ణుడు తాను దైవమునని అర్జునునకు తెలుపుచున్నాడు. ముందు శ్లోకమున "నీకును, నాకును చాలా జన్మలు గడచినవని" తెలిపెను. అట్లగుచో జీవులవలె అతడును జనన మరణముల ననుభవించినాడా అను ప్రశ్న తలయెత్తును.

జీవులు ప్రకృతివశమై జన్మ ఎత్తుచుందురు. వారు జన్మ పరంపరల వశమై మృత్యువు ననుభవించుచు ముందుకు సాగుదురు. తా నట్టివాడు కాడని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు. అతడు ప్రకృతివశమై జన్మ ఎత్తుట లేదని, తన నుండి వెలువడిన ప్రకృతి ఆధారముగ తన మాయాశక్తిచే తాను రూపమును ధరించు చున్నానని తెలుపుచున్నాడు. ప్రకృతి తన నుండి ఉద్భవించినది. తాను స్వచ్ఛందముగ అందు ప్రవేశించినను స్వతంత్రుడే. జీవు లట్టివారు కాదు. వారు ప్రకృతి గుణములకు లోబడి యుందురు.

వారిని ప్రకృతి వశపరచుకొని యుండును. తాను ప్రకృతిని వశ పరచుకొని జన్మించుచున్నాడు. దైవమునకు జీవునకు ఇదియే వ్యత్యాసము.

ఒకడు నదీ ప్రవాహమున స్వచ్ఛందముగ ప్రవేశించి ఈత కొట్టుచున్నాడు. మరియొకడు నదీ ప్రవాహమున కొట్టుకొని పోవు చున్నాడు. ఇద్దరును సమాన మెట్లగుదురు. ఇందు రెండవవాడు రక్షణ లేనివాడు. మొదటివాడు రక్షించ గలిగినవాడు. ప్రకృతి ప్రభావము తీవ్రమగు నదీ ప్రవాహమువలె నుండును. అది త్రిగుణముల అల్లిక. దానిలో నుండి పుట్టినవారు నిజముగ పుట్టినవారు. దైవము పుట్టనివాడు. ప్రకృతి గుణముల నుండి జన్మించినవారు, కాలము రూపమున వ్యయమగు చుందురు. దైవమట్లు వ్యయము కాడు. జీవులకు తమపై ఈశ్వరత్వ ముండదు. దైవమునకు తనయందే కాక, సర్వజీవుల ప్రకృతి యందు ఈశ్వరత్వము కలదు. జీవాత్మ, పరమాత్మలకు గల వ్యత్యాస మీ శ్లోకమున తెలియును.

శ్రీకృష్ణుడు పుట్టలేదు. దేవకీదేవి ప్రసవించిన శిశువుపై తన నాపాదించుకొనెను. కాలము కారణముగ అతడు వ్యయమై వృద్ధుడు కాలేదు. ఎప్పుడునూ పదహారు సంవత్సరముల యువకుని వలెనే గోచరించెను. అతని జీవితమున ఎన్నో ఘట్టములు జీవులపై తనకు గల ఈశ్వరత్వమును ప్రకటించినది.

6

వాగ్దానము

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజా మ్యహమ్ ॥ 7

ఎప్పుడెప్పుడు ధర్మము క్షీణించి అధర్మము వృద్ధి యగుచుండునో, అపుడు నన్ను నేనే సృష్టించుకొందునని భగవంతుడు తెలిపినాడు.

ఇది భగవంతుని వాగ్దానము. సృష్టితోపాటు సృష్టిధర్మమును కూడ దైవ మేర్పరచినాడు. ధర్మమునకు గ్లాని కలిగినపుడెల్ల తానవతరించి ధర్మమును చక్కబెట్టుదునని తెలిపినాడు. ధర్మమే సృష్టికి ఆధారము.

ద్వంద్వములు కూడ సృష్టిధర్మమే. ద్వంద్వములు లేనిదే సృష్టిలేదు. వెలుగు లోకములు కలవు. చీకటి లోకములు కూడ కలవు. సురలు గలరు. అసురులు కూడ గలరు. జ్ఞానము కలదు. అజ్ఞానముకూడ కలదు. ఇట్లెన్నియో ద్వంద్వములు సృష్టిని సమతూకముగ నుంచును. ఇవి అన్నియు సృష్టి ధర్మములే.

ఇందొకటి నిర్మూలించినచో రెండవది కూడ నిర్మూలింపబడును. కావున దైవము దిగివచ్చినప్పుడు, అధర్మమును పరిపూర్ణముగ నిర్మూలించుట ఎప్పుడును జరుగదు. ధర్మాధర్మములు సృష్టి తక్కెడల వంటివి. తూకమునకు రెండు తక్కెడలును అవసరమే. దైవము హెచ్చుతగ్గులనే సరిచేయును తప్ప అధర్మమును పరి పూర్ణముగ సృష్టినుండి తొలగజేయునని తలచరాదు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి రూపములలో దైవము దిగివచ్చినప్పుడు ధర్మగ్లానిని సరిదిద్దిరే గాని అధర్మమును సంపూర్ణముగ తొలగింపలేదు. అసురులు, అజ్ఞానము ఎప్పుడూ యుండనే యున్నవి. వాటి స్థానము వాటికున్నది. ఇది సృష్టి ధర్మము. ఎవరి ధర్మమును వారు పాటించుట దైవమునకు ముఖ్యము. అతిక్ర మించినపుడు వానిని సరిజేయును.

కాలమునకు ధర్మమున్నది. కృతయుగమున కేవలము ధర్మమే యుండును. అపుడు సృష్టి అంతయు వెలుగు లోకముల తోనే నిండియున్నది. త్రేత, ద్వాపర, కలియుగములలో ఒక్కొక్క పాదము (25%) ధర్మము నశించుట జరుగును. కలియందు ఒక పాదమే ధర్ముముండును. మూడు పాదములు అధర్మమే యుండును. అంతకు మించి అధర్మము పెరిగినచో దైవము అవతరించగలడు. దైవము అవతరించనిచో, కాలరీతిని బట్టి అధర్మము మితిమీర లేదని తెలియవలెను.

దైవము యొక్క అవతారములు దిగివచ్చినను, మహా పురుషులు దేహధారులై యున్నను, అధర్మ మెందులకున్నది అని

ప్రశ్నించువారు, సందేహపడువారు పై సత్యమును తెలియవలెను. కాలమును బట్టి ధర్మ ముండును. జనస్రవంతి కాలము ననుసరించి యుండును. అందువలన ధర్మము ననుసరించు వారు అధర్మమును దూషింపక, ఒద్దికగ జీవించినచో అధర్మము స్పృశించదు. ధర్మ మనుసరించువారికొరకై మరియొక శ్లోకము చెప్పబడినది.

7

రక్షణ

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ 8

"సాధుజనులను పరిరక్షించుటకు, దుష్కృత్యములు చేయువారిని నిర్మూలించుటకు, ధర్మ సంస్థాపనము చేయుటకు ప్రతి యుగమునందు నే నవతరించు చున్నాను" అని భగవానుడు పలికెను.

సాధుజనులనగా సన్మార్గమున నడచు వినయవంతులు. వీరియందు అహింస, ఋజు ప్రవర్తనము, దొంగబుద్ధి లేకుండుట, కాని వాని కాశపడకుండుట, శుచి, శౌచము, సంతోషము, జ్ఞానాసక్తి, ఈశ్వరునికి సమర్పణ చెంది జీవించుట సహజముగ నుండును. అట్టివారు సాధువులు. వారిని భగవంతుడు పరిరక్షించును. పరి అను పదము కారణముగ సర్వకాలముల యందు అని అర్థము. ఇట్టి వారిని అధర్మము హింసించ లేదు. దండకవనమున గల ఋషులలో అగస్త్యాది ఋషులను అధర్మము తాకలేదు. ఇతర తపస్వి జనులను, మునులను తాకినది. ఇందలి

రహస్యమును తెలియవలెను. అగస్త్యాది ఋషులకు పరిరక్షణ మున్నది. ఇతరులకు రక్షణము కలుగుచు, కలుగక యుండును. కారణము వారి యందలి సత్వగుణము యొక్క స్థితి. సత్వ గుణము కూడ త్రిగుణములలో నొకటియే. కావున ఆసురీ తత్వమగు రజస్తమస్సులు తాకును. ముముక్షుజనులు సత్యాతీత మగు నిత్య సత్వమందుందురు. అట్టి వారిని రజస్సు, తమస్సులు స్పృశించలేవు. భగవంతుడు పరిరక్షణ చేయును. ఇందు తెలుప బడిన పరిరక్షణ ఎల్లప్పుడు నుండును. ధర్మాధర్మముల పాళ్ళు తప్పినపుడు దానికి కారణమగు దుర్మార్గులను శిక్షించి, సత్వ గుణులను కాపాడును.

అవతరించుటకు కాలధర్మము నిష్పత్తి చెందుటయే కారణము. అపుడు జరుగునవి మూడు కార్యములు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మ సంస్థాపనము. అవతరించనపుడు కూడ సాధు జనులకు రక్షణ యున్నది. అపుడు దైవము తాత్కాలికముగ జీవులలో ప్రవేశించి, శిష్టరక్షణ చేసి అంతర్ధాన మగుచుండును.

ఉదాహరణకు సత్పురుషుడొకడు, కర్మవశాత్తు అపాయము నకు గురియై మార్గ మధ్యమున స్పృహతప్పి పడియున్నప్పుడు ఆ మార్గమున బోవు జీవులలో ధర్మము ప్రవేశించి, వానిని గొని పోయి సురక్షితముగ ఒక వైద్యాలయములో ప్రవేశింప జేయుదురు. అట్లే దొంగ యొకడు సత్పురుషుని ధనము దొంగి లించుకొని పారిపోవు చున్నప్పుడు పలువురి రూపమున దైవమే దొంగను పట్టి, దండించి, ధనమును సత్పురుషున కిచ్చును. సృష్టి

అంతయు వాసుదేవరూపమే గనుక వాసుదేవుడెప్పుడును ఇట్లు జీవులను రక్షించుచునే యుండును. ఇట్టి రక్షణ కవతార మక్కర లేదు. పై తెలిపిన అపాయములు దుష్టులకు జరిగినచో అట్టి సహాయము లభించదు.

పై కారణముగ సత్ప్రవర్తన కలిగియున్న వారికి రక్షణ ఎప్పుడును కలుగును. అవతారము మాత్రము ధర్మగ్లాని కారణముగనే దిగివచ్చునని తెలియవలెను.

8

తత్త్వజ్ఞులు

జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోఽర్జున ॥ 9

"ఏ మానవుడు నా దివ్యమైన జన్మమును, కర్మమును యథార్థముగ తెలుసుకొనుచున్నాడో, అతడు దేహాంతరమున జన్మము నొందక నన్నే పొందుచున్నాడు" అని భగవానుడు అర్జునునకు తెలుపుచున్నాడు.

ఈ శ్లోకమున భగవంతుడొక రహస్యమును తెలుపుచున్నాడు. అది ఏమనగా "తనను తెలిసినవాడు తానే యగుచున్నాడు. బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మమే యగుచున్నాడు" అని ఉపనిషత్ సారాంశము. ఇచ్చట తెలియుట యనగా సిద్ధాంత పరముగ తెలియుట కాదు. స్వానుభవమున తెలియుట. అట్లు తెలిసినవారు తత్త్వజ్ఞులు. తత్త్వమనగా తత్ + త్వం. అనగా అది నీవే. వేదములలో దైవము పేరు 'తత్'. దైవమే నీవు అనునది జ్ఞానసారము. తత్వజ్ఞుడనగా దైవమే తానుగ నున్నాడని అనుభవ

పూర్వకముగ తెలిసినవాడు. "వేత్తి తత్త్వతః" అని ఈ శ్లోకమున తెలియబడినది. అనగా తత్త్వజ్ఞులకు 'తాను' తెలియునని అర్థము.

జీవులు తత్త్వజ్ఞు లెట్లగుదురు? భగవంతునియొక్క అవతారములను, అతడు చేసిన దివ్యమైన కర్మలను యథార్థముగ తెలుసుకొనినచో జీవుడు తత్త్వజ్ఞుడు కాగలడు. ఈ రహస్యము భాగవతమున ఈయబడినది. దైవముయొక్క జన్మ దివ్యము. అనగా అప్రాకృతము. కర్మమును దివ్యమే. అనగా లోకహితార్థము. వీని యందు మనస్సు రతిగొన్నచో భ్రమర కీటక న్యాయమున, జీవుడు కూడ లోకహితార్థము జీవించు టారంభించును. అట్లు జీవించుట పరిపూర్ణమగుసరికి అతని స్వభావము దివ్యమగును. పాంచభౌతిక ప్రకృతి అతనిని బంధించదు. తత్కారణముగ దేహ బంధముండదు. దేహబంధము లేనివారికి మరణము లేదు. కావున జన్మము కూడ లేదు.

తత్త్వజ్ఞునకు దేహము గృహము వంటిది. దేహమున ప్రవేశించుట, మరల నిష్క్రమించుట బంధము కాదు. అజ్ఞానికి అది కారాగృహము. బంధింపబడుట, తాత్కాలికముగ విడుదల కలుగుట, మరల బంధింపబడుట అతనికి స్వభావ వశమున కలుగును. దైవీస్వభావ మేర్పడుచుండగ ప్రకృతి స్వభావము సడలు చుండును. అట్టి తత్త్వజ్ఞులుకూడ క్రమశః అప్రాకృత శరీరమును పొందుదురు. దానినే దివ్యశరీర మందురు. మైత్రేయాది మహర్షు లట్టివారు. వారికి జనన మరణములు లేవు. దైవమే వారియందు నిండియుండుట వలన వారి రూపమున దైవమే యుండును. కావున వారు తత్త్వజ్ఞులు.

ఇట్లు దైవస్మరణము అనన్యము కాగా, వారు దైవ స్వరూపులై యున్నారు. కావున దైవముయొక్క దివ్యమగు జన్మ కర్మలయందు మనస్సు లగ్నము చేసినవారు క్రమముగ దైవమే యగుదురని, వారికి ప్రాకృత దేహబంధ ముండదని, భగవానుడు అర్జునునకు ఉపాయమును తెలుపుచున్నాడు.

9

దైవ భావము

**వీతరాగభయక్రోధా మన్మయా మా ముపాశ్రితాః ।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావ మాగతాః ॥ 10**

ఈ శ్లోకము, ముందు శ్లోకముయొక్క కొనసాగింపు. ఇందున "నా మయమైన మనస్సు కలవారు", "నన్నే ఆశ్రయించిన వారు". ముఖ్యముగ గమనింపవలెను.

నా మయమైన మనస్సు కలవారు, నన్నే ఆశ్రయించిన వారు. మమకారము, భయము, కోపము విడచినవారై, పవిత్రులై, నన్ను తెలియు చింతన గలవారై, నా భావమును పొందుచున్నారు. అట్టివారెందరో కలరు అని భగవంతుడు తెలుపుచున్నాడు.

దైవమును చేరుటకు వలసిన నియమముల నిచ్చుట దైవమే సూచించు చున్నాడు.

1. మనస్సు తన మయమగుట అనగా అన్ని సన్నివేశములను దైవముగ చూచుట. పరిసరముల యందలి రూపములు, వారి ప్రవర్తనలు దైవముగ చూచుట. శుభాశుభ

విషయములయందు దైవమునే చూచుట. సమస్తము దైవమే అని మనస్సున దృఢపడుట.

2. అన్ని విషయములయందు దైవమునే ఆశ్రయించుట, ఇతరములను ఆశ్రయించకుండుట.

3. పై రెండు నియమములను పాటించువారి నుండి మమకారము, భయము, కోపము అను మలినములు నిష్క్రమించును. కామ క్రోధాదులు, భయభ్రాంతులు విసర్జించుటకు వీలులేనివి. కేవలము దైవచింతన మాత్రమే వానిని పారద్రోలగలదు. దీపము వెలిగించుకొన్నచో, చీకటి అదృశ్య మగును. మరియొక మార్గము లేదు. అట్లే మొదటి రెండు నియమములు చక్కగ పాటించువారిని అరిషడ్వర్గములు వదలును గాని, వదిలించుకొను ప్రయత్నమున వదలవు. కావున మూడవ అంశము సిద్ధించినదే కాని ప్రయత్నించినది కాదు.

4. పై మూడు నియమములు సిద్ధించగ జీవుడు పవిత్రు డగును.

5. అట్లు పవిత్రుడైన జీవుడు దైవము తానుగ నున్నాడని ధ్యానము చేయుట వలన దైవరూపమున నిలచును. దైవభావమున పరిపూర్ణముగ నిలచును.

పై సోపానములన్నియు ఓర్పుగ నిర్వర్తింపబడవలెనే గాని, మరియొక మార్గము లేదు. ఇట్లు తనను పొందినవా రెందరో కలరని దైవము తెలుపుచున్నాడు.

10

ఆనందము

యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్।
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః । 11

"ఎవరెవ రేవిధముగ నన్ను ఆశ్రయించు చున్నారో వారిని ఆ యా విధములుగనే నేను ఎల్లప్పుడు అనుగ్రహించుచున్నాను. మానవులందరు సర్వ విధముల నా మార్గమునే అనుసరించు చున్నారు" అని భగవానుడు పలికెను. ఇది ఒక శాశ్వత సత్యము.

దైవము ఆనంద స్వరూపుడు. జీవులు ఆనందము కొరకే రకరకముల కార్యముల నాచరించు చున్నారు. రకరకముల అన్వేషణలను సాగించు చున్నారు. శాశ్వత ఆనందము లభ్యమగు వరకు జీవుని అన్వేషణ సాగుచునే యుండును. ఇన్ని రకముల అన్వేషణలును దైవమును జేరు మార్గములే. కారణము జీవుని యందు గల ఆనందాన్వేషణ. శాశ్వతానందము దైవము. శాశ్వతానందము కలుగనంతవరకు జీవుడు అన్వేషణ సాగించుచునే యుండును. జీవు డనగా ఆనందము కొరకు నన్వేషించువాడని ఒక నిర్వచనము.

ఈ ఆనందము ప్రాథమిక దశలో అజ్ఞానపూరితముగను, అశాశ్వతముగను నుండును. కొందరికి అన్నము తిన్నచో ఆనందము. కొందరికి నిద్రించినచో ఆనందము. కొందరికి తీరుబడిగ కూర్చుని వ్యర్థభాషణము చేయుట ఆనందము. కొందరికి తిరుగుట ఆనందము. కొందరికి పుణ్యక్షేత్ర దర్శన మానందము. కొందరికి ధనార్జన మానందము. ఇట్లనేకానేక ఆనందములు జీవుడు పొందు టకు ప్రయత్నించును. ఇట్లే పదవి, కీర్తి, స్త్రీ పురుష వ్యామోహము ఆనందములుగ కొందరికి గోచరించును. జీవుడు దీని ననుసరించి అందలి ఆనందము అనుభవించి అది తాత్కాలికమని తెలుసుకొనును. ఒక ఆనందము తాత్కాలికమని తెలిసిన వెంటనే అంతకన్న మిక్కుట మగు ఆనందమునకు ప్రయత్నించును.

ఇట్లు ఆనందానుభూతికే సర్వవిధముల మానవులు కోటానుకోట్ల మార్గముల ప్రయత్నించును. అందు శాశ్వతత్త్వము లేకపోగా బంధనములు, రోగములు ఏర్పడుట గమనించును. అపుడు దుష్ఫలితములు లేని ఆనందమునకే అన్వేషించును. చిట్టచివరికి దైవస్మరణ, యజ్ఞార్థ జీవనము, స్వాధ్యాయము శాశ్వతానంద మార్గములని తెలిసి అందు తనను నియమించు కొనును. ఇట్లు జీవులు సర్వవిధముల ప్రయత్నించి చివరకు తననే అనుసరించి చేరుతున్నారను సత్యమును దైవము తెలిపెను.

11

దేవతారాధన

కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।
క్షిప్రం హి మానుషే లోకే సిద్ధి ర్భవతి కర్మజా ॥ 12

దేవతల రూపమున దైవమే వ్యాప్తి చెందియున్నాడు. ఒకే అంతర్యామి దైవమునుండి అనేకానేక దైవశక్తులు దేవతా ప్రజ్ఞలుగా వ్యక్తమై వివిధములగు కార్యములను సృష్టిలో నిర్వహించు చున్నవి. ఆయా దేవతలు, ఆయా లోకములలో లోకపాలురుగను, గురువులుగను, యితర శక్తులుగను వెలసి యున్నారు. ఇందరియందు అంతర్యామిగా తానై దైవమున్నాడు. ఇన్ని దేవతా ప్రజ్ఞలుగా జీవులకు సమీపముగా తా నున్నాడు.

కర్మఫల సిద్ధికొరకు దేవతలను ఆరాధించుట ఆర్య సంప్రదాయము. దేవతలను ఆరాధించుట అనగా వారి యను గ్రహము కోరి తదనుగుణమైన దీక్షను వహించుట, పూజించుట. దీక్షాయుత జీవనము జీవులను సంస్కారవంతులుగా తీర్చిదిద్ద గలదు. తదనుగుణమైన ఫలమునుగూడ నీయగలదు.

ఈ లోకమున శీఘ్రముగా ఫలసిద్ధి కలుగుటకు ఋషులనేకానేక దేవతా ఆరాధనములను అందించి యున్నారు. శ్రీరాముడు, ధర్మరాజు, అర్జునుడు, లీలామానుష రూపుడగు శ్రీకృష్ణుడు కూడ ఆరాధనములు సలిపినట్లు మన గ్రంథములు తెలుపుచున్నవి. భగవద్గీతయందు దేవతారాధన సంప్రదాయమున్నట్లు దైవము తెలుపుచున్నాడు. ముందు శ్లోకమున తననెవరెవరు ఏ యే విధముగా ఆరాధించిన వారికి ఆ విధముగనే అనుగ్రహింతునని తెలిపిన వైనము ఈ శ్లోకమున దేవతలను ఆరాధించుటచే కర్మఫల సిద్ధి శీఘ్రముగ కలుగునని వివరించుటలో అందరియందు తననే దర్శించమని కూడ సూచన లభించుచున్నది. ఇట్లారాధించుటచే మనుష్యులు త్వరితగతిని మానవలోకమున పురోగమించగలరని గీత బోధించుచున్నది. అగస్త్య మహర్షితో సహా సమస్త ఋషులును దేవతారాధనము ప్రతినిత్యము గావించుచుందురని పురాణములు తెలుపుచున్నవి.

కావున బుద్ధిమంతులగువారు నిత్యదేవతార్చనము కావించుకొనుట శ్రేయోదాయకము. యోగము, ధ్యానము, తపస్సు చేయువారు కూడ దేవతార్చన సలిపినచో మార్గము సుగమమగును. ప్రతికూలతలు, విఘ్నములు, అంతరాయములు నివారింపబడును.

12

స్వభావము

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।
తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥ 13

భగవద్గీతయందీ శ్లోకము అవగాహన చేసుకొనుట అత్యంత ప్రధానము. దైవము కర్మలను బట్టి గుణవిభజనము సృష్టి యందున్నదని, గుణములను బట్టి కర్మలు నిర్వర్తింపబడు చున్నవని, గుణములు ప్రకృతిచే నిర్వర్తింపబడుచున్నవని, ప్రకృతికి అతీతుడుగా కర్మలకు తాను కర్తను కాదని, ప్రకృతియందు అధీనుడుగా తాను కర్తనని కూడ తెలియజేయుచున్నాడు.

మానవులు కొన్ని పనులు చేయుటకు యిష్టపడుదురు. కొన్ని పనులకు యిష్టపడలేరు. కొన్ని సమర్థతలు కలిగియుందురు. కొన్ని సమర్థతలు పొందలేరు. అందరికిని ఒకే రకములైన భావము లుండవు. వారి వారి పరిణామమును బట్టి ఆయా భావములు తరచు కలుగుచుండును. ఇది మనము సులభముగ గుర్తించ వచ్చును. మనము చేయు పనులన్నిటికి మనకు కలుగు భావములే పునాది. మన భావములకు మన స్వభావము పునాది.

మన స్వభావమునకు మనయందలి గుణముల మిశ్రమము పునాది. మనలో తమోగుణము మిక్కుటముగ కలిగి, రజో గుణము స్వల్పముగ నున్నచో మన మనస్సు శరీర శ్రమకు ఎక్కువ యిష్టపడదు. అట్లే తమోగుణము, రజోగుణము సమానముగ కలిగి సత్త్వగుణము స్వల్పముగ నున్నచో, స్వభావమునందు వ్యాపారదృష్టి మిక్కుటముగ నుండును. రజోగుణము మిగిలిన రెండు గుణముల కన్న అధికముగ నున్నచో సహజమగు శౌర్యము, ధైర్యము, పాలనాశక్తికి సంబంధించిన స్వభావములు; సత్త్వ గుణము అధికమై మిగిలిన గుణములు స్వల్పముగ నున్నచో తపస్సు, స్వాధ్యాయము, విద్యాబోధనమునం దాసక్తి, శమ దమాదులు యుండును.

మన స్వభావములను మనము పరిశీలించి చూసు కున్నపుడు, స్థూలముగ పై నాలుగు తరగతులుగ మానవులు గోచరింతురు. ఈ చతుర్విధములైన స్వభావములను బట్టి, స్థూలముగ చతుర్విధములగు కార్యక్రమములు భూమిపై జరుగుచుండును. ప్రతి మానవునియందు కూడ ఈ నాలుగు విధములైన స్వభావములు ఒక అనుక్రమమున గోచరించును. ఆ క్రమమును బట్టే వర్ణము లేర్పడినవి. ఇవి గుణములచే నిర్వర్తింప బడుటచే గుణముల యందలి మిశ్రమమును సత్త్వము వైపునకు క్రమముగ మళ్ళించుట పరిణామమునకు దారితీయును. జీవుల పరిణామములోని వివిధ స్థితులను బట్టి వివిధములగు మిశ్రమములు ఉండును. మానవ సంఘమున మానవులు గుంపులు గుంపులుగ వారి వారి స్వభావమును బట్టి ఏర్పడు

చుందురు. వారి మధ్య సంబంధ బాంధవ్యముల నేర్పరుచుకొందురు. కాల క్రమమున అవి కులములై స్థిరపడినవి. కాని వర్ణముల విభాగము గుణమునుబట్టి యని తెలియవలెను. ఆయా కులములలో ఆయా స్వభావములు యుండుననుటలో సత్యము లేదు. ఆయా గుణములలో ఆయా స్వభావమున్నది యనుటలో సత్యమున్నది. కావున గుణమును బట్టి కులమని భగవద్గీత స్పష్టము చేయుచున్నది.

13

కర్తవ్యాచరణము

న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।
ఇతి మాం యోఽభిజానాతి కర్మభి ర్న స బధ్యతే ॥ 14

"నాకు కర్మఫలమునం దపేక్ష లేదు. నన్ను కర్మలంటవు" అని నన్ను గూర్చి ఎవడు తెలుసుకొనునో అతడు కర్మములచే బంధింపబడడు. శ్రీకృష్ణుడు పలికిన ఈ వాక్యములో రెండు విధములగు అవగాహన గోచరించును. దైవము నిర్లిప్తుడని, కోరికల కతీతుడని, కావున అతడిచే నిర్వర్తింపబడుచున్న సృష్టి కర్మఫలము, అతనిని అంటదని ఒక అవగాహన.

దైవము పేరు 'నేను'. జీవుని పేరుకూడ 'నేను'యే. జీవుడు కూడ పై తెలిపిన వాక్యమును మరల మరల జ్ఞాపకము చేసుకొనవచ్చును. అది యేమనగా "నాకు కర్మఫలమునం దపేక్ష లేదు. నన్ను కర్మలంటవు." ఇది అనునిత్యము ధ్యానము చేయుచు కర్మలాచరించు వానిని కూడ కర్మలు బంధింపవు.

కోరిక యున్నచోట బంధముండును. కోరిక లేనిచోట బంధముండదు. కావున ఫలము కోరక, కర్తవ్య మాచరించుట కర్మబంధము నుండి బయల్పడుటకు మార్గము. ఇది గీత బోధించు ప్రధాన సూత్రము.

14

నిష్కామకర్మ

ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వై రపి ముముక్షుభిః ।
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥15

ముముక్షత్వము పొందిన జీవులందరును పూర్వమాచరించిన సూత్రము "కర్మము నిర్వర్తించుట, కర్మఫలము నాశింపకుండుట." ఫలాసక్తి లేక కర్మము నాచరించుట వలన అనాది కాలము నుండి కొందరు జీవులు మోక్షమున స్థిరపడి యున్నారు. కావున నీవు కూడ "కర్మమునే చేయుము. ఫలముల నాశింపకుము" అని తెలుపుటలో దైవము నిష్కామ కర్మ యోగము అనాది కాలము నుండియు గలదని, తానిపుడు క్రొత్తగ తెలుపుట లేదని తెలియ చెప్పుచున్నాడు. నిజమునకు సద్గురువు తాను క్రొత్తగ నేదో చెప్పుచున్నట్లు భ్రమను కలిగింపడు. పూర్వీకులనుసరించి, తరించిన మార్గమునే మరల మరల వివరించును. అందుచేత మోక్షాసక్తి గల అర్జునునకు, అనాదిగా మోక్ష స్థితి

యందు స్థిరపడిన జీవు లేమిచేసిరో కూడ తెలిపినాడు. నిజమునకు శ్రీకృష్ణు డాచరించినది, నిష్కామ కర్మమే. దాని నుపదేశించుటకు అతడే తగిన ఆచార్యుడు. కామము లేక కర్మము నిర్వర్తించుట అనునది ప్రారంభమున కష్టముగ గోచరించినను, ఆరంభించినచో క్రమముగ సుళువు దొరుకగలదు.

15

బుద్ధిమంతుడు

కిం కర్మ కి మకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః ।
తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్‌జ్ఞాత్వా మోక్ష్యసే ఽశుభాత్ ॥ 16

కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥ 17

కర్మ ణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।
స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న కర్మకృత్ ॥ 18

కర్మ మెట్టిది? అకర్మ మెట్టిది? అను విషయమున పండితులు కూడ మోహము చెందుచున్నారు. అట్టి కర్మ రహస్యమును నేను నీకిపుడు తెలుపుచున్నాను. దీనిని తెలిసి నీవు బంధము నుండి విముక్తుడవు కాగలవు అని కూడ తెలిపినాడు. చేయుట, చేయకుండుట అను విషయము చాల లోతైనది. వాస్తవికముగ ఎవ్వరును కర్మ విషయమున స్పష్టముగ వివరించి తెలియజెప్పలేరు.

కర్మ స్వరూపమును వివరించుచు శ్రీకృష్ణ డిట్లను

చున్నాడు. ‘‘చేయుటలో, చేయకుండుట యున్నది. అదెట్లనిన, సంభాషించుచు నడచుచున్నపుడు, నడచినట్లు తెలియదు. సంభాషించుచు వాహనము నడుపునపుడు, వాహనము నడుపు చున్నా నన్న భావముండదు. ప్రయాణమున సంభాషణ జరుగు చున్నపుడు, ప్రయాణము సాగినట్లే తెలియదు. ఇట్లు చేయుటలో చేయకపోవుట యున్నది.

పై ఉదాహరణమునందు ఒక రహస్యము గోచరించు చున్నది. రసవత్తరమగు సంభాషణమున, నడక - ప్రయాణము జరుగుచున్నవిగాని, చేయుచున్నట్లనిపించవు. ఇచ్చట నడక - ప్రయాణము, పరధ్యానముగ జరుగుచున్నవి. అదే విధముగా పరమును (దైవమును) స్మరించుచూ పనులు జరిపినచో తాను దైవము నందుండుట, పనులు జరుగుట యుండును. భక్తులు మహత్కార్యము లన్నియు ఇట్లే నిర్వర్తించిరి. వారు దైవమున రుచిగొని యుండగ, పనులు జరిగినవి. ఇట్లు జరిగినపుడు కర్తృత్వ భావన కూడ యుండదు. అనగా తాను చేయుచున్నానను భావన యుండదు. అతడు దైవముతో యుక్తుడగుటచే, అతని నుండి కర్మలు జరిగినవి. ‘‘యుక్తః కర్మకృత్’’ అని పలుకుటలో, నా స్మరణమున నిలిచి కర్మ లాచరింపుము. అపుడు చేయుటలో చేయని స్థితి అనుభూతమగును.

అట్లే చేయకుండుటలో చేయుట యున్నది. ఏమీ చేయకుండ కూర్చున్న వానియందు కూడ మనసు ఆలోచన చేయుచునే యుండును. అట్లు చేయకపోవుటలో చేయుట యున్నది. ఆ చేయుట మానసికము. మునుల తపస్సు యిట్లే

సాగుచుండును. వారేమియు చేయుచున్నట్లు గోచరింపదు. కాని వారి తపశ్శక్తి లోకములను కూడ చలింపచేయ గలదు. ధ్యాన యోగులు చేయక చేయుదురు. కర్మయోగులు చేయుచు చేయరు. చేయక చేసిన జ్ఞానయోగులు ఇటీవలి కాలమున శ్రీ అరవింద యోగింద్రులు, మాస్టర్ సి.వి.వి., రమణమహర్షి, రామకృష్ణ పరమహంస, షిరిడీ సాయిబాబా. చేయుచు చేయని వారు మదర్ (శ్రీమాత, పాండిచేరి), మాస్టర్ ఇ.కె., వివేకానంద స్వామి, శ్రీ సత్య సాయిబాబా.

పై రహస్యము తెలిసి యుద్ధము చేయుచు చేయనివాడుగ నీవుండుమని అర్జునునికి తెలిపెను. యుద్ధము చేయక చేయు వానిగ శ్రీకృష్ణుడు నిలచెను.

కర్మ యందుగాని, అకర్మ యందుగాని దైవము బోధించి నది యుక్త స్థితి, అనగా యోగస్థితి. దైవముతో స్మరణ మార్గమున యోజించి చేయుట ద్వారా, చేయకుండుట ద్వారా మోక్షస్థితి యందు నిలువవచ్చునని దైవము తెలిపిన రహస్యము. అట్లు చేయువాడు మనుష్యులలో బుద్ధిమంతుడు.

16

కర్తవ్యము

యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥ 19

కర్మ నిర్వహణమునందు వ్యక్తిగతమైన సంకల్పము, కోరిక యుండుట సామాన్యము. తననుండి ఆరంభము కాకయే తన వరకు కొన్ని కర్తవ్య కర్మలు వచ్చుచుండును. అవికాక తనవైన కోరికలు కొన్ని యుండును. పండితుడు అనగా తెలిసిన వాడని యర్థము. తెలిసినవాడు అనగా జ్ఞాని. అతనికి కోరికలుండవు. వ్యక్తిగతములైన సంకల్పము లుండవు. రెండునూ లేక ఆచరణయే యుండును. ఇట్టివారినే పెద్దలు పండితులుగా గుర్తింతురు.

రజోగుణ ప్రేరితునకు, తమోగుణ ప్రేరితునకు కోరికలు మెండుగ నుండును. తదనుగుణముగ సంకల్పములు వచ్చు చుండును. సత్వగుణమున నిలచిన వానికే సంకల్పములు యుండవు, కోరికలు యుండవు. కర్తవ్యములు మాత్రమే యుండును. కర్తవ్యము మాత్రమే నిర్వర్తించువానికి, కర్మ దగ్ధమగు

చుండును. కోరిక లున్నచోట ఫలాసక్తి యుండును. కర్మ ఫలానుభూతి మరల కర్మను కలిగించును. అవి సంకల్ప రూపమున జీవుని ప్రేరేపించును. సంకల్ప ప్రేరితుడై ఫలాసక్తితో మరల జీవుడు పనిచేయును. ఇట్లు కోరికనుండి ఫలాసక్తి కారణముగా కర్మ పుట్టును. కర్మ కారణముగా కర్మఫలము కలుగును. కర్మఫలము నుండి నూతన సంకల్పము పుట్టును. జీవిత మంతయు "ఇది కావలెను, యిది వద్దు" అనుకొనుచు ఎడతెరపి లేక జీవించుట యుండును. అపుడు కర్మయందు చిక్కుపడును.

కర్మమంటక, అందు చిక్కుపడక, కర్మను నిర్వర్తించుటకు ఉపాయమే ఈ శ్లోకమున తెలుపబడినది. ఈ సుళువు తెలియుటకే శ్రీరాముని జీవితము, శ్రీకృష్ణుని జీవితము పఠించి, అవగాహన చేసుకొనవలెను. అందులకే రామాయణ, భారత, భాగవతములు. ఉదాహరణకు శ్రీరాముని జీవితమును పరిశీ లింపుడు. అతడు తన కోరిక కారణముగ పుట్టలేదు. దశరథుని ప్రార్థనకు ప్రతిస్పందించి, జన్మించినాడు. వశిష్ఠునివద్ద తండ్రి ఆజ్ఞగ విద్య నేర్చినాడు. విశ్వామిత్రునితో తండ్రి ఆజ్ఞగనే చనినాడు. తాటక సంహారము విశ్వామిత్రుని యాజ్ఞ. మిథిలానగర ప్రవేశము కూడ మహర్షి ఆదేశమే. విల్లు నెక్కుపెట్టుట మహర్షి ఆదేశము. సీతా పరిణయము జనకుని ప్రార్థన. పట్టాభిషేకము తండ్రి సంకల్పము. వనవాసము ప్రత్యక్షముగా సవతి తల్లి ఆజ్ఞ. పరోక్షముగా తండ్రిమాట. దండకవన ప్రవేశము ఋషుల కోరిక. ఖరదూషణ

సంహారము రాక్షసుల ప్రేరణ. సుగ్రీవుని స్నేహము కబంధుని సూచన. రాక్షస సంహారము ఋషుల సూచన. సీతా లక్ష్మణులను రక్షించుకొనుట కర్తవ్యము. భరతుని అనుగ్రహించుట కర్తవ్యము. పట్టాభిషేకము భరతుని కోరిక. ఇట్లు జీవితమంతయు కర్తవ్యపరముగనే సాగినదిగాని వ్యక్తిగతమగు కోరిక ఒక్కటియునూ లేదు. బంగారు లేడిని గూడ సీత కోరినదేగాని, తనది కాదు.

జ్ఞానులెట్లు నడువవలెనో రాముని జీవితము సూటిగ తెలియజెప్పును. అట్టివారికి ఉన్న కర్మ దగ్ధమగును. కొత్త కర్మ పుట్టదు. దీనికి వలసిన సూత్రము కర్తవ్యాచరణము. అందు వ్యక్తిగతమగు కోరిక, సంకల్పము లేకుండుట. ఇట్లు జీవించుట అసామాన్యము. అట్లు జీవించి, యితరులకు మార్గదర్శకులై నిలచువారు ఆచార్యులు లేక సద్గురువులు లేక జ్ఞానులు. వారు జ్ఞానాగ్ని దగ్ధ కర్మలు.

17

నిత్య తృప్తి

త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించి త్కరోతి సః ॥ 20

కర్మలయందు ప్రవర్తించుచు, అవి చేయని వానివలె నుండు రహస్యము దైవ మీ శ్లోకమున బోధించుచున్నాడు.

కోరిక కర్మఫలాసక్తిని కలిగించును. దానివలన మరల సంకల్పములు పుట్టును. ఈ చక్రమునుండి బయట పడుటకు ముందు శ్లోకమున కర్తవ్యకర్మ ఎట్లు నిర్వర్తించుకొనవలెనో చెప్ప బడినది. ఈ శ్లోకమున తృప్తియను మరియొక గుణమును ఉపాసించ వలసినదిగా దైవము తెలుపుచున్నాడు.

తృప్తి యున్నచోట ఎవరిని, దేనిని ఆశించుట యుండదు. కర్తవ్యము మేర జీవించుట యుండును. దేనిని ఆశించనపుడు, ఎవరినీ ఆశ్రయింప పనిలేదు. తృప్తి కారణముగా ఆశించుట యుండదు. దాని కారణముగా ఆశ్రయించుట యుండును. కేవలము తృప్తితో నిర్వర్తించు కర్తవ్యమే తృప్తి నిచ్చును. ఇట్టివాడు

చేయు పనివలన కలుగు ఫలములయందు కూడ సంగము విడచినచో చేయకముందెట్లుండెనో, చేయుచున్నప్పుడు కూడ అట్లే యుండును. అట్టి వానిని కర్మఫలములు అంటవు. ఆగామి కర్మలు పుట్టవు. సంచిత, ప్రారబ్ధములు క్రమముగా నశించును. ఇందు మూడంశములు ముఖ్యము.

1. నిత్యతృప్తి, 2. నిరాశ్రయత, 3. కర్మఫల సంగత్యాగము.

18

అమలిన కర్మ

నిరాశీ ర్యతచిత్తాత్మా త్యక్త సర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వ న్నాప్నోతి కిల్బిషమ్ ॥ 21

ఆశ లేనివాడును, చిత్త నిర్వహణము కలవాడును, ఏ వస్తువును పరిగ్రహింపనివాడును చేయు కర్మనుండి ఎట్టి పాపము (మలినము) పుట్టదు అని యర్థము.

19వ శ్లోకమున సంకల్పము, కోరిక లేకుండుటను గూర్చి దైవము తెలిపినాడు. 20వ శ్లోకమున నిత్యతృప్తి, నిరాశ్రయత, కర్మఫలసంగ త్యాగము తెలిపినాడు. ఈ శ్లోకమున ఆశ లేకుండుట, అపరిగ్రహము, చిత్త నిగ్రహము తెలిపినాడు.

ఆశ లేనివానికి చిత్తము పలువిధముల పరుగులెత్తదు. ఆశ, కోరిక లేక తృప్తిగ జీవించువానికి, చిత్తము స్థిరపడి సంకల్పములు లేని స్థితి కూడ కలుగును. దీనికి అపరిగ్రహము తోడైనచో చిత్తము లోతుగ స్థిరపడును. ఈ శ్లోకము చేరుసరికి చిత్తమునకు ఏడు గుణము లబ్బును. అవి ఈ విధముగ నున్నవి.

1. కోరికలేమి, 2. నిస్సంకల్పము, 3. కర్మఫల సంగ త్యాగము, 4. నిత్యతృప్తి, 5. నిరాశ్రయత, 6. నిరాశ, 7. అపరిగ్రహము. ఈ ఏడు గుణము లబ్బినచో నిగ్రహింపబడిన చిత్తము గలవాడై యుండును. అట్టివాడు నిర్వర్తించు కర్మల నుండి బంధనము పుట్టదు.

19

ద్వంద్వాతీత స్థితి

యదృచ్ఛాలాభ సంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।
సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥ 22

యాదృచ్ఛికముగా లభించుదానికి సంతృప్తి చెందువాడు, మత్సరము లేనివాడు, సమబుద్ధి కలవాడు, ద్వంద్వములకు అతీతుడు నిర్వర్తించు కర్మలు అతనిని బంధింపవు.

ముందు తెలిపిన ఎనిమిది గుణములకును మరి నాలుగు గుణములను దైవము కర్మలంటని మార్గమున పేర్కొనుచున్నాడు. పై తెలిపిన నాలుగు గుణములను గూర్చి ప్రత్యేకించి వివరింప పనిలేదు. ఒక సోపాన క్రమమున దైవము కర్మమును గూర్చిన జ్ఞానము వివరించుచున్నాడు. కర్మము నిర్వర్తించుచున్ననూ, బంధనమున పడకుండుటకు అనుసరించవలసిన సూత్రములను వివరించుచున్నాడు. ఈ శ్లోకముతో ఆ సూత్రములు పండ్రెండుగా తెలియును.

అవి 1. కోరికలేమి, 2. నిస్సంకల్పము, 3. కర్మఫల సంగత్యాగము, 4. నిత్యతృప్తి, 5. నిరాశ్రయత, 6. నిరాశ, 7. అపరిగ్రహము, 8. యతచిత్తము, 9. దొరికిన దానితో సంతోషము, 10. మాత్సర్యము లేకుండుట, 11. సమబుద్ధి, 12. ద్వంద్వాతీత స్థితి.

20

శ్రీ భగవా నువాచ

గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః ।
యజ్ఞా యాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23

కర్మమును గూర్చిన 12 సూత్రములను అనుసరించుచూ యజ్ఞార్థముగ కర్మలు నిర్వర్తించు జ్ఞాని సంగము, బంధము లేక యుండును. అతని కర్మ మెప్పటికప్పుడు విలీనమైపోవు చుండును.

చేయుచున్న కర్మలనుండి మరల కర్మబంధములు పుట్ట కుండుట, చేయుట యందలి జ్ఞానముగ గుర్తించవలెను. చేయు చున్న కర్మనుండి పుట్టిన ఫలితమునందు సంగము లేకుండుట వలన బంధముండదు. సంగమున్నచోట బంధ ముండును. కర్మఫల సంగము బంధముగాని, కర్మ సంగము బంధము కాదని తెలియవలెను. శ్రీకృష్ణుడు తన జీవితమున ముందు తెలిపిన 12 కర్మ సూత్రములను పాటించి చూపిన యోగి. సర్వమూ తానై ఏమియు నంటని యోగేశ్వరు డతడు. అతడు జీవితమున తానుగా ఏదియు సంకల్పించలేదు. ఏదియును కోరలేదు, ఎవ్వరినీ ఆశ్రయించలేదు. కర్మఫలాసక్తి చూపలేదు. నిత్యతృప్తుడై

జీవించెను. ఆశ, పరిగ్రహము అనునవి కానరావు. యతచిత్తుడై ఎప్పుడునూ కర్మల నాచరించెను. నిత్యతృప్తుడై లభించినదానికి సంతసించెను. సర్వబుద్ధియై ద్వంద్వముల కతీతముగ జీవించెను. అత డంతరమున మత్సరములేదు. మహాభారత యుద్ధమంతయు అతని చేతుల మీదుగా నడచినది. సర్వము తననుండి నిర్వహింప బడి తనకేమియు నంటక నిలచిన మహాయోగి. భారత యుద్ధ మందు కర్మలంటని మరియొక యోధుడు లేడు. భీష్మ ద్రోణాదులు సహితము కర్మబద్ధులే. పాండవులునూ కర్మబద్ధులే. శ్రీకృష్ణు డొక్కడే అందరిని అధిగమించి, ఏ కర్మమూ అంటక నిలచిన విశిష్ట పురుషుడు. అతని జీవితమే మరల మరల జ్ఞానయోగ సూత్రములకు మూలమని తెలియవలెను. కనుకనే అతడు "నాకు కర్మ ఫలమునం దపేక్ష లేదు. నన్ను కర్మలంటవు" అని తెలిపినాడు.

21

బ్రహ్మ యజ్ఞము

బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ 24

సమస్తమును బ్రహ్మమే అని తెలుపు శ్లోకము ఇది. ప్రతినిత్యము పఠింపవలసిన శ్లోకము. నిర్వర్తించు సర్వమును బ్రహ్మమున కర్పణము చేయుము అని యీ శ్లోక నిర్దేశము. నిర్వర్తించుటకు వినియోగించు సర్వ శక్తులు, వనరులు, శరీరము, మేధస్సు, ధనము అంతయూ బ్రహ్మమే. వానినట్లు వినియోగించుట దినచర్యయందలి హోమము. కార్యమునందు సమర్పింపబడిన వన్నియు (అనగా వనరులు, శక్తులు మొదలగునవి) హోమ ద్రవ్యములు. సమర్పణము కర్తవ్య నిర్వహణమున గనుక అది బ్రహ్మాగ్ని. నిర్వర్తించు యజమాని బ్రహ్మ. ఎవరి కొరకు నిర్వర్తించుచున్నాడో వారునూ బ్రహ్మమే. చేయువాడు, చేయబడు పని, అందు వినియోగింపబడినవి, దాని నుండి ఫలము పొందినవారు, అంతయూ బ్రహ్మమే. బ్రహ్మమే యిన్ని రూపములుగా ఏర్పడి,

యిన్ని రకములుగా నిర్వర్తించు కొనుచున్నాడు. మొదలున్నది బ్రహ్మమే. సంకల్పము బ్రహ్మమే. కర్మనిర్వహణము బ్రహ్మమే. అది బ్రహ్మమునకే సమర్పణము. చివరకు మిగులునది బ్రహ్మము. ఇది ఒక బ్రహ్మ ఉపాసనా మార్గము. ఇట్లు భావించుచూ జీవించుటయే ఈ ఉపాసన. ఇట్టివారు సమముగా, ఇందలి సత్యమును రుచి చూడగలరు. దీనిని బ్రహ్మయజ్ఞము అందురు.

22

దైవ యజ్ఞము

దైవ మేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।
బ్రహ్మాగ్నా వపరే యజ్ఞం యజ్ఞే నైవోపజుహ్వతి ॥ 25

సర్వము దైవమే యని యజ్ఞార్థముగ జీవించుట యొక పద్ధతి. ఆచరణమంతయు దైవారాధనమే అని భావన చేయుచు, అన్నిటి యందు దైవమునే దర్శించుచు జీవించుట యిందలి ప్రధాన సూత్రము. మరికొందరు జీవుల ఆరాధన, దైవము యొక్క ఆరాధనయని, జీవులనే దైవమూర్తులుగా భావించి, వారి కొనరించు సేవ, ఆరాధనగా జీవింతురు. ఇదియును జ్ఞాన యజ్ఞమే. మొదటిది దైవయజ్ఞము. రెండవది జీవయజ్ఞము. ముందు శ్లోకము లలో తెలిపిన 12 సూత్రముల ఆధారముగా నిర్వర్తించు సమస్త కర్మము యజ్ఞమే.

23

ఇంద్రియ యజ్ఞము

శ్రోత్రాదీ నింద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వాతి ।
శబ్దాదీ న్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వాతి ॥ 26

చూచునది, వినునది, వాసన చూచునది, రుచి చూచునది, స్పృశించునది దైవమే అని భావన చేసి జీవించినచో అది ఇంద్రియ యజ్ఞము కాగలదు. దైవమునకు సమర్పణముగ ఇంద్రియార్థ ములు, యింద్రియములందు హోమము చేయబడుచున్నట్లుగా ఈ యజ్ఞము నిర్వర్తింపబడును. తత్కారణముగా, దైవము యింద్రియములద్వారా కూడ, రసోపేతముగ అనుభవింపబడును.

ఇంద్రియ నిగ్రహము :

పంచేంద్రియములు, పంచతన్మాత్రలు, పంచభూతములు, పంచప్రాణములు. ఇట్లు నాలుగు పంచారములతో కూడినది శరీరము. పంచప్రాణము లాధారముగ మిగిలిన పంచారములు పనిచేయుచు నుండును. ప్రాణ మాధారముగనే దేహ మేర్పడు చున్నది. ఇందు జీవుడు త్రిగుణాత్మకుడై జీవించు చుండును.

త్రిగుణముల కావల దైవముండును. దైవమే ప్రాణముగను, ప్రజ్ఞగను వుండును. దైవము త్రిగుణములనుండి ప్రతిబింబింపగ జీవుడేర్పడును. కావున జీవుడు త్రిగుణములకు బద్ధుడై దైవ మందించు ప్రాణ, ప్రజ్ఞ లాధారముగ తనదైన జీవితము జీవించు చుండును. తా నొకడున్నాడను భావమున జీవించు చుండును. అతడు జీవిత మనుభవించుటకు దేహమాధారమై యుండును. దేహము లేనిదే జీవు డే అనుభూతియు పొందలేడు. అట్టి దేహ మందు తన్మాత్రలు, ఇంద్రియములు త్రిగుణాత్మకుడగు జీవుని బాహ్యముతో సంబంధము కలిగించి అనుభూతుల నొసగును. ఇంద్రియములు, తన్మాత్రలు లేనిదే జీవు డే అనుభూతియు చెందలేడు. తన్మాత్ర లనగా వినుట, చూచుట, స్పర్శించుట, రుచి చూచుట, వాసన చూచుట అను ప్రజ్ఞలు. ఈ ప్రజ్ఞలు పనిచేయు టకు వాహనములుగ లేక వాహికలుగ లేక యంత్రములుగ ఐదింద్రియము లున్నవి. అవియే పై వరుసలో చెవి, కన్ను, చర్మము, నాలుక, ముక్కు ఐదు ప్రజ్ఞలున్నను, ఐదు వాహికలు లేనిచో అనుభూతి లేదు. అనగా వినుట యను ప్రజ్ఞ చెవి లేనిచో పనిచేయదు. చెవి యున్నను వినుట లేనిచో అది అలంకార ప్రాయమే. ఇట్లు ఇంద్రియములు, తన్మాత్రలు ఒకదాని నొకటి నాధారము చేసుకొని జీవుని కనుభూతి నిచ్చుచున్నవి.

అనుభూతి సుఖానుభూతి కావచ్చును, దుఃఖానుభూతి కూడ కావచ్చును. సుఖ దుఃఖములు, బాధ ఆనందములు. ఇట్టి ద్వంద్వానుభూతులు జీవునకు కలుగుచుండును. కొన్ని శబ్దములు విన్నచో ఆనందముగ నుండును. అట్లే కొన్ని శబ్దముల వలన

బాధ కలుగును. ద్వంద్వముల కతీతమైనటువంటిది భగవత్ తత్త్వము. దానిని పొందవలెనన్నచో చెవి ద్వారా విను రెండు రకముల విషయము లందును, కన్నుద్వారా చూచు రెండు రకముల విషయములు, అట్లే మిగిలిన యింద్రియముల ద్వారా పొందు ద్వంద్వముల యందు దైవమును చూచుట ఒక యజ్ఞము.

ఇంద్రియములద్వారా, ఇంద్రియార్థముల నుండి పొందు అనుభూతిని దైవముగ చూచినప్పుడు సంయమము దక్కును. అట్లు దక్కుటవలన విషయముల యందలి ద్వంద్వములు హోమము చేయబడి దైవము నిలచును. ఇంద్రియములను, శబ్దాది విషయములను హోమము చేయుట యనగా నిదియే. దైవమునకు సమర్పణ చెంది ఇంద్రియముల నుండి పొందు అనుభూతిని దైవ సంకల్పముగ స్వీకరించుట యొక యజ్ఞము. అంతియేగాని ముక్కు, చెవి, కనుగుడ్లు పెరకి హోమము చేయుట కాదు. ఇంద్రియ నిగ్రహము కూడ దైవమును ఇంద్రియముల ద్వారా గ్రహించునప్పుడే కలుగును కాని, నిగ్రహించుటకు పాషాండ ప్రవర్తనములు పనికి రావు. పాషండ మార్గమున ప్రయత్నించు నిగ్రహములు రజోగుణ ప్రేరితములు.

24

మనో యజ్ఞము

సర్వా ణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।
ఆత్మసంయమ యోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥ 27

మనో నిగ్రహము :

దైవము బ్రహ్మయజ్ఞము, దైవయజ్ఞము, ఇంద్రియ యజ్ఞములను ముందు శ్లోకములయందు తెలిపి, ఇపుడు మనో యజ్ఞమును తెలుపుచున్నాడు. అన్నిటికిని మూలసూత్రము నొక్కటియే. సమస్తమును దైవముగ చూచుటయే మూల సూత్రము. దైవమును బ్రహ్మము అనికూడ పిలుతురు. బ్రహ్మమునకు సమర్పణముగ సర్వమును అనుభవింపుము. దేవతలు కూడ బ్రహ్మము యొక్క రూపములే గనుక వారియందు బ్రహ్మమును చూచుట దైవయజ్ఞ మగును. అట్లే యింద్రియార్థముల నుండి ఇంద్రియార్థములను అనుభవించునపుడు, ఆ అనుభవము ఏవిధమైన దైనను దైవముగనే చూచుట యింద్రియ యజ్ఞము. అపుడే యింద్రియములు నిగ్రహింపబడును.

మనో నిగ్రహమునకు కూడ ఇదియే సూత్రము భగవానుడు తెలుపుచున్నాడు. మనస్సు పరిపరి విధములుగ పోవుచుండును. షడ్వికారములకు గురియగు చుండును. తదనుగుణమైన అనుభూతిని పొందుచుండును. అట్టి మనస్సు సుఖదుఃఖాది ద్వంద్వముల యందు కొట్టుమిట్టాడు చుండును. అట్టివాని కే శాంతియు వుండదు. ఇది మానవుని ప్రధానమగు సమస్య. ఈ సమస్యకు కూడ పరిష్కార మొక్కటే, తనకు కలుగు భావముల యందు బ్రహ్మము లేక దైవమును చూచుట. భావమున దైవమును చూచుట ఒక అభ్యాసము. ఈ అభ్యాసము సిద్ధించి నచో షడ్వికార భావములు నశించి మనిషి స్థిరమతి యగును. షడ్వికార భావములు నశించుటనే వానిని సంయమ మను అగ్ని యందు ఆహుతి చేయుటగా తెలియవలెను.

మనోనిగ్రహము పేర ఎన్ని ఇతర సాధనలు చేసినను మనస్సు నిగ్రహింపబడదు. భావమునందు దైవమును చూచుట వలన సులభముగ నిగ్రహింపబడును. "భావముల యందు దైవమును చూడుము. బాహ్యము నందు యింద్రియముల ద్వారా దైవమునే చూడుము." ఇది భగవద్గీత బోధించు యజ్ఞము.

ఆత్మ సంయమ మను యోగాగ్నిగ పై అభ్యాసము తెలుప బడినది. పరిపూర్ణ యోగులు ఈ మార్గమునే బోధింతురు. నిగ్రహము పేరున హింసా మార్గములను బోధింపరు.

25

చతుర్యజ్ఞములు

ద్రవ్యయజ్ఞా స్తపోయజ్ఞా యోగయజ్ఞా స్తథాఽపరే ।
స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశ్రితవ్రతాః ॥28

ముందు శ్లోకముల యందు నాలుగు యజ్ఞములు తెలుపబడినవి. అవి వరుసగ బ్రహ్మ యజ్ఞము, దేవ యజ్ఞము, ఇంద్రియ యజ్ఞము, మనో యజ్ఞము. ఇపుడీ శ్లోకమున మరి నాలుగు యజ్ఞములు తెలుపబడినవి. అవి వరుసగా ద్రవ్య యజ్ఞము, తపో యజ్ఞము, యోగ యజ్ఞము, స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞము.

ఈ నాలుగు యజ్ఞములు దృఢవ్రతములుగ ప్రయత్నించు వారు కూడ దివ్యానుభూతిని పొందగలరు.

1. ద్రవ్య యజ్ఞము :

తనకున్న సమస్త ఒనరులను సమర్పణ బుద్ధితో సద్విషయములకు వినియోగించుట ఒక మహత్తర యజ్ఞము. బలి, శిబి యిత్యాది మహాత్ములు ఈ యజ్ఞము ద్వారా దైవానుగ్రహ పాత్రులై, శాశ్వతులైరి.

2. తపో యజ్ఞము :

తపస్సు ఎందరినో దైవానుగ్రహ పాత్రు లను గావించినది. తపస్సు మూడు భాగములుగ నున్నది. శారీరక తపస్సు, వాఙ్మయ తపస్సు, మనోమయ తపస్సు. ఈ సోపానముల ద్వారా మనస్సును దైవమున కర్పించి, స్థిరముగ చేయు తపస్సు వలన దైవ మను గ్రహించును. విశ్వామిత్ర మహర్షి తపస్సునకు పెట్టినది పేరు. ఆ మహర్షి చేసిన తపస్సు అనుపమానము. ఆయన యందు బ్రహ్మమును గూర్చిన తపనయే నిరుపమానమగు తపస్సుగ నడచినది. దైవమును గూర్చి తపన లేనిచో తపస్సు కుదరదు. తపన యున్నవానికి దైవముచే పొందబడుటయే ప్రధానమగు కర్తవ్యమై, యితర వ్యాపారములను మాని రహస్య ప్రదేశమున తపస్సు చేయును. కలియుగమున మానవులకు ఇది దుష్కర విషయము.

గౌతమబుద్ధు డీ మార్గముననే కలియుగమున సిద్ధి పొందెను.

3. యోగ యజ్ఞము :

యోగమనగా అష్టాంగ యోగమే. ఇది సమగ్రముగ ఏడు సోపానములతో కూడిన మార్గమిది. ఎనిమిదవది సిద్ధి. దానిని సమాధి అందురు. కలియుగమున అష్టాంగ యోగము నకు జగద్గురువు మైత్రేయులు అధిపతిగ నున్నారు. పరమగురువు లందించు మార్గము అష్టాంగ యోగమే. ఇందు యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము,

ధారణ, ధ్యానము ఏడు సోపానములుగ నున్నవి. దీక్షతో క్రమముగ ఈ ఏడింటిని అధిగమించుట సక్రమమగు మార్గము. ఈ మార్గము సక్రమము కానిచో యోగము సిద్ధించదు. ఇది యొక యజ్ఞము.

4. స్వాధ్యాయము :

స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞము కూడ దైవ సన్నిధికి చేర్చగలదు. వేదములు, శాస్త్రములు, పురాణములు, ఇతిహాసములు ఇత్యాది వాఙ్మయమున రుచి కలిగి వాని నధ్యయనము చేసి, వాని యందలి అంతరార్థములను గ్రహించి, (గ్రహింపలేకున్నచో సద్గురువులను సేవించి, పూజించి, వారి అనుగ్రహముగ జ్ఞానము నుపదేశముగ పొంది) అందు అనుష్ఠానపరమైన విషయములను ఆచరణ మార్గమున కొనివచ్చి తాదాత్మ్యము చెందుట వలన, అజ్ఞానము తొలగి జ్ఞానము నిలచును. ఈ విధముగ కూడ దైవ సాన్నిధ్యము చేరవచ్చును.

26

ప్రాణాయామ యజ్ఞము

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాఽపరే।
ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామ పరాయణాః ॥ 29

అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।
సర్వేఽప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపిత కల్మషాః ॥ 30

ప్రాణాయామ యజ్ఞమును దైవమిచ్చుట బోధించుచున్నాడు. అర్హతలేని ప్రాణాయామ యజ్ఞము అనర్థములకు దారితీయును. అష్టాంగ యోగమున ప్రాణాయామము నాలుగవ అంగము. అహింస, సత్యము, బ్రహ్మచర్యము, ఇతరుల సంపదను తెలివితో దొంగిలించ కుండుట, ఉచితముగ ఇతరుల వద్ద బహుమానములను, ఉపకారములను పొందకుండుట అనునవి ఐదు నియమములు. బాహ్యమునను, అంతరమునను శుచిగా నుండుట అనునవి మరి రెండు నియమములు. ఈ ఏడు నియమములను శ్రద్ధతో దీర్ఘకాలము ఆచరించినవారే సహజమగు సంతోషము గలవారై యుందురు. ఇట్టివారికి సంతోషముగ

నుండుటకు కారణ మక్కరలేదు. ఇట్టి మనస్సు కలవారు పై తెలిపిన ఏడు నియమములను పాటించి, సంతోషమును చేరుట ఎనిమిదవ మెట్టు. అట్టి వారు చేయవలసి నది శాస్త్రాధ్యయనము. పై నియమములను పాటింపని వారు శాస్త్రములను అధ్యయనము చేసినచో మిడిమిడి జ్ఞాను లగుదురు. తెలిసీ తెలియని మూర్ఖులగుదురు. వీరికి అభివృద్ధి కుంటుపడును. వీరి ననుసరించినవారి అభివృద్ధి కూడ కుంటుపడును.

భారతీయ సంప్రదాయమున అధ్యయనమునకు పై అర్హతలు తప్పనిసరి. పై నియమములను పాటించినవారి మేథస్సు, శాస్త్రములను సరిగ నవగాహన చేసుకొనగలదు. అందులకే చదివిన వారందరు పండితులు కారు. చదువులు వేరు, విద్యలు వేరు. పై నియమములను పాటించు వారికి శాస్త్రాధ్యయనము, సమస్తము నందును ఈశ్వరుని దర్శనము చేయు ప్రయత్నమును రెండు నియమములుగ అష్టాంగ యోగము తెలుపుచున్నది. ఇట్టి వారికే స్థిరము, సుఖము అగు మనస్సు ఏర్పడునని పతంజలి మహర్షి పేర్కొనినాడు.

అదే విషయమును దైవము భగవద్గీత యందు ప్రాణాయామమునకు ముందు తెలిపిన యజ్ఞములలో పేర్కొనినాడు. ద్రవ్య యజ్ఞము, ఇంద్రియ యజ్ఞము, మనో యజ్ఞము, బ్రహ్మ యజ్ఞము- పై తెలిపిన నియమములకు సంబంధించిన యజ్ఞములే. ఎనిమిది యజ్ఞములు తెలిపిన భగవానుడు, తొమ్మిదవ యజ్ఞముగ ప్రాణాయామము తెలుపుచున్నాడు. అట్లే పతంజలి మహర్షి కూడ మూడు అంగములలో పదకొండు నియమములను

అందించెను. వానిని పాటించిన వారికే ప్రాణాయామము అని తెలిపెను.

ప్రాణాయామము రాజయోగ మార్గమున జరుగునదే కాని చేయునది కాదు. ఈ హెచ్చరికను పాఠకులు గుర్తించి తరువాత అంశమును పఠించవలెను.

ప్రాణాయామ మనగా ప్రాణము యమింపబడుట. ప్రాణము యమింపబడుటకు శ్వాస నిబద్ధము కావలెను. శ్వాస నిబద్ధమగుటకు క్రమబద్ధముగ శ్వాసను పీల్చుట, వదలుట చేయ వలెను. శ్వాసను క్రమబద్ధముగ నిర్వర్తించుటకు మనసును శ్వాసపై లగ్నము చేయవలెను. ఉచ్ఛ్వాసతోపాటు మనసు అంతర్ముఖముగ పయనించి ఉచ్ఛ్వాస కొసకు చేరవలెను. ఉచ్ఛ్వాసకొసన నిశ్వాస ప్రారంభమగును. నిశ్వాసను మరల అనుస రించుచు మనసు నిశ్వాస కొసను చేరవలెను. మనసు శ్వాసతో లగ్నమై యుండునట్లు పై విధముగ నభ్యాసము చేయవలెను.

ఈ అభ్యాసము సిద్ధించినచో మనసు పరిపరి విధముల పోక శ్వాసకు కట్టుబడి యుండును. ఇట్లు అనేకానేక భావముల నుండి మనసు ఏక భావమునకు చేరును. అపుడు మనసు భావముకూడ శ్వాసను గూర్చియే యుండును. ఉచ్ఛ్వాసతో అంతర్ముఖ మగుట, నిశ్వాసతో బహిర్ముఖమగుట జరుగుచున్న సందర్భములో మనసుయొక్క సహజ లక్షణమైన కుతూహలము ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఎట్లు జరుగుచున్నవో గమనించును. తాను చేయక తనయందు అవి జరుగుచున్నట్లుగ గుర్తించును. అనగా

తన ప్రజ్ఞను మించిన ప్రజ్ఞ యేదియో తనయందీ శ్వాస యజ్ఞమును నిర్వర్తించుచున్నట్లు తెలియును. తనయందు తనకు తెలియని ప్రజ్ఞ యొకటి యున్నదని తెలియును. అది తనకు మించిన ప్రజ్ఞయని తెలియును. తానుగ చేయకున్నను, తన యందు జరుగు శ్వాస, జరుగుట అను మరియొక స్థితిని తెలియచేయును. తాను చేయువాడు, తనయందు జరుపువాడుగ మరియొక ప్రజ్ఞ తనయందు గోచరించును. ఈ చేయుటకు ఆ జరుగుట ఆధారమని కూడ తెలియును. జరుగుట, చేయుట యొక్క వ్యత్యాసములు తెలియును. పనులు జరుగునని తెలియును. చేయుట జరుగుటలో భాగమని తెలియును. ప్రవాహముపైన వస్తువులు తేలుచు వేగముగ కదలుచున్నను అది వస్తువుల కదలిక కాదు కదా! ప్రవాహ వేగమే పైన తేలు వస్తువుల వేగము. అట్లే శరీర ప్రయాణ వేగమునకు, మనో ప్రయాణ వేగమునకు శ్వాసయే ఆధారమని తెలియును. శ్వాస ప్రవాహమున మనసు లగ్నమగును.

శ్వాస నెమ్మదించినచో మనసు నెమ్మదించును. మనసు నెమ్మదించినచో శ్వాస నెమ్మదించును. కావున మనసు నెమ్మదించ వలెనన్నచో శ్వాసను నెమ్మదిగ నిర్వర్తించవలెను. మనసు వేగముగ పనిచేయు వారియందు శ్వాస కూడ వేగముగ పనిచేయుచు నుండును. అట్టివారి శ్వాస బుసలు కొట్టుచున్నట్లుగ యుండును. ఇది రజోగుణ పూరితమైన శ్వాస. మనసు లగ్నము చేసి శ్వాసను నెమ్మదిగ పీల్చుట అభ్యాసమున రెండవ మెట్టు. ఎంత నెమ్మదిగ శ్వాసను పీల్చిన మనసు అంత నెమ్మదించును. పీల్చినంత నెమ్మది

గనే వదలుట కూడ చేయవలెను. పీల్చుట, వదలుట నెమ్మది యగుకొలది మనసు నిదాన మగుచుండును. నిదాన మగుచున్న మనసునకు ప్రశాంతత రుచి తెలియును. ఈ ప్రశాంతత రుచిగొనిన మనసు మరింత ప్రశాంతతకై మరింత నెమ్మదిగ పీల్చుట, వదలుట చేయును. ఈ అభ్యాసమున మనోశాంతి అనునది యిట్లు అప్రయత్నముగ లభించును.

మనోశాంతియే ధ్యేయముగ ప్రస్తుతకాలమున ధ్యాన ములు బోధింపబడుచున్నవి. వాస్తవమునకు మనోశాంతి నిజమగు ధ్యానమునకు ఆరంభము. ధ్యేయము కాదు, అంతము కాదు. మనోశాంతి ఆధారముగ ప్రాణాయామ యజ్ఞము ఆరంభమై ప్రత్యాహార, ధారణ స్థితులను దాటి ప్రజ్ఞ ధ్యానమును చేరును. అందులకే భగవానుని బోధ ధ్యానమును గూర్చి తరువాత అధ్యాయమైన ఆరవ అధ్యాయమున వున్నది. నాలుగవ అధ్యాయ మగు జ్ఞాన యోగమున- యోగమున నాలుగవ అంగమైన ప్రాణా యామమును బోధించుట పతంజలి యోగశాస్త్రమునకు, భగవద్గీతకు గల సమన్వయము.

ప్రశాంతతో కూడిన మనస్సు శ్వాసను నెమ్మదిగ పీల్చుటతో పాటు పూర్ణముగ పీల్చుట చేయును. శ్వాసనెంత పూర్ణముగ పీల్చినచో అంత పూర్ణముగ వదలుట జరుగును. పూర్ణముగ పీల్చుట వలన ప్రాణావాయువు దేహమున పూర్ణముగ నిండును. పూర్ణముగ వదలుట వలన అపాన వాయువు పూర్ణముగ బయలు వెడలును. అపానము పూర్ణముగ బయలు వెడలినచో దేహ మందలి మలినములు బైటకు నెట్టబడును. మలినములు

నెట్టబడుట, ప్రాణము పీల్చబడుట కారణముగ ఈ అభ్యాసమున దొరకు రెండవ బహుమతి ప్రాణశక్తి. క్రమముగ దేహము ఆరోగ్య వంతమగుటకు క్రొత్తగా కొనివచ్చిన ప్రాణము సహకరించును. ప్రాణశక్తి పెరుగుట, మలినములు తొలగుట అనునది నిరంతరము జరుగు ప్రాణాయామము అభ్యాసమున మరియొక భాగము.

ప్రాణమును అనేక విధములుగ దేహము అందుకొను చుండును. ఆహారము అందులో ఒక భాగము.

మనసును లగ్నము చేసి శ్వాసను నెమ్మదిగ పీల్చుట, వదలుట, పూర్ణముగ పీల్చుట, వదలుట కారణముగ శ్వాస క్రమ బద్ధము చెందుట జరుగును. మనసు ప్రశాంతత చెందు చుండును. ప్రాణశక్తి పెరుగుచు నుండును. ఉచ్ఛ్వాస నుండి పొందు ప్రాణవాయువు వలసిన ప్రాణశక్తిని దేహమున కిచ్చు చుండును. అట్టివారు నియతాహారు లగుదురు. అనగా సహజ ముగ వారి ఆహారము నియమింపబడును. ఇదియొక సిద్ధి. వీరు ఆహారమును అల్పముగనే స్వీకరించినను శక్తివంతులై యుందురు, సులభముగ అలసట చెందరు. దేహము తేలిక పడుచు పలుచనై కాంతివంత మగుచుండును. దేహమున శుభమగు మార్పులు ఈ విధముగ శ్వాస నభ్యసించుటవలన వచ్చును. శ్వాస నుండి వలసిన ప్రాణశక్తి లభించుటచే ఆహారము నందు నియమము సహజముగ ఏర్పడును.

ఆహారము తగ్గుట జరుగునే కాని చేయుటగ నుండదు. తగ్గించుట చేయువారు అకస్మాత్తుగ ఎక్కువ తినుచుందురు.

ఎక్కువ తినుట, తక్కువ తినుట వలన దేహమునకు అవ్యవస్థత కలిగించును. ఈ అవస్థకు గురియగు దేహము, అస్వస్థతకు కారణ మగును. ఉపవాసములు చేయువారు, ఎక్కువగను, తక్కువగను తినువారు యోగమున కనర్హులు. యోగజీవనము నిర్మల సెలయేరువలె ప్రవహించవలెనే కాని వరదవలె కాదు. పై కారణముగనే భగవద్గీత యందు నియతాహార విషయము 30వ శ్లోకమున తెలుపబడెను. 29వ శ్లోకమున ప్రాణమును గూర్చిన సాధన తెలుపబడినది.

పై తెలిపిన విధముగ శ్వాస నభ్యసించుచున్న కొలది దేహతత్వము మారుచుండును. దేహధాతువుల యందలి తమస్సు క్రమముగ తొలగును. తమస్సు తొలగినకొలది బద్ధకము, నిద్ర వదలును. ధాతువులు తేలిక యగుచున్నకొలది, తేలిక యగు ఆహారమే దేహము స్వీకరించును. బరువగు ఆహారమును నిర్జించును. ఇది అంతయు సహజముగ జరుగును. దేహమునకు హింసగ జరుగదు. యోగమున మాంసాహారులు శాకాహారు లగుట. శాకాహారులు దుంపలు ఇత్యాది బరువైన ఆహారమునకు బదులు కూరలు, ఆకు కూరలు మొదలగు ఆహారమునకు మ్రొగ్గుట, పప్పుదినుసులు తగ్గించుట, ద్రవాహారము పెరుగుట సహజముగ జరుగును. ఉప్పు, కారములు కూడ తగ్గును. మసాలా దినుసుల ప్రసక్తియే యుండదు. పండ్లు, పండ్లరసము, నీరు ఆహారమున ఎక్కువభాగ మగును. ఇట్లు సహజముగనే దేహ ధాతువుల యందు కలిగిన మార్పువలన ఆహారమందు మార్పులు కలుగును. అపుడు శ్వాస అభ్యాసము మరింత చురుకుగ సాగును.

మనసు లగ్నము చేసి శ్వాసను నెమ్మదిగను, పూర్ణముగను పీల్చుట, వదలుట వలన మనసు ప్రశాంతత చెందుట, ప్రాణశక్తి పెంపొంది స్వస్థత చేకూరుట, ప్రాణము పూర్ణమై అస్వస్థతను దరిచేరనీయకుండుట, తత్కారణముగ ఆయుర్దాయము పెరుగుట, శరీర ధాతువులయందు చక్కని మార్పు జరిగి ఆహారము నియత మగుట జరుగునని తెలుపబడినది.

శ్వాసను నెమ్మదిగను, పూర్ణముగను పీల్చుట, వదలుట ప్రతి శ్వాస యందు నిర్వర్తింపబడుట మూడవ నియమము. నెమ్మదిగను, పూర్ణముగను పీల్చుట, వదలుట మొదటి రెండు నియమములు. మూడవ నియమము ప్రకారము ప్రతి శ్వాస దాని నెమ్మదితనము నందును, దీర్ఘత్వము నందును, పూర్ణత్వము నందును ఒకే విధముగ నుండవలెను. మొదటి శ్వాస ఎంత శ్రద్ధగ నిర్వర్తింపబడుచున్నదో, చివరి శ్వాసకూడ అంతే శ్రద్ధగ, అంతే నెమ్మదిగ, దీర్ఘముగ, పూర్ణముగ నిర్వర్తింపబడవలెను. ఈ మూడవ నియమముననే శ్వాస క్రమబద్ధమగును. క్రతుబద్ధ మగును. సృష్టియందలి క్రమమే క్రతువు. ఆ క్రమము ననుస రించియే ఋషులు క్రతువులను దర్శించిరి. క్రతువు లన్నియు కాలబద్ధమై యుండును. కాలమే సృష్టియందు గల క్రమము. అవరోహణము, ఆరోహణము కాలము వలననే జరుగుచున్నది. సృష్టి యందు కాలమే దైవము. కావున కాలము ననుసరించుచు చేయు శ్వాస క్రతుబద్ధము కాగలదు.

జీవితము క్రతుబద్ధము కావలెనన్నను, క్రమబద్ధము కావలెనన్నను కాలమును గౌరవించుట నేర్చుకొనవలెను. కాలము

ననుసరించుట నేర్చుకొనవలెను. ప్రాణాయామ యజ్ఞమున పై తెలిపిన విధముగ శ్వాసను క్రమబద్ధము చేయుట యనగా ఒక శ్వాసకు ఎంతకాలము పట్టునో తరువాత శ్వాసలకు కూడ అంతే కాలము పట్టవలెను. ఇది నాలుగవ నియమము.

ప్రతిదినము సాధకుని సౌకర్యమును బట్టి ఒకే కాలమున ప్రాణాయామ హోమమును నిర్వర్తించుట ఐదవ నియమము. అనగా ప్రతిదినము అదే సమయమునకు నిర్వర్తించుకొనవలెను. శ్వాసల సంఖ్య క్రమముగ పెంచుకొనవచ్చును. ప్రతి మూడు శ్వాసలు ఒక విభాగముగ (యూనిట్) భావించుచు పెంచుకొనవలెను. ఇట్లు తొమ్మిది విభాగములుగ ఇరువది ఏడు శ్వాసలు నిర్వర్తించుకొనుట ఒక శ్వాస విభాగముగ గుర్తించవలెను. క్రమముగ దీనిని మూడు రెట్లు పెంచుకొనవచ్చును. అనగా ఒకసారి శ్వాస ప్రక్రియను ప్రారంభించినప్పుడు కనీసము 3 × 9 = 27 శ్వాసలు నిర్వర్తించుకొనవలెను. అట్లు 27 × 3 = 81 శ్వాసల వరకును నిర్వర్తించుకొనవచ్చును. ఇచ్చట కాలమునకు శ్వాసలే కొలతగాని గడియారము కాదు.

ప్రాణాయామ పరాయణులు, ముందు తెలిపిన శ్వాస యజ్ఞమును దినమునకు మూడుసార్లు నిర్వర్తించుకొందురు. అట్టివారిని గూర్చి భగవానుడు 29వ శ్లోకమున తెలుపుచున్నాడు.

ముందు తెలిపిన నియమము లన్నియు శ్రద్ధతో పాటించు వారికి ఆహార వ్యవహారాదులు నియతమగును. ఆహార విషయమున ఎంత పవిత్రత ఏర్పడునో విహార విషయముల యందు

కూడ అంతే పవిత్రత ఏర్పడును. వీరి జీవితము ప్రపంచమున సాగు చున్నప్పటికిని, అందు మమేకమై యుండక, మైకములేక జీవింతురు. అవసరము లేనిచో కదలరు. దేహమును కదలింపరు. అవసరము లేనిచో మాట్లాడరు. అవసరము లేనివి చూడరు, వినరు, స్పృశింపరు. ఇట్టివారికి అన్నమయ కోశము, ప్రాణమయ కోశము, మనోమయ కోశములతోపాటు, పంచేంద్రియములు, పంచతన్మాత్రలు, పంచభూతములతో కూడిన లింగశరీరము కూడ పవిత్రమై పారదర్శకముగ నుండును. పై తెలిపిన నియమము లన్నియు యమునిచే నచికేతునకు తెలుపబడినట్లుగ కఠోపనిషత్ నందు తెలుపుదురు.

పై విధముగ మూడు శ్వాసలు యొక విభాగముగ నిర్వర్తించు చున్నప్పుడు, కొంత తడవు పీల్చ నవసర మనిపించదు. అట్లే కొంత తడవు పీల్చిన శ్వాసను వదలవలె ననిపించదు. ఇట్లు సహజముగ జరుగును. ఇట్లు చేయుట హఠయోగము. ఇట్లు జరుగుట రాజయోగము. ఇట్లు జరుగుటకు చాలాకాలము పట్ట వచ్చును. త్వరితగతిని జరుగవచ్చును. అది సాధకుని పూర్వ సంస్కారమును బట్టి, శ్రద్ధనుబట్టి జరుగును. ఇట్లు ప్రాణము పీల్చబడి- వదలబడకుండుట, వదలబడి- పీల్చబడకుండుట ప్రాణాయామ పరాయణులకు జరుగును. శ్వాస పీల్చబడి వదల బడకుండుటను 'పూరకము' అందురు. శ్వాస వదలబడి పీల్చబడ కుండుట 'రేచకము' అందురు. రెండు స్థితుల యందు కలిగిన విరామమును 'కుంభకము' అందురు. ప్రాణాయామ పరాయణు లకు ఈ కుంభకము సిద్ధించును. పీల్చబడిన ప్రాణము అపానమై

మలుపు తిరుగు సమయమున ఏర్పడిన విరామము అపానమున ప్రాణము హోమము చేయబడినదిగ చెప్పబడు చున్నది. అదే విధముగ వదలబడిన అపాన వాయువు ప్రాణవాయువుగ మలుపు తిరుగు సందర్భమున ఏర్పడిన విరామము, అపానము ప్రాణము నందు హోమము చేయబడు చున్నట్లుగ చెప్పబడినది. "ప్రాణా యామ తత్పరులగు వారు అపాన వాయువు నందు ప్రాణ వాయువును, ప్రాణవాయువు నందు అపాన వాయువును హోమము చేయుచున్నారు. తత్కారణముగ ప్రాణాపానగతి నిరోధింపబడు చున్నది." అని భగవద్గీత శ్లోక అర్థము. (4-29)

అట్లే పై తెలిపిన ప్రాణాయామ పరాయణులు ఆహార వ్యవహారములను కూడ పై తెలిపిన హోమము ద్వారా నియ మించుకొనుచు పవిత్రులై, పాపము నశించినవారై వెలుగొందు చున్నారు. అనునది రెండవ శ్లోక అర్థము. (4-30)

పై తెలిపిన విధముగ ప్రాణాయామ హోమము జరుగు చుండగ ఏర్పడిన విరామముల సమయము పెరుగును. విరామ ముల యందు హృదయమున ప్రజ్ఞకు గోచరించునది స్పంద నాత్మక చైతన్యము. ఈ చైతన్యమున ప్రవేశించినపుడు మనసు శ్వాస యొక దాని యందొకటి కరిగి రెండునూ లేని స్థితి యుండును. సాధకుడు తాను స్పందనాత్మక చైతన్యుడనని తెలియును. ఆ సమయమున బాహ్యస్మృతి యుండదు. అంతః స్మృతి యుండును. ఆ స్మృతి కారణముగనే, తాను స్పందనాత్మ కుడ నని తెలియును. స్పందనము చేయు శబ్దము తనకు సూక్ష్మముగ వినపడుచుండును. స్పందనము ద్వంద్వ చేష్ట.

అందువలన ద్వంద్వ శబ్దము వినబడును. అంతర్ముఖుడైన సాధకుడు ద్వంద్వ శబ్దమును వినుచు ద్వంద్వ చేష్టయందు లగ్నమై యుండును. ఈ ద్వంద్వ శబ్దమే 'సోఽహం'. దాని ద్వంద్వ చేష్టయే ప్రజ్ఞ స్పందనముగ విచ్చుకొనుట, ముడుచుకొనుట. దీనిని పెద్దలు హంసతో పోల్చిరి. గరుడ పక్షితో పోల్చిరి. పావురముతో కూడ పోల్చిరి. విచ్చు కొనుట, ముడుచుకొనుట యనునది ఆధారముగ తా నున్నాడని సాధకునకు తెలియును.

తా ననగ తనయందు జరుగు స్పందనమే అని తెలియును. స్పందనము నుండే అనగా తననుండే మనసు, శ్వాస రెండు ప్రవాహములుగ నేర్పడి దేహ మేర్పడినదని తెలియును. దేహము తన నివాసమేకాని, తాను కాదనియు తెలియును. నివాస పరిణామము నివసించువాని పరిణామము కన్న చాల పెద్దది. ప్రతి జీవియు అతని శరీరమున అతని బొటన వ్రేలంత మాత్రమే యుండును. బొటన వ్రేలికి, శరీరమునకు గల వ్యత్యాసమే నివాసమునకు, నివాసికి కూడ కలదు. తాను నివసించు దేహము తనకొక వసతియేగాని, బంధము కాదని తెలియును. వసతి గృహము నుండి బయటకు, లోనికి ఎట్లు రాకపోకలు చేయ వచ్చునో అట్లే దేహము నుండి తాను రాకపోకలు చేయవచ్చును అని తెలియును. తాను 'హంస స్వరూపు'డని లేక 'పక్షి' యని, ద్వంద్వ శబ్దము తన రెక్కలని, తన శరీరము అస్థికలతో కూడిన పంజరమని, పంజరమున బంధింపబడి నుండనవసరము లేదని తెలియును.

పై తెలియుట లన్నియు యింకను సిద్ధించుట కాదు. ఈ తెలియుట ప్రాణాయామ యజ్ఞమున ఒక శుభ పరిణామము. దీని వలన ఒక నూతన వికాసము, నూతనమైన రుచి సాధకునకు కలిగి ప్రాణాయామ హోమమునకు మరింత ఉద్యుక్తుడు కాగలడు.

ప్రణవము ప్రాణమై, ప్రాణము స్పందనమై పంచ ప్రాణములుగ నేర్పడి దేహమును నిర్వర్తించుచు నుండును. ఈ పంచప్రాణములు ముఖ్యప్రాణములు. వీని ననుసరించి మరి ఐదు చిల్లర ప్రాణములు వున్నవి. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అనునవి పంచప్రాణములు. ఇవి ఆధారముగనే జీవుడు దేహము నందుండును. పంచప్రాణములు సరిగ దేహమునందు పనిచేయుచున్నప్పుడు జీవుడు దేహమున స్వస్థత చెంది యుండును. వీని సామ్యమును జీవుడు తన ప్రవర్తన ద్వారా నిలుపుకొనవలెనే గాని చెదరగొట్టుకొనకూడదు. కావుననే జీవుని ప్రవర్తనమునకు, అతని స్వస్థత లేక అస్వస్థతకు సంబంధ మున్నది. ప్రాణము బలముగ నున్నచో మనసునకు బలము కలుగును. ప్రాణము బలముగ లేనిచో మనసు బలహీనపడి ప్రాణమును మరింత బలహీన పరచును. మనసు దుర్బలత ప్రాణమునకు సహితము హాని కలిగించ కలదని తెలియవలెను. “క్షుద్రం హృదయ దౌర్బల్యమ్” అని భగవద్గీత తెలుపుచున్నది.

పంచప్రాణములు దేహమున ఈ క్రింది భాగములలో పనిచేయుచున్నవి.

1. ప్రాణవాయువు :

ఇది శ్వాస ద్వారా పీల్చబడుచున్నది. ముక్కుపుటముల నుండి ఉదర వితానము క్రింది భాగము వరకు ఈ వాయువు పనిచేయు చుండును. కావున కనుబొమల నుండి ఉదర వితానము వరకు గల శరీర భాగములు, వాని స్వస్థత ఈ వాయువు బలమునకు సంబంధించి యున్నవి. ప్రాణవాయువు బలముగ స్వీకరింపబడుచున్నచో ఈ శరీర భాగమంతయు ప్రాణబలముతో కూడిన అస్వస్థతను దరిచేరనీయదు. ప్రాణవాయువు ముక్కు పుటముల నుండి భ్రూమధ్యము వరకు ప్రవేశించి, అచటి నుండి వాయునాళము ద్వారా ఉపిరితిత్తుల వరకు వ్యాపించి యుండును. ప్రాణవాయువును పూర్ణముగ పీల్చుట చాల ముఖ్యము. సామాన్య ముగ జీవులు వారు పీల్చగలిగిన శక్తిలో నాలుగవ వంతు మాత్రమే పీల్చుదురని పరిశోధనలు తెలుపుచున్నవి. పరిపూర్ణముగ శ్వాసను పీల్చుట వలన ఎన్నియో రోగముల నరికట్టవచ్చును. సత్సాధకుడు శ్వాసావయవముల నన్నింటిని పరిశుభ్రముగను, ఆరోగ్యముగను ఉంచుకొనుటకు జాగరూకత వహించి యుండవలెను. అనగా ముక్కు, గొంతు, శ్వాసనాళము, ఊపిరితిత్తులు. వీటియందు తరచు జలుబు చేయుట, దగ్గు వచ్చుట ఇత్యాదివి కలుగకుండ శ్రద్ధ వహించవలెను. మూలసూత్రము- 'బాగుగ గాలి పీల్చుటయే.'

2. అపాన వాయువు :

అపానవాయువు శరీరము నుండి ముక్కుపుటముల ద్వారా వదలబడు వాయువు. ఇది దేహము నందు ఉదర వితానము క్రింది భాగము నుండి భుజము వరకు పనిచేయుచు నుండును.

ఈ వాయు శక్తే ఈ శరీర భాగమును పటిష్టముగ నుంచగలదు. శరీరమందలి ఈ భాగము ఆరోగ్యపరముగ చాల ముఖ్యము. సర్వసామాన్యముగ ఈ భాగమే మొదట అనారోగ్యమునకు గురి యగును. ఈ శరీర భాగమున జీర్ణాశయము, కాలేయము, చిన్న, పెద్దప్రేవులు, మూత్ర పిండములు, అమ్లేయము, మల మూత్ర విసర్జనాంగములు వున్నవి. మలమూత్రములు పరిపూర్ణముగ విసర్జింపబడుటకు ఈ వాయువు ప్రధాన కారణము. అట్లే జీర్ణశక్తికి కూడ నిదియే ఆధారము. మలమూత్రములే కాక దేహమందలి మలినములను పారద్రోలుటకు ఈ వాయు బలమే ముఖ్యము. అజీర్తి, కడుపునొప్పి, వికారము, తలనొప్పి, అతిమూత్ర వ్యాధి, రక్తపోటు, కీళ్ళనొప్పులు, మలబద్ధకము, జలుబు, దగ్గు, విరేచనములు, జ్వరములు ఇవి అన్నియు ఈ భాగముననే పుట్టును. కావున అపాన వాయువును శ్రద్ధగ, పూర్తిగ వదలవలెను.

మలినములను విసర్జించుటకు అపానవాయువు, ప్రాణములను పెంచుటకు ప్రాణవాయువు అనుస్యూతముగ దేహమున పనిచేయుచు నున్నవి. వానిని సక్రమముగ నిర్వర్తించుకొనుట ముఖ్యము.

3. సమాన వాయువు :

ఉదర వితానమునకు పై భాగమున కనుబొమల వరకు ప్రాణవాయువు పనిచేయు చున్నదని తెలుపబడినది. ఉదర వితానము నుండి క్రింది భాగమంతయు అపాన వాయువు పని చేయు చున్నదని తెలుపబడినది. ఈ రెండింటి సామ్యమే సమాన

వాయువు. అంతియే కాదు- ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన ప్రాణముల సామ్యము కూడ సమాన వాయువే.

ప్రాణము, అపానము, సమానము కేంద్రముగ నిర్వర్తింప బడుచున్నవి. ప్రాణాపానములు పరస్పర విరుద్ధమగు శక్తులు. కావున రెండు విధములగు ప్రయోజనములు అవి దేహమున నిర్వర్తించుచున్నవి. ఈ వైరుధ్యము శత్రుత్వము కాదు, మిత్రత్వమే. ఒకటి బాగుండిన రెండవది బాగుండును. ఒకదాని నొకటి బలపరచుకొనును. ఒకటి బలహీనపడిన రెండవది కూడ బలహీన పడును. బాగుగ శ్వాస పీల్చినచో బాగుగ వదల వచ్చును. అట్లే బాగుగ వదలినచో బాగుగ పీల్చవచ్చును. ఈ రెంటిని సామ్య పరచుటనే ఒకదాని యందొకటి హోమము చేయుటగ భగవద్గీతా శ్లోకములు (29, 30) తెలుపుచున్నవి. ముందు తెలిపిన ప్రాణా యామ యజ్ఞము ద్వారా ఈ రెండును సమాన వాయువు నందు సామ్యము చెందినపుడు, శ్వాస, మనసు కరగి సమాన ప్రాణ స్పందనము నిలచును. అపుడు బహిర్ముఖమగు మనసు అంతర్ముఖమై నిలచును. సాధకునకు తాను స్పందనాత్మక చైతన్య మని తెలియును. బాహ్య ప్రజ్ఞనుండి అంతర్ ప్రజ్ఞ మేల్కొనును. అంతర్ముఖుడైన జీవునకు బాహ్యమున తనకు గల స్థితి గతులన్నియు తాత్కాలికమే అని తెలియును. తాను హంస స్వరూపుడ నని తెలిసి ద్వయాక్షరి యగు 'సోఽహం' అను స్పందన ముగా తెలియును. ఈ విషయము ముందు పాఠములలో తెలుప బడినది.

అంతర్ముఖుడుగ మేల్కాంచిన జీవునకు బహిర్ముఖముగ తన అస్థిత్వమంతయు తాత్కాలికమే అని ధృవపడి శాశ్వతమగు అస్థిత్వమునకు ప్రయత్నము ఆరంభమగును. ఇది నిజమగు పుట్టుక.

4. ఉదాన వాయువు :

అంతర్గతమై సమాన వాయువు చేరిన ప్రజ్ఞ, స్పందనాత్మక చైతన్యమై నిలచి, అంతర్లోకాను అన్వేషణమునకు కుతూహలము చూపును. స్పందనాత్మక ప్రజ్ఞ కాధారమేమి? అని అన్వేషించును. అట్టి అన్వేషణమున ద్వయ శబ్దముగ వచ్చుచున్న స్పందన ప్రజ్ఞ కేంద్రమున అంతర్ముఖ మనసును లగ్నము చేయును. స్పందన ప్రజ్ఞా కేంద్రమున జీవప్రజ్ఞ ఆసక్తి కలిగియుండగ, ప్రాణ అపాన ప్రవృత్తులు మరింత సమీకరణము చెంది సామ్యము సాధింప బడును.

ప్రాణము వలన అన్నము, నీరు, గాలి స్వీకరించుట, వినుట, స్పర్శించుట, చూచుట, రుచి చూచుట, వాసన చూచుట అను విషయములు మనసుచే గ్రహింపబడుట, వినుట, అర్థము చేసుకొనుట, సంఘమున ఆర్జనము, దానము యిత్యాది ప్రవృత్తు లేర్పడుచున్నవి. అపానము వలన మలమూత్రములు, చెమట ఏర్పడుచున్నవి. అట్లే ప్రాణము వలన దేహము యొక్క జననము, అపానము వలన మరణము జరుగుచున్నవి. ఈ రెండు ప్రవృత్తులును చక్కగ సమీకరణము చెంది, సామ్యము సాధించి నపుడు జనన మరణ ప్రవృత్తులు కూడ సామ్యము చెందును.

నిదానముగ గాలిపీల్చి ప్రశాంతముగ గాలి విడుచుటలో శ్వాస ప్రసన్నమగును. సామ్యమునందు నిలబడును. ఇట్టి సమయమున ఉచ్ఛ్వాసలో నిశ్వాస, నిశ్వాసలో ఉచ్ఛ్వాస లీనమై పీల్చి విడుచు ప్రయత్నము ఆగిపోవును. కావలసిన గాలి సహజ ముగ లోనికి వచ్చుట, బయటకు వెళ్లుట జరుగును. ఇట్టి స్థితిలో మనసు, శ్వాస ఒకటియై నిలచిపోవును. ఇట్లు నిలచిపోవుటనే 'ప్రాణాయామము' అందురు. అపుడే అంతర్గతమైన జీవప్రజ్ఞ స్పందనాత్మక కార్యక్రమమునకు ఆధారమును వెదకును. ఆ వెదకుటలో స్పందనము నుండి సూక్ష్మ స్పందనములోనికి ప్రవేశించును. అనగ హృదయ కేంద్రము నుండి సుషుమ్నలోనికి ప్రవేశించుట జరుగును. అచట ఊర్ధ్వమగునొక వెలుగుదారి లభించును. కంఠము నుండి ఉదాన వాయువు ఊర్ధ్వమున కాకర్షించుచుండగ, ఉదానవాయు మార్గమున క్రమముగ భ్రూమధ్యమున చేరును.

ఉదాన వాయువు కంఠభాగమునుండి భ్రూమధ్యము వరకు వ్యాపించి యుండి జీవుని హృదయము నుండి ఊర్ధ్వ గతిని కలిగించి, ప్రత్యాహారస్థితి యందు నిలుపును. అపుడు జీవుడు తననొక స్పందనాత్మక చైతన్యముగ కంఠమునందు, నోటియందు, క్రింది తాలువుయందు, పై తాలువు యందు, నాసిక యందు స్పందన ప్రక్రియగ అనుభూతి చెందుచునుండును. అప్పుడు ఉచ్ఛ్వాస, నిశ్వాస, హృదయమునందు స్పందన యుండవు. ప్రాణస్పందనము, ప్రజ్ఞ ముఖమున యుండును. ప్రజ్ఞ ప్రశాంతముగ నుండును. భ్రూమధ్యమున క్రమముగ

చేరును. ఈ స్థితిలో సాధకునకు ఆహార విషయమున, ఉచ్చారణ విషయమున విశిష్టమగు నిష్ఠయుండును. పవిత్రమగు ఆహారమును మాత్రమే స్వీకరింపగలడు. పవిత్రమగు భాషణమును మాత్రమే చేయగలడు. అతడిపుడు చేరునది ఆకాశతత్వముగ గనుక, ఆకాశమువలె నిర్మలమగు విషయములందు మాత్రమే ఆసక్తి కలిగి యుండును. ప్రాపంచిక ప్రవృత్తులు, దేహప్రవృత్తులు యాంత్రికముగ సాగుచుండును. వానిని విసర్జించ నవసరము లేదు. ఉదాసీనతతో నిర్వర్తించుట యుండును.

ఉదాన శబ్దమున 'ఉత్' అను శబ్దముండును. అనగ ప్రాణమాధారముగ జీవు డూర్ధ్వముఖము చెందుటకు దేహమున ఏర్పడిన సౌకర్యమని తెలియవలెను. ఆకాశమును చేరినది జీవ ప్రజ్ఞ యగుటచే అది అనంతము, అపరిమితము, సర్వవ్యాపకము అగు తత్త్వమునకు చేరువగుచుండును. భ్రూమధ్యము వరకు చేరి, అనంతత్త్వములోనికి వంతెన నేర్పరచుకొను ప్రయత్నమున నుండును.

హృదయమునుండి భ్రూమధ్యమునకు చేరు మార్గమున సాధకునికి అనేకానేక దివ్యానుభూతులు కలుగుచునుండును. అనేకములగు దివ్యరూపములు దర్శనమగు చుండును. అనేకములగు దివ్య విషయములు వినపడుచుండును. రకరకముల కాంతి దర్శనము లగుచుండును. అట్లే వివిధములగు వాయిద్యములు వినబడుచు నుండును. ఈ సమస్త దర్శనమును నాదబిందు కళాత్మకముగ పెద్దలు వివరించుచు నుందురు. వీని కాకర్షింప బడక ఊర్ధ్వమునకు సాగుట ఉత్తమమని పెద్దలు తెలిపిరి.

భ్రూమధ్యమున చేరిన త్రిగుణాత్మక జీవప్రజ్ఞ, త్రిగుణముల కావలనున్న త్రిగుణాతీతమగు తత్వముతో అనుసంధానము చెందుటయే ప్రధానము కాగ, ఉదాన వాయువు వ్యానవాయువుతో అనుసంధానము చెందుట ప్రారంభమగును.

5. వ్యాన వాయువు :

వ్యాన వాయువు దేహమంతయు వ్యాపించి యుండును. శిరస్సునుండి పాదముల వరకు అన్ని భాగముల యందు పని చేయుచు నుండును. దేహమున ప్రజ్ఞ అంతర్యామిత్వము చెందుటకు, దేహము అంతట వ్యాపించి యుండుటకు పని చేయుచు నుండును. జీవప్రజ్ఞ దేహ వ్యాప్తి చెందుటకు, దేహము మొత్తము కదలికలకు, దేహము పెరుగుదలకు వ్యాన వాయువు తోడ్పడుచుండును.

ఉదానము నుండి వ్యానము చేరిన జీవప్రజ్ఞ సహస్రార మును చేరి తన నిజస్థితిని అనుభూతి చెందగలదు. ఈ విధముగ ప్రాణము, అపానము, సమానమున సామ్యము చెందుట, సమాన వాయువునుండి జీవప్రజ్ఞ ఉదానవాయువు చేరుట, ఉదాన మాధారముగ ఊర్ధ్వముఖ మగుట, ఊర్ధ్వముఖము చెందిన ఉదానము వ్యానమును చేరుట - ఈ మొత్తము మార్గమును "ప్రాణాయామ యజ్ఞ"మని దైవము తెలిపియున్నాడు.

27

యజ్ఞార్థ భావము

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।
నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥ 31

కురుసత్తముడవగు ఓ అర్జునా! యజ్ఞము లాచరింపగ అందు శేషించిన ఫలము అమృతమయము. దాని ననుభవించు వారు శాశ్వతమైన బ్రహ్మమును పొందుచున్నారు. లోకమున యజ్ఞము చేయనివానికి ఈ లోకమునందే అస్థిత్వము దొరుకదు. పరలోకమెట్లు దొరుకును?

పరమాత్మ తెలిపిన యజ్ఞము ఫలాపేక్షలేక యితరుల శ్రేయస్సు కొరకు ఆచరించు కార్యము. అట్లు కార్యములను నిర్వర్తించు రాజవంశమైన కురు వంశమునందు అర్జునుని శ్రేష్ఠునిగ శ్రీకృష్ణుడు సంబోధించినాడు. నిజమునకు అర్జునుని జీవిత మంతయు యజ్ఞార్థమే.

ఇట్లు యజ్ఞార్థముగ జీవించువారు అట్టి కార్యములందు అందరి శ్రేయస్సును హృదయమున స్మరించుచు నిర్వర్తించ

వలెను. అట్టి విశిష్టమగు కార్యముల నుండి పుట్టిన ఫలములను అందరికిని పంచవలెను. అందరికి పంచగ మిగిలినది తాను భుజించినచో అది అమృతమగును. ముందుగ భుజించుట వలన ఫల మమృతము కాదు. అందువలన అందరికొరకు తాను, అందరి శ్రేయస్సు తరువాత తన శ్రేయస్సు అనునది యజ్ఞార్థభావము. అట్టివారే దైవానుగ్రహ ప్రాప్తులగుదురు. అట్టి వారికే సనాతనము, శాశ్వతము అగు బ్రహ్మానుభూతి అనుభవమగును.

అన్ని విషయములందు అందరికన్న ముందు పొంద వలెనని, అందరికన్న ముందు భుజించవలెనని భావించువారు ప్రాపంచికులు. వారికి నిదానమే లేదు. అట్టి వారికి యజ్ఞ మన నేమో తెలియదు. వారీలోకమున కూడ స్థిమితముగ నుండలేరు. వారి పరలోక ప్రయత్నము లన్నియు హాస్యాస్పదములే.

28

యజ్ఞార్థ జీవనము

ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।
కర్మజాన్ విద్ధితాన్ సర్వా నేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥ 32

ఈ ప్రకారముగ అనేక విధములైన యజ్ఞములు బ్రహ్మాదుల ముఖము నుండి సవిస్తరముగ చెప్పబడి యున్నవి. ఇవి యన్నియు వివిధములగు యజ్ఞార్థ కర్మలు. వానిని యజ్ఞార్థముగ తెలుసుకొని ఆచరించినచో కర్మము నుండి ముక్తుడై నిలుతువు.

జీవుడు కర్మబద్ధుడు. బద్ధతకు కారణము ఫలాసక్తియే. ఫలమునం దాసక్తి గొన్న మనసును, కర్తవ్యమునం దాసక్తి గలుగు నట్లు చేయుట ముఖ్యము. శ్రీకృష్ణుడు కర్మ యందు కర్తవ్యమును చూడమని, తనకు వలసినది చూడవలదని, కర్తవ్యమును మాత్రమే నిర్వర్తించినచో కర్మమంటదని, యిప్పటివరకు అంటిన కర్మ కూడ నశించునని తెలిపినాడు. ఈ అధ్యాయమునకు వేదవ్యాస మహర్షి జ్ఞానయోగమని పేరిడుట ఆసక్తికరము.

నిజమగు జ్ఞానము కర్మబంధ విమోచన జ్ఞానమే కదా! దైవారాధన చేసినను, బ్రహ్మయజ్ఞము చేసినను, ద్రవ్యయజ్ఞము

చేసినను, భగవంతుడు తెలిపిన 12 రకముల యజ్ఞము లన్నియు చేసినను బంధములే కలుగుచు నుండును గాని, విముక్తి చాల మందికి కలుగదు. కారణము, చేయు విషయమునందు మమకార మోహములు కలుగుట, ఆ కార్యములు తనవిగా భావించుట, అందలి ఫలితములు ద్రవ్యరూపమునగాని, కీర్తి రూపమునగాని తనకే దక్కవలె ననిపించుట, యివన్నియు బంధములే. అందులకే సత్కార్యములు చేయువారు కూడ బంధవిముక్తులు కాలేక యున్నారు.

విముక్తి కల్గించని యజ్ఞములు, యాగములు, సేవా కార్య క్రమములు ప్రస్తుతము జ్ఞానము కలిగిన మానవులను కూడ బంధించియున్నవి. జ్ఞానులు కూడ అజ్ఞానులవలె, ఫలాసక్తి కలిగి పరుగులెత్తుట, తాము చేయు కార్యములందు వ్యామోహపడుట, తమ కార్యములు నెరవేరవలెనని పట్టుదలతో పలువిధములైన సాధనములను ఉపయోగించుట జరుగుచునున్నది. అజ్ఞానులు - జ్ఞానులు ఒకే రకముగ విమోచనారహిత మార్గముల నడచు చున్నారు. ఇది ప్రకృతి చేయు యింద్రజాలము. దానికి కృష్ణు డందించిన పరిష్కారము యజ్ఞార్థ జీవనము.

29

కర్మ నిర్వహణ - నియమములు

శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాద్ జ్ఞానయజ్ఞః పరంతప ।
సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే ॥ 33

ఓ అర్జునా! ద్రవ్యము వలన సాధింపబడు యజ్ఞము కంటె జ్ఞాన యజ్ఞము గొప్పది. జ్ఞాన యజ్ఞమున, కర్మ మంతయును పరిసమాప్తి చెందుచున్నది.

కర్మము పరిసమాప్తి చెందు విధానము శ్రీకృష్ణుడు యిచ్చట తెలిపియున్నాడు. జ్ఞానముతో యజ్ఞము చేయుటయే జ్ఞాన యజ్ఞము అనునది యిచ్చట తెలిపిన రహస్యము. అనగ తెలిసి కర్మను నిర్వర్తించుట. కర్మ, కర్తవ్యము రూపమున మనవద్దకు కాలానుసారముగ వచ్చుచుండును. దానిని నిర్వర్తించునపుడు తెలిసినవాడు ఈ క్రింది నియమములను పాటించును.

1. ఫలాపేక్షలేక నిర్వర్తించుట.
2. చేయవలసిన విధానము నెరిగి కర్తవ్యమును నిర్వర్తించుట.
3. కర్తవ్యమును తప్పించుకొనకుండుట.

4. కర్తవ్యము నిర్వర్తించునపుడు, వర్తనమున ఎక్కువ తక్కువలు లేకుండుట.

5. అలసత్వము, అశ్రద్ధ, కాలయాపనము చేయకుండుట.

6. నిర్వర్తింపబడుచున్న విషయములందు తగుల్కొనకుండుట, చిక్కుపడక యుండుట.

7. వక్రగతుల ననుసరింపక సక్రమముగ ఓర్పుతో శ్రద్ధతో నిర్వర్తించుట.

పై సూత్రములను పాటించుచు, సమస్త కర్తవ్య కర్మలను నిర్వర్తించువాడు కర్మబద్ధత నుండి, క్రమముగ విముక్తి చెందును. అటుపైన దివ్యకర్మయందు భాగముగ నిలచును. దివ్యకర్మను కూడ పై సూత్రములాధారముగనే నిర్వర్తించును కనుక మోక్షస్థితి యందే యుండి, కర్మ నిర్వహణము చేయుచు నుండును. సనక సనందనాదులు, నారదమహర్షి, సప్తఋషులు, మనువులు అట్టివారు. వారు సృష్టియందు శాశ్వతులై జ్ఞానయజ్ఞమున నిలచి జీవులకు మార్గము చూపుచున్నారు.

ఈ శ్లోకము జ్ఞానయోగమునకు హృదయము వంటిది. ఎవరే పని గావించుచున్నను పై సూత్రములను పాటించుట వారిని ఆ పనుల నుండి విముక్తులను చేయును. ముక్తి మార్గమును చూపునదే జ్ఞానము. అది ఆచరణమున యిమిడి యున్నది. ఆచరణమున పై సూత్రములను పాటించని వారు ఎన్ని తెలిసినను, తెలియనివారే. జీవితమున బద్ధులే. బద్ధులైన వారు ఎంత చదివినను, తెలిసినను జ్ఞానులు కారు. బద్ధత లేనివారే

జ్ఞానులు. బంధచ్ఛేదనము గావించుకొనుటకు దైవమిచ్చినది నిష్కామ కర్మయోగము. అట్టియోగమున నిలచి, బంధములను పరిష్కరించుకొనుట జ్ఞానయోగ మగును. జ్ఞానము పేరిట శాస్త్రాధ్యయనము, క్రతువులు, మంత్రములు, తంత్రములు, పూజలు, అభిషేకములు, సత్కార్యములు చేయువారు కూడ పై సూత్రములను పాటించనిచో బద్ధులే అగుచున్నారు. ఇది గమనించవలసిన విషయము.

30

బంధమోచనము

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥ 34

తత్త్వవేత్తలగు జ్ఞానులకు సాష్టాంగ నమస్కారము చేసి, వ్యకిగతముగ వారికి సేవచేసి, వినయముగ వారిని సమయా సమయ వివేకముతో ప్రశ్నించియు, బంధమోచన జ్ఞానమును ఉపదేశపూర్వకముగ పొందుము.

బంధమోచన జ్ఞానము, బంధమోచనులైన ముక్తి జీవుల వద్ద దర్శింపవచ్చును. జ్ఞాన మనగ బంధమోచన జ్ఞానమే అని తెలుపబడినది గదా! తెలిపినంత మాత్రమున తెలుసుకొనిన వాడు ఆచరింపలేడు. ఫలాసక్తి లేక కార్యము నాశ్రయించి, కర్మను నిర్వర్తించవలెనని సర్వసామాన్యముగ అందరు వినియే యుందురు. అంతమాత్రముచేత ఆచరింప గలుగుచున్నారా? కర్మాచరణము దైవము తెలుపురీతిలో ఆచరించుట అంత సులభము కాదని అందరును అంగీకరింతురు. కోరిక ప్రధానముగ జీవించు మానవుడు, తన వ్యక్తిగత కోరిక కన్న కర్తవ్యమే ప్రధానమని

భావించుటకు సంస్కారబలముగ చాల మార్పు రావలెను. కేవలము విషయ పరిజ్ఞానము వలన ఎవ్వడును జ్ఞాని కాలేడు. నిజమగు జ్ఞాని సాన్నిధ్యము వలననే జ్ఞాని యగుటకు వీలగును.

ఇచ్చట జ్ఞాని యనగ బంధములను పరిష్కరించుకొనుచు, చేయు కర్మలవలన మరల బంధములను సృష్టించుకొనక జీవించు విధానము. ఈ విధానమున జీవుడు బంధమోచనుడై, స్వతంత్రుడై దివ్యవైభవమున నుండును. అట్టివాడే జ్ఞాని. అతని నిత్యజీవన ఆచరణమే నిజమగు దర్శన జ్ఞానము. జ్ఞానుల జీవన విధానము ఆకర్షణీయమై యుండును. వారు కర్మలాచరించు తీరు, ఫలాసక్తి లేని సూటియైన కర్తవ్యాచరణము, వ్యామోహము లేని జీవనము గమనించినచో ఆచరించుటకు వలసిన స్ఫూర్తి, సంకల్పబలము కలుగును. అట్లాచరించు బుద్ధిమంతుడు నిర్వర్తించవలసిన మరియొక కర్తవ్యము దైవమిచట బోధించు చున్నాడు.

జీవన్ముక్తుడగు జ్ఞాని దరిచేరుట, అతని జీవన విధానమును అవగాహనము చేసుకొనుట, సున్నితముగ అతడు కర్మ నిర్వర్తించు విధానము తెలుసుకొనుట, స్ఫూర్తితో ఆ విధానము ననుసరించు టతో బాటు, అట్టి జ్ఞాన పురుషునికి సేవ చేయుట, సాష్టాంగ దండప్రణామము చేయుట, అనుగ్రహమున వారు తెలిపిన సుళువులను, సూత్రములను హృదయస్థము గావించుకొని, వాచాలత్వము లేక వినయముతో ఆచరించుట.

భగవద్గీత యందలి ఈ శ్లోకము సద్గురు శుశ్రూష బంధ మోచనము కోరువానికి ఉపకరణము కాగలదని తెలుపుచున్నది.

స్వంతముగ తమకు తాము నిర్వర్తించుకొనుట కన్న తెలిసిన వారి సాన్నిధ్యమున నిర్వర్తించుకొనుట ఉత్తమము. తెలిసినవారి అనుగ్రహము పొందుట ఉత్తమోత్తమము. అనుగ్రహ మనునది అయస్కాంతీకరణము వంటిది. అయస్కాంత సన్నిధిని యినుప ముక్క త్వరితగతిని అయస్కాంతము కాగలదు. ఒక మనిషికి సేవ చేయుట, అతనికి సాష్టాంగదండ ప్రణామము చేయుట, అతనిని వినయముతో అడిగి తెలుసుకొనుట అహంకారులకు సాధ్యము కాదు. అహంకార మున్నంత కాలము బంధమోచనము కలుగదు. సాధకుని యందు సత్త్వము పెరుగుటకు ఈ మూడు సూత్రములను దైవము సూచించినాడు. అదియే మన పాద నమస్కారము, సేవ, పరిప్రశ్నము. కృష్ణ భక్తుల విషయమున ఈ మూడును గమనింపదగును. దైవభక్తుల జీవితమున ఈ మూడును దినచర్యగ పాటింపబడును. అట్టివారే దైవానుగ్రహ పాత్రులు కాగలరు. సద్గురువు రూపమున దైవమే వారిని అనుగ్రహించు చుండును.

31

నిజమైన జ్ఞానము

యజ్ఞ్ఞాత్వా న పునర్మోహ మేవం యాస్యసి పాండవ ।
యేన భూతా న్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథోమయి ॥ 35

అర్జునా! సద్గురువు శుశ్రూష ద్వారా వారి అనుగ్రహము నుండి నీవు పొందిన జ్ఞానము నిన్ను మోహము నుండి తరింప జేయును. నీకు, నీయందును నా యందును, సమస్త ప్రాణుల యందును గల ఒకే ఒక తత్త్వము దర్శనము కాగలదు.

నిజమగు జ్ఞాన ప్రయోజన మేమో ఈ శ్లోకము తెలుపు చున్నది. భగవానుని దృష్టిలో ఈ రెండు అర్హతలు కలవారే జ్ఞానులు. జ్ఞానమను అగ్నిచేత సర్వమును హరింపబడినవారు మరల మోహమున పడరు. ఒకవేళ అట్లు పడినను, అది తాత్కాలికము. కండ్లున్నవారు సామాన్యముగ నడచినపుడు గోతిలో పడరు. ప్రమాదవశమున ఒకమారు పడినను, మాటి మాటికి పడుట యుండదు. జ్ఞానులను సైతము అపుడపుడు దైవమాయ మోహమున పడవేయును. అది దైవలీలయే! జ్ఞానుల

విషయమున అది తాత్కాలికమే యగును. నిజమగు జ్ఞానులు మరల మరల మోహమున పడుట యుండదు. మోహము దాటిన వారే నిజమగు జ్ఞానులు.

దైవము, జ్ఞానులను గూర్చి మరియొక అర్హత తెలిపినాడు. నిజమగు జ్ఞానికి తనయందు, తన పరిసరములయందు తత్త్వమే (దైవమే) గోచరించుచు నుండును. మరియొకటి యుండదు. "*నా యందు గల వెల్గు నా పరిసరముల వారి రూపమున కన్పట్టు గాక*" అను వాక్యము నిజమగు జ్ఞానమార్గము. తన యందు, అందరి యందుగల ఒకే సత్యమును నిత్యము దర్శించువాడే జ్ఞాని. జ్ఞాని సహచర్యమున సాధకు డీ రెంటిని గమనింపవచ్చును. అతడు వ్యామోహమున్నట్లు కనిపించు చున్నను, నిజమునకు అంతరంగమున అది గోచరింపదు. అతడన్నిటియందు గల దైవము తోనే ముడిపడి యుండును. ఇతర ఆకర్షణములు కలుగవు. నిత్య జీవితమున జ్ఞాని యిట్లు ప్రవర్తించు చుండగ, దానిని చూచుటయే మహదానందకరము. చూచువారికి వలసిన స్ఫూర్తి, ఆచరణీ యాత్మకమగు బలము కూడ జ్ఞాని నుండి లభింపగలదు.

ఈ శ్లోకముద్వారా శ్రీకృష్ణుడు జ్ఞానియనగ నెట్లుండునో, ఎట్టివారిని జిజ్ఞాసువు లాశ్రయింపవలెనో సున్నితముగ తెలిపినాడు.

32

బంధవిమోచన జ్ఞానము

అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।
సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥ 36

పాపాత్ము లందరికన్నను కూడ నీవు పాపము చేసినవాడ వైనను, ఆ సమస్త పాపమును (పై తెలుపబడిన) జ్ఞానమను తెప్పచేత నీవు చక్కగ దాటగలవు.

పాపము చేసినవారు పాపఫలములను దుఃఖము లుగను, నష్టములుగను, రోగములుగను, బాధలుగను అనుభ వించుచు బంధితులై యుందురు.

పుణ్యములు చేసినవారు ధనము, కీర్తి, పదవి, సంపద, ఆరోగ్యము, సుఖము అనుభవించుచు, వారును బద్ధులై జీవింతురు.

పాపకార్యములు చేసినవారు అశుభవాసనల యందు తగుల్కొని జీవింతురు. అట్లే పుణ్యకార్యములు చేయువారు

శుభముల యందు తగుల్కొని జీవింతురు. ఇరువురును వాసనా భావముచే బంధితులే. బంగారు త్రాళ్ళతో కట్టినను, పలుపు త్రాళ్ళతో కట్టినను బంధము బంధమే కదా! పుణ్యములు చేసినవారికి అనుభవము రూపమున పుణ్యము కలుగును. పాపములు చేసిన వారికి కూడ అనుభవ రూపమున పాపములు తొలగును. పాప పుణ్యముల హెచ్చుతగ్గులను బట్టి సుఖదుః ఖముల బంధములు ఉండుచునే యుండును.

సామాన్యజీవులు కొన్ని పుణ్యకార్యములు, కొన్ని పాప కార్యములు చేయుటవలన సుఖదుఃఖములతో జీవితము సాగుచుండును.

పై మూడు తెగలవారికి బంధవిమోచనము లేదు. జ్ఞాన మొక్కటే అందరికిని పరిష్కారము. జ్ఞాన మనగ ఫలముల యం దాసక్తి లేక, కర్తవ్యము నిర్వర్తించుటయే. అట్లెవరు నిర్వర్తించినను, ప్రపంచమను సాగరమున తెప్పతో సాగతున్నట్లుగ తేలుచు జీవించ గలరు. ఈ జ్ఞానమార్గ మొక్కటే నిజముగ దాటించు నావ. పుణ్యాత్ములకైనను, పాపాత్ములకైనను, సామాన్యులకైనను యిది ఒక్కటియే తరించు మార్గము.

33

కర్మ నిర్వహణ జ్ఞానము

యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్ కురుతేఽర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా ॥ 37

న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే ।
తత్స్వయం యోగ సంసిద్ధః కాలే నాత్మని విందతి ॥ 38

ఓ అర్జునా! బాగుగా ప్రజ్వలింపజేయబడిన అగ్ని కట్టెల నే ప్రకారముగ భస్మీభూత మొనర్చుచున్నదో, ఆ ప్రకారముగనే, జ్ఞానమను అగ్ని సమస్త కర్మలను భస్మము చేసి వేయును.

ఈ ప్రపంచములో జ్ఞానముతో సమానమైన పవిత్రత కలిగినది ఏదియు లేదు. ఈ నిష్కామ కర్మయోగ జ్ఞానము కాలక్రమమున యోగసిద్ధిని గావించి, సాధకునకు 'తాను' ఎవరో స్వయముగ తెలుపును.

కోరికలు, ఆవేశకావేశములు, స్వార్థచింతన, అహంకార పూరితమగు భావనలు, ఫలములం దాసక్తి, కార్యములందు వక్రత, తనదనుకొను వానియందు మమకారము పచ్చి కట్టెల

వంటివి. అట్టి కట్టెలు అగ్నికార్యమునకు పనికిరావు. కేవలము చివికి నశించుట జరుగును. ఎండుకట్టె అగ్ని స్పర్శతో త్వరితముగ మండగలదు. స్థితి మార్పులు పొందగలదు. పవిత్రీకరింపబడి, విభూతియై మిగులగలదు. విభూతి పరమ పవిత్రము. కారణ మేమనగ అగ్ని దానిని ఏమియును చేయలేదు. పరమ పవిత్ర స్థితియే విభూతి. అగ్నివలననే కట్టె విభూతిగ మారుచున్నది. జ్ఞానము వలననే మనిషి మహాత్ము డగుచున్నాడు. జ్ఞానమనగ, కర్మలను నిర్వర్తించు జ్ఞానము. కర్మ నిర్వహణమున పాత కర్మలు, ప్రస్తుత కర్మలు నశించవలెను. క్రొత్తకర్మలు పుట్టరాదు. వ్యక్తిగత కర్మము నుండి విమోచనము పొందినవారు దివ్యకర్మయందే చిరకాలము జీవించుచు నుందురు. శాశ్వతులుగ నుందురు. అట్టివారు భగవత్ విభూతియే. కేవలము దైవమే వారి నుండి వ్యక్తమగుచు, శ్రేయస్సు చేకూర్చుచు నుండును. స్వయముగ భగవంతుడే వారియందు ఉపస్థితుడై యుండుటచేత 'స్వయ మును' గూర్చి కూడ వారు కాలక్రమమున తెలిసిన వారగుదురు.

ఈ రెండు శ్లోకములలో స్థూలముగ మూడు పురోగమన ములు గోచరించును.

1. జ్ఞానముతో కూడి నిర్వర్తించు కర్మ వలన కర్మ నాశనము క్రమముగ నగుట.

2. కర్మమోచనము పొందినవారు పవిత్రులై నిలచి దివ్య కార్యములకు సమర్పణ చెందియుండుట.

3. దైవము తమనుండి దివ్యకర్మను వ్యక్తము చేయుచుండగ, కాలక్రమమున తామెవ్వరో తమకు తెలియుట.

ఇట్లాత్మజ్ఞానము కర్మ నిర్వర్తించు జ్ఞానము నుండే పొంద వచ్చని, మరియొక మార్గము లేదని దైవము సూచించు చున్నాడు. ఎంత తెలిసినను, ఎంత పాండిత్యమున్నను, ఎన్ని విధములగు విద్యలు నేర్చినను, ఆచరణయందలి నిష్కామత, ఫలమునందు నిరాసక్తి, నిర్వహణమునందు త్రికరణశుద్ధి, సిద్ధించిన కార్యము లందు మమకార పడకుండుట మాత్రమే మార్గము. జ్ఞానము సర్వము కర్మనిర్వహణ జ్ఞానమే అని తెలియవలెను.

34

శ్రద్ధ

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరే ణాధిగచ్ఛతి ॥ 39

శ్రద్ధగలవాడు, తదేక నిష్ఠగలవాడు, యింద్రి యార్థము లందు చిక్కుకొననివాడు ఈ జ్ఞానమును పొందగలడు. జ్ఞానమును పొందినవాడు త్వరితగతిని పరమశాంతిని పొంద గలడు.

జ్ఞానమునకు మూడర్హత లీ శ్లోకమున చెప్పబడినవి. అందు మొదటిది శ్రద్ధ. రెండవది నిష్ఠ. మూడవది యింద్రియ నియమము.

1. శ్రద్ధ :

శ్రద్ధయనగ పరిపూర్ణ ఆసక్తితో కూడిన ఆచరణ. ఆసక్తి లేనిదే ఎవ్వడును ఏ పనియు చేయడు. ఆసక్తి పూర్ణముగ నున్నచో మనసు పరిపూర్ణముగ ఒక పనియం దర్పింపబడును. శ్రద్ధగ పనిచేయు వానికి మనసు పనియందు సమర్పితమగుటచేత యితర విషయములపై ప్రసరింపదు. పరిసరములందేమి జరుగు

చున్నను అతనికి వాటి అస్థిత్వముండదు. అర్జునుడు బాణము ఎక్కుపెట్టినపుడు పిట్టకన్ను మాత్రమే కనిపించుట, యితరములు గోచరింపకుండుట జరిగినది. ఇది శ్రద్ధకు తార్కాణము. అటులనే శ్రీరాముడు తాటి చెట్టు ఏడుతలలను కొట్టుట, పదునాలుగువేల రాక్షసుల నొక్క బాణముతో చంపుట శ్రద్ధకు తార్కాణము. శ్రద్ధ కలవాడు తాను చేయు పనియందే మనసు లగ్నము చేసి యుండును. ఎన్ని సంవత్సరములైనను చేయు పనియందే శ్రద్ధ గోచరించును. శ్రద్ధ గల మనసు సంయమము అను శక్తిని పొందును. ఎపుడైనను, ఎచటైనను విషయములు సూటిగ గోచరించుట, అవగాహన యగుట యుండును. సూక్ష్మమగు విషయములు కూడ సులభముగ అర్థమగును.

శ్రద్ధ గలవా డన్ని విషయము లందును శ్రద్ధగ నుండును. కొన్ని విషయములందు శ్రద్ధ, కొన్ని విషయములందు అశ్రద్ధ యుండదు. రాముని జీవితమే దీనికి తార్కాణము. (భరతు నెట్లాదరించెనో, గుహుని కూడ అట్లే ఆదరించెను.)

శ్రద్ధగలవాడు ప్రస్తుతమునందే యుండును. భవిష్యత్తు లోనికి తొంగిచూచుట, గతమును నెమరువేయుట యుండదు. శ్రద్ధ గలవానికి ఎదుట నున్న కర్తవ్యమే దైవము.

శ్రద్ధ అను గుణము చిన్నతనముననే నేర్చినవారు కార్యము లందు సులభముగ విజయమును సాధింపగలరు.

మరపు గల వారందరు శ్రద్ధ లేనివారే. ప్రస్తుత కాలమున మరపెక్కువ. అనగ శ్రద్ధ తక్కువ. నిజమునకు 'శ్రద్ధ' అను

గుణము సమస్తమగు సిద్ధులను సాధింపచేయును. జ్ఞానమునకు కూడ శ్రద్ధయే ప్రధానము. చేయు పనియందు శ్రద్ధ, ఫలములయం దనాసక్తి ముఖ్యమని తెలియవలెను.

2. తదేక నిష్ఠ :

భగవంతుడు 'తత్పరః' అను పదమును వాడినాడు. తత్పరత్వము కలుగవలెనన్నచో చేయు పనియం దాసక్తి మిన్నగ యుండవలెను. ఆసక్తి యున్నచోటే శ్రద్ధ, తత్పరత్వము యుండును. ఆసక్తి కలుగుట, కలుగకపోవుట స్వభావముపై ఆధారపడి యుండును. స్వభావమున కనుగుణమైన పని స్వధర్మ మగును. అందువలన స్వధర్మము నాచరించువారికి సహజముగ కొంత ఆసక్తి యుండును. ఆ ఆసక్తికి శ్రద్ధ, తత్పరత జోడించినచో కార్యసిద్ధి తథ్యము. ఈ రెండు గుణముల గలవాడు అంతః కరణముల యందు అఖండుడై నిలచును. అనగ అతని స్వభావము, మనసు, బుద్ధి, అహంకారము ఒకటిగ నిలచి కార్యములు నిర్వర్తించును గనుక సిద్ధి కలుగును. బుద్ధిని దైవముపై లగ్నము చేయుచుండగ, చిత్తము చెప్పు పైకి ప్రస రించుట సర్వసామాన్యము. అట్టివారు ఖండ ప్రజ్ఞ గలవారై, కార్యములందు విఫలు లగుచుందురు.

అంతఃకరణ ప్రజ్ఞ అఖండమై, కార్యములందు ప్రయోగించి నపుడు సర్వసామాన్యముగ కార్యసిద్ధి కలుగును. అట్టివారు జ్ఞానముపై మనసు నిడినపుడు చిత్తము, మనసు, బుద్ధి, తాను (అహంకారము) జ్ఞానము నుపాసించుటచే జ్ఞాను లగుదురు.

కర్మల నుపాసించునపుడు కూడ శాంతిగ నుందురు. పనులు చేయుచుండుట వలన వారికి శాంతి కరవు కాదు. పనులు చేయుచు కూడ పరమశాంతితో నుందురు.

విస్తారమగు కార్యములు నిర్వర్తించుచు, ప్రశాంతముగ ఏమియు చేయని వారివలె గోచరించు వారు శ్రద్ధాళువులు, తత్పరులు.

3. యత యింద్రియత్వము :

శ్రద్ధ, తదేక నిష్ఠతో పాటుగ యమింపబడిన యింద్రియములను గూర్చి దైవము పలికినాడు. ఇంద్రియ నియమము జీవుని బాహ్య ప్రజ్ఞకు సంబంధించినది. శ్రద్ధ, నిష్ఠ అంతర్ముఖ ప్రజ్ఞకు సంబంధించినది. బాహ్యాంతరము లందు చెదరక యుండవలె నన్నచో అంతర్ముఖముగ శ్రద్ధ, నిష్ఠ యుండవలెను. బహిర్ముఖముగ యింద్రియ వ్యాపారములు తన వశమున నుండవలెను. ఇంద్రియముల యందు కన్ను ముఖ్యమే అయినను వానిని వశము చేసుకొనుటలో స్పర్శ, రుచి ముఖ్యమని దైవము మరియొక చోట తెలిపినాడు. స్పర్శ, రుచి బాహ్యమును అంటును. చూపు, వినికిడి, వాసన సూక్ష్మముగ అంటును. తిన్నది, ముట్టుకున్నది స్థూలమై, బాహ్యముతో గట్టి సంబంధ మేర్పరచును. అందువలన తినుట, ముట్టుకొనుట అను విషయమున కొంత నియమముండుట ఉపయోగించును.

చూచుట, వినుట, వాసన చూచుట అను విషయముల యందు కూడ నియమము ప్రధానము. చూచునది, వినునది,

వాసన చూచునది, రుచి చూచునది, ముట్టుకొనునది, కావలెనని పించుట సామాన్యము. కావలె ననిపించగనె, అవసర మనిపించును. ఇంద్రియార్థముల విషయమున దైవ మొకటే ప్రశ్న పరిష్కారముగ నిచ్చినాడు. 'అవసరమా?' అని యింద్రియార్థముల విషయమున ప్రశ్నించుకొనుట ముఖ్యము. అవసరము లేనివి చూచుట, వినుట, రుచి చూచుట, ముట్టుకొనుట, వాసన చూచుట చేయు వానికి యింద్రియములు బలిష్టమైన గుఱ్ఱములవలె ఐదు దిశల లోనికి లాగుచు నుండును. ఇక ప్రయాణమెక్కడ? రథము ఐదు ముక్కలుగ చీలును. ఇంద్రియములను గుఱ్ఱములను అవసర మునకే వాడవలెను. ఈ క్రింది విషయములందు అవసరమా? అను ప్రశ్న వేసుకొను చుండవలెను.

1. ఎచ్చటికైన వెళ్లదలచినపుడు, 2. ఏదైన వినదలచినపుడు, 3. తినదలచినపుడు, 4. ముట్టుకొనవలసి వచ్చినపుడు, 5. వాసన చూడ వలసినపుడు. అవసరము లేక తినుట, తిరుగుట, వినుట, మాట్లాడుట, చూచుట, ముట్టుకొనుట వలన జీవప్రజ్ఞ బాహ్యమున బంధింపబడి యుండును. బద్ధుడెట్టి కార్యమును నిర్వర్తించలేడు.

పంచేంద్రియములందు బద్ధుడైనవాడు కర్మేంద్రియము లందు కూడ బద్ధుడగును. ఇట్లు దశేంద్రియములందు బద్ధుడై నశించును. కర్మేంద్రియబద్ధుడు ఈ క్రింది విధముగ ప్రవర్తించుచు నుండును.

1. పని లేక తిరుగుట
2. పని లేక వాగుట

3. అవసరము లేని పనులయందు చేతులను వినియోగించుట.

4. మలమూత్రావయవములను నిస్సత్తువ గావించుట.

పంచేంద్రియములను గుఱ్ఱములు, కర్మేంద్రియములతో కూడిన రథమును అవకతవకగ లాగుటచే జీవుడు బాహ్య ప్రజ్ఞ యందే నశించును. ఇక అంతరంగ మెక్కడ. బహిఃకరణములనే వినియోగించ లేనివాడు అంతఃకరణములను వినియోగింప జాలడు. అంతఃకరణములు, బహిఃకరణములు సవ్యముగ నిర్వర్తింపబడుటయే గాక, అన్నిటి నుండియు అఖండమై 'తాను' అను ప్రజ్ఞ ప్రసరించినపుడే జ్ఞానమున కర్హత అని తెలియవలెను. అట్టి అఖండ ప్రజ్ఞ కలవారే పరమశాంతి కర్హులు.

ఈ శ్లోకము సాధకులకు అత్యంత ప్రాముఖ్యమగు శ్లోక మగుటచే క్లుప్తముగ మరల వివరింపబడు చున్నది.

జీవుడు బాహ్య ప్రపంచమున పనిచేయుటకు మనసు, పంచేంద్రియములు, పంచ కర్మేంద్రియములు అవసరము. అంత రంగమునుండి చిత్తము, బుద్ధి, అహంకారము పనిచేయును. జీవప్రజ్ఞ ఈ క్రింది విధముగ బాహ్యములోనికి ప్రసరించును.

1. అహంకారము, 2. బుద్ధి, 3. చిత్తము, 4. మనస్సు, 5. జానేంద్రియములు (5), 6. కర్మేంద్రియమలు (5), 6. వాక్కు. మొత్తము 15.

ఒక సంకల్పము కలిగినపుడు ఈ పదునైదు పనిచేయు చుండును. సంకల్పము కర్తవ్యమై యున్నచో దానిని నిర్వర్తించ

వలెను. కానిచో విసర్జించవలెను. కర్తవ్యమైనపుడు శ్రద్ధతోను, తదేక నిష్ఠతోను నిర్వర్తించుటకు అంతఃకరణశుద్ధి ముఖ్యము. అందు వలన శ్రద్ధ, నిష్ఠ అనువాటిని ఆయుధములుగ కర్తవ్య కర్మను జ్ఞానేంద్రియములతోను, కర్మేంద్రియములతోను నిర్వర్తించవలెను.

ఈ శ్లోకమున లింగ శరీరమందలి పదునైదు అంశములు అనుసంధానము చేయుటకు వలసిన దీక్షలను దైవము తెలిపి యున్నాడని తెలియవలెను. అవియే శ్రద్ధ, నిష్ఠ, యింద్రియ నిగ్రహము.

ఈ మూడు దీక్షలను స్వీకరించువారు జ్ఞానమున నడచి, బంధములను తొలగించుకొనగలరు.

35

అశ్రద్ధ - సంయమము

అజ్ఞశ్చా శ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।
నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥ 40

అజ్ఞాని ఇహలోకమున గాని, పరలోకమున గాని సుఖమును పొందలేడు. కారణమేమనగ అతడు రెండు గుణములచే బద్ధుడు. ఒకటి అశ్రద్ధ, రెండు సంశయము.

అశ్రద్ధ వలన పనులు చెడును. శ్రద్ధ లేనివాడు ఏ కార్యమును అనుస్యూతముగ నిర్వర్తింపలేడు. మనసు లగ్నము చేసి పనులను నిర్వర్తింపలేడు. పనులన్నియు అరకొరగనే జరుగు చుండును. శ్రద్ధ లేమివలన పనులయం దాటంకములు రాగ, ఆటంకముల వలన మనసునందు రకరకముల సంశయములు మొలకెత్తుచు నుండును. సంశయము అశ్రద్ధను పోషించుచుండగ, అశ్రద్ధ సంశయమును ప్రోత్సహించు చుండును. సర్వసామాన్య ముగ వైఫల్యములకు ఈ రెండు అంశములే కారణముగ తెలియ

వచ్చును. ఇట్టివారు క్రమముగ పురోగమించుట జరుగకపోగ, తిరోగమించుట జరుగుచు నుండును. ఈ శ్లోకమున సంశయాత్ముకుడు నశించును అని చెప్పుటలో 'వినశ్యతి' అను పదము వాడబడినది. అనగ అట్టివాని పతనము ఘోరముగ నుండునని తెలియవలెను. శ్రద్ధ, విశ్వాసము పురోగతికి కారణములు కాగ, అశ్రద్ధ, సంశయము తిరోగతి కలిగించును సుమా అని అర్థము.

36

కర్మనిష్ఠ

**యోగసన్న్యస్త కర్మాణం జ్ఞానసంఛిన్న సంశయమ్ ।
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ ॥ 41**

కర్మఫలములను సన్యసించి, కర్తవ్య కర్మల నాచరించు వాడు జ్ఞానముచే సంశయములను భిన్నము గావించి కర్మనిష్ఠతోనే ఆత్మవంతు డగును. అట్టివాని కెట్టి బంధములు లేవు.

శ్రీకృష్ణుడు మానవులకు అందించిన సందేశ మొక్కటియే. ఫలాసక్తి సన్యసించి కర్తవ్యమును నిర్వర్తించుట. భగవద్గీతయందు ఈ అంశము మరల మరల తెలుపబడుచునే యుండును. ఎన్ని రకములుగ చెప్పినను సాధకున కందించు విషయ మొక్కటియే. కర్తవ్యము నాచరించుటే ముఖ్యము గాని, ఫలములనుబట్టి కర్తవ్యముల నాచరించుట కాదు. ఇది మానవునకు వంట బట్టుటకు వందల జన్మలు గడువవచ్చును. అయినను బంధ మోచనమున కిదొక్కటియే మార్గము. మరియొక మార్గము లేదు.

చేయుపని కర్తవ్యమా, కాదా? అనునది ముఖ్యము.

కర్తవ్యమే అని తేలినపుడు ఆచరించుటయే గాని మరియొక మార్గము లేదు. ఆచరించునపుడు సమతూకముగ నాచరించ వలెను. లేనిచో ఆచరించుట ద్వారా మరల కర్మలు పుట్టవచ్చును. సమతూకముగ ఆచరించినపుడు ఫలములు సిద్ధింపవచ్చును. సిద్ధించిన ఫలములయందు మోహపడుట వలన కూడ మరల బంధము కలుగవచ్చును. అందువలన కేవలము కర్తవ్య నిర్వహణమేకాని, జీవితమున మరి ఏమియు లేదని కృష్ణుని ఉపదేశ సారాంశము. నిర్వర్తించుట ఆనందముగ జరిపినచో కర్మ నిర్వహణమే వలసిన అనుభూతి నందించును. కృష్ణు డట్లే వర్తించి నాడు. నిజమునకు అట్టి వర్తనమున, దిట్టయై నర్తించినాడు కూడ. అతని సందేశము కూడ నదియే.

కర్మ నిర్వహణ మందలి సూత్రములను తెలిసి, అట్లు జీవించువాడు జ్ఞానముచే సంశయములు తొలగినవాడై, కర్మ బంధములనుండి విడివడి ముక్తుడగును. ఆత్మవంతుడు కూడ అగును. అట్టివానికి సృష్టియందు సమస్తము శాశ్వతముగ సహక రించుచునే యుండును.

37

నిష్కామ కర్మయోగము

తస్మా దజ్ఞానసంభూతం హృత్ స్థం జ్ఞానాసి నాత్మనః ।
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత ॥ 42

భరత పుత్రుడవగు ఓ అర్జునా! నీ హృదయమందు పుట్టిన అజ్ఞానమును, ఈ తెలుపబడిన జ్ఞాన మను ఖడ్గముచే ఛేదించుము. నిష్కామముగ కర్మమును నిర్వర్తించుము. సంశయింపక లెమ్ము.

అర్జునుడు సంశయమున పడుటచేతనే అతని హృదయమున అనేకానేక ప్రశ్నలు ఉద్భవించినవి. ప్రశ్నలనుండి ప్రశ్నలు పుట్టుచున్నవి. సహజముగ జ్ఞానవంతుడైనను అతడు సంశయమున పడుటచే అతని నజ్ఞాన మావరించినది. అజ్ఞానము, సంశయముతోడై, అశ్రద్ధ జనింపగ శ్రీకృష్ణుడు తెలిపిన విషయమునే మరల మరల తెలుపవలసి వచ్చినది. అర్జునుని యందుకల వాత్సల్యముతో దైవము మరల మరల నిష్కామ కర్మయోగ ప్రభావమును వివరించినాడు.

అర్జునుడు ధనుస్సు, బాణములను విడిచిపెట్టి ప్రశ్నలు వేయుట, శ్రీకృష్ణుడు పదే పదే ఒకే సమాధానము తెలుపుట మానవుల సహజ ధోరణిని తెలుపును. మానవులకు తెలుసు కొనుటలోగల ఆసక్తి చేయుటలో లేదు. తెలుసుకున్నకొలది యింకను తెలుసుకొనవలెనను ఆరాటమేగాని, తెలిసినది ఆచరించుట యుండదు. తెలిసినది ఏ కొద్దియైనను, దాని నాచ రించుట ఆరంభించినచో తెలియవలసినది ఎప్పటికప్పుడు తెలియుచునే యుండును. ఆచరింపక తెలుసుకొనుట ఆరంభించి నచో అది వ్యసనమై స్థిరపడును. తెలుసుకొనుట, ఆచరించుట ఉచ్ఛ్వాస నిశ్వాసలవలె ఎవరియందు జరుగునో అట్టివారే ముముక్షు మార్గమున పయనించువారు.

అందులకే ఉత్తిష్ఠ, అతిష్ఠ (లెమ్ము, ఆచరింపుము) అని దైవము పలికినాడు. ఆచరించవలసినది తాను తెలిపిన యోగము. అందుచే “యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత” అని పలికినాడు. యోగ మనగ నిష్కామ కర్మయోగమే.

గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 5వ అధ్యాయము - కర్మసన్న్యాసయోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధన మనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ", డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "*జగద్గురు మందిరము*" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. “పరహితము పరమధర్మ” మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

విషయ సూచిక

ముందుమాట

కర్మఫల సన్న్యాసమే కర్మసన్న్యాసముగ ఈ అధ్యాయమున పేర్కొనబడును. కర్మఫల సన్న్యాసము అనుభవమైన వారికి కర్మ చేయుట అను భావన నశించి, కర్మ జరుగుట అను అనుభూతి దైనందినముగ కలుగుచునుండును. కర్మ సన్న్యాస మనగ తమనుండి యితరుల నుండి జరుగుచున్న కర్మను సాక్షీభూతుడై గమనించుట. నదీ ప్రవాహమును నదియొడ్డున నుండి గమనించినట్లు, జరుగు చున్న కర్మను గమనించు స్థితి అభ్యాసవశమున నిష్కామ కర్మ యోగులకు కలుగును. వారికి కర్మ జరుగుచుండుట ఎక్కువగ గోచరించును. చేయుచుండుట అందులో భాగమని తెలిసి యుండును. పడవ ఒకటి ప్రవాహమున ప్రయాణము చేయు చుండగ, పడవ నడచుచున్నదని గ్రహించుట ఒక పద్ధతి. ప్రవాహమే పడవను నడిపించుచున్నదని తెలియుట మరియొక పద్ధతి. పడవ లోని ప్రయాణికుడు తాను ప్రయాణము చేయుచున్నాడని భావించుట మరియొక పద్ధతి. పడవకు ప్రయాణికునికి ప్రవాహమే ఆధారము కదా! ప్రవాహమే లేనపుడు పడవకు, ప్రయాణికునికి ప్రయాణమే లేదు. నిజమునకు సృష్టియందు జరుగుచున్న కార్యము చాల హెచ్చు. చేయుచున్న కార్యములు అతి స్వల్పము. చేయుటనుండి సృష్టి యందు జరుగుచున్న కార్యములోనికి ప్రవేశించుటయే నిష్కామ కర్మయోగము నుండి కర్మసన్న్యాస యోగములోనికి ప్రవేశించుట.

క్రొత్తగ వాహనము నడుపుట నేర్చినవాడు తానే వాహనమును నడుపుచున్నానని భావించును. కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, మనస్సు హెచ్చరికగ వాహనము నడుపుట యందు లగ్నమై యుండును. క్రమముగ నిపుణతరాగ ఆడుచు, పాడుచు, సంభాషణములు చేయుచు, గంభీరమైన విషయములను మాట్లాడుచు వాహనము నడుపుచుండును. ఇచట గమనించవలసిన విషయమొకటున్నది. బాహ్యేంద్రియములు వాహనమును యాంత్రికముగ నడుపుచుండగ, అంతఃకరణములతో జీవుడు ప్రసంగించుట, ఆడుట, పాడుట చేయుచుండును. అతనికి వాహనము నడపు చున్నానను భావన కూడ అంతంత మాత్రముగనే యుండును. ఛలోక్తులతో ఆసక్తికర ప్రసంగములతో, పాటలతో సమయము గడచుచుండగ, ప్రయాణము పూర్తియగును. తాను వాహనము నడపిన భావమే యుండదు. అట్లే కర్మ సన్న్యాస యోగమున స్థిరపడిన జీవునికి కర్మ చేయుచున్నానను భావన యుండదు. కర్మ జరుగుచున్నదన్న భావనయే యుండును. ముందు తెలుపబడిన మూడు అధ్యాయముల నిష్కామకర్మ నిర్వహణ సూత్రములకు యీ అధ్యాయమున ఒక పరిపూర్తి ఏర్పడును.

మనసు కర్మలయందు లగ్నము కాక, దైవము నందు లగ్నమగుటచే కర్మలు అప్రయత్నముగను, అనాయాసముగను సాగునని తెలుపుట కర్మసన్న్యాసయోగ రహస్యము.

గురుపౌర్ణమి **– పార్వతీకుమార్**
29-7-2007

గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 5వ అధ్యాయము - కర్మసన్న్యాసయోగము)

ముఖ్య సూత్రములు

1. ఇది కావలెను, యిది వద్దు అను భావము లేక జీవితమును గడుపుట సన్న్యాసము.
2. సన్న్యాస పూర్వకమగు కర్మానుష్ఠానము సన్న్యాస యోగము.
3. మననము ద్వారా బ్రహ్మముతో యోగము చెందియుండుట వలన క్రమముగ బ్రహ్మము అనుగ్రహించును.
4. సర్వభూతాత్మల యందలి అంతరాత్మగ బ్రహ్మమును దర్శించుచు జీవించువానికి కర్మబంధమంటదు. అతడు విశుద్ధుడు, జితేంద్రియుడు.
5. బ్రహ్మముతో యోగమును స్మరణ మాత్రమున పొందియున్న యోగి యింద్రియములతో గాని, మనసుతో గాని కర్తవ్యము లను యాంత్రికముగ నిర్వర్తించుచు నుండును.
6. బ్రహ్మ స్మరణమున నున్న యోగి దినచర్య యంతయు స్వప్నముగ సాగును. కార్యము లన్నియు నీటి బిందువులవలె పడి జారిపోగా, తాను తామరాకువలె నుండును.
7. శరీరము, యింద్రియములు, మనసు, బుద్ధి, కర్తవ్య కర్మలు నిర్వహించుచుండుగ, చేతన యందలి సింహభాగము దైవ స్మరణమున నిలచుట కర్మసన్న్యాస యోగమై యున్నది.

8. పై తెలిపిన కర్మసన్న్యాస యోగమందు నిలచిన వానికి శాంతము స్థిరమై నిలచును.

9. పై విధముగ సన్యసించిన మనసు గల యోగి నవద్వార పురమగు శరీరమున సుఖముగ నుండును. అతని నుండి సర్వకార్యములు జరుగుచుండునే గాని, చేయుచున్న ట్లతని కనిపించదు.

10. కర్మ, కర్తృత్వము, కర్మఫలము ప్రకృతి సంబంధితములు. పరమాత్మయందు లగ్నమైన చేతనగల జీవాత్మకు అవి యంటవు. ఇతరులకు కర్మ చేయుచున్నామను భ్రమ యుండును.

11. పై విధమగు భ్రమ, భ్రాంతి ప్రకృతియం దిముడుటచే జీవాత్మ కేర్పడును. బ్రహ్మము స్మరణతో ప్రకృతిని దాటిన జీవాత్మ కివి యంటవు.

12. మేఘము క్రమ్మినపుడు సూర్యుడు గోచరింపడు. నిజమునకు సూర్యుని దరిదాపులయందు మేఘ ముండదు. భూమి పరిసరములయందే మేఘ ముండును. భూమి జీవులు సూర్యుని మేఘము క్రమ్మినదని భావింతురు. అది వారి భ్రమ. సూర్యుని మేఘము క్రమ్మలేదు. అట్లే ప్రకృతిబద్ధులైన జీవులకు అజ్ఞాన మను మేఘము క్రమ్మును. కాని ప్రతి జీవియు నిజముగ ఒక సూర్యుడే. పరబ్రహ్మము నందు నిష్ఠతో బుద్ధిని నిలిపి, అతని స్మరణమున తన్మయము చెందువారిని కల్మష పూరితమగు అజ్ఞాన మంటదు.

13. అట్టివారికి కుక్కమాంసము నందు, దానిని తిను చండాలుని

యందు, ఏనుగునందు, ఆవునందు విద్యావినయ సంపద గల బ్రాహ్మణుని యందు, సృష్టియందలి సమస్త వస్తు జాల మందు బ్రాహ్మ దర్శనమే జరుగుచుండును. వారిని సమదర్శనులు అందురు.

14. బ్రహ్మమునందు స్థిరపడిన మనసు కలవారు దేహము నందున్నను వారిని జనన మరణాదులు గాని, సంసారము గాని అంటదు.

15. అట్టివాడు స్థిరబుద్ధి కలిగి యుండుటచే మోహపడడు. అతనికి ప్రియముగాని, అప్రియముగాని యుండదు.

16. అట్టివానికి బ్రహ్మమునందే అక్షయమగు సుఖానుభూతి యున్నది. అతడు బాహ్యాస్పర్శలతో బంధము లేనివాడై యుండును.

17. బాహ్యాస్పర్శ యందుగల సుఖములకు ఆది, అంతము గలవు. భోగ దుఃఖములు గలవు. దివ్య స్మరణమున నిలచినవారు అట్టి ఆద్యంతములు గల సుఖమున యిమడక శాశ్వత సుఖమున నిలతురు.

18. అట్టివానికి శరీర మున్నను లేకున్నను ఒకటియే.

19. సమ్యగ్ న్యాసమున బ్రహ్మమును స్పందన యందు నిరంత రము భావించు యోగికి అంతరంగమున సుఖము, విరామము, జ్యోతిదర్శనము కలుగుచు తనను మరచిన స్థితి ఏర్పడును.

20. పై స్థితి లభించిన సన్న్యాసులు కేవలము కనులు మూసు

కొనియే కాలము గడుపరు. సర్వజీవులకు హితము కలిగించుటయం దాసక్తి కలిగి జీవించు చుందురు.

21. ఇట్టి యోగుల బుద్ధి నుండి, చిత్తము నుండి, యింద్రియ ముల నుండి, వాక్కు నుండి, నడవడిక నుండి బ్రహ్మమే విదితమగును.

22. వీరు ప్రాణాయామ మార్గమున అంతర్గతులై బ్రహ్మోపాసనము చేయుచు, ముక్తస్థితి యందుండగ వీరి నుండి బ్రహ్మమే జీవులకు వలసిన హితమును గావించు చుండును.

23. కర్మ సన్న్యాస యోగులు చేయు కర్మలన్నియు వాని నుండి దైవము నిర్వర్తించునవే. వారికి కర్తృత్వభావమే యుండదు. ఇష్టాయిష్టము లుండవు. కావున కర్మబద్ధులు కారు.

24. సన్న్యాసమను పదమునకు గీతయందలి యీ అధ్యాయమే సరియగు, సంపూర్ణమగు నిర్వచనము. ఈ సూత్రములకు సరిపడనిది సన్న్యాసము కాదు. ఇది సత్యము.

1

కర్మ - జ్ఞానము

సన్న్యాసం కర్మణాం కృష్ణ పున ర్యోగం చ శంససి ।
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్॥ 1

సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ ।
తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే ॥ 2

శ్రీకృష్ణా! నీ ప్రబోధమున కర్మయోగము, కర్మత్యాగము రెంటిని పలుకుచున్నావు. ఇంతకును జీవుడు కర్మయోగము నందుండవలెనా, కర్మత్యాగము నందుండవలెనా అని అర్జునుడు ప్రశ్నించినాడు.

అర్జునా! కర్మత్యాగము, కర్మయోగము రెండును విముక్తి కలిగించ గలవు. రెండిటిలో కర్మయోగమే శ్రేష్ఠము.

కర్మల నెవ్వరును త్యాగము చేయలేరు. నిద్రించుట, లేచుట, ఆలోచించుట, భుజించుట, మాటాడుట దేహాకి తప్పనిసరి యగు కర్మలు. కర్మత్యాగ మనగా, కర్మఫలత్యాగమే అని తెలియవలెను. అంతియే కాదు, కర్మసంగ త్యాగము కూడ.

కర్మల నాచరించుచు, వానిచే తగులకొనబడకుండుట కర్మ యందు కౌశలము. కర్మలను నిర్వర్తింపకుండుటకు ఎవ్వడును సమర్థుడు కాడు. నిర్వర్తించునపుడు కర్మ సంగము, కర్మ ఫలము కలుగుచుండును. త్యాగము చేయవలసినది సంగము, ఫలమే గాని కర్మలు కాదు.

ఫలముల నాశించక, కర్తవ్య కర్మలను నిర్వర్తించుచు, నిర్వర్తింపబడు కర్మలనుండి సంగము పొందక నిర్వర్తించుట కర్మయోగమే యగును. "*కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన। మా కర్మఫల హేతుర్భూ ర్మా తే సంగోఽ స్త్వకర్మణి॥*" (2-47) అను నాలుగు సూత్రములుగ కర్మలు నిర్వర్తించు పద్ధతి దైవము తెలిపినాడు. (వివరమునకు పై శ్లోక వివరము చూడుడు). అట్లాచ రించినవాడు కర్మయోగియే. ఈ మార్గమున కర్మ క్షాళనమై, జీవుడు ముక్తుడగునని తెలుపుచున్నాడు.

పై విధముగ కర్మల నాచరించు కర్మయోగి క్రమముగ, కర్తృత్వ భావనను కూడ విసర్జించును. తన నుండి కర్మలు జరుగు చున్నవి గాని, తాను చేయుట లేదని తెలియును. "*కర్మ బ్రహ్మోద్భవం విద్ధి*" - కర్మ బ్రహ్మము నుండి పుట్టుచున్నదని, బ్రహ్మము అక్షర పరబ్రహ్మము నుండి పుట్టినవాడని, కావున సృష్టియందు కర్మ మనివార్యమని, కర్మమును బ్రహ్మవలె నాచరించినచో జీవుడు ముక్తుడుగ నుండునని ముందే తెలుపబడినది.

కావున కర్మయోగమున నిష్ణాతుడైనవాడు తననుండి జరుగు కర్మ యంతయు దైవ సంకల్పమని తెలిసియుండును. కర్త తాను

కాడు కనుక, కర్మలు చేయుచున్నానను భావన కూడ యుండదు. **కర్తృత్వ భావన లేక చేయుచు నుండును.** ఈ స్థితిని కర్మ సన్న్యాస స్థితి అందురు. కర్మయోగికే కర్మ సన్న్యాస స్థితి లభించును. కర్మలు మానుట కర్మ సన్న్యాసము కాదు.

2

సన్న్యాసము

జ్ఞేయస్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధా త్ప్రముచ్యతే ॥ 3

దేనిని కోరనివాడు, ద్వేషింపనివాడు సన్న్యాసి అని తెలియుము. అతడే నిత్య సన్న్యాసి. అతనికి రాగద్వేషములు లేవు కనుక బంధము లేదు.

కోరుట రాగము. తనకిది అక్కర లేదనుకొనుట ద్వేషము. తనకిది కావలె ననుకొనుట రాగము. ప్రతి జీవికిని జీవితమున కొన్ని జరగవలెనని, కొన్ని జరుగకూడదని అనిపించు చుండును. జరుగవలెనని కోరినవి జరుగుట అంతంతమాత్రమే. అట్లే జరుగ కూడదనుకున్నవి జరుగుట లోకవిదితమే. కష్టము, నష్టము, మృత్యువు రాకూడదని; సుఖము, లాభము, జీవనము సాగవలెనని సామాన్య జీవు లందరును కోరుదురు. కాని జీవితమున నిత్య సత్యమైన చేదు నిజమొకటి తారసిల్లుచునే యుండును. ఆరోగ్యము కోరినను అనారోగ్యము వచ్చును. లాభము కోరినను నష్టము వచ్చును. ఆయుష్షు కోరినను మృత్యువు వచ్చును.

జీవునికి తీరని కోరిక లెప్పుడును మిగిలిపోవును. కోరని బంధములు ఎప్పుడును ఏర్పడుచుండును. తీరని కోరికలు, వదలని బంధములు జన్మపరంపరలు కలిగించు చుండును. వీటన్నిటికిని రాగద్వేషములే కారణము.

జీవితము కర్మానుసారము సాగుచుండగ, కేవలము అందు తన కర్తవ్యమును నిర్వర్తించుచు జీవించువాడు బంధముల నుండి బయల్పడుట కవకాశమున్నది. కర్తవ్యములను నిర్వర్తించినపుడు ఫలితములు కోరుట రాగము. దృష్టి ఫలితములపై నున్నపుడు సత్ఫలితము కొరకై ప్రక్కదారులు తొక్కుట బంధము. కర్మము సత్ఫలితముల నిచ్చినపుడు వానియందు తగుల్కొనుట మరల రాగము. కర్మలు ఫలించనపుడు కలుగునది క్రోధము, ద్వేషము. ఇట్టి ఒడుదొడుకుల జీవితములే అన్నియును.

కర్తవ్యమే తనవంతని, మిగిలిన దంతయు దైవమని భావించి కాలక్రమమున తనను సమీపించు కార్యములను రాగ ద్వేషములు లేక నిర్వర్తించుట నిజమగు సన్న్యాసము. సన్యసించిన బుద్ధితో కర్మల నాచరించుట కర్మసన్న్యాసము. అనగ రాగద్వేషముల నంట నీయక ఆసాంతము కర్తవ్యకర్మలనే నిర్వర్తించుట ఈ శ్లోకమున సూచింపబడినది. అట్లు నిర్వర్తించువారు సంసార మందున్నను సన్న్యాసియే. రాగద్వేషములకు చిక్కినవారు సన్యసించిననూ సంసారులే.

3

కర్మ - జ్ఞానము - సాంఖ్యము

సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।
ఏక మప్యాస్థితః సమ్య గుభయో ర్విందతే ఫలమ్ ॥ 4

కర్మయోగము, జ్ఞానయోగము వేరువేరని భావించువారు పసివారు. తెలిసినవారట్లు భావింపరు. ఇందే ఒక్క దానినైనను ఆచరించువాడు రెండవ దానిని కూడ పొందును.

కర్మ జ్ఞానములు అవినాభావ సంబంధము కలిగియున్నవి. అవి అవిభక్తములు. చేయుచు సాగువానికి చేయుట యందలి జ్ఞానము తెలియుచు నుండును. తెలుసుకొనుచు ఆచరించు వానికి ఆచరించుట యందలి నేర్పు కలుగును. ఆచరించుట, తెలియుట, తెలుసుకొనుచు ఆచరించుట రెండును అవిభక్తముగ సాగునే గాని తెలుసుకొనుట ముఖ్యమని, ఆచరించుట ముఖ్య మని విడదీయుట తెలియని తనము.

ఆచరించువాడు తెలుసుకొనుచు ఆచరించవలెను. తెలుసు కొనువాడు తెలుసుకొనుచు ఆచరించవలెను. ఇట్లొకదాని వెంట

ఒకటి జరుగుటయే యుండును గాని, కేవలము తెలుసుకొని ఆచరించకపోవుట, ఆచరించుచు తెలుసుకొనకపోవుట యుండదు. పశువులు సైతము ఆచరించుచు తెలుసుకొనుచు, తెలుసు కొనుచు ఆచరించుచు యుండును. ఇందులో ఏది ముఖ్యము? అను ప్రశ్న పసితనమే. ఉదాహరణకు మామిడిపండు రుచి ఎట్లుండునో తెలుసుకొనినవాడు రుచి చూచుట మానునా? మామిడిపండు భుజించినవాడు రుచి తెలియక యుండునా? కేవలమొక చొప్పదంటు ప్రశ్న అర్జునుడు వేసినా డనిపించును. అర్జునుడు నరులకు ప్రతినిధి. నరులలో విపరీత వ్యాఖ్య చేయు వారుందురు. అట్టివారికి కూడ సమాధానము తెలియవలెనని అర్జును డట్లు ప్రశ్నించినట్లు గోచరించును.

పై ఉదాహరణలో మామిడిపండు భుజించుట ఆచర ణము (కర్మయోగము). భుజించునపుడు మామిడిపండు రుచి ఎట్లుండునో తెలుయుట జ్ఞానయోగము. కర్మయోగము లేని జ్ఞాన యోగము లేదు. అందులకే ముందు కర్మయోగము తెలుప బడినది. అటుపైన జ్ఞానయోగము తెలుపబడినది. పండు భుజించిన వానికి రుచిజ్ఞాన మెట్లును కలుగును. రుచి జ్ఞానము కలిగి, పండు భుజింపనిచో ఆ జ్ఞానము అనుభవైక జ్ఞానము కాక, మానసికము గనే యుండిపోవును. పై కారణమున కర్మయోగమే శ్రేయస్కరమని దైవము గీతయందు పదే పదే పలుకుచుండును. ఆచరించుచు తెలుసుకొనుట సులభము. తెలుసుకొనువాడు ఆచరించుట మాని యింకను తెలుసుకొనవలెనని భ్రాంతిపడుట భ్రష్టతను కలిగించును.

తెలిసినంతమేర ఆచరించుట అవసరము. మొత్తము తెలిసిన వెనుక ఆచరింతు ననువాడు మూర్ఖుడు. తెలిసినది ఆచరించుచుండగ మరికొంత తెలియుట యుండును. గాలిని పీల్చుచు వదలుచు నుండవలెను గాని, రోజు మొత్తమున కొక్కమారు పీల్చి, ఒక్కమారు వదలుట సాధ్యమా? చీకటిలో చిన్న దీపము ఒకటి రెండడుగుల మేర దారి చూపును. ఒక మైలు దూరము ఈ చిన్న దీపముతో ఎట్లు ప్రయాణము చేయగలను అనుకొనువాడు మూర్ఖుడు. దీపము చూపునంతమేర నడచినచో మరి రెండడుగుల మార్గము కనుపించును. కేవల మాలోచించు వానికి నడక సాగదు. చిన్న దీపపు కాంతితో పెద్ద అడవిని కూడ దాటవచ్చును. అతి చిన్నదియైన నావతో పెద్ద నదిని దాటవచ్చును. ఆచరణ వలన జ్ఞానము లభించుచునే యుండును. అనుభవైక జ్ఞానము నుండి మరికొంత ఆచరణ, మరికొంత జ్ఞానము లభించు చుండును. అట్లుకాక మీన మేషములు లెక్కించుచు చతికిల పడువానికి జ్ఞానయోగము లేదు. కర్మభ్రష్టత వలన జీవితము కూడ చెడును.

ఆచరించుచు సాగువానికి జ్ఞానము కలుగుచు నుండును. కర్మయోగమున కర్మాచరణమునకు దైవము నాలుగు సూత్రముల నిచ్చినాడు. అవి వరుసగా యిట్లున్నవి.

1. నీకు కర్మ నిర్వర్తించు అధికారమున్నది.

2. కర్మఫలములయందు నీ కధికారము లేదు. కావున

ఫలముల కాశించుచు కర్మము నిర్వర్తించుట వలదు. కర్మము నిష్కామమే కావలెను.

3. కర్మ నిర్వహణమున వక్రమార్గముల ననుసరింపకుము. అట్లు చేసినచో కర్మ నిన్ను బంధించగలదు.

4. ఫలితమాశింపక, వక్రత లేక కర్తవ్యకర్మను నిర్వర్తించు నపుడు ఫలితములు సామాన్యముగ, వైభవముగ నుండును. వైభవము, శోభనములకు ఆకర్షింపబడక కర్తవ్యకర్మ యందు కొనసాగుము.

పై విధముగ నాచరించు వానికి కర్మాచరణము సుఖము నిచ్చును. ఆచరణయందే సుఖమున్నదని, ఫలితముల యందు కాదని తెలియును. అట్లాచరించు వారు జ్ఞానయోగమున తెలిపిన పండ్రెండు కర్మ యజ్ఞములను ఆచరించు సమర్థతను పొందుదురు. ఆచరణమున పరహితము మెండై, స్వహితము మరుగున పడుచుండును. ఆచరణయందు పవిత్రత పెరుగుచునుండుగ, రాగ ద్వేషములు లేని ఆచరణ సిద్ధించును. అదియే సన్న్యాసమని ముందు శ్లోకమున దైవము తెలిపినాడు. జ్ఞానము, ఆచరణము, సమన్వయింపబడినపుడు ఏర్పడు వైరాగ్యము కారణముగ జీవుడు పొందు స్థిరతయే సాంఖ్యము. అదియే యోగస్థితి.

4

సాంఖ్యము - యోగము

యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే ।
ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5

జ్ఞానయోగులచే పొందబడు గమ్యమే కర్మయోగము చేతను పొందబడుచున్నది. కర్మ జ్ఞానములు రెండిటిని ఒకటిగ చూచువాడే తెలిసినవాడు.

ఏమి చేయవలెనో, ఎట్లు చేయవలెనో తెలిసి కర్మమును చేయుట కర్మబంధము నుండి జీవునికి విముక్తి కలిగించును. విముక్తి కలిగిన తరువాత కూడ కర్మాచరణమే యుండును. ఆచరణమే ఆనందమయమై నిలచును. అపుడు నిర్వహించునది దివ్యకర్మ యని పిలువబడును. మహాత్ము లందరును దివ్య కర్మమునే నిర్వర్తించు నుందురు. వారికి కర్మబంధము లేదు. ఆచరణమందలి ఆనందమే యుండును. ఫలితముల యందు వారి కాసక్తి యుండదు. దేనిని గూర్చి రాగము గాని, ద్వేషముగాని యుండదు. తటస్థ స్థితి యందుండి తమ వద్దకు వచ్చిన కర్మను

ధర్మ మాధారముగ నిర్వర్తింతురు. ఇట్టి తటస్థస్థితి వశిష్ఠ, అగస్త్యాది మహర్షులు నిర్వర్తించి చూపిరి. ఇదియే నిజమగు సన్న్యాసము.

దైవము గీతయందలి రెండవ అధ్యాయమున బుద్ధిని ఆశ్ర యింపమని తెలిపెను. మూడవ అధ్యాయమున కర్మ మాచరింప మని తెలిపెను. నాల్గవ అధ్యాయమున కర్మాచరణము త్యాగ స్ఫూర్తిని కలిగించి, పరహిత యజ్ఞములనెట్లు నిర్వర్తింప చేయునో తెలిపెను. తదనుగుణమగు జ్ఞాన మెట్లబ్బునో తెలిపెను. ఐదవ అధ్యాయమున తటస్థస్థితిని చేరుట తెలుపుచున్నాడు. ఈ సోపాన ములను యిట్లే అధిరోహించుట వలన ప్రాపంచిక బంధములు తప్పక తొలుగగలవు. భగవద్గీత యందలి అధ్యాయము లన్నియు యిట్లొక ఆరోహణ క్రమమును కలిగియున్నవి. యోగ మనగ క్రమముగ యిందలి సోపానములను అధిరోహించుటయే.

మొదట బుద్ధిని ప్రచోదనము గావించుకొని, చేయదలచిన పనులను చేయుట కాక, చేయవలసిన పనులను చేయుట నేర్వ వలెను. చేయవలసిన పనులు చేయుచున్నపుడు ఫలితముల నాశించుట, ఫలితముల కొరకై వక్రతల నాశ్రయించుట, కర్మ ఫలములకు రాగము కారణముగ లొంగుట విసర్జించవలెను. అట్లు చేయు కర్మాచరణము శుద్ధమై త్యాగపు తీరములు చేరును. అపుడే ద్రవ్యాది ద్వాదశ యజ్ఞములు నిర్వహించు సామర్థ్యము కలుగును. అట్లు కర్మయం దుత్తీర్ణుడైనవాడు తటస్థ స్థితిని చేరి సన్న్యాసి యగును. ఇదియొక ముఖ్యమగు క్రమము. తోచినది తోచినట్లు చేయుటగాక, పై క్రమము ననుసరించి యుండవలెను.

5

ముని - మననము - బ్రహ్మము

సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తు మయోగతః ।
యోగయుక్తో ముని ర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥ 6

గొప్ప బాహువులుగల ఓ అర్జునా! కర్మ సన్న్యాసము కర్మ యోగము లేకుండ పొందుట దుఃఖము కలిగించును. కర్మ యోగముతో కూడిన మననశీలుడు శీఘ్రముగ బ్రహ్మమును చేరుచున్నాడు.

సన్న్యాస మను పేర పనిమానుట, పని తప్పించుకొనుట భ్రష్టత్వమును కలిగించును. పని దొంగలే కాషాయము ధరించి కపట సన్న్యాసులై తిరుగుచు నుందురు. నిజమగు సన్న్యాసులు (కాషాయము ధరించి యున్నవారు) ఈ కపట సన్న్యాసుల కారణ ముగ, ఒక్కొక్కప్పుడు అనుమానింపబడుదురు. మన దేశమున బిచ్చగాండ్రందరు కాషాయమే ధరించి తిరుగుచూ ఉందురు. అందు నిజమగు సన్న్యాసులు లేకపోలేదు.

నిజమగు సన్న్యాసులు సతతము దైవస్మరణము చేయుచు

నుందురు. వారి ఉచ్ఛ్వాస, నిశ్వాసలయందు దివ్యస్మరణమే సాగుచునుండును. అట్టివారు దేహమునకు ప్రాధాన్యమీయక దైవమే ప్రధానముగ, ఆధారముగ మననము చేయుచు మునివలె జీవించుచుందురు. వారి సంస్కారమున ప్రాపంచిక ఆకర్షణలు జారిపోవుటచే వారు కేవలము దైవస్మరణ చేయుచు, దొరికినది భుజించుచు, నిదురవచ్చినపుడు నేలపై నిద్రించుచు, నదీ తటాక ముల స్నానములు గావించుచు, గృహములందు కాక ప్రకృతి యందే జీవించుచు నుందురు. ప్రపంచమున సన్న్యసించి జీవించుట సులభము కాదు. దేహభ్రాంతి, దేహావసరములు లేనివారే అట్లు జీవింతురు. అట్టివారు గౌరవింపదగినవారు. కాని అట్లు జీవించుట కష్టము అని దైవము తెలుపుచున్నాడు. కష్ట మనగ అసాధ్యమని కాదు. కాని అది సాధ్యపడినవారు కొందరే యుందురు.

కష్టతరమగు ఆ మార్గముకన్న ముందు తెలుపబడిన కర్మ జ్ఞాన యోగముల ద్వారా శీఘ్రముగ దైవమును చేరవచ్చునని దైవమే తెలుపుచున్నాడు. బుద్ధియోగముతో కర్తవ్యములను నిర్వర్తించుచు దివ్యస్మరణ యందుండుట మేలని తెలుపు చున్నాడు. అనగా శ్వాసయందు స్మరణ సాగుచుండగ, కర్తవ్యము లన్నిటిని ఉదాసీన తతో నిర్వర్తించుచు నుండుట. చిత్తము శివుని పైన, చేతులు ప్రపంచములో నుంచుట కూడ సన్న్యాసమే అని కృష్ణుని మతము. వశిష్ఠాది బ్రహ్మర్షులు అట్లాచరించినవారే. జనకాది రాజర్షులు కూడ అట్లాచరించిన వారే.

సన్న్యాస మనగ సమ్యక్ న్యాసము. అనగ ఒడుదొడుకులు

లేని స్మరణ. హృదయమందు 'సోఽహం' శబ్ద రూపమున వసించి యున్న దైవమునందు బుద్ధిని నిలిపి దైనందిన కార్య క్రమములను యథాలాపముగ నిర్వర్తించువాడు కూడ సన్న్యాసియే. సరళమగు మార్గముండగ దుఃఖపూరితమగు మార్గమేల? జీవులలోని రజస్తమస్సులు వారి నెప్పుడును ప్రపంచములోనికి నెట్టుచునే యుండును. లభించినది భుజించుట, ఏ ప్రదేశమున నైనను నిద్రించ గలుగుట, ఎప్పుడును హృదయమున స్మరణయందే యుండుట, దేహాభిమానము లేకుండుట, దేహియైన జీవునకు దుఃఖకరము. దేహముతో పని చేయించుచు, బుద్ధితో దైవస్మరణ యందుండుట సులభము. ఇట్లుండువారు దేహముతో చేయు పనుల ద్వారా ప్రపంచమున చిక్కుపడియుండక యుండుటకు కర్మజ్ఞాన రహస్యములను తెలిపినాడు.

ఇచ్చటొక ముఖ్య సూత్రమున్నది. బుద్ధియోగమున చేరి, కర్మ జ్ఞాన యోగ సూత్రముల సహాయముతో చిక్కుపడక యుండుట మాత్రమే పరమావధి కాదని, మననము జరుగవలెనని దైవము బోధించు చున్నాడు. అనన్య మననము వలననే జీవుడు బ్రహ్మమును పొందగలడు. మననము ఎట్లు చేయవలెను? "దైవమే నేనుగ నున్నానని" చేయవలెను. అదియే "సోఽహం" అను మంత్రము. 'సహ' అనగ అతడు. 'అహం' అనగ నేను. "అతడే నేను" అని హృదయము ఘోషించుచున్నది. దానియందు స్థిరపడుట సన్న్యాసము. అట్లు నిరంతరము న్యాసపూర్వక మననము ఎవని యందు జరుగునో అతడే ముని. అతడు బ్రహ్మమును అచిరకాలమున చేరగలడు.

6

సోపానములు - యోగము

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।
సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7

యోగయుక్తుడైనవాడు పరిశుద్ధమైన హృదయము గలవాడగును. మనోవికారములను జయించిన వాడగును. ఇంద్రియములను జయించిన వాడగును. సమస్త ప్రాణికోటి యందును ఒకే ఆత్మ యున్నదని తెలిసినవాడు. ఇట్టి జ్ఞానము గలవాడు పనులాచరించు చున్నప్పుడు గూడ బంధమున పడడు.

యోగయుక్తు డనగ విచక్షణ (బుద్ధి)తో నిష్కామముగ కర్తవ్యముల నాచరించుచు, త్యాగనిరతితో జీవించుచు నుండువాడని ముందు అధ్యాయము లందలి సారాంశము గ్రహించినచో తెలియును. అట్టివాడు యింద్రియ వినియోగము విచక్షణతో గావించును. కావున జితేంద్రియు డగును. ఇంద్రియ వ్యాపారములు శమించినపుడు మనసునకు పూర్ణమగు జయమే లభించును. అట్టి మనసు కామబద్ధము కాదు గనుక, బుద్ధియను వెలుగును ప్రతిబింబింపజేయుచు పూర్ణచంద్రునివలె యుండును.

కామము మితిమీరినపుడే మనసునకు హెచ్చుతగ్గు లుండును. కామము విచక్షణకు లోనుగ పనిచేయుచుండుట వలన మనసునకు స్థిరము కలుగును. వికారములు చెందక యుండును. అట్టి వానిని 'విజితాత్మ'డని దైవము సంబోధించు చున్నాడు.

నిర్మలమగు మనసు కలిగినవానికి హృదయము విశుద్ధమై యుండును. పరిశుద్ధమై యుండును. పరిశుద్ధమగు హృదయము, ప్రశాంతమగు మనస్సు, విధేయులైన యింద్రియములు గల జీవుడు నిర్వర్తించు కార్యములు క్రమబద్ధముగ నుండును. అందు ఫలాసక్తి లేదు. ఫలితముల యందు ఆకర్షణయు లేదు. చేయుట యందు వక్రతయు లేదు. అట్టి వానిని కర్మలెట్లు బంధించగలవు? బంధించలేవు. వాని కనుదిన కర్మాచరణము ఆనందమే. వాని కాచరణమే ఆనందము. అట్టివాడు యోగయుక్తుడు.

యోగయుక్తుడైన వాడు, భగవత్స్మరణమున కూడ యుండునని ముందు శ్లోకమున దైవము తెలిపినాడు. పై తెలిపిన నియమములకు మననము కూడ తోడైనచో అన్ని జీవుల యందు తన యందున్నవాడే యున్నాడని తెలియును. ఇది ఒక చక్కని సోపానక్రమము.

1.	విచక్షణ	ఇంద్రియముల నిబద్ధత	జితేంద్రియుడు
2.	నిష్కామ కర్మ	మనసు ప్రశాంతత చెందుట	విజితాత్మ

3. యజ్ఞార్థ కర్మ	మనసు నిర్మల మగుట	విశుద్ధాత్మ
4. సన్న్యాసము	రాగద్వేషములు మనస్సు విడచుట	యోగము
5. మననము	అన్నిజీవులయందలి ఆత్మను దర్శించుట	ముక్తస్థితి.

అధ్యాయముల యందలి సూత్రములను పూసకెక్కించినట్లుగ అమర్చుకొనుచు, అవగాహన చేసుకొనుచు శ్రద్ధాళువగు ఆత్మ సాధకుడు ముందుకు సాగవలెను.

నిత్యము భగవత్స్మరణము నందుండువాడే (మననము చేయువాడె) ముని యని తెలుపబడినది. అట్లు స్మరణము చేయుటవలన అన్నిటియందు మూలముగ నున్న బ్రహ్మమును పొందగలడని కూడ తెలుపబడుచున్నది. అనగా అన్నిటి యందలి దైవము దర్శించినవాడు మననము ఫలించనివాడే యగుచున్నాడు. మననము జరుగుటకు హృదయ నైర్మల్యము, మనోప్రశాంతత ఆధారమై యున్నవి. మనోప్రశాంతతకు కామము లేని కర్తవ్య కర్మ, విచక్షణ ఆధారములై యున్నవి. ఇటుకమీద యిటుక పేర్చి యిల్లు కట్టినట్లు, ఈ వరుస క్రమమును గ్రహించి అట్లాచరించి పురోగతి చెందవలెనే గాని, మరియొక మార్గము లేదు. సరాసరిగ అందరి ఆత్మలయందు వసించియున్న దైవమును చూచుట వీలుపడదు. "విశ్వం విష్ణుః" అని పలుకుట సులభమే. తెలియుట శ్రద్ధాళువునకు మాత్రమే అనుభవైకము.

7

గమనిక; సాక్షిత్వము

నైవ కించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।
పశ్యన్ శృణ్వన్ జిఘ్రు న్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8

ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిష న్నపి ।
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ 9

పరతత్త్వముతో యోగయుక్తుడైన తత్త్వవేత్త చూచుచున్నను, వినుచున్నను, తాకుచున్నను, వాసన చూచుచున్నను, తినుచున్నను, నడచుచున్నను, నిదురించుచున్నను, శ్వాసను నిర్వర్తించు చున్నపుడును, మాట్లాడుచున్నను, విషయములు గ్రహించుచున్నపుడును, కళ్ళను తెరచినను, మూసినను, ఈ సమస్తమును సాక్షీభూతుడుగ గమనించుచునే యుండును గాని, తానే చేయుచున్నాడని భావింపడు.

పై విధముగ నుండుట నొక విచిత్రము. కాని పరతత్త్వము నాశ్రయించిన వానికి, యోగయుక్తుడైన వానికి యిది సత్యము. యోగయుక్తుడైనవాడు తన శరీరమును, యింద్రియములను,

మనసును తనకన్న వేరుగ గమనించును. అతనికి మనసు, యింద్రియములు, శరీరము ఒక వాహనము వంటివి. బాహ్య ప్రపంచమున పనిచేయునపుడు శరీరము నతడు వాహనముగ వాడును. ఆవశ్యకత లేనపుడు దానియందుండక, తనయందు తా నుండును.

తనయందు తానున్న యోగికి తన శరీరావసరము లన్నియు తనవనిపించవు. అవి ప్రకృతి గుణముల వలన ఏర్పడినవని, ఆ గుణములే పంభూతములతో రూపుగట్టుకొని యున్నవని తెలిసి యుండును. అది క్షరమని, తా నక్షరుడని తెలిసి యుండును. తాను ఆత్మయని, తన ఎరుక బుద్ధియని, ఆత్మ-బుద్ధిగ తా నున్నాడని, మనస్సు, ఇంద్రియములు, దేహము ద్వారా బహిర్గతు డగు చున్నాడని, తన దేహము రక్త మాంసాదులు కలిగి యున్నదని తెలిసియుండును. అట్టివానికి దేహాత్మ భావముండదు. ఆత్మ భావనయే యుండును.

ఉదాహరణకు, మన కొక గుఱ్ఱము (ఎక్కి తిరుగుటకు) ఉన్నదనుకొనుడు. గుఱ్ఱము నెక్కి సమస్త కార్యములు నిర్వహించి, అటుపైన గుఱ్ఱమును దిగి మనము మన గృహమున నుందుము. గుఱ్ఱము చూచుచున్నను, వినుచున్నను, తాకుచున్నను, వాసన చూచుచున్నను, తినుచున్నను, కదలుచున్నను, ఊపిరి పీల్చి విడచుచున్నను, కండ్లు తెరయుచు మూయుచున్నను సాక్షీభూతు లమై చూతుము గాని అవి యన్నియు మనము చేయుచున్నా మనుకొనము గదా! మన వాహనము మనకన్న వేరని మనకు

తెలియును. వాహనపు చేష్టలు మన చేష్టలు కాదని మనకు తెలియును. అదే విధముగ యోగయుక్తుడు తా నక్షరుడగు ఆత్మ యని; మనసు, యింద్రియములు, శరీరము తన వాహనమని, వాహనపు మనో యింద్రియపు వ్యాపారములు తనవి కావని తెలిసియుండును. ఇట్టి వారిని కర్తృత్వ భావనను దాటిన వారని తెలుపుదురు. ఇట్టివారే సన్న్యాసులు. వారు సాక్షితనమున నుందురు. సమస్త కర్మలు తమనుండి జరుగుచున్నపుడు కూడ సాక్షిగనే యుందురు. తాము బ్రహ్మమునందే మనన మార్గమున యందురు.

8

తామరాకు - నీటి బిందువు

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా ॥ 10

బ్రహ్మమునకు సమర్పితముగ, సంగము విడచి కర్మల నెవరైతే నాచరింతురో, అట్టివారిని పాప మంటదు. నీటిబొట్లు ఎన్ని పడినను, తామరాకు నంటవు కదా!

ఉషా సమయమున మంచుబిందువులు తామరాకులపై పడుట, ఆ బిందువులు సూర్యరశ్మికి ముత్యములవలె ప్రకాశించుట చూచి మనస్సంతయు ఆహ్లాదము చెందును. అట్లే బ్రహ్మమునకు సమర్పితము చేసిన మనసుతో కర్మ లాచరించు వారు, వాని ఫలముల యందు ఆసక్తి లేకుండుటచే చేయు పనులు ఆహ్లాదము కలిగించుచు నుండును. ఆసక్తి ఫలముల యందు కలిగినచో ఆహ్లాదము లేకపోగా మనసు ప్రపంచమున కంటును. నీటి బిందువు తామరాకుపై నున్నను, తామరాకునకు దానిపై ఆసక్తి లేదు. అట్లే కర్మలను మనసు ద్వారా ఆచరించువాడు ఫలములయం దాసక్తి లేక ఆచరించినచో అతనిని ఆ కర్మలు

బంధించవు. అంటను కూడ నంటవు. నీటి బిందువులు ప్రతి నిత్యము తామరాకుపై రాలుచు నుండును. ఆకునుండి జాలు వారుచు పోవుచునుండును. ఈ విషయమున తామరాకు సాక్షీ భూతముగ నుండునే గాని రాలిపోవుచున్న బిందువులను గూర్చి బాధపడదు. కర్మము లన్నియు వచ్చి పోవునవే. తా నాధారముగ అనేకానేక కర్మలు వచ్చి, నిర్వర్తింపబడి పోవుచునుండును. తామరాకు నీటి బిందువుల ననుసరించనట్లే, కర్మల ననుసరించి బుద్ధి పోరాదు. బుద్ధి ననుసరించి మనస్సుండవలెను. కర్మలు నిర్వర్తింపబడుచున్నను, బుద్ధిని దైవముపై నిలపిన, కర్మలు జరిగి పోవుట, తాను దైవముతో నుండుట జరుగును. "బుద్ధిః కర్మాను సారిణి" అను నానుడి కలదు. సామాన్యుల బుద్ధి కర్మల ననుస రించుచు పోవును. అపుడతడు కర్మబద్ధుడగును. బుద్ధిని దైవముతో జోడించి, మనస్సేంద్రియ దేహములతో కర్మలను నిర్వర్తించుట వలన ఆనంద ముండును గాని బంధ ముండదు.

ముందు శ్లోకమున మననము ద్వారా దైవముతో సంబం ధము ఏర్పరచుకొనుట తెలుపబడినది. ఆ బంధము పటిష్ఠమైనచో నిర్వర్తించు కర్మలయందు ఫలాసక్తి యుండదు. దైవమునం దాసక్తి చెందిన బుద్ధి, ఫలములయం దాసక్తి కలిగి యుండదు. అట్టి వానిని కర్మ లంటవు.

9

యోగి - కర్మ నిర్వహణము

కాయేన మనసా బుద్ధ్యా కేవలై రింద్రియై రపి ।
యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాఽఽత్మ శుద్ధయే ॥11

ఆత్మశుద్ధిగల యోగులు సంగము లేక కర్మ నిర్వర్తింతురు. కర్మ నిర్వహణము శరీరము చేత, యింద్రియముల చేత, మనసు చేత నిర్వర్తింప చేయుచున్నను, యోగమున నిలచియే చేయుదురు.

శరీరము, యింద్రియములు, మనసు ఈ మూడింటిని కలిపి దేహ మందురు. దానిని ధరించినవాడు మానవుడు. మానవుడు, అతని దేహము అను వర్గీకరణము అవగాహన నిచ్చును. సదవగాహన గల మానవుడు బుద్ధియందుండి మనసు, యింద్రియములు, శరీరమును తన వాహనముగ వినియోగించుచు కర్మల నాచరించును. అట్లాచరించు వాడు బుద్ధియందు దైవస్మరణమున నుండుటచే దైవముతో యోగము చెంది యుండును. దైవముతో యోగము చెందుట వలన కర్మల యందు సంగము లేక నిర్వర్తించుట ఏర్పడును.

కేవలము సంగము లేక కర్మలను నిర్వర్తించుట సాధ్యము కాదు. బుద్ధి సంగము దైవముతో నున్నపుడు కర్మముతో నుండదు. అందులకే ముందు శ్లోకము నందు మననము తెలుపబడినది. బ్రహ్మమును స్మరించుచు యుండుటయే యిచ్చట తెలిపిన మననము. మననము వలన మానవుని బుద్ధి దైవముతో యోగము చెందియుండును. అట్టి వాడు యోగయుక్తుడు. యోగయుక్తుడు క్రమముగ జితేంద్రియు డగునని, జయింపబడిన మనసు గల వాడగునని, కల్మషములు తొలగిన వాడగునని, సర్వభూతముల యందలి ఆత్మ తత్త్వము నెరిగిన వాడగునని, కర్మలయందు సంగమము కూడ తొలగిన వాడగునని 6,7,8,9 శ్లోకములందు తెలుపబడినది. పాఠకులకు అదే విషయమును మరల మరల తెలియపర్చుట ముఖ్యము. 'చర్విత చర్వణము' అనునది సాధన మార్గమున అతిముఖ్యము. తెలిసిన దానినే మరల మరల తెలియ చెప్పుట బోధన మగును.

పై విధముగ నేర్పడుటకు కారణము కర్మ జ్ఞాన యోగ మందలి సూత్రములను క్రమముగ ఆచరించుటే. అట్లాచరించని వానికి ఈ స్థితి ఏర్పడదు. ఈ అధ్యాయమున ప్రత్యేకముగ తెలుప బడిన సూత్రము కోరిక, ద్వేషములను విసర్జించుట, మననము హృదయమున చేయుచు నుండుట, అందరి యందలి ఈశ్వరుని గుర్తించుట. వీటికారణమున నీటి బిందువులు అంటని తామరాకు వలె కర్మఫలము లంటని యోగి ఏర్పడును.

10

నైష్ఠికులు

యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్ ।
అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ **12**

యోగయుక్తుడై నిష్ఠగ కర్మము నాచరించువాడు శాంతిని పొందును. యోగయుక్తుడు కానివాడు కర్మఫలములయం దాసక్తుడగుటచే, కోరికల రూపమున బంధింపబడు చున్నాడు.

దైవము కర్మాచరణము విషయమున అనేక పర్యాయములు విసుగు, విరామము లేక ప్రేమతో, ఆదరణతో, కరుణతో ఒకే సూత్రమును తెలుపుచున్నాడు. ఇన్నిమార్లు చెప్పిన విషయమునే చెప్పుటయందు అతడెంత ఆత్మీయుడో మన మెరుగవలెను. ఆత్మబంధువు లనిన యిట్టి వారే. తెలిపినదే మరల మరల తెలుపుచు, శ్రేయోమార్గము గుర్తు చేయుచు నుందురు.

కర్మ మనగ కర్తవ్యకర్మ. కర్తవ్యము నిర్వర్తించవలసినదే. నిర్వర్తింపబడకుండుట కుదరదు. దప్పిక కలిగినపుడు నీరు త్రాగవలసినదే, ఆకలి కలిగినపుడు ఆహారము భుజింపవలసినదే. మరియొక మార్గము లేదు.

కర్తవ్యములు నిర్వర్తించుట, కోరికలను తీర్చుకొనుట ఒకటి కాదు. దప్పిక గొన్నపుడు నీరు త్రాగుట. ఆకలి కలిగినపుడు తగు మాత్రము భుజించుట కర్తవ్యము లగును. అవి కోరికలు కావు. కర్తవ్యము లేవియో, కోరిక లేవియో ఎవరికి వారుగ తెలుసుకొన వచ్చును. ఈ విషయమున పెద్ద విద్య లక్కరలేదు. విచక్షణ చాలును. **విచక్షణ లేనివానికి కర్తవ్యములు, కోరికలు కలగాపులగమై కోరికలే కర్తవ్యములుగ భ్రమ గొల్పును.** ఇట్టి వారికి ఉప్పు-కప్పూరము ఒక్క మాదిరిగనే గోచరించును. పేడ-బెల్లము తేడా కూడ తెలియదు.

నిర్వర్తించవలసినది కర్తవ్యమే గాని కోరికలు కాదు. కర్తవ్యములు కాని కర్మ కేవలము ఫలములం దాసక్తి వలననే చేయవలె ననిపించును. ఫలాసక్తియే కామము. కామము వలన ఫలాసక్తి ఈ రెండును బలిమిగ అల్లుకొని యుండును. ఇట్టివారికి కర్తవ్యమేమో తెలియదు. కర్తవ్యమునకు సౌకర్యము అసౌకర్యము, లాభము నష్టము, జయము అపజయము అనునవి అప్రధానములు. ఉదాహరణకు గృహమునం దెవ్వరికైన తీవ్ర అస్వస్థత ఏర్పడినపుడు నిద్రాహారములు మాని సేవచేయుదురు. సౌకర్యము కాదని మానరు కదా! అట్లే వివాహాది సందర్భములలో రాత్రి పగలు శ్రమపడుదురు. సౌకర్యము కాదని మానరు కదా! ఎంత ఖర్చైనను, అప్పులు చేసియైనను పిల్లలను చదివింతురు. నష్టమని భావింపరు కదా. బాధ్యతాయుత కార్యములను నిర్వర్తించునపుడు జయాపజయములను చూడరు గదా! వైద్యుడు ఔషధము నిచ్చుట

కర్తవ్యము. శస్త్రచికిత్స చేయుట కూడ కర్తవ్యము. వ్యాధి తగ్గనో తగ్గదో అని భావించుచు మీన మేషములు లెక్కపెట్టడుగదా! వ్యాధి నివారణముతో సంబంధములేక, వ్యాధి నిర్మూలనమునకు తనకు తెలిసిన విద్యను వినియోగించుటయే కర్తవ్యము. ఇది నిష్ఠ.

అర్జునుడు యుద్ధమున గెలుతుమో లేదో అని కూడ పలికినాడు. జయాపజయములతో సంబంధము లేక, క్షత్రియుడు ధర్మరక్షణమునకు యుద్ధము చేయవలెనని దైవము తెలుపు చున్నాడు.

ఇట్లు కర్తవ్యమును నిర్వర్తించువారు దైవముతో యుక్తులై నిర్వర్తించుటవలన శాంతిని బొందుచున్నారు. ఇట్లుకాక కోరిక లను ఫలములం దాసక్తితో నిర్వర్తించువారు యోగయుక్తులు కాకపోవుట వలన బంధింపబడు చున్నారు. వారి కర్మలే వారిని బంధించుచున్నవి. నైష్ఠికులు శాంతిని పొందుదురు. ఇతరులు పొందలేరు. అనగా ఫలాసక్తి యందు తగులుకొనక కర్తవ్య కర్మల నాచరించువారే శాంతిని పొందెదరు. వారు నిష్ఠగలవారగుటచే నైష్ఠికులని తెలుపబడిరి.

11

మానసిక సన్న్యాసము

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥ 13

మనసున సన్న్యాసము స్థిరపడిన జీవుడు నవద్వారపురమగు దేహమందు సుఖముగ జీవించును. సుఖ మతని వశమున నుండును. సర్వకర్మలు అతని నుండి నిర్వర్తింపబడు చున్నను అతడు కర్త కాడు, కారణము కూడ కాడు.

సన్న్యాస మనగ ముందు శ్లోకముల యందు దైవము నిర్వచన మందించినాడు. 1. దేనిని కాంక్షింపనివాడు, ద్వేషింపని వాడు సన్న్యాసి. 2. సతతము దైవముతో మనన మార్గమున యోగయుక్తుడైనవాడు సన్న్యాసి. సన్న్యాస దీక్ష వలన యింద్రియ ములు నియమమున నుండగలవు. మనసు పరిశుద్ధమగును. 3. సన్న్యాసి సర్వజీవుల యందలి దైవమునే దర్శించుచుండును. 4. తన నుండి జరుగుచున్న మనో దేహేంద్రియ వ్యాపారములను మననమున నుండి వీక్షించువాడు సన్న్యాసి. 5. దైనందిన కార్యము లన్నియు తన మనసున ఆలోచనల రూపముగ వచ్చి, నిర్వర్తింప

బడి పోవుచున్నవని గ్రహించువాడు సన్న్యాసి. అట్టివాడు నీటి బిందువులచే అంటబడని తామరాకువలె నుండును. 6. కర్మ ఫలములను త్యజించినవాడు సన్న్యాసి. మననముతో దైవ యుక్తు డగుటచే ఇది సాధ్యపడును.

పై ఆరు గుణములు కల జీవుని మనసున సన్న్యాసము స్థిరపడి యుండును. సుఖ మతని వశమున నుండును. అట్టివాడు దేహము నందుండుటకు ఎట్టి అసౌకర్యముండదు. నిజమున కిట్టి సన్న్యాసియే మానవదేహ సౌలభ్యము, సౌకర్యము అనుభూతి పరముగ నెరిగి యుండును.

పై సర్వమును గృహస్థు అయినను నిర్వర్తించుకొన వచ్చును. గృహము, సంఘము, దేహము బంధములు కావు. ప్రతిబంధక ములు కానే కావు. కావున సన్న్యాసమను పేర భార్యాపిల్లలను విసర్జించుట, వృత్తి వ్యాపారములను వదలివేయుట, సంఘమున వేరుపడి వెలిగ నుండమని భగవంతుడు చెప్పలేదు. "మనసా సన్న్యస్య" అని పలుకుటలో, మనసున సన్న్యసించిన చాలునని, భౌతిక సన్న్యాసము అవసరము కాదని తెలిపినాడు. తా నట్లే ఆచరించి చూపినాడు. రాజర్షులు, మహర్షులుకూడ నట్లే ఆచరించి రని తెలిపినాడు. సంసారమధ్యమున కూడ సన్న్యాసిగ నుండవచ్చు నని తెలిపినాడు. "సన్న్యాసులందు కూడ చాలమంది సంసారులే" అని అనుచు అప్పుడప్పుడు మాస్టర్ ఇ.కె. గారు పలుకుచుండెడి వారు. మాస్టర్ ఇ.కె. గారు సంసారమందు సన్న్యాసిగ ఎట్లుండ వచ్చునో జీవించి చూపించినారు. సన్న్యాసము మానసికమే అని తెలియవలెను.

12

సన్న్యాసము

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14

భగవంతుడు జీవులకు కర్తృత్వము, కర్మములను సృజింప లేదు. కర్తృత్వము, కర్మము, ఫలములందాసక్తి ఆయన స్వభావము నుండి ఏర్పడుచున్నవి.

శ్రద్ధగల వారికే ఈ సున్నితము, సూక్ష్మమగు విషయము అవగాహన కాగలదు. పరతత్త్వము కేవలము ఉండుటగ నుండును. అతని నాధారముగ గొని అనేకానేక విషయములను ప్రకృతి నిర్మించుచున్నది. పరతత్త్వము నుండి పుట్టిన కాలము, ప్రకృతి సృష్టి సమస్తమును అల్లిక చేయుచు నుండును. పరతత్వము నుండి ప్రకృతి శక్తిని గొని త్రిశక్తులుగ మారి కాలక్రమమున జీవుల నుద్భ వింపజేయు చున్నది. జీవులు ప్రకృతి నుండి పుట్టినవారే అయి నప్పటికి వారు వస్తుతహ పరతత్వాంశమే. అందువలన వారికిని ప్రకృతిని దాటు సౌలభ్యమున్నది. వశిష్ఠాది మహర్షులట్టివారు.

ప్రకృతి, త్రిశక్తులే త్రిగుణాత్మకముగ సృష్టిని నిర్మాణము చేయును. సప్తలోకములను త్రిగుణములతో నిర్మించును. అందు జీవులు వసింతురు. రజస్తమస్సులను సమన్వయపరచి, సత్త్వమున సంయమము చెందుట ద్వారా జీవులు కూడ వారి వారి స్వభావ ములను దాటవచ్చును. అట్లు దాటినవారు తమ స్వభావము కన్న వేరుగ తమ అస్తిత్వమును గుర్తింతురు. వారు స్వభావమునకు లోబడరు. కార్యములు తమ స్వభావము నిర్వర్తించుచుండగ ఉదాసీనులై అవలోకింతురు. ఇట్టి వారినే అవలోకితేశ్వరులు అందురు. వారి నుండి కార్యములు జరుగును. వారికి చేయు చున్నామను భ్రమ యుండదు. సర్వము ప్రకృతి సంకల్పమే. ప్రకృతి దివ్యత్వమునుండి వెలువడిన సంకల్పమే అని తెలిసియుండును. తమ తమ స్వభావములు ప్రకృతి స్వభావముతో సమన్వయింప బడి కార్యములు జరుగుచుండగ, తాము వీక్షించుచు నుందురు.

దైవసృష్టి కవిసృష్టి వంటిది. కవి నుండి ఎన్నిరకముల పాత్రలు, సన్నివేశములు, వివిధములగు ఘట్టములు వ్యక్తమగు చున్నను, అందు తానొక పాత్రధారిగ నున్నను తన నుండి వెలు వడిన కథ తనను బద్ధుని చేయదు. హాస్య ఘట్టము, శోక ఘట్టము, విజయ ఘట్టము, పరాజయ ఘట్టములు, లాభనష్ట ఘట్ట ములు యిట్లెన్నియో ఘట్టములు కథ నుండి వెలువడు చున్నప్పుడు ఆ ఘట్టములు ప్రభావము కవిపై నుండవు గదా! అట్లే దైవము కూడ. జీవుడు కూడ నట్లే యుండవచ్చునని, అట్టివారే సన్న్యాసులని దైవము తెలుపుచున్నాడు.

13

తటస్థత

నాదత్తే కస్యచి త్పాపం నచైవ సుకృతం విభుః ।
అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యాంతి జంతవః ॥ 15

దైవము జీవుల పుణ్యమునుగాని, పాపమునుగాని స్వీకరింపడు. అతడు జ్ఞానముచే తెలియబడువాడు. అట్టి జ్ఞాన మజ్ఞానముచే కప్పబడి యుండుట వలన జీవులు మోహము చెందుచున్నారు.

దైవ తత్త్వము తటస్థముగ నుండును. పాపములు చేసిన వారిని దైవము శిక్షించ నవసరము లేదు. వారి పాపములే వారిని శిక్షించును. అట్లే పుణ్యము చేసినవారిని దైవ మనుగ్రహించుటయు లేదు. వారి పుణ్యములే వారికి సుఖశాంతుల నిచ్చుచున్నవి. ఒకరియం దాగ్రహము, ఒకరియం దనుగ్రహము దైవము చూపడు. దైవము కేవలము తెలుసుకొనదగిన వాడే! తెలుసు కొనినవాడు దైవమువలె తటస్థ స్థితి యందుండును. ఉదాహర ణకు ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, పృథ్వి తటస్థమగు స్వభావము గలవారే వానిని వినియోగించుకొను జీవులు

సుఖమును, దుఃఖమును కూడ పొందవచ్చును. అట్లే సూర్యకాంతి కూడను. వినియోగ జ్ఞానము గలవారికి సృష్టి సుఖమీయ గలదు. అట్టి జ్ఞానము లేనివారికి దుఃఖము కలుగవచ్చును. ఇందు భగవత్ ప్రమేయ మేమియు లేదు. 'రామ, రామ, రామ' యనుచు అగ్ని శిఖపై వేలుంచిన కాలక తప్పదు. రాముని స్మరణ వలన జ్ఞానము కలిగినచో అగ్ని శిఖపై వ్రేలుంచరాదని తెలుయుట సరియగు పద్ధతి.

ఏ జీవునికైనను అతడు చేయు కర్మయే అతనికి ఫలముల నిచ్చుచుండును. అందరును బాగుండవలెనని చేయు పనులు సుఖమీయగలవు. ఇతరులకు దుఃఖము కలిగించు పనులు కాల చక్రమున దుఃఖము నీయగలవు. ఇందు భగవంతుని ప్రమేయ మేమియును లేదు.

భగవదారాధన లన్నియు పవిత్రము చెందుటకు, జ్ఞానము పొందుటకే అని తెలియవలెను. జ్ఞానము పొందుట యనగ ధర్మ స్వరూపము నెరిగి ఆచరించుట. సృష్టి నిర్మాణము చేయునపుడే దైవము సృష్టియందు ధర్మము నేర్పరచెను. ధర్మము నాచరించు వారు రక్షింపబడుట, ఆచరింపనివారు దుఃఖము చెందుట సృష్టి యందు జరుగుచు నుండును. సనక సనందనాదులు, త్రిమూర్తులు, సప్తఋషులు, మనువులు, ప్రజాపతులు, ఆదిత్యులు, రుద్రులు, వసువులు, గ్రహగోళాదులు, పంచభూత ములు, మానవులు, జంతువులు, వృక్షములు ఎవరెవరి ధర్మము

వారికున్నది. ధర్మము ఎవరు నిర్వర్తింపకున్నను వారికి క్లేశము తప్పదు.

దైవము ద్వంద్వాతీతమైన సృష్టి కతీతము. సృష్టియం దతడు ధర్మముగనే వసించి యున్నాడు. అందువలన ప్రత్యేకముగ అనుగ్రహించుట, ఆగ్రహించుట యుండక సాక్షీభూతుడై యుండును. సన్న్యాస మనగ కూడ యిదియే స్థితి. సన్న్యాసి అయిన వానికి యితరుల పాపపుణ్యములతో సంబంధము లేదు. అతడందరి యందును ఒకే విధముగ సముడై ప్రవర్తించును.

14

నిరహంకారము

జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః ।
తేషా మాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 16

జ్ఞానముచేత అజ్ఞానము నాశన మొనర్పబడినపుడు ఆజ్ఞానము ఆదిత్యునివలె పరతత్త్వమును ప్రకాశింపజేయును.

జ్ఞానము అజ్ఞానముచేత ఆవరింపబడి యుండునని, అందుచేత జీవులు భ్రమను చెందుచున్నారని, పరమాత్మ తటస్థుడు, సాక్షీభూతుడని ముందు శ్లోకమున తెలుపబడినది. ఈ శ్లోకమున జ్ఞానమగు వెలుగు కలుగుచున్నకొలది అజ్ఞానమగు చీకటి తొలగుచు నుండునని తెలుపబడినది. జ్ఞానము సూర్యోదయము వంటిది. సూర్యుడు ఉదయించు చున్నకొలది చీకటి తొలగి పోవుచు నుండును. అట్లే జ్ఞానము కలుగుచున్నకొలది చిత్తభ్రమలు, భ్రాంతులు నశించుచుండును. దైవమును గూర్చిన సదవగాహన జ్ఞానముచే తెలియబడినట్లు, అజ్ఞానమున తెలియబడదు. జ్ఞానము కలుగుచున్నకొలది ప్రతి ఒక్కనికి తన స్వరూప స్వభావములు స్పష్టమగు చుండును. క్రమముగ ‘తాను’ అను అహంకార

పురుషుడు నశించి పరతత్త్వమే ఉన్నదని తెలియును. ‘ఆదిత్యవత్’ అను శ్లోకమును వాడుటలో ఒక సూక్ష్మమున్నది. ఆదిత్యుడు సవిత్రు మండలమునకు, సూర్య మండలమునకు వెలుగును ప్రసాదించు వాడు. అట్టి ఆదిత్యుడు కూడ స్వయం ప్రకాశకుడు కాదు. అతని నుండి వెలుగునది పరతత్త్వమే.

‘నేను’ అను అంతర్యామి తత్త్వము ‘నేను’ అను అహంకార పురుషుని ద్వారా ప్రకాశించును. విద్యుద్దీపము ఎంత ప్రకాశించు చున్నను, ఆ ప్రకాశమునకు మూలము కనబడని విద్యుత్తే కదా! ప్రకాశించు దీపమే గోచరించును గాని, విద్యుత్తు గోచరించదు. అట్లే కనబడుచున్న వెలుగునకు కనబడని వెలుగాధారము. నిజముగ జ్ఞానము కలిగినవాడు తా నున్నానను భ్రమను చెందడు. దైవమే తానుగ నున్నాడని తెలిసియుండును. నిజముగ దైవమే యున్నాడని తెలిసియుండును.

ముందు అధ్యాయములలో దైవము “నేను సూర్యున కుపదేశించితిని. సూర్యుడు మనువున కుపదేశించెను. మనువు ఇక్ష్వాకున కుపదేశించెను” అని యొక రహస్యము తెలిపినాడు. అనగా ‘నేను’ అను అంతర్యామియగు వాసుదేవుడు, నే నను అహంకార పురుషుడగు సంకర్షణుని యందు ప్రకాశించును. అటుపైన ఆ నేనే బుద్ధియగు ప్రద్యుమ్నుని నుండి, చిత్తమగు అనిరుద్ధుని నుండి కూడ ప్రకాశించుచున్నది. ఇంద్రియములు (చిత్తము), మనసు, బుద్ధి, అహంకారము వీటినుండి ప్రకాశించు నది ఒకే వెలుగు. అది తన యందు పరిసరముల యందు

వ్యాపించి యుండును. ఇట్లు తెలిసినవానికి తాను, యితరులు అను బేధముండదు. అంతయు పరతత్త్వమే నిండి యుండునని పరమానందభరితుడై యుండును. ఇట్లు తెలిసినవారే ఆదిత్యుని వలె పరబ్రహ్మ స్వరూపమునకు వాహికలై యుందురు. వారే సద్గురువులు. నిరహంకారులు. పూర్ణ జ్ఞానులు.

15

అపునరావృత్తి

దద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణా ।
గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూత కల్మషాః ॥ 17

సర్వమునకు ఆధారమైన తత్త్వము నందు తమ బుద్ధిని నిలుపువారు, 'నేను' అను అహంకారమును, 'నేను' అను సర్వాంత ర్యామి ప్రజ్ఞయందు స్థిరముగ నిలుపువారు ఆ తత్త్వము నందే నిష్ఠగలవారు, అదియే తానైన వారు. పునరావృత్తిలేని స్థితిని పొందు చున్నారు. జ్ఞాన మనగ ఆ తత్త్వముతో ముడిపడుటయే అట్టి వారిని పాపము లంటవు.

ఉన్నది యొకటే. దానినే సత్యమందురు. ఉండుట సృష్టి యందు అన్ని స్థితుల యందు ఉన్నది. సృష్టికి పూర్వము కూడ నున్నది. అందుండే కాలము, ప్రకృతి, శక్తి, త్రిగుణములు, పంచ భూతములు పుట్టుచున్నవి. త్రిగుణముల నుండియే సర్వజీవ రాశులు పుట్టుచున్నవి. అన్నిటి యందు ఉండుటగ ఆ పరతత్త్వ మున్నది. అదియే సత్యము. రాయి రప్ప కూడ ఉండుట యను స్థితియందున్నది. అన్నిటియందున్నను, అన్నిటికి అతీతముగ

నుండునది, అన్నిటికి ఆధారమై యుండునది ఈ తత్త్వము. దీనినే పరమాత్మయని, అంతర్యామియని సంబోధింతురు. నిజమునకు అందరికిని, అన్నిటికిని అదే మూలము. దానితో ముడిపడి యుండుట నిజమగు జ్ఞానము, నిజమగు భక్తి, నిజమగు యోగము, నిజమగు సన్న్యాసము, వైరాగ్యము.

బుద్ధి చేతను, స్మరణ చేతను, నిష్ఠ చేతను దానియందు స్థిరపడినవారు శాశ్వతులు. అట్టివారిని త్రిగుణాత్మకమగు ప్రకృతి ఆరోహణ, అవరోహణ క్రమములకు గురిచేయదు. సనక సనంద నాదులు, వశిష్ఠ అగస్త్యులు అట్టివారు. తత్త్వముతో ముడిపడిన వారిని ప్రకృతి గుణములు స్పృశించవు గనుక, పాపపుణ్యములు పునర్జన్మలు వారి కుండవు. వీరు సహజ జ్ఞానులు. వారి స్థితి సహజ సమాధి స్థితి.

16

సమదర్శనము

విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ 18

విద్య, వినయ సంపన్నులైన బ్రాహ్మణుల యందు, గోవుల యందు, ఏనుగు నందును, కుక్క యందును, కుక్క మాంసము తిను చండాలుని యందును సమదర్శనము చేయువారే జ్ఞానులు.

అన్నిటియందు ఉన్నది ఒక్కటియే. ఉన్నది సత్యము అని ముందు తెలిపితిమి. ఉన్నదాని చుట్టును ప్రకృతి తన గుణముల చేత, పంచభూతములచేత వివిధములగు అల్లికలు చేయుచు నుండును. ఈ అల్లికలలో వైవిధ్యమున్నది. విద్య, వినయము సంపదగా గలిగిన బ్రాహ్మణులకు మూలముగ ఏది యున్నదో అదియే చండాలుని యందు, కుక్క యందు, ఏనుగు నందు దర్శించుట సమదర్శనము.

సామాన్యముగ మనసు, బుద్ధి ఆధారముగ జీవించు మానవులు యితరుల స్వభావమునే దర్శింతురుగాని, స్వభావము

నకు మూలమున నున్న తత్త్వమును దర్శింపలేరు. అన్నిటియందు వసించి యున్నటువంటి తత్త్వమునే దర్శించుచు, స్వభావము ప్రకృతియొక్క విలాసముగ దర్శించువారు నిజమగు జ్ఞానులు, సన్న్యాసులు. మంచి స్వభావము కలవారు, చెడ్డ స్వభావము కల వారు, ప్రాణము కలవి, ప్రాణము లేనివి అన్నిటి యందు ఉన్న దొక్కటే. త్రిగుణముల కలయికలు వేరగుటచేత అవి వేరు వేరు స్వభావములతో గోచరించును. స్వభావములను చూచువారు మాయను బడక తప్పదు. ఉన్నదానిని చూచు వారిని ప్రకృతి బంధింపదు.

ఉన్నది చూచుట జ్ఞానము, సమదర్శనము. అట్లు చూచు వారే పండితులు. అనగా తెలిసినవారు. ఇతరములను చూచువారు శ్రీకృష్ణుని దృష్టిలో పండితులు కారు. అట్టివారు కేవలము చదివిన వారే కాని తెలిసినవారు కారని మాస్టర్ ఇ.కె. తెలుపుచునుండిరి. అధికులని, అధములని భేదములు సృష్టిలో నుండుట ప్రకృతి అమరిక. తదతీతమైన సత్యమున యివి ఏవియును లేవు.

ప్రపంచమున ప్రవర్తించినపుడు పేడ-బెల్లము కలుపు కొనుట, గుఱ్ఱమును-గాడిదను సమానమని భావించుట, గంగి గోవును-దున్నపోతును సమానముగ భావించుట, సంస్కారులు-కుసంస్కారులు సమానమేనని భావించుట అజ్ఞానము. అది సమదృష్టి కాదు. సమదృష్టి యనగ వైవిధ్యమునకు మూలము ఒక్కటే యని తెలియుట. అంతియే కాని స్వభావముల యందు సమానత్వము నాపాదించుట కాదు. స్వభావపరముగ ఆరోహణ,

అవరోహణ క్రమములున్నవి. మూలమున కవి వర్తింపవు. సంఘమున బాధ్యత గలవారు, బాధ్యత లేనివారు యిరువురు సమానమా? స్వభావపరముగ వారు సమానము కాదు. కాని వారియందు మూలముగ నున్నది ఒక్కటియే. ఇట్లేకత్వమును గమనించుచు, వైవిధ్యమును మన్నించుచు సాగవలెను. ఏకత్వము స్థిరపడినపుడు అన్నింటి యందును ప్రేమ యుండును. అంత మాత్రము చేత వైవిధ్యమును మరువరాదు. శిశుపాలుడు, అర్జునుడు తత్త్వమున ఒకటియే. స్వభావమున చాల వ్యత్యాస మున్నది. అర్జునుని శ్రీకృష్ణుడు ప్రేమతో రక్షించెను. శిశుపాలుని ప్రేమతోనే శిక్షించెను. అట్లే రాముని ప్రవర్తనమునందు కూడ తత్త్వమును ప్రేమించుట, స్వభావమును బట్టి ప్రతిస్పందించుట గోచరించును. హనుమంతుని, సుగ్రీవుని, రావణుని, విభీషణుని కూడ రాముడు ప్రేమించినాడు. వారి వారి స్వభావములను బట్టి ప్రతిస్పందించినాడు. పులిని, పిల్లిని తత్త్వపరముగ ప్రేమించుట, స్వభావపరముగ తగు విధముగ ప్రతిస్పందించుట ఈ శ్లోకమున తెలుపబడినదే కాని, అన్నము-సున్నము కలుపుకొనుట కాదని తెలియవలెను.

ఉండుటను సత్య మందురు. ప్రకృతి స్వభావమును చైతన్యమందురు. చైతన్యమునకే స్థితి భేదము. ఉండుటకు స్థితి భేదము లేదు. చైతన్యమునకు నిద్రావస్థ, స్వప్నావస్థ, మానసికావస్థ, బుద్ధి యిత్యాది అవస్థలు. ఎక్కువ చైతన్యము, తక్కువ చైతన్యము గల జీవులుందురు. దీనిని బట్టే స్థావరములు, జంగమములు,

ప్రాణము లేని, ప్రాణము ఉన్న జీవులు, భూమి జీవులు, దేవతలు. దేవతలలో కూడ, పితృదేవతలు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు ఏర్పడి యున్నారు. సృష్టి యందు ఏడు లోకములు, ఏడు రకముల చైతన్యముతో కూడిన జీవులున్నారు. ఇవి యన్నియు చైతన్యావస్థలు. అజ్ఞానుల నుండి, జ్ఞానుల వరకు అనేక అవస్థ లలో మానవు లున్నారు. ఇది యంతయు ప్రకృతి విలాసము. దానికాధారముగ నున్న పురుషుడు మాత్రము అన్నిటి యందు ఒకే స్థితి గొని యున్నాడు. పురుషుని దర్శించుట సమ దర్శనము కలవారికే వీలగును. వారు ప్రకృతి విలాసమున అంతర్గతుడై స్థితి చెందిన దైవమును కూడ చూతురు.

17

సమభావము

ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః॥ 19

సమభావము, స్థిరత్వము ఎవరి మనసునకు కలదో వారి కిచ్చటనే సర్గము జయింపబడి, దోషరహితము సమము అయిన బ్రహ్మమునందు స్థితిగొన్న వారగుదురు.

సర్గమును మనసుచే జయించుటవలన బ్రహ్మమునందు స్థిరపడుట తెలుపబడినది. సర్గమనగా సృష్టిసర్గము. అది భూర్భువసువరాది ఏడులోకములుగ ఏర్పడి యున్నది. ఇవన్నియు చైతన్యస్థితులు. భౌతిక స్థితి, ప్రాణమయ స్థితి, మనోమయ స్థితి, బుద్ధి స్థితి, ఆకాశ స్థితి (మహత్), తపో స్థితి, సత్య స్థితి యిట్లేడు లోకములు వర్ణింపబడినవి. ఇందు ప్రాథమిక స్థితులలో పదార్థ మెక్కువగను, ప్రజ్ఞ తక్కువగ నుండును. అట్లే ఉన్నత స్థితులలో ప్రజ్ఞ ఎక్కువగను, పదార్థము తక్కువగ నుండును. ప్రజ్ఞ ఎక్కువగ నున్న లోకములను వెలుగు లోకము లందురు. మానవుడు తన యందలి చైతన్యము యొక్క విలాసము వలన వెలుగు లోకము

లందు, పదార్థమయ లోకములందు చరించుచు నుండును. ఈ హెచ్చు తగ్గులన్నియు చైతన్యము యొక్క క్రీడయని భావించి, దానికి మూలమైన సత్యమున ప్రవేశించుటకు మనసునకు సామ్యము, స్థిరము అవసరము.

వెండితెరపై రంగులు, శబ్దములతో కూడిన సినిమా కథ నడచుచుండగ రసవత్తరముగ నుండును. కాని దాని కాధారమైన తెరకు సినిమా సన్నివేశము లన్నియు పట్టవు. తెరమీద కథను గమనించువారు కథలో లీనమగుదురు. తెరను కూడ గమనించు వారు సమస్తమగు సన్నివేశములు వచ్చిపోవునవిగ గమనింతురు. జీవితమందలి సంఘటనలు అనేకానేకములు వచ్చిపోవుచున్నను, తాను తెరవలె యున్నాడు అని తెలిసినవాడు, వచ్చిపోవు సన్నివేశ ములకు ప్రభావితుడు కాడు. అట్లు ప్రకృతి విలాసములను గమ నించుచు వాని కాధారమైన బ్రహ్మమునందు స్థితి గొన్నచో ఈ శరీరమునందే బ్రహ్మత్వము పొందవచ్చునని భగవంతుడు తెలుపుచున్నాడు.

మనసున బ్రహ్మమును గూర్చిన భావనము స్థిరపడుచున్న కొలది మనసునకు స్థిరత్వము, సామ్యము కుదురును. అట్టి మనసుతో సర్గమును (చైతన్య విలాసమును) జయించవచ్చును. అపుడిచ్చటే బ్రహ్మమునందు స్థితిగొని యుండవచ్చును. అదియే సామ్యము. సర్గమున కతీతమగు స్థితి. సర్గము ప్రకృతి యధీనము. సామ్యమున ప్రకృతికూడ యధీనమై యుండును. అదియే బ్రహ్మము నందు స్థితిగొనుట యందురు.

18

బ్రహ్మజ్ఞాని

న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజే త్ప్రాప్య చాప్రియమ్।
స్థిరబుద్ధి రసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః ॥ 20

బ్రహ్మమునందు స్థిరబుద్ధికల బ్రహ్మజ్ఞాని మోహరహితుడై యుండును. ఇష్టమైన దానిని పొందునపుడు సంతోషించుటగాని, యిష్టము లేని దానిని పొందునపుడు దుఃఖించుట గాని చేయడు.

బ్రహ్మజ్ఞాని అన్నిటియందు బ్రహ్మమునే దర్శించును. అతని బుద్ధి బ్రహ్మమునందు స్థిరపడి యుండును. అతడు బ్రహ్మ పరాయణుడై యుండునని, బ్రహ్మమునందే నిష్ఠ కలిగి యుండునని, అన్నింటియందును బ్రహ్మమునే దర్శించునని, సృష్టి సర్గమును దాటిన దృష్టి కలవాడని ముందు శ్లోకములలో తెలుపబడినది. బ్రహ్మమును దర్శించునపుడు ప్రకృతి విలాసమే యుండును కాని, మాయ ఆవరింపదు. మోహము పొందుట యుండదు. అతడు అసమ్మూఢుడు. మూఢత్వమనిన మోహపడుట. ప్రకృతి మాయ లేని వానికి మూఢత్వము లేదు, మోహ

నత్వము లేదు. మోహమే లేనపుడు ప్రియము లేదు, అప్రియము లేదు. ఇది బ్రహ్మజ్ఞాని లక్షణము.

ఇటీవలి కాలమున రామకృష్ణ పరమహంస జీవితము బ్రహ్మజ్ఞానికి దర్పణము పట్టినట్లుండును. సమకాలిక బ్రహ్మ జ్ఞానులు కూడ అతనిని చూచి విస్తుపోయిరి. రామకృష్ణుడు సదా బ్రహ్మమునందే చరించెను. తానే బ్రహ్మము అయి ఉండుట వలన, తాను బ్రహ్మజ్ఞాని యను స్ఫురణ కూడ తనకు లేదు. బ్రహ్మజ్ఞాను లందరును సభ నేర్పాటు చేసి అతనిని బ్రహ్మజ్ఞానిగ నిర్ణయించినారు. ఆ విషయము పరమహంసకు తెలుపగ ఆ మహాత్ముడు "అంటే ఏమిటి" అని అడిగినాడట. అతడు మురుగు నీటిని కూడ ఆచమనము గావించెడివాడు. శునకముతో సమాన ముగ కలిసి భుజించెడివాడు. శునక మను భావ మతనికుండక, అదియును బ్రహ్మముగనే గోచరించెడిది.

బ్రహ్మజ్ఞాన స్థితి ప్రకృతి స్పర్శ దాటిన స్థితి.

19

బ్రహ్మము

**బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మ యోగయుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే ॥ 21**

బ్రహ్మముతో యోగము చెంది ముక్తుడైనటువంటి జీవాత్మ అక్షయమగు సుఖమును పొందుచున్నాడు. అతనికి బాహ్యస్పర్శ యిత్యాది యింద్రియ స్పర్శ లుండవు. వానియం దాసక్తియు యుండదు.

బ్రహ్మము ప్రకృతికి కూడ అతీతమైన తత్త్వము. దాని యందు ముడిపడిన స్థిర చైతన్యము కలవాడు ప్రకృతి సంబంధిత సుఖములను దాటిన వాడగుచున్నాడు. అతనికి దేహ సంబంధిత మగు సుఖములుగాని, యింద్రియపరమగు సుఖములుగాని, మనోభావములుగాని, అహంకార భావములుగాని యుండవు. అంతయు దైవముగనే యుండును. అందువలన బాహ్యస్పర్శ యందు ఆసక్తిని దాటిన వాడని వేరుగ చెప్పవలెనా!

20

స్థిర చైతన్యము

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥ 22

ఇంద్రియ సుఖములు, యింద్రియ భోగములు మొదలు సుఖము కలిగించినను, తరువాత దుఃఖము కలిగించగలవు. అవి అంతవంతములని తెలిసి బ్రహ్మజ్ఞాని వానియందు రమించడు.

త్రిగుణాత్మకమగు ప్రకృతి సహజ లక్షణము మార్పు. అష్ట ప్రకృతులు ఎప్పుడును మార్పు చెందుచునే యుండును. మూల ప్రకృతి మార్పు చెందకయుండు వెలుగు. అది తొమ్మిదవది. ఆ స్థిరమగు వెలుగున కాధారము దాని కావలయున్న బ్రహ్మతత్త్వము. ఈ తత్త్వము నాశ్రయించినపుడు మనయందలి చైతన్యమను వెలుగు స్థిరముగ నుండును. స్థిరచైతన్యము ఆనంద దాయకము. అది పూర్ణము కూడ. అష్ట ప్రకృతులలోని చైతన్యము మార్పుకు నిరంతరము గురియగు చుండును. పంచేంద్రియములు, రజస్తమస్త్వములు సన్నివేశములను బట్టి, కాలమును బట్టి, దేశమును బట్టి వివిధముగ అనుభవము కలిగించును. అవి సుఖము

కలిగించునట్లుగ అనిపించునుగాని, ఆ సుఖమును అందీ అంద నట్లు అనుభవింప చేయుచుండును. తిథులకు గురియైన చంద్రుడు ఎట్లు హాని వృద్ధులను అనుభవించునో, మానవుడు కూడ అట్లే ద్వంద్వము లందు ఊగిసలాడు చుండును. ప్రకృతి విలాసమును దాటి, స్థిరముగ నుండి ప్రకృతి క్రీడను చూచుట మహదానంద దాయకము.

నదీ ప్రవాహమున కొట్టుకొని పోవుచున్నవాడు నదీ గమన మును గాని, పరిసరములగల ప్రకృతి రమ్యతనుగాని అనుభూతి చెందలేడు. స్థిరము, పటిష్ఠము అయిన నావయందు సుఖాసీనుడై, నదిపై పయనించు ప్రయాణికుడు ప్రవాహము యొక్క వేగమును, తీరమునందలి రమ్యమగు దృశ్యములను చూచి ఆనందించ గలడు. అట్లే సృష్టి రమ్యతను శాశ్వతముగ అనుభూతి చెందుటకు సృష్టి కధిష్ఠానమైన తత్త్వమున స్థిరపడుట తెలివి. ఇట్టి తెలివి బ్రహ్మజ్ఞానికి మాత్రమే యుండును.

21

స్మరణ

శక్నో తీహైవ యస్సోఢుం ప్రాక్ శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ 23

కామ క్రోధముల వేగమును ఏ మానవుడైతే ఈ శరీరము విడచుటకు పూర్వమే జయించ సమర్థుడగు చున్నాడో, అట్టి మానవుడు యోగియై సుఖవంతుడగు చున్నాడు.

కామక్రోధము లన్నవి ప్రపంచమున జీవించు మానవునకు సన్నివేశమునుబట్టి, పరిస్థితులనుబట్టి ఉద్భవించుచునే యుండును. ఇవి చిత్తవృత్తులు. వీనిని అరికట్టుటయే యోగము. అరికట్టుట యనగ బలవంతముగ త్రొక్కిపెట్టుట కాదు. త్రొక్కి పెట్టినచో, అవి సమయమునకై వేచియుండి విజృంభించగలవు. చిత్తవృత్తి నిరోధమునకు యోగవిద్యయే పరిష్కారము. యోగ మనగా ఆసనములు, ప్రాణాయామములే కాదు. దైవమునందు ప్రీతియే నిజమగు యోగము. అట్టి ప్రీతి మధురాతి మధురముగ నుండుటచేత యితర విషయములందు ప్రీతి శిథిల మగుచు నుండును.

శ్లోకము చదివినపుడు "కామ క్రోధముల వేగమును జయించి, యోగమున సుఖపడుము" అన్నట్లు గోచరించును. ఇది సాధ్యపడునది కాదు. యోగమున స్థిరపడి, కామక్రోధములను జయించమనుట యిందలి రహస్యము. చీకటని పారద్రోలి, వెలుగు నేర్పరచుకొనుము అని తెలిపినచో అది సాధ్యపడునది కాదు. వెలుగు నేర్పరచినంతనే చీకటి అదృశ్యమగును.

'యుక్తః' అను పదము యిందు చాల ముఖ్యము. భగవంతునితో యుక్తుడైయుండుట ప్రధానము. అనగ భగవతత్త్వ ముతో ముడిపడి యుండుట. అట్లు ముడిపడుటకు చేయు ప్రయత్నమే స్మరణ, భావన. భగవంతునియందు ప్రీతి యున్నచో, స్మరణ భావన నిరంతర మగుచుండును. అట్టి స్మరణ దీపపు వెలుగువంటిది. స్మరణ యను వెలుగు ఉన్నంత సమయము కామక్రోధములను చీకటి క్రమ్మదు. అట్టి నరునకు సుఖ ముండును. అంతియేగాని కామమును జయింతును, క్రోధమును జయింతును అని అహంకరించువారు శ్రమ చెందుచు దుఃఖ పడుదురు. ఇచ్చట సమర్థత భగవంతునితో యుక్తము చెందు టయేగాని, కామక్రోధములను జయించుట కాదు. కామక్రోధ ములు కూడ పై విధముగ శరీరమందుండగనే జయించనిచో మరుజన్మమున గూడ దుఃఖముండును. అందువలన భగవంతుడు ఈ శరీరమందున్నప్పుడే నాతో యోగము చెంది, కామక్రోధములను హరించి, శాశ్వతముగ సుఖపడుము" అని తెలుపుచున్నాడు.

22

బ్రహ్మ నిర్వాణము

యోఽంతఃసుఖో ఽంతరారామ స్తథాంతర్జ్యోతి రేవ యః ।
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ 24

యోగి అంతర్ముఖుడై అంతరంగము నందలి వెలుగుతో రమించుచు, అంతఃసుఖమును పొందుచు, ఆత్మజ్యోతియై ప్రకాశించుచు నుండును. అతడు బ్రహ్మ స్వరూపుడై బ్రహ్మము నందు నిర్వాణము చెందుచున్నాడు.

అంతరంగమున బ్రహ్మము వసించి యున్నది. అది ఆధారముగ చైతన్యము, చైతన్యము ఆధారముగ త్రిగుణములు (త్రిశక్తులు), వాని నాధారము చేసుకొని పంచభూతములు ఏర్పడి యున్నవి. ఇట్లు పది అంశములతో కూడిన స్థూల సూక్ష్మములగు ఏడు పొరలతో ఏర్పడిన రూపమున జీవుడున్నాడు. అందువలననే అతడు దశరథుడు అని, సప్తపర్ణి అని సంబోధింపబడుచున్నాడు. ఈ మొత్తమునకు మూలము బ్రహ్మమే గదా! అట్టి బ్రహ్మమునందు యుక్తము చెందుట యోగమగును. తొమ్మిది ఆవరణలు దాటి పదియవ అంశమగు బ్రహ్మముతో భావపరమగు యోగము

చెందుట ప్రధానము. అపుడు చైతన్యము పరిపూర్ణమై వెలుగును. గుణములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచేంద్రియ ములు, పంచాంగములు అట్టి చైతన్యమునకు లోబడి యుండును. పై విధముగ భావన చెందినపుడు అంతరంగమున తన జ్యోతిస్వరూపము గోచరించును. ఆ స్వరూపమునకు మూల మైన తత్త్వము అందలి సూక్ష్మ స్పందన బిందువుగ గోచరించును. అదియే పరమాత్మ స్థానము. దానియందు రమించుచున్న యోగికి, బుద్ధి మనో యింద్రియముల కతీతముగ సుఖము లభించు చుండును. ఆ బిందు స్థానమున లగ్నమైన చైతన్యము కలవా డగుటచే అచ్చటి బ్రహ్మము యొక్క సాన్నిధ్యమును పొందును. క్రమముగ బ్రహ్మమే యగును. తానుండక బ్రహ్మ ముండును. తాను బ్రహ్మమునందు నిర్వాణము చెందును. ఇట్లు యోగి అంతర్ముఖుడై బ్రహ్మ సాయుజ్యమును పొందగలడు.

23

మోక్ష స్థితి

లభంతే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః ।
ఛిన్న ద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥ 25

ఋషులు బ్రహ్మ నిర్వాణము అనుగ్రహముగ పొందినవారు. వారు చరించు బ్రహ్మములే. బ్రహ్మ నిర్వాణము పొందినవారికి కల్మషములు శాశ్వతముగ నశించి యుండును. మనోబుద్ధి యింద్రియములు యమింపబడి యుండును. వారు భూమిపై చరించుటకు కారణము సర్వభూతములకు హితము కలిగించుటకే.

బ్రహ్మమును ధ్యానించి సాలోక్య, సామీప్య, సాయుజ్య, సారూప్య సోపాన మార్గమున బ్రహ్మమైన వారు వశిష్ఠాది బ్రహ్మర్షులు. బ్రహ్మర్షు లనగ స్ఫురించువారు అత్రి, భృగువు, అంగీరసుడు, వశిష్ఠుడు, అగస్త్యుడు, గౌతముడు ఆదిగా గల ఋషులు. వీరి యందు వెదకి చూచినను కల్మష ముండదు. వారు కాలమును, దేశమును, దైవమును ఎరిగిన వారు. వారికి సంశయము లుండవు. వారు సమస్తమును బ్రహ్మముగనే దర్శింతురు. ద్వంద్వములగు మంచి చెడులు వారిపై ప్రభావము

చూపవు. వారికంతయు బ్రహ్మమే. అట్టివారు శరీరధారులై భూమిపై చరించుటకు ముఖ్యమగు కారణ మొకటియే సర్వభూతములకు హితము కలుగజేయుటకు వారు అమితాసక్తులై యుందురు. కోరినవారికి హితము చేయుటయే పనిగ అహోరాత్రములు ఉన్ముఖులై యుందురు. పరులకు హితము చేయుట పరమాత్మకు చేయు ఆరాధనగ వారు భావించుచుందురు.

బ్రహ్మ నిర్వాణము చెందుట, బ్రహ్మ సాయుజ్యము పొందుట, బ్రహ్మమగుట ఊరకయుండుటకు కాదు. మోక్షమనగ ఏ బంధములు లేక, ఏ పనిలేక ఎక్కడో ఒక అద్భుతమగు లోకమున హాయిగ నుండుట అని సామాన్యు లందరు భావింతురు. కల్మషములు లేనిచోట బంధము లేదు. సంశయము లేనిచోట చిక్కుపడుటయు ఉండదు. బ్రహ్మమునందు మనసు నిలచుట చేత శరీరము, యింద్రియములు, మనసు వశమున నుండును. అహంకార భావము నశించి యుండును. చిత్తవృత్తులందు తనదైన స్వభావము చిందులాడక దైవీ స్వభావమే మిగులును. అట్టి స్థితి యందు పరహిత మనునది పరమ ధర్మముగ నిర్వర్తింప బడును. అదియే మోక్ష స్థితి. శరీరము వదలిన వెనుక వచ్చునది మోక్షమని భావించుట అజ్ఞానము.

24

ఆత్మ నెరిగిన వారు

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥ 26

బ్రహ్మ నిర్వాణమును పొందినవారు విదితాత్మలై వర్తింతురు. వారు యత చేతస్సులు. యతులు. కామక్రోధముల నుండి విడి వడినవారు.

బ్రహ్మ నిర్వాణ మనగ బ్రహ్మమునందు కరగిన అహంకార స్థితి. మంచుగడ్డ నీటియందు తేలుచున్నపుడు అది వేరుగ గోచరించును. నీటికన్న విలక్షణమైన లక్షణములు కలిగి యుండును. ఎవరి ముఖమున నైనను నీరు చల్లినచో చల్లగ యుండును గాని, బాధింపదు. మంచుగడ్డతో కొట్టినచో బాధ కలుగును. అహంకార స్థితి మంచుగడ్డవంటి స్థితి. నీటి స్థితి బ్రహ్మము లేక ఆత్మ స్థితి. అహంకారమునకు మూలమైన తత్త్వమే బ్రహ్మతత్త్వము. అది త్రిగుణములకు లోబడినపుడు ప్రత్యే గాత్మయై తానొకడ నున్నాడని భావన చెందును. నిజమునకు తన రూపమున నున్నది పరతత్త్వమే. బ్రహ్మతత్త్వమే. ఆ తత్త్వమే

తానుగ నున్నాడు. తత్త్వమే తానుగ నున్నాడని తెలియుట, తత్త్వము నుపాసించుట, తాను కరిగి తత్త్వము మిగులుట జరిగినచో అది బ్రహ్మ నిర్వాణ మగును.

బ్రహ్మ నిర్వాణ స్థితిని పొందినవారి బుద్ధి నుండి, మనసు నుండి, యింద్రియముల నుండి, వాక్కు నుండి, చేతల నుండి బ్రహ్మ తత్త్వమే ప్రకాశించును. అనగ బ్రహ్మమే అన్ని పొరల నుండి విదితమగు చుండును. వారి మాట, చేత, నడవడికల నుండి బ్రహ్మమే ప్రకాశించుచుండును. ఇట్టి వారిని విదితాత్ము లందురు. విదితాత్ము లనగ ఆత్మ నెరిగిన వారని అర్థము. ఆత్మ తత్త్వమే సర్వత్ర విదితము గావించువారని మరియొక అర్థము. ఇట్టివారి వర్తనమున చూపరులకు ఆత్మ తత్త్వము విదితమగు చుండును. ఇదియంతయు 17వ శ్లోకమున చెప్పబడిన రీతిగ, బ్రహ్మ పరాయణులై యుండుట వలన ఏర్పడు స్థితి.

ఎవరి బుద్ధి, మనసు, యింద్రియములు, వాక్కు, చేష్టల నుండి ఆత్మ తత్త్వము విదిత మగుచుండునో అట్టివాని చేతన యమింపబడి యుండును. అనగా చైతన్య స్వరూపిణియగు శ్రీమాత తన మాయను ప్రసరింపజేయక, అనుకూలవతియై యుండును. చేతన తత్త్వమునకు అనుకూలముగ నుండుటవలన సర్వము యమింపబడినవారై యుందురు. అట్టివారిని యతులు అందురు. యతీంద్రు లందరు నిరంతరము తత్త్వమునే ప్రకాశింప జేయుదురు. అట్టివారిని కామ క్రోధములు దరిచేరలేవు. స్పృశించ నైన స్పృశించలేవు. వారు కామక్రోధ వియుక్తులు అని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

25

అంతర్ముఖుడు

స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాం శ్చక్షుశ్చై వాంతరే భ్రువోః ।
ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥ 27

బాహ్యమందలి స్పర్శాది విషయములను వెలుపలనే వదిలి ప్రాణాపానములను సమానము గావించి, చూపును అంతర్ముఖముగ నాసికాగ్రమున నిలిపి ముక్తుడై యుండుట తెలుపబడినది.

శబ్ద స్పర్శాది విషయము లన్నియు బాహ్య ప్రపంచ సంబంధితము. పంచేంద్రియముల మూలమున మానవుడు వీని ననుభవించు చున్నాడు. ఇంద్రియ సుఖము లన్నియు బాహ్య సుఖములే. పంచేంద్రియములే లేనిచో జీవునకు బాహ్యస్మృతి యుండదు. ఇంద్రియముల అమరిక సృష్టిలో ఒక ప్రధాన ఘట్టము. ఇంద్రియముల అమరిక సృష్టింపక మునుపు జీవుడు అంతర్ముఖుడై, అంతరంగముననే యుండెడివాడు. ప్రచేతసులు అను ప్రజ్ఞల రూపమున యింద్రియ ప్రజ్ఞల నేర్పరచి, అంతః చేతనను బహిరంగముగ ప్రకటితము గావించుట జరిగినది. ఇంద్రియముల ద్వారా బాహ్యమున కలవాటుపడిన జీవులు,

బాహ్యోన్ముఖులై అంతరంగమందలి స్వస్థానమును మరచిరి. ఇల్లు మరచి రాత్రింబవళ్లు పోకిరిగా తిరుగు పిల్లలను సంఘమున చూచుచున్నాము కదా! వారికి యిల్లు పట్టదు. అట్లే సర్వ సామాన్యముగ మానవులకు బహిరంగముననే జీవిత మంతయు గడిచి పోవును. అంతరంగ అనుభూతి వారికి కలిగించుటయే ప్రధానోద్దేశ్యముగ యోగవిద్య ఏర్పడినది.

మానవుని ప్రజ్ఞ అంతర్ముఖ మగుటకు ప్రధానమగు ఉపాయము శ్వాసను గమనించుట, శ్వాసపై మనసు లగ్నము చేయుట. శ్వాసమార్గము బహిర్ముఖమైన మనోప్రజ్ఞను అంతర్ముఖము చేయుటకు ఉపయోగపడును. శ్వాసపై మనసు నిలుపుట వలన శ్వాస ననుసరించుచు మనసు శ్వాస పుట్టుక స్థానమునకు పయనించును. క్రమముగ మనసు స్పందన ప్రక్రియను చేరును. మనసు స్పందనమును గమనించుట యందు ఏకాగ్రత కలిగిన కొద్దీ, ప్రాణాపానములు సమన్వయింపబడి ఉదాన ప్రాణము ద్వారమున అంతరంగమున ఊర్ధ్వ ముఖమై జనును. భ్రూమధ్యమును చేరును. భ్రూమధ్యమును నాసికాగ్ర కేంద్రముగ కూడ తెలుపుదురు. అచ్చట అంతర్ముఖుడై చరించుచుండును. (ప్రాణాయామ యజ్ఞముగ దీనినే భగవంతుడు ముందు అధ్యాయములలో బోధించినాడు.)

అచ్చట అంతర్జ్యోతిని దర్శించుచు, అంతరారాముడై, అంతః సుఖమును పొందుచు నుండువాడు సన్న్యాసియని 24వ శ్లోకమున తెలుపబడినది. అట్లు అంతర్ముఖముగ భ్రూమధ్యమునకు చేరుటకు ఉపాయమును దైవమీ శ్లోకమున ప్రతిపాదించినాడు.

26

మననము

యతేంద్రియ మనోబుద్ధి ర్మ్రుని ర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥ 28

మోక్షపరాయణులు యింద్రియ మనో బుద్ధులను నియమముతో బ్రహ్మమున సమర్పణ చేయుదురు. ఇచ్ఛ, భయము, క్రోధముల నుండి వారు విగతులై, పై తెలిపిన సమర్పణ భావనచే ఎల్లప్పుడును మోక్షస్థితి యందుందురు.

భగవానుడు సుళువగు మార్గములను బోధించు చుండును. ఆ బోధనలు సహితము మానవులు తలక్రిందులు చేసుకొని త్రిప్పలు పడుచుందురు. ఈ శ్లోకమును సామాన్యముగ ఈ క్రింది విధముగ భావింతురు.

ఇష్టము, భయము, క్రోధము అనువానిని విడచి నిగ్రహముతో యింద్రియములను, మనసును, బుద్ధిని అధిగమించి మోక్షపరాయణులు ఎల్లప్పుడును ముక్తస్థితి యందుందురు.

పై విధముగ భావించి కోరిక లుండరాదని, భయపడరాదని,

కోపము కలుగరాదని తెలుపుచుందురు. జన్మల తరబడి సాధన జరిపినను ఈ మూడును వదలవు.

వదల్చుకొనదలచిన విషయములు ఎప్పుడును వదలవు. పొందవలసిన సద్విషయములు పొందుటకు ప్రయత్నము చేయవలెను గాని మరియొక మార్గము లేదు. సద్గుణములను దైవపరముగ ఆరాధించుచు, కాలము దానియందు వినియోగించు కొలది, యితర గుణములు దూరము కాగలవు. చీట్లపేక ఆడు వ్యక్తి భగవద్భజన, బోధన, స్తోత్రపారాయణ, సత్కర్మాచరణములలో సమయము వినియోగించు చున్నచో క్రమముగ చీట్లపేకాడుట తగ్గును. ఏమి చేయవలెనో చెప్పవలెనుగాని, ఏమి చేయరాదో చెప్పుట వలన ఉపయోగము లేదు. వాహనమునందు ప్రయాణము చేయుచున్న పిల్లవానికి, చేతులు బయట పెట్టకు అని చెప్పినట్లుండును.

భగవానుడు "మనసా, వాచ, కర్మణా నన్నే ఆశ్రయింపుము" అని పలుమార్లు తెలుపుచు నుండును. బ్రహ్మము నాశ్రయించిన వానికి బ్రహ్మమే మిగులును. దైవమును ఆశ్రయించిన వారికి దైవమే మిగులును. దైవసాన్నిధ్యమున నున్నపుడు దైవమునే కోరుట యుండును గాని, యితరములను కోరుట యుండదు గదా! దైవభావన యున్నచోట భయ భావన ఎట్లు కలుగ గలదు? క్రోధమెట్లు కలుగ గలదు? దైవ స్మరణయందు మనసు, బుద్ధి లగ్నమైన వానికి యిచ్ఛా భయ క్రోధము లుండుట కవకాశమే లేదు. మననమున దైవమును స్థిరపరచుకొని బుద్ధి, మనసు,

యింద్రియములను కూడ అట్టి దైవ మననమున నింపిన మునులకు నిత్యముండు స్థితి ముక్త స్థితి. అట్టి వారిని యిచ్ఛా భయ క్రోధములు స్పృశింపనైనా స్పృశింప లేవు.

ఈ అధ్యాయమున ఆరవ శ్లోకముననే మననము ద్వారా బ్రహ్మముతో యోగయుక్తుడై యుండుట తెలుపబడినది. వారే మునులు. వారి యింద్రియములు, మనసు, బుద్ధి, నిరంతర మననము కారణముగ యమము చెంది యుండును. అట్టి మననము కారణముగ భయక్రోధాది భావము లుండవు. ప్రహ్లాదుడు, అంబరీషుడు అట్టివారు.

27

సాన్నిధ్యము

భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్ ।
సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి॥ 29

తపస్సు, యజ్ఞముల భోక్తను నేను. సర్వలోకముల అధిపతులకు ఈశ్వరుడను నేను. సృష్టి యందు పుట్టిన సమస్త ప్రాణులకు సుహృదయుడను నేను. ఈ విధముగ నన్ను తెలుసు కొనిన వాడు శాశ్వతముగ శాంతిని పొందుచున్నాడు.

సన్న్యాస స్థితికి చరమ గీతముగ భగవంతుడు ఈ వాక్యమును పలికినాడు. "నేను" అను అంతర్యామి ప్రజ్ఞగ అందరి హృదయములందు తా నున్నాడు. అట్టివాని చూచుట ప్రధానము. అతడే సమస్తమునకు స్వామి. అతడే గమ్యము. అట్టి వానిని 'నేను'గ తనయందు, సర్వభూతముల యందు దర్శించుచు దేశమును, కాలమును బట్టి సంచరించువాడు సన్న్యాసి యని, అట్టి సన్న్యాసి శాంతియే ప్రధాన లక్షణముగ యుండునని తెలియ వలెను.

ఈ అధ్యాయమునకు "కర్మ సన్న్యాసయోగము" అని నామ కరణము చేయుటలో గల ఔ చిత్య మేమనగ, సత్సాధకుడు తన మనో బుద్ధి యింద్రియములను 'నేను' అను అంతర్యామి ప్రజ్ఞ యందు లగ్నము చేసియుండగ, అతని సమస్త కార్యములు యాంత్రికముగ సాగిపోవును. చేయుచున్నట్లనిపించదు. దీనికి భక్తుల జీవితమున చాల ఉదాహరణలు గలవు.

1. గోపికలు : గోపికల మనసు అహర్నిశలు శ్రీకృష్ణుని యందే లగ్నమై యుండగ, వారి దైనందిన జీవితమంతయు అనాయాస ముగ సాగిపోయినది. అన్నిటియందు వారు కృష్ణుని దర్శించుటచే కృష్ణదర్శన మాధుర్యము గూడ నిరంతర ముండెడిది.

2. సక్కుబాయి : ఈమెకు మానవ సాధ్యము కాని బరువు బాధ్యతలు అప్పచెప్పబడినను, కృష్ణ సాన్నిధ్యమున నుండుటచే, అసాధ్యము లన్నియు సుసాధ్యములైనవి. దుష్కరమైన కార్యములు కూడ తాను చేసితినను భావనయే లేక ఫలించినవి.

3. హనుమంతుని సముద్రోల్లంఘనము, నారదుని వీణా గానము కూడ ఈ కోవకు చెందినవే.

(మనసు కర్మల యందు లగ్నము కాక, దైవమునందు లగ్నమగుటచే కర్మలు అప్రయత్నముగను, అనాయాసముగను సాగునని తెలుపుట 'కర్మ సన్న్యాసయోగ' రహస్యము.)

గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 6వ అధ్యాయము - ధ్యానయోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ" మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయి లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"*అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ

పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

విషయ సూచిక

ధ్యాన యోగము

హెచ్చరిక :

ధ్యాన యోగమును 'ఆత్మ సంయమ' యోగమని పిలుతురు. శరీరము, యింద్రియములు, మనస్సు, బుద్ధి ఆత్మతో సంయమము చెందుటకు వలసిన సూత్రములు ఈ అధ్యాయమున *"శ్రీకృష్ణార్జున సంవాదము"గ* వేదవ్యాస మహర్షి పొందుపరచినాడు.

ధ్యానము చేయుటకు పూర్వము సాధకుడు పొంద వలసిన శిక్షణ, ధ్యానము చేయుచు అనుసరించవలసిన ప్రధాన సూత్రములు ఈ అధ్యాయమున వివరింపబడినవి. ధ్యానమును గూర్చిన మోజు, వ్యామోహము ప్రస్తుతమున భౌగోళికముగ నేర్పడినది. సరాసరి ధ్యానమున కుపక్ర మించుట అవివేకము, అపాయకరము కూడ. సాధకుడు తన్ను తానుగ కొంత నియంత్రణ పాటించుచు, ధ్యానము ప్రారంభించిన కాలము నుండి ఈ అధ్యాయమున తెలుప బడిన నియంత్రణలను అన్నింటిని పాటించవలసి యున్నది. యోగశాస్త్రమైన భగవద్గీత యందలి ఈ సూత్రములను పాటింపక ధ్యానమున కుపక్రమించువారు, వారి అశ్రద్ధ, అహంకారము కారణముగ కష్ట నష్టములకు లోను కాగలరు.

1

కర్తవ్య కర్మ

అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।
స సన్న్యాసీ చ యోగీచ న నిరగ్ని ర్న చాక్రియః ॥ 1

ఎవడు చేయవలసిన కర్మములను, ఫలములం దాపేక్ష లేక చేయుచుండునో అట్టివాడే సన్యాసియు, యోగియు కాగలడు. అంతియే గాని అగ్నిహెూత్రాది విహిత కర్మలను వదలినవాడు, కర్తవ్య కర్మలను విడిచినవాడు ఎన్నటికిని సన్యాసియు, యోగియు కానేరడు.

కర్తవ్య కర్మను ఫలాపేక్ష లేక నిర్వర్తించుట యోగమార్గమున కత్యంత ప్రధానము. "కార్యం కర్మ" అనునది తాను తప్పక నిర్వర్తించవలసిన కర్మ. అది నిర్వర్తించనివాడు వ్యర్థుడే. ఐదవ సంవత్సరమున అక్షరాభ్యాసము మొదలుగ మానవునకు క్రమముగ కర్తవ్య కర్మ లేర్పడును. మొదట దేహమునకు శిక్షణ నిచ్చుట, అటుపైన యింద్రియములకు శిక్షణ నిచ్చుట, ఆ తరువాత విద్యా భ్యాసము ద్వారా మనస్సునకు శిక్షణ నిచ్చుట, తమ తల్లిదండ్రు లను, అధ్యాపకులను గౌరవించుట, పిదప జీవితమున కాలాను

సారముగ ఏర్పడు బాధ్యతలను నిర్వర్తించుట, సంఘమున మైత్రీ భావమున మెలగుట యిత్యాది వన్నియు కర్తవ్య కర్మలే. వీనిని అశ్రద్ధ చేయువారు ఎవ్వరును ధ్యానయోగమున ప్రవేశింపజాలరు.

కర్తవ్య కర్మల నాచరించుట ఋణమును తీర్చుట వంటిది. దేహ ఋణము, సంఘ ఋణము, కుటుంబ ఋణము, పితృ ఋణము, గురు ఋణము యిత్యాది ఋణము లన్నియు కర్తవ్యముల రూపమున సాధకుని దరి చేరును. వీనిని నిర్వర్తింపకుండుట, దాటవేయుట వలన కర్మము సాధన కడ్డుపడును. నిర్వర్తించుట ఋణము తీర్చుట వంటిది గనుక ఫలముల నాశించుట అవివేకము. అప్పు తీర్చి, ఫలమాశించుట వలన అపహాస్యమునకే గురియగుదురు. ఈ విషయమున సాధకునకు మొట్టమొదటగ గురి కుదరవలెను. ఈ గురి కుదరక, ఈ సూత్రములను నిర్వర్తింపక ఎన్ని రకముల సాధనలు చేసినను నిరుపయోగమే. అందులకే ఈ సూత్రముతో ఆత్మ సంయమ యోగము ప్రారంభింపబడినది.

2

దివ్య సంకల్పము

యం సన్న్యాస మితి ప్రాహు ర్యోగం తం విద్ధి పాండవ ।
న హ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన ॥ 2

దేనిని సన్యాసమని చెప్పుదురో దానినే యోగమని గూడ నెరుగుము. సంకల్ప సన్యాసము చేయనివాడు యోగి కానేరడు. (అట్టివాడు సన్యాసియు కాదు.)

నిత్య నైమిత్తిక కర్మలను, కర్తవ్య కర్మను ఫలాపేక్షను ఆశ్రయింపక నిర్వర్తించువాడు, తనదైన యితర సంకల్పములు లేనివాడు యోగి యగును. సన్యాసియు అగును. పుట్టగొడుగుల వలె సంకల్పములు గలవారు సన్యాసులు కారు, యోగులు కారు. కోరికలు గలవారు, యిచ్ఛాద్వేషములు కలవారు యోగమును గూర్చి, సన్యాసమును గూర్చి భావించుట వ్యర్థము.

నిత్య నైమిత్తిక కర్మ లనగా దంతధావనము, స్నానము, ఆహార స్వీకరణము, నిద్ర మొదలగునవి. ఇవి ఎవ్వరికైనను తప్పని సరి.

కర్తవ్య కర్మలు ప్రారబ్ధము నుండి, సంచితము నుండి కాలము రూపమున ఏర్పడుచుండును. కాలమందించిన కర్మమును ఫలాపేక్ష రహితముగ నిర్వర్తించుటయే సాధకునకు ప్రధానము. నిర్వర్తించు కర్మలనుండి, కర్తవ్యములనుండి రజోగుణము కారణ ముగ నూతన సంకల్పములు, నూతన కర్మలను సాధారణముగ మానవుడు పెంచుకొనుచుండును. బాకీలు తీర్చుచు, క్రొత్త బాకీలు ఏర్పరచుకొనువాడు తెలివిగలవా డనుకొనుటకు వీలు లేదు. ఋణము, కర్మము తరుగవలెనన్నచో కర్తవ్య నిర్వహణమేగాని అందుండి మరల మొలకలు పుట్టించుకొనుట కాదు.

పూర్వము చేసిన కామపూరిత సంకల్పముల కారణముగ ఋణము లేర్పడుటచే, ఆ ఋణములే ప్రస్తుత జన్మమున కర్తవ్య ములుగ దరి చేరును. శ్రద్ధాభక్తులతో వానిని నిర్వర్తించుటయేగాని నూతన కర్మల నేర్పరచుకొనరాదు. ఏది కర్తవ్యమో, ఆ కర్తవ్యము నెంతవరకు నిర్వర్తించవలెనో, తెలిసి నిర్వర్తించవలెను. తమది కాని కర్తవ్యము తమదనుకొనుట అవివేకము. రజోగుణ దోషము వలన ధనకాంక్ష, కీర్తి కాంక్ష, పదవీ కాంక్ష లేర్పడి, చేయుచున్న కర్తవ్యముల నుండి అనేకానేక కార్యములు పుట్టుచు నుండును. స్వకాంక్షకై నిర్వర్తించుట యుండును. గనుక చేయు పనులయందు అవక తవకలుండి, వాని నుండి కర్మఫలములు పుట్టి, మరల ఋణ రూపము ధరించి, కర్తవ్యములై కాలము రూపమున సమీపించును. తన సంకల్పములే తన బంధనములకు కారణమని తెలియుటకు కొన్ని జన్మలు పట్టవచ్చును.

సృష్టియందు దివ్య సంకల్పమొకటి ఆరంభము నుండి నడచుచున్నది. సృష్టి కథ మధ్యమున మానవు డవతరించినాడు. అతడు జరుగుచున్న కథలో తన వంతు కర్తవ్యమును నిర్వర్తించినచో ఉత్తీర్ణు డగును. కృతకృత్యు డగును. లేనిచో బందీ యగును. జరుగుచున్న కథలో తన కథను స్వంత సంకల్పములతో చేర్చుట వలన మానవుడు బద్ధుడగుచున్నాడు. అతనికి దైవము స్వతంత్ర బుద్ధి నిచ్చెను. స్వతంత్ర బుద్ధిని బాధ్యతయని ఎరిగి నిర్వర్తింపవలెనే గాని, హక్కుగ భావించి దుర్వినియోగము చేయరాదు. అట్లు చేసినచో రజస్తమస్సులు తనయందు ప్రకోపించి, తనను శాశ్వత బందీని చేయును. విమోచనము కావలెనన్న తపన యున్నచో, స్వంతముగ సంకల్పించుట మాని కర్తవ్యము మాత్రమే ఆచరించుట నేర్వవలెను. దీర్ఘకాలమట్లు నిర్వర్తించినపుడు, రజస్తమో గుణములు శాంతించి సత్వ మలవడును. సత్వమున నిలబడుటకు సంకల్ప సన్యాసము ముఖ్యము. అట్టివాడే సన్యాసమునకు గాని, యోగమునకు గాని అర్హత గలవాడు. వ్యక్తిగత సంకల్పములున్నవారు యోగమున, సన్యాసమున ప్రవేశింపలేరు. ఇది నిశ్చయము.

3

శాంతి - శమము

ఆరురుక్షో ర్మునే ర్యోగం కర్మకారణ ముచ్యతే ।
యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే ॥ 3

ప్రజ్ఞారోహణము చేయదలచిన మననశీలురకు నిష్కామ కర్మ సాధనమని చెప్పబడుచున్నది. యోగమార్గమున ఆరోహణము గావించిన యోగికి శమము కారణమని చెప్పబడుచున్నది.

ప్రజలందరును శాంతిని, శమమును కోరుచుందురు. దానికై ఉద్యమములు చేపడుదురు. శాంతి, శాంతి యని నినాదములు చేయుదురు. శాంతి లభించవలెనన్నచో మానవుడు నిష్కామ కర్మమును జ్ఞానముతో జోడించి నిర్వర్తింపవలెను. కర్మజ్ఞానముల సూత్రములను ముందు అధ్యాయములందు వివరింపబడుట జరిగినది.

యజ్ఞార్థ కర్మయే దైవము నిర్దేశించిన కర్మ. ఫలముల నాశింపక, కర్తవ్యమును నిర్వర్తించుచు ఫలితముల కొరకై

కర్మములు వక్రీకరించక, ఏర్పడిన సత్ఫలములందు రమించక, యితరుల శ్రేయస్సు నాశించుచు తత్ఫలమైన కర్మలు నిర్వర్తించుచు జీవించుట కర్మయోగమను అధ్యాయమున తెలుపబడినది.

జ్ఞానయోగమను అధ్యాయమున నిష్కామ కర్మను నిర్వర్తించుచు పండ్రెండు రకములగు యజ్ఞములను భగవానుడు బోధించినాడు. ఈ యజ్ఞములన్నియు బుద్ధి, మనస్సు, యింద్రియములు, శరీరము, సంపద పరహితమున కెట్లు వినియోగింపవలెనో తెలిపినాడు. దైవయజ్ఞమని, బ్రహ్మయజ్ఞమని, యింద్రియ సంయమ యజ్ఞమని, శబ్దయజ్ఞమని, మనోయజ్ఞమని, ద్రవ్య యజ్ఞమని, తపో యజ్ఞమని, యోగయజ్ఞమని, స్వాధ్యాయ యజ్ఞమని, జ్ఞానయజ్ఞ మని, ప్రాణాయామ యజ్ఞమని, అన్న యజ్ఞమని పండ్రెండు యజ్ఞములు నిర్వర్తించుట ద్వారా జీవుడు ప్రజ్ఞయందు ఆరోహణము చెందగలడని తెలిపినాడు.

జ్ఞానముతో కూడిన నిష్కామ కర్మయజ్ఞమే సాంఖ్యమని తెలిపినాడు. ఇట్లు నిర్వర్తించుట పరిపూర్ణమగు యోగము. అట్టి వానికే శమము సాధ్యమగును. శమము సాధ్యపడిననేగాని ధ్యానము కుదరదు. ధ్యాన యోగమునకు సోపానక్రమముల కర్మయోగ సూత్రములు, జ్ఞానయోగ సూత్రములు తప్పనిసరియని తెలియవలెను. వీని నిర్వహణముననే శమము లభించునుగాని, కేవలము

శమము కోరుట వలన శమము కలుగదు. శాంతి, శమము ధ్యానమునకు ప్రాథమికమగు అర్హత కలిగించును.

శాంతి శమముల కొరకు ధ్యానములు చేయుట కన్న, నిష్కామ కర్మము, పరహితములను జీవితమున నిర్వర్తించుట నిజమగు తెలివి.

4

సంకల్ప సన్యాసము

యదా హి చేంద్రియార్థేషు న కర్మ స్వనుషజ్జతే ।
సర్వసంకల్ప సన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే ॥ 4

యోగవిద్య సాధన చేయుచున్నప్పుడు ప్రజ్ఞ ఆరోహణ క్రమమున సాగుటకు యింద్రియార్థముల ద్వారా బాహ్యమునకు ఊరక చనుచుండుట వర్జనీయము. అట్లే సర్వసంకల్పములను విసర్జించుట ఆవశ్యకము.

సాధారణముగ మానవులు బాహ్య ప్రపంచమున నిమగ్నులై యుందురు. మునిగియుందురు. మానవ ప్రజ్ఞ బాహ్యములోనికి ప్రవేశించుటకు, అనగా ప్రపంచముతో సంబంధ మేర్పరచుకొను టకు యింద్రియములు దైవ మేర్పరచిన సౌకర్యము. ఇంద్రియ ముల ద్వారా బహిరంగ విషయములను వినుట, చూచుట, రుచి చూచుట, వాసన చూచుట, స్పర్శను తెలియుట జరుగుచుండును. ఇట్లు బాహ్యమున చూచునపుడు కొన్ని విషయములం దాసక్తి కలుగుట, కొన్ని విషయములం దనాసక్తి కలుగుట జరుగు

చుండును. బాహ్య విషయములను గ్రహించుచు, బాహ్యమునకు ప్రతిస్పందించుచు సామాన్య జీవితము సాగుచుండును. ఇంద్రియము లందించు సుఖము తాత్కాలికమే అయినను మరల మరల వానిని కోరు స్వభావ మేర్పడి వినుట, చూచుట, తినుట, స్పర్శించుట, మాట్లాడుటగ దినమంతయు సాగి రాత్రివేళకు ప్రజ్ఞ బలహీనపడును. ప్రకృతి నిద్రద్వారా ప్రజ్ఞను తిరోగమింపజేసి, మరునాటి ఉదయమునకు బలముగను, ఉత్సాహవంతముగను ఏర్పరచును. నిద్ర ప్రకృతి అందించిన వరము. నిదుర నుండి లేచిన మానవ ప్రజ్ఞ మరల బహిరంగమున ఉత్సుకతతో ప్రవేశించును. ఐదు ఇంద్రియముల ద్వారా, జననేంద్రియము ద్వారా, వాక్కు ద్వారా ఏడు విధములుగ ప్రజ్ఞ బహిర్గతమగుచు, జీవుడు నిర్వీర్యు డగుచుండును. క్రమముగ మరణము సమీపించును.

బలీయముగ బహిర్గతము లోనికి యింద్రియముల ద్వారా ప్రజ్ఞ ఏడు విధములుగ యీడ్చబడుచుండును. పశువును అన్ని విధములుగ బంధించి, బలీయముగ లాగుకు పోవునట్లు, మానవ ప్రజ్ఞ మేల్కాంచినది మొదలు బహిరంగమున చేరుటకు కారణము యింద్రియములు రుచి చూపించిన విషయములందు ఏర్పడిన అమితమగు ఆసక్తియే. ఇట్టి ప్రజ్ఞ ప్రథమముగ వెనుకకు మరల్చబడవలెను. పురోగమించు ప్రజ్ఞకు తిరోగమనము కూడ సంకల్ప మాత్రమున కలుగవలెను. కళ్ళెములేని గుఱ్ఱమువలె పరిగెత్తు ప్రజ్ఞకు గంతల కళ్ళెము ఏర్పరచినట్లు వెనుకకు మరల్చ

గల పటుత్వ మేర్పడవలెను. బహిరంగమున గల ఆసక్తిచే బహిరంగములోనికి తీరుబడిలేక ప్రజ్ఞ ప్రసార మగుచున్నది గదా! విషయములం దాసక్తియే దీనికి కారణము. ఈ ఆసక్తి అనాసక్తిగా ఎట్లు మారగలదు? ఇంద్రియ విషయముల కన్న రుచికరమైన విషయము ఒకటున్నదని తెలియుటవలన, దానియం దాసక్తి పెరుగుచుండుట వలన చిల్లర విషయములం దాసక్తి తగ్గుచు నుండును.

హృదయము నుండి ప్రజ్ఞ యింద్రియముల ద్వారా బహిర్గత మగుచున్నది గనుక, హృదయమును రంజింపజేయు విషయ మొక్కటి తెలిసినచో బాహ్య విషయములం దనాసక్తికి అవకాశ మేర్పడును. అంతరంగ మాధుర్యము బహిరంగ మాధుర్యముకన్న మిన్నయని జీవునకు తోచినపుడే ఇది సాధ్యము.

సత్సాంగత్యము, సద్గురు బోధ అమిత మధురమగు విషయము నావిష్కరింపగ దానియందు ఆసక్తి కలుగుట కవకాశ ముండును. అట్లే సద్గ్రంథములు కూడ అట్టి ప్రచోదనము కలిగింప గలవు. దైవమునందు రుచి కలుగుట దైవానుగ్రహమే. రుచి కలిగిన వారు సత్సాంగత్యము, సద్గ్రంథ పఠనము కావించుట వలన రుచి పెరుగగలదు.

దైవమును గూర్చిన రుచి పెరుగుచుండగ ప్రవృత్తి యందు మార్పునకై కృషి కూడ సమాంతరముగ సాగవలెను. అట్లు సాగుటకే

ప్రవృత్తి కార్యములందు అనగా బాహ్య ప్రవర్తనయందు కర్తవ్య నిర్వహణము మాత్రమే నిర్వర్తించుట నొక దీక్షగ గైకొనవలెను. చేయవలసిన పనులను మాత్రమే చేయుచు, చేయదలచిన వన్నియు చేయుట మానవలెను. కర్తవ్య కార్యము లెవ్వరికిని తప్పవు. వానిని నిర్వహింపకపోవుట అవివేకము. కర్తవ్యమునకు మించి కలుగు సంకల్పములు కోరికలే యగును. ఈ కోరికలే కళ్ళెము లేని గుఱ్ఱములు. వీనిని అదుపున నుంచుకొనినచో ప్రజ్ఞ బాహ్యము నుండి అంతరంగము లోనికి తిరోధానము చెందదు.

కోరికలను నియమించుట, నిగ్రహించుట అనగా, కర్తవ్యము కాని సంకల్పములలో నియమించుట. విచక్షణము లేనిచో కర్తవ్య మేమో తెలియదు. కానిపనులు కూడ కర్తవ్యమే అనిపించును. అపుడు జీవుడు తీరుబడి లేక తిరుగుచుండును. కర్తవ్యమునందు తప్ప యితరములగు ఆసక్తి నశించుటకు బాహ్యముగ దీక్షనుగొనుట, అంతరంగమున నచ్చిన ఒక వెలుగు రూపమును ఆరాధించుట నేర్వవలెను. కర్తవ్య కర్మను మాత్రమే నిర్వర్తించు జీవుడు యింద్రి యార్థముల వెంటబడి ప్రపంచమున పరుగెత్తడు. ఆహార వ్యవహా రాదులను క్లుప్తము కావించుకొనును. ఆసక్తి అంతరంగమును గూర్చి ఏర్పడుచుండగ బహిరంగమున వ్యాప్తిపై ఆసక్తి యుండదు. ఇట్లు భగవంతుడు చెప్పిన అనాసక్తత సిద్ధించు చుండును.

సంకల్పములు కూడ కర్తవ్యము మేరకే ఏర్పడుచుండును గాని, ఊరుట యుండదు. మానవులకు సంకల్పములు ఊట

బావిలోని నీరువలె ఊరుచునే యుండును. అట్టి వారికి ఊరట కలుగదు. వారు ధ్యానమున కర్హులు కారు. ఆత్మ సంయమము నకు అర్హులు కారు. **కర్తవ్యేతర సంకల్పములు సాధకుని వీడినపుడే అతడు యోగమున పురోగతి చెందు అవకాశము కలిగి యుండును.** ఈ స్థితినే భగవంతుడు సంకల్ప సన్యాసమని పలికినాడు.

ఇంద్రియార్థముల వెంటబడి తీరుతెన్ను లేకుండ, గతి గమ్యము లేకుండ బాహ్యమునకు ప్రసరించు మానవ ప్రజ్ఞను, కర్తవ్యము మేరకే నిర్వర్తింపజేయుట, కర్తవ్యేతర సంకల్పములను సన్యసించుట ఆత్మ సంయమమునకు ప్రధానమగు సూత్రము.

5

ఆత్మోద్ధరణ

ఉద్ధ రేదాత్మనఽఽత్మానం నాత్మాన మవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపు రాత్మనః ॥ 5

తనను తానే ఉద్ధరించుకొనవలెను. తనను తాను అధోగతికి చేర్చుకొనగూడదు. తనను తా నుద్ధరించుకొన్నప్పుడు, తనకు తాను బంధువు. అట్లు కానిచో తనకు తానే శత్రువగును.

తాను - నేను అను ప్రజ్ఞ మనయందు నాలుగు స్థితులలో యున్నది. అందు మూడు స్థితులు దివ్యము. ఒక స్థితి దివ్యమే అయినను స్వభావమున బంధింపబడి యుండును. ముందు మూడు స్థితులు వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న వ్యూహము లనియు, నాలుగవది అనిరుద్ధ వ్యూహ మనియు తెలుపుదురు. మొదటిది మనయందలి దైవము. ఆ ప్రజ్ఞ మనయందు త్రిగుణములను దాటి యుండును. రెండవది మనిషి తానొకడు వేరుగ నున్నాడని భావించుట. గోధుమపిండియే చపాతీగ యున్నట్లు ఈ స్థితిని భావించవచ్చును. అనగా రెండవ స్థితి మొత్తము నుండి ప్రత్యేకముగ ఏర్పడిన స్థితి. ఇది త్రిగుణముల కీవలయుండును.

మొదటి ప్రజ్ఞ మనయందలి దైవము కాగ, రెండవ ప్రజ్ఞ "మనము" అని మననుగూర్చి మనము భావించుచున్న తెలివి, మొత్తమునుండి త్రిగుణముల ద్వారా ప్రత్యేకముగ నేర్పడినవి. అందువలన ఈ రెండవ స్థితిని "ప్రత్యగాత్మ" అని కూడ అందురు. మొదటి ప్రజ్ఞను 'పరమాత్మ', రెండవ ప్రజ్ఞను జీవాత్మ లేక ప్రత్యగాత్మ అందురు. మొదటి ప్రజ్ఞను వాసుదేవ ప్రజ్ఞ యని, రెండవ ప్రజ్ఞను సంకర్షణ ప్రజ్ఞ యని కూడ అందురు. అట్లే మొదటి ప్రజ్ఞను నారాయణుడని, రెండవ ప్రజ్ఞను నరుడని కూడ యందురు. మొదటి ప్రజ్ఞ మంచి నీరువలె భావించినచో, రెండవ ప్రజ్ఞ అందు తేలుచున్న మంచుగడ్డ యని భావింపవచ్చును. మంచినీరే మంచుగడ్డ అయినది. పర మాత్మయే ప్రత్యగాత్మ అయినది. ఈ మార్పు త్రిగుణముల ద్వారా జరుగుట వలన జీవాత్మపై త్రిగుణముల ప్రభావముండును. నీరే మంచుగడ్డ అయినప్పటికిని, మంచుగడ్డకు కొన్ని క్రొత్త గుణములు వచ్చును. అమితమగు శీతలత్వము, పగిలిపోవుట, గట్టిపడుట, ఎవరిపైనను విసిరినచో వారికి కొద్దిగ దెబ్బతగులుట యుండును. మంచి నీటికి లేని గుణములు మంచుగడ్డకు ఏర్పడినవి. అట్లే దైవమునకు లేని గుణములు జీవున కేర్పడినవి. ఒక నూతన స్వభావ మేర్పడును. గుణముల సమ్మిశ్రమమును బట్టి అనేకములగు స్వభావములు గోచరించు చుండును.

తన స్వభావము కన్న తాను వేరుగ బుద్ధిమంతు డగువాడు చూచుకొనవచ్చును. తాను, తన స్వభావముగ తనని తాను విడమర్చుకొన వచ్చును. ఈ స్వభావము బాహ్య ప్రపంచమందలి అనుభవముల ఆధారముగ గట్టిపడుచుండును. ఇష్టము,

అయిష్టము, అభిప్రాయములు ఏర్పడి అవి సత్య మనిపించు చుండును. తా నేర్పరచుకున్న స్వభావములు కొన్ని సన్నివేశముల కారణముగ మారుచుండును. కొన్ని నమ్మకములు, కొన్ని సిద్ధాంత ములు, కొంత మంచి చెడు అవగాహన కొంత అనుభవము అంతయును కలిపి తనదైన తెలివి యొకటి స్వభావము రూపమున ఏర్పడుచుండును.

తాను, తన స్వభావము కాదని తెలియుటకు వలసిన బుద్ధి కూడ తనయందే యున్నది. బుద్ధిని వినియోగించినచో స్వభావము నుండి తాను విడిపడ వచ్చును. విచక్షణ బుద్ధి లక్షణమే. ఇట్లు అంతయు వ్యాపించిన ఒకే తత్త్వము గుణముల ద్వారా ప్రత్యేకమై, బుద్ధిని, స్వభావమును కలిగి యుండును. ఇట్లు ప్రజ్ఞ నాలుగు స్థితులలో మానవుని యందున్నది. అవి వరుసగా తనయందలి దైవము, తాను, తన బుద్ధి, తన స్వభావము. ఈ నాలుగు స్థితులలో నున్న ప్రజ్ఞనే వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అని కూడ తెలుపుదురు. ఈ నాలుగు స్థితులు చెందిన ప్రజ్ఞలో స్వభావమునందు యిమిడియున్న ప్రజ్ఞ బంధముల నేర్పరచుకొనును.

పై తెలిపిన నాలుగు ప్రజ్ఞలు ఒకే ప్రజ్ఞయొక్క స్థితి భేదము లని తెలియవలెను. ఈ నాలుగు ప్రజ్ఞలనే రామాయణమున రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు అని కూడ వివరింతురు. ఈ నాలుగు ప్రజ్ఞలనే సనక సనందనాది నలుగురు కుమారులుగ తెలుపుదురు. ఈ నాలుగు ప్రజ్ఞల ప్రభావమే నాలుగు

యుగములలో పనిచేయు చుండును. వీనిని బట్టి జ్ఞానము నాలుగు రకములని, వర్ణాశ్రమములు నాలుగు రకములని, వేదములు నాలుగని కూడ తెలియజేయు చుందురు. ఈ నాలుగే సృష్టికి పునాది. ఈ నాలుగును నాలుగు భుజములుగ కూడ కీర్తించినారు. నాలుగు భుజములుగల దేవత లందరును, ప్రజ్ఞయొక్క నాలుగు స్థితులు తెలిసినవారని అర్థము. మన దేవత లందరికిని నాలుగు భుజములు చిత్రీకరింతురు. మానవులకు రెండు భుజములే యున్నవి. అనగా అహంకారము, చిత్త ప్రవృత్తి మాత్రమే వారికి తెలియును. మానవులు మహాత్ము లైనపుడు వారును చతుర్భుజులే. మానవుడు మహాత్ముడగుటకే యోగవిద్య. యోగవిద్యా వాఙ్మయమునకు శ్రీమద్భగవద్గీతయే మకుటము. దేవుడు, జీవుడు, బుద్ధి, చిత్తము ఈ నాలుగు ప్రజ్ఞలుగ నున్నవాడు మానవుడు. సామన్య మానవుని చిత్తము బాహ్య ప్రపంచముతో ముడిపడి యుండును. బాహ్యమును దర్శించుటకు, అనుభూతి చెందుటకు పాంచభౌతిక శరీరమున్నది. అందు పంచ భూతములు (పృథివి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము), పంచ కర్మేంద్రియములు (చేతులు, కాళ్ళు, వాక్కు, గుదము, జననేంద్రియము), పంచ జ్ఞానేంద్రియములు (చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు), పంచతన్మాత్రలు (వినుట, స్పర్శ తెలియుట, చూచుట, రుచి తెలియుట, వాసన తెలియుట), పంచ ప్రాణములు (ప్రాణము, అపానము, ఉదానము, వ్యానము, సమానము).

ప్రజ్ఞాపరముగ మానవుడు నాలుగు స్థితులుగ ఉన్నాడు. అతని దేహము ఐదు స్థితులలో నున్నది. దేహమునకు, జీవునకు

సంబంధము, ప్రజ్ఞ నాలుగవ స్థితిలో నేర్పడును (చిత్తము). చిత్తము నాలుగవది. అదియే ప్రవృత్తిలోనికి అనగా బాహ్య ప్రపంచము లోనికి జీవుడు ప్రవేశించుటకు వీలు కలిగించును. అంతరంగ మున నున్న దైవప్రజ్ఞ జీవప్రజ్ఞ, బుద్ధి, చిత్తముల ద్వారా వ్యక్తమగు చుండును. ఈ నాలుగింటిని అంతఃకరణము లందురు. పంచేంద్రి యములు, పంచ కర్మేంద్రియములు, పంచభూతములతో కూడిన శరీరము బహిఃకరణ మందురు.

బహిఃకరణము ప్రపంచముతో ప్రతిస్పందించుటకు ఒక వాహిక. అంతఃకరణమున నున్న మానవుడు బహిఃకరణమగు దేహమును వాహనముగ గొని, పంచభూతాత్మకమైన ప్రపంచమున తిరుగాడుచుండును. వాహనమెక్కి తిరుగుట యనగా, సంకేతార్థ మిదియే. దేవతలందరును వాహనమెక్కియే తిరుగుదురు. నరుడు కూడ దేహమను వాహనమెక్కియే తిరుగుచున్నాడు. ఇది తెలియుట ముఖ్యము.

దేహము తన వాహనమే కాని తాను కాదు. తాను ప్రజ్ఞ, శరీరము తన వాహనము. వాహనమును, తనను అనుసంధానము చేయు ప్రజ్ఞ చిత్తము. ఈ చిత్తము బుద్ధి నుండి దిగివచ్చినది. బుద్ధి దైవమునుండి దిగివచ్చినది. జీవుడు కూడ దైవమునుండి దిగి వచ్చినాడు. చిత్తము దేహమునకు లోనైనపుడు, తాను దైవ స్వరూపుడనని, జీవుడు శాశ్వతుడని, బుద్ధియను వెలుగు తన సహజమగు గుణమని మానవుడు మరచును. ఇట్టి మరపునకు కారణము బాహ్యమందలి విషయములకు చిత్తము నిష్కారణ

ముగ ఆకర్షింపబడుటయే. ఇట్లాకర్షింపబడినపుడు చిత్తము ప్రవృత్తి మార్గమునందే యుండునుగాని, నివృత్తి మార్గమున ప్రవేశింపదు. యోగవిద్య నుపాసించువారు మొట్టమొదట చిత్తముయొక్క ప్రవృత్తులను నిరోధించవలెనని యోగశాస్త్రము తెలుపుచున్నది.

చిత్తము ప్రవృత్తులకు బానిస అయినచో జీవు డధోగతి చెందును. అనగా ప్రపంచమున బంధింపబడును. అన్నిటికన్న మిన్నగ దేహమే బంధించును. అపుడు దేహమే తానను భావముతో జీవించును. ఇదియొక వికృత స్థితి. రౌతు గుఱ్ఱముతో చేరి, గుఱ్ఱముచే బంధింపబడి, గుఱ్ఱమునకు బానిస అయినచో అది వికారమే. గుఱ్ఱము నధిరోహించి తన పనులను చక్కపెట్టుకొనుట మాని, గుఱ్ఱమునకు సేవకు డగుట పతనమే కదా! రాజు సేవకు డగుట, సేవకుడు రాజగుట సామాన్య నరుని స్థితి. ఈ కారణము గనే గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు, తనకు తానే అధోగతి చెందుటను గూర్చి బోధించినాడు.

చిత్తము ప్రవృత్తులకు లోబడి ఉన్నంతకాలము జీవుడు దేహబద్ధుడై యుండును. ప్రవృత్తి వర్జనీయము కాదుగాని, జీవిత మున ప్రవృత్తియే సమస్తము కారాదు. ప్రవృత్తితో నుండుట అను భవమును, ఆనందమును యిచ్చును. కాని ప్రవృత్తిలో నుండుట బంధము. ఈ బంధము దుఃఖహేతువు. సంసారహేతువు. ఇది జరుగకూడదు సుమా! అని దైవము హెచ్చరించు చున్నాడు.

చిత్తము ప్రవృత్తితో దైనందినముగ వ్యవహరించు చున్నప్పటి కిని, నివృత్తి మార్గమున బుద్ధితోను, జీవాత్మతోను, పరమాత్మతోను

అనుసంధానము చెందుట ఊర్ధ్వగతి యగును. చిత్తము తానే. కనుక తాను తనను అధోగతికి చేర్చవచ్చును. తనను తాను ఊర్ధ్వ గతికిని చేర్చవచ్చును. అంతఃకరణ మార్గము ఊర్ధ్వగతి నిచ్చును. బహిర్గత మార్గమున యిమిడిపోయినచో అధోగతి కలుగును. తన్ను తాను మరచి, ప్రపంచమే సర్వస్వమని జీవించువాడు తనకు తానే శత్రువగు చున్నాడు. అంతఃకరణ మార్గమున తన సమగ్ర రూపమును తెలిసి దేహమును వాహనముగ నిర్వ ర్తించుకొనువాడు తనకు తానే మిత్రుడు, తనకు తానే బంధువు. ఈ శ్లోకము పరమ పవిత్రమగు నొక సత్యము నావిష్కరించును. దీనిని బుద్ధిమంతుడు శ్రద్ధతో చదువుకొనవలెను.

6

స్వభావ - మిత్రత్వము

బంధు రాత్మా ఉ ఉ త్మన స్తస్య యేనాత్మైవాత్మనా జితః ।
అనాత్మనస్తు శత్రుత్వే వర్తే తాత్మైవ శత్రువత్ ॥ 6

తన చిత్త ప్రవృత్తులను తాను నియమించుకొను సామర్థ్యము కలవానికి తన స్వభావము తనకు బంధువై యుండును. లేనిచో తన స్వభావమే తనకు శత్రువై పనిచేయును.

చిత్తము ప్రజ్ఞయొక్క నాలుగవ స్థితి. ప్రజ్ఞ యన్నను, చైతన్య మన్నను ఒకటియే. చైతన్యమనగ మనలోని ఎరుక. ఈ ఎరుక లేనిచో మన మున్నామని కూడ మనకు తెలియదు. ఈ ఎరుక లేక చైతన్యము మనయందలి దైవము. అది మనయందు అహం కారముగను, బుద్ధిగను, చిత్తముగను అవతరించు చున్నది. మన యందలి చైతన్యమునకు చిత్తము తోక వంటిది. దైవము తల వంటిది. ఈ నాలుగును కలిపి ఒక దండమువలె భావించవచ్చును. దీనిని యోగదండమని కూడ పిలువ వచ్చును.

చిత్తము బాహ్య ప్రపంచముతో ప్రవర్తించుటకు దేహముతో సాంగత్యము చేయుచున్నది. ప్రపంచమున వ్యవహరించు చున్నప్పుడు స్వభావ మేర్పడుచున్నది. స్వభావ మనగా తనదైన అనుభవము నుండి పుట్టిన ఒక అవగాహన. ఈ అవగాహనయందు అభిప్రాయములు, సిద్ధాంతములు యుండును. అవి యన్నియు స్వభావమునకు సంబంధించినవియే. చిత్తమునకు సంబంధించి నవి కావు. తాను, తన స్వభావము మిళితముకాక యున్నపుడు చిత్తము బంధింపబడదు. మిళితమైనపుడు బంధింపబడును. తన స్వభావమునకు తాను లోబడకుండుట తాను చేయవలసిన సాధన.

తన స్వభావము తాను కాదని, తాను చైతన్యమని ప్రతి నిత్యము గుర్తుచేసుకొనుట ప్రథమ కర్తవ్యము. దీనికి పరిశీలనము అవసరము. దీనినే ఆత్మపరిశీలన మందురు. తాను వెలుగని, ఆ వెలుగులో ప్రపంచము గోచరించు చున్నదని తెలియవలెను. చీకటిగదిలో దీప మున్నపుడు అన్నియు గోచరించును. దీపము లేనిచో గదిలో వస్తువు లున్నను, తనకు గోచరించవు. తాను ప్రపంచమును చూచుచున్నపుడు, తన వెలుగే ప్రపంచము నావిష్క రించు చున్నది. దానిని గూర్చిన అభిప్రాయములు గూడ ఏర్పడు చున్నవి. తన అభిప్రాయములు కేవలము తనకే పరిమితము. అట్లే యితరులకు కూడ వారి అభిప్రాయము లుండును. ఈ విధముగ అందరి యందలి చిత్తము ఒకే వెలుగైనప్పటికి అనుభవ మునుబట్టి అవగాహన, అభిప్రాయములు ఏర్పడుచుండును. ఈ

అభిప్రాయము లన్నియు కలిసి సమష్టిగ ఒక స్వభావ మేర్పడు చున్నది.

తనకన్న తన స్వభావము గొప్పది కాదు. తన నుండి పుట్టినది తనను శాసించరాదు. అట్లు తన స్వభావము తనను శాసించుట జరుగరాదు. కాని అట్లే జరుగుచుండును. తినకూడదని తెలిసి తినుట, వినకూడదని తెలిసి వినుట, చూడకూడదని తెలిసి చూచుట, ఊరక తిరగకూడదని తెలిసి తిరుగుట, అధిక ప్రసంగ ములు చేయకూడదని తెలిసి చేయుట సామాన్యముగ జరుగు చున్నదియే గదా. చేయవలసినవి మరచి చేయదగనివి చేయుచు బ్రతుకుచున్న స్థితి గమనించుచునే యున్నాము గదా! అనగా తన స్వభావము తనను పరిపూర్ణముగ బంధించినదనియే అర్థము.

దీనికి పరిష్కారము నిత్య ఆత్మపరిశీలనమే. తా నొంటరిగ కూర్చొని తన భావములను, స్వభావమును పరిశీలించుకొనుట. ఇట్లు పరిశీలించుకొనుటలో తన స్వభావము, తన దేహమునుండి తనను తాను వేరుగ గుర్తించవలెను. లేనిచో తన స్వభావమే తాముగా నుండిపోవుదురు. తమ దేహమే తాముగ భావించి మరణింతురు. అందువలన ఈ శ్లోకమున దైవము ఒక హెచ్చరిక చేయుచున్నాడు. "నీ మాట వినని స్వభావము నీకు శత్రువే. నీ మాట విను స్వభావము నీకు ఆప్తబంధువే."

ఉదయముననే నిద్రలేచినచో బాగుండును, అని అనిపించి నను లేవలేకపోవుట స్వభావము చేతిలో ఓటమి. ఇట్లెన్నియో

ఉదాహరణలు చెప్పవచ్చును. తెలియుట వేరు, ఆచరణ వేరు. తనకు శ్రేయస్కరమని తెలిసిన కూడ, తా నాచరింపలేని స్థితి యున్నచో తన స్వభావమే తన శత్రువని తెలియవలెను. తెలిసినది ఆచరింప గలిగినచో తన స్వభావము తనకు సహకరించు చున్నదని తెలియ వలెను. తన స్వభావము తనతో మిత్రత్వము వహించుట ప్రధాన మని గీతాచార్యుడు హెచ్చరిక చేయుచున్నాడు. అట్టి సహకారము లభించుటకు దైవము నాశ్రయించుటయే పరిష్కారము. ఆరాధన మార్గమున దైవము నాశ్రయింప వచ్చును. నిష్కామ కర్మ నిర్వహణ మార్గమున మరింత బలము చేకూర్చును. పరహిత జీవనము ఆ బలమును యినుమడింప జేయును. ముందు అధ్యాయములలో తెలుపబడిన సూత్రముల ననుసరించినచో తనకు, తన స్వభావమునకు మైత్రి ఏర్పడి, యోగమునకు అనుకూల పరిస్థితి ఏర్పడును.

7

ఆత్మ తత్త్వము

జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥ 7

స్వభావముపై స్వామిత్వము సాధించినవాడు ప్రశాంతు డగును. అట్టివాడు చలి - వేడిమి, సుఖము - దుఃఖము, ప్రశంస - అవమానములను సమదృష్టితో దర్శించగలడు. పరమాత్మను చేరుటకు సమర్థుడగును.

ఆత్మ యనగ పరమాత్మ. ఆత్మ యనగ జీవాత్మ. జీవాత్మయే ప్రత్యగాత్మ. అతడు బుద్ధియందున్నపుడు, చిత్తమునం దున్నపుడు, స్వభావమునం దున్నపుడు, యింద్రియములం దున్నపుడు, కర్మేంద్రియములం దున్నపుడు కూడ తానే యున్నట్లు భావించును. ఇట్లు తాను నడచుచున్నానని భావించినపుడు తాను అనగా శరీర మని అర్థము. చూచు చున్నపుడు, విను చున్నపుడు, తిను చున్నపుడు, తానే చూచు చున్నానని, విను చున్నానని, తిను చున్నానని భావించును. అపుడు తాను యింద్రియములందున్న "నేను." అట్లే భావించు చున్నపుడు భావములన్నియు స్వభావము

నుండి వచ్చును గనుక, అచ్చట నున్న నేను మనస్సుయందున్న నేను. అదే విధముగ బుద్ధి యందున్నపుడు కూడ "నేను" అనియే భావించును. అపుడు ఆత్మ బుద్ధితో కూడియున్నదని తెలియవలెను.

ఇట్లు నేను అను ప్రత్యగాత్మ శరీరమున యింద్రియముల యందు, స్వభావమునందు, బుద్ధియందు సంస్కారమును బట్టి, చేయు పనులను బట్టి యుండును. ఉత్తమ సంస్కారమున్నపుడు ఆత్మ బుద్ధియందుండి ప్రపంచమున మనస్సు, యింద్రియములు, శరీరము సౌకర్యముగ (వాహనముగ) వినియోగించును. కేవలము ఆలోచనాపరుడుగ నున్నపుడు స్వభావములోనికి సంసరణము చెంది సగటు మానవ ప్రజ్ఞగ యుండును. అపుడు "నేను" అనియే భావించును. మరింత దిగజారినపుడు కేవలము తినుట, వినుట, చూచుట, స్పర్శించుట యిత్యాది పానీయాదులు యిమిడి, అనగా యింద్రియముల యందు యిమిడి యుండిపోవును. ఇట్టివారు మానవ రూపముననే యున్నను పశువులతో సమానమై యుందురు. కేవలము శరీరమే తా మనుకొనువారు దాని పోషణము కొరకు మాత్రము జీవించువారు మానవులలో అందరికన్న చిన్నవారు. ఇన్ని స్థితులలోనికి ఆత్మయే అవరోహణము చెందుచున్నది. జీవాత్మ బుద్ధిలో యుండవచ్చును. స్వభావములో (మనస్సులో) నుండ వచ్చును. ఇంద్రియములలో నుండవచ్చును. శరీరములోనికి కూడ దిగవచ్చును. ఇవి యన్నియు తాను ప్రవేశించు వ్యూహములు. గృహముల వంటివి. ఇవియన్నియు కాక తా నున్నాడు. తాను అహర్నిశలు పై స్థితులలో నిలుచుచుపోయినచో తన నిజస్థితి మరచును.

తాను శరీరమునం దున్నాడు కాని శరీరము తాను కాదు అని తెలియవలెను. తాను ప్రపంచమును యింద్రియములద్వారా అనుభవించుచున్నాను కాని తాను యింద్రియములు కాదు. తాను మనస్సుద్వారా స్వభావమునుండి వెలువడుచున్న భావనలయందు ప్రవేశించుచున్నాడు. కాని తన భావములే తాను కాదు. తాను బుద్ధియను కక్ష్యనుండి ప్రకాశించుచున్నాడు. ఆ ప్రకాశమునకు కూడ తానే ఆధారము. తా నాధారముగనే తన ప్రకాశమున్నది. అట్లే తా నాధారముగనే తన భావములు, కోరికలు, శరీరము ఉన్నవి. ఇవి యన్నియు కాక తా నెట్లున్నాడు? నేను, తాను అని మనము పదే పదే పలుకు పదమునకు అర్థమేమి? తాను ప్రవేశించు కక్ష్యలు తాను కాదు గదా! బుద్ధియందు ప్రవేశించి నపుడు బుద్ధిమంతు డందురు. ఆలోచనల యందున్నపుడు ఆలోచనాపరు డందురు. ఆలోచనలు మనస్సు ద్వారా వచ్చు చుండును. మనస్సు ప్రధానముగ జీవించు చున్నపుడు మానవు డందురు. అట్లే అహర్నిశలు యింద్రియ పరితృప్తికై, యింద్రి యార్థముల కొరకు శమించువానిని కాముకు డందురు. కేవలము శరీర శ్రమయే చేయగలుగుట అను స్థితియందున్నపుడు శ్రామికు డందురు. ఆయా కక్ష్యలలో ప్రవేశించినపుడు ఆయా నామములు వాడుచున్నాము. కాని యివి యేమియు తాను కాదు.

ఒక గృహస్థు యింటియందున్నపుడు యజమాని. భార్యతో నున్నపుడు భర్త. పిల్లలతో నున్నపుడు తండ్రి. తల్లిదండ్రులకు కుమారుడు. అన్నదమ్ములకు సోదరుడు. కార్యాలయమున కేగి

నపుడు అధికారి, గుమస్తా, ప్యూను యిత్యాదిగ గుర్తింపబడును. స్నేహితులు స్నేహితుడుగ గుర్తింతురు. ఇన్నిటియందు తా నెవరు? తాను యజమానియా? అన్ని సన్నివేశములయందు తాను యజమాని కాదు గదా! అట్లే తాను భర్తయా? తండ్రియా? సోదరుడా? అధికారియా? స్నేహితుడా? ఇవి ఏవియు తాను కాదు. సన్నివేశమును బట్టి యజమాని, భర్త, సోదరుడు యిత్యాదిగ తెలియ బడుచున్నాడు.

నీ వెవరవు? పై తెలిపిన మానవుడవా? శ్రామికుడవా? యజమాని, భర్త, సోదరుడు యిత్యాది స్థితియా? ఇవి యేవియు కావని, అన్నియు ఆయా సందర్భమును బట్టి తాత్కాలిక సత్యము లని తెలియును. ఇవి కాక తా నెవరు?

నీ వెవరవు అను ప్రశ్నకు, నేను అప్పారావు, సుబ్బారావు, సోమేశ్వరరావు అని తెలుపుచుందురు. అదికూడ నీవు పుట్టిన తరువాత పెట్టిన పేరేగాని, నీవు అంతకుముందు కూడ యున్నావు గదా! ఆ పేరు పెట్టకముందు నీ వెవరవు? ''నే నున్నాను, నే నున్నాను'' అనుచుందువే. నే నుండుట అనగా ఏమి? నీ వెట్లున్నావు? ఇత్యాది ప్రశ్నలకు సమాధానము తెలుసుకొనవలెనను జిజ్ఞాస ఎవరికుండునో అతడికే యోగవిద్య.

యోగమునందు అవరోహణము, ఆరోహణము తెలుప బడినది. ''నేను'' అను ప్రజ్ఞ బుద్ధిలోనికి, మనస్సులోనికి (స్వభా వములోనికి), యింద్రియములలోనికి, శరీరములోనికి దిగి

వచ్చుట అవరోహణము. మరల శరీరము యింద్రియము, మనస్సు దాటి బుద్ధిని చేరి అటుపై తానుగ నుండుట ఆరోహణము. మానవులు సహజముగ మనస్సు వరకు ఆరోహణము చేయగలరు. తమ స్వభావమును తాము దాటినపుడే బుద్ధిలోనికి ప్రవేశించుట జరుగును. ఈ శ్లోకమున 'జితాత్మనః' అను పదము ప్రారంభమున వాడబడినది. అనగా జయింపబడిన ఆత్మ అని అర్థము. ఇచ్చట స్వభావముపై జయమే చెప్పబడినది. తన స్వభావమును తాను జయించుటకు వలసిన సూత్రములన్నియు ముందు అధ్యాయములో తెలుపబడినవి. వాటిని పాటించినపుడు స్వభావముపై జయము కలుగును. అట్టివానికే ప్రశాంతి కలుగును.

మనస్సులో నున్నపుడు అప్పుడప్పుడు శాంతి కలుగవచ్చును. శాంతి వేరు, ప్రశాంతి వేరు.

8

యోగ కారకములు

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః ॥ 8

ఇంద్రియములను జయించినవాడు, జ్ఞానమును గ్రహించినవాడు, నిత్యజీవితమున ఆ జ్ఞానమును నిర్వర్తించి విజ్ఞానముతో కూడి తృప్తుడైనవాడు, మట్టి బంగారము మొదలగు లౌకికములగు విలువలను దాటినవాడు- ఇట్టి సద్గుణములతో కూడినవాడు యోగి అని చెప్పబడుచున్నాడు.

జ్ఞాన సముపార్జన మానవునకు నిత్యానిత్య వస్తు వివేకము కలిగించును. శాశ్వతము, తాత్కాలికము అగు విషయములను విశద పరచును. తాత్కాలికములతో కూడినవాడు తన నిజస్థితిని కోల్పోయి, అశాశ్వతునివలె రకరకముల భ్రమలకు లోనగును. జనన మరణములు నిజమునకు జీవునియాత్రలో ఘట్టములే గాని, ఆద్యంతములు కావు. జ్ఞానము కలిగియున్నను అది దిన చర్యయందు విజ్ఞానముగ భాసింపనిచో తాను మరణించునని

భయము కలుగును. జ్ఞానము కేవలము శాస్త్రజ్ఞానముగనే ఉండి పోరాదు. అది అనుభవజ్ఞానమై నిత్యజీవనమున భాసింపవలెను. అట్టి వానికి శాశ్వత విలువలయందు ఆసక్తి, అశాశ్వతమగు విషయములందు అనాసక్తి సహజముగ ఏర్పడును. అట్టివాడే తృప్తుడుగ జీవించగలడు. ఏ విషయమందు తృష్ణ యుండదు. నిత్య జీవితమున కాలమును, దేశమును బట్టి దరిచేరు సన్నివేశముల యందు కర్తవ్యము మేరకు నిర్వర్తించి తృప్తిగ జీవించు చుండును. యజ్ఞార్థముగ వర్తించు చుండును. అనగ పరుల హితము కొరకే ప్రధానముగ జీవించును.

నిత్యానిత్యములు తెలిసినవానికి, తమ కర్తవ్య నిర్వహణ మున నిలచినవానికి స్థిరత్వముండును. ఆకర్షణలు, వికర్షణలు అతనిని భ్రమ భ్రాంతులకు లోను చేయును. ప్రజ్ఞ నిశ్చలముగ నుండును. ఇంద్రియములు కూడ అతని ననుసరించియే యుండును గాని, ఇంద్రియార్థముల వైపు పరుగిడవు. కర్తవ్యము నకు, పరహితమునకు, దివ్యారాధనమునకు ఇంద్రియములు, మనస్సు సహకరించును. శరీరము, ఇంద్రియములు అతనిపై ప్రభావము చూపలేవు. అతడే వానిపై ప్రభావము చూపుచు, జ్ఞాన విజ్ఞానములయందు నిలచియుండును. అట్టి స్థితప్రజ్ఞునకు మట్టి బెడ్డ, రాయి, బంగారమునందు ప్రధానముగ ప్రజ్ఞయే గోచ రించును. లోకమంతయు ప్రజ్ఞా విలాసమే అను భావముండును.

పై తెలిపిన శ్లోకమందు నాలుగు అంశములు గోచరించును. యోగమునకివి ప్రధానమైనవి. అవి ఈ విధముగ నున్నవి.

1. జ్ఞాన విజ్ఞానములచే తృప్తి చెందుట (జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మ): జ్ఞానము శాస్త్రముల ద్వారా, ఇతిహాస పురాణముల ద్వారా, భగవద్గీతాది గీతల ద్వారా, వేదాంగముల ద్వారా, ఉపనిషత్తుల ద్వారా, మరియు గురుబోధల ద్వారా బుద్ధిమంతుడగు సాధకుడు గ్రహింపవచ్చును. గ్రహించిన జ్ఞానమును దినచర్య యందు పూర్ణముగ అనుభూతి చెందుట విజ్ఞానము. అది సాధనతో కూడిన పని. పాకశాస్త్రము నేర్చుకొనినంతమాత్రమున వంట వచ్చిన దన లేము కదా! అనుభవముననే జ్ఞానము వచ్చును. అట్లే తత్త్వజ్ఞానము స్థిరపడుటకు జీవుడు జీవితమున ఒక సోపానక్రమముగ యజ్ఞార్థ కర్మ లాచరించుచు, దైవము తెలిపిన పరహిత యజ్ఞమును నిర్వహించుచు, సన్యసించిన మనసు కలవాడై యుండవలెను.

కర్మయందలి స్వరూప స్వభావముల నెరిగి యజ్ఞార్థము కర్మ నిర్వర్తించుట ఎట్లో మూడవ అధ్యాయమున తెలుపబడినది. అట్టి యజ్ఞకర్మను పండ్రెండు విధములుగ జ్ఞాన యోగమున దైవము తెలిపెను. వానిని నిర్వర్తించుట వలన జ్ఞానముతో యోగించుట సంభవించును. అట్టి వానికి కాంక్ష, ద్వేషము లేని స్థితి అన్ని విషయములయందు ఏర్పడుట సన్యాస యోగమున తెలుపబడినది. అటుపైన ఈ అధ్యాయమున సంకల్ప సన్యాసము కూడ తెలుపబడినది. ఇట్లు క్రమసోపాన మార్గమున రెండవ అధ్యాయమున తెలిపిన సాంఖ్యము 3, 4, 5 అధ్యాయములలో నిర్వర్తించుట వలన క్రమముగ తత్త్వజ్ఞానము విజ్ఞానముగ పరిణతి

చెందును. అట్టి వానికి ఒకటవ అధ్యాయమున తెలిపిన విషాద ముండదు. ఈ క్రమ మగు సాధన ఓర్పుతో నిర్వర్తింపని సాధకునకు మిడిమిడి జ్ఞానమే మిగులును. జీవితమున తృప్తి యుండదు.

2. కూటస్థ : చంచలత్వము, మార్పు లేక ఏకరీతిలో ఉన్న ప్రజ్ఞ. నిశ్చలత్వము, నిర్వికారత్వము కలిగియుండుట కూటస్థ స్థితి. క్షరపురుషుడు గాలికి రెపరెపలాడుచు ఆరిపోవు దీపమువలె నుండును. అక్షర పురుషుడు నిశ్చల జ్యోతివలె నుండును. యోగ సాధకుడు అట్టి స్థితిని పొందవలెనని ఈ శ్లోకము సూచించు చున్నది. జ్ఞానము, విజ్ఞానముగ పరిణతి చెందుచున్నపుడు యోగ సాధకునకు నిత్యానిత్య వస్తు వివేకము కలుగుచుండును. జీవితమున జరుగు సన్నివేశము లన్నియు వచ్చిపోవు విషయములని తెలియుచుండును. మమకారము, మోహము వంటి బంధములు తరుగుచుండును. భయము, శోకము తగ్గుచుండును. క్రమముగ అరిషడ్వర్గములు విసర్జింపబడును. తత్ఫలితముగ బాహ్య సన్నివేశములు అతని మనస్సును కలవరపెట్టవు. మనసు చంచల స్థితి నుండి అచంచల స్థితికి చేరును. క్షేత్రము నుండి యోగసాధకుని ప్రజ్ఞ అక్షరత్వము చెందుచుండును. అట్టి వానిని కూటస్థుడందురు. ఎన్ని సమ్మెట దెబ్బలు తగిలినను కంసాలి యొక్క దాగిలి చెక్కు చెదరక యుండును. పదును కలిగి యుండును. దానికి చలన ముండదు. కంసాలి దాగిలిని కూట మందురు. కూటస్థుడనగ అట్టి నిశ్చలత్వము కలవాడని అర్థము.

పర్వత శిఖరములను కూడ కూటము లందురు. శిఖరము ఎండకు, వానకు, గాలికి, చలికి, వేడిమికి తట్టుకొనుచు ఉత్తమ స్థితియందుండును. కూటస్థు డట్టివాడు.

కూటస్థితి అక్షర స్థితి. అది ఉత్తమ స్థితి. అట్టి స్థితప్రజ్ఞత్వము అరుదుగ నుండును. జ్ఞానము విజ్ఞానముగ పరిణతి చెందినపుడు మాత్రమే యోగసాధకుడు కూటస్థుడు కాగలడు. అట్టివాడే ఇంద్రియ ములను జయించిన వాడగును.

3. విజితేంద్రియః : ఇంద్రియములను బాగుగ నియమించ గలుగువాడు మరియు నిగ్రహానుగ్రహము కలవాడు మాత్రమే యోగి కాగలడని భగవానుడు పలుకుచున్నాడు. యోగసాధకునకు ఇంద్రియములు సహకరించుటయేగాని, ఇంద్రియములకు లోబడుట జరుగదు. ఇంద్రియార్థముల వైపు పరుగిడు మనసు జ్ఞాన విజ్ఞానముల ద్వారా వివేకమును, వైరాగ్యమును పొంది ఇంద్రియముల నధిగమించగలదు. సాధకుడు క్రమపద్ధతిన యోగా భ్యాసము చేయువాడైనచో, జ్ఞానమును ఆచరణమున పెట్టుటకు మొదట ప్రయత్నము చేయును. దానివలన వివేక వైరాగ్యములు కలుగవలెను. అట్లు కలుగనంత వరకు ఇంద్రియములే జయించు చుండును. అట్లు జరిగినపుడెల్ల నిరుత్సాహపడక పునః ప్రయత్నము గావించు చుండవలెను. నిత్య జీవితమును జ్ఞాన మాధారముగ నిర్వర్తించుటకు పూర్ణ ప్రయత్నము గావింపవలెను. ఇంద్రియములు క్రమముగ వశమగునే కాని, వాటిని వశము చేసుకొనుటకు తీవ్ర

మగు దీక్షలు పట్టరాదు. స్నేహమున లొంగినట్లు ఇతర మార్గము లలో ఇంద్రియములు లొంగవు. దమించుట యోగమార్గమున నిషిద్ధము. ప్రేమతో, లాలనతో పిల్లలను ఉన్ముఖము చేసుకొను నట్లు, ఇంద్రియములను బాధించక స్నేహపూర్వకముగ నియ మములోనికి తెచ్చుకొనవలెను. ఇట్టి కార్యములకు బలము జ్ఞానము నుండి లభించును.

4. సమలోష్టాశ్మకాంచనః : లోష్ట మనగ లోహము లేక ఇనుప ముక్క. అశ్మము అనగ రాయి (గుండ్రాయి). కాంచన మనగ బంగారము. లోహమును, రాయిని, బంగారమును సమానముగ చూచుట ఎరిగినవాడే యోగారూఢుడైన యోగి అని భగవంతుడు చెప్పుచున్నాడు.

రాయి కన్న లోహము, లోహము కన్న బంగారము మానవుల దృష్టిలో విలువైనవి. అట్లే శూద్రుడు, వైశ్యుడు, క్షత్రియుడు, బ్రాహ్మణుడు కూడ హెచ్చుతగ్గులతో పరిగణింపబడు చున్నాడు. అట్లే విద్యావంతుడు, అజ్ఞాని భేద దృష్టితో చూడబడుచున్నాడు. ఇట్లెన్నియో అసంఖ్యాకములైన విషయములు భేదబుద్ధితో చూడ బడుచున్నవి. ధనికుడు, దరిద్రుడు, అధికారి, సామాన్యుడు ఇత్యాదివి కూడ నట్లే. వీటన్నిటిని సమానముగ చూచుట ఎట్లు? అన్నమును, అశుద్ధమును సమానముగ చూడదగునా? ఇది సాధ్య పడు విషయమా? సృష్టియందు దేని విలువ దానికున్నది గదా! గుఱ్ఱము, గాడిద ఒకటి ఎట్లగును? ఉప్పు, కర్పూరము ఒక్క పోలిక

నున్న వాని రుచులు వేరు కదా! దుర్జనులకు, సజ్జనులకు, సామాన్యు లకు భేదము లేదా? ఇత్యాది ప్రశ్నలెన్నియో పుట్టుకొని వచ్చును.

పై తెలిపిన వన్నియు సమానమని చెప్పుట మెట్టవేదాంతమే అగును. అది ఆచరణయుక్తము కూడ కాదు. మరి భగవంతు డిట్లు చెప్పినాడేమి? దీని రహస్య మేమనగ, అన్నిటియందు అంతర్యామిదైవ మొక్కరీతిగనే యున్నాడు. అంతర్యామి దైవమును దర్శించువాడు యోగి. పై తెలిపిన అన్ని అంశములు స్థితిగొని యున్నవి గదా. స్థితి విషయమున అన్ని అంశములు ఒక్కటియే. రాజు ఉన్నాడు. పేద ఉన్నాడు. బ్రాహ్మణుడు ఉన్నాడు. అట్లే క్షత్రియ, వైశ్య, శూద్రులు ఉన్నారు. రాయి ఉన్నది. రాము డున్నాడు. ఇచ్చుట గమనించవలసిన విషయము "ఉండుట" అను విషయము. దీనిని స్థితి అందురు. ఉండుట అన్నిటియందు సమానమే. కాని ఆయా వస్తువుల చైతన్య వికాసమునందు భేదము కలదు. కొన్నిటి యందు చైతన్యము ఎక్కువ వికసించి యుండును. కొన్నిటి యందు తక్కువ వికసించి యుండును. చైతన్యము యొక్క వికాసమునుబట్టి ప్రకాశము, ప్రభావము వేరు వేరుగ నుండును. అశ్మము కన్న లోహమందు ప్రకాశ మెక్కువ. ఇనుము కన్న బంగారమునందు ప్రకాశ మెక్కువ. అట్లే జీవులయందు కూడ వారి వారి ప్రకాశమును బట్టి, వారి వారి విలువ లేర్పడుచుండును. గ్రామ పాలకునకు, సామ్రాజ్య పాలకునకు వ్యత్యాసము వారి చైతన్య వికాసమును బట్టి యుండును.

చైతన్య విలాసమంతయు యోగిదృష్టియందు ఒక మాయా నాటకము. ఈ జన్మకు రాజైనవాడు పై జన్మకు బంటు కాగలడు. ముందు జన్మయందు కూడ బంటుయే అయి ఉండవచ్చును. ఈ జన్మలో ధనికుడు క్రిందటి జన్మలో పేద కావచ్చును. ఇట్లు జీవులు జన్మకొక పాత్రపోషణము చేయుచు, వేల జన్మలలో వివిధములగు పాత్రలు పోషించుచుందురు. ఈ చైతన్య విలాసము వెనుకగల అస్థిత్వమును దర్శించువాడు నిజమగు యోగియని శ్రీకృష్ణుని భావము. యోగి జీవులను, వారియందు వర్తించుచున్న అంతర్యామిని దర్శించి, సమదర్శనుడై నిలుచును. సృష్టియందు ఆ జీవులు పోషించు పాత్ర ననుసరించి వారితో ప్రతిస్పందించును. పాత్రపోషణమున వైవిధ్య ముండవచ్చును. దానికాధారభూతుడగు జీవునియందు వసించు అంతర్యామి ఒక్కడే. ఇది తెలిసినవాడు యోగారూఢుడగును గాని, కేవలము ప్రకృతి విలువలకే పట్టము కట్టుచు జీవించు మిడిమిడి జ్ఞానము కలవాడు కాదు. యోగ సాధకుడు అంతర్యామితో అనుసంధానము చెందుట వలన యోగారూఢుడై, యోగియై నిలబడును. చైతన్య విలాసములకు ఆకర్షింపబడినచో యోగ భ్రష్టుడగును.

9

యోగ సూత్రములు

సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్యబంధుషు ।
సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే ॥ 9

యోగసాధకునకు ఆత్మసంయమము కలుగుటకు మరి కొన్ని సద్విషయములు సూచింపబడినవి. అవి పై శ్లోకమున తెలుపబడినవి. అందు మొదటిది వివిధములగు మనుజులను సంఘమున కలియుచుండుట సామాన్యముగ జరుగుచునే యుండును. అందు తొమ్మిదిరకముల మనుష్యులను గూర్చి ఈ శ్లోకము తెలుపుచు, అట్టివా రందరియందు యోగి సమభావన కలిగియుండవలెనని శ్రీకృష్ణుడు బోధించుచున్నాడు. వారెవరనగ

1. సుకృత్ : అనగా ప్రతిఫలము కోరక ఉపకారము చేయువారు.
2. మిత్ర : ఉపకారమునకు ప్రత్యుపకారము చేయువారు.
3. అరి : శత్రువు.

4. ఉదాసీన : తటస్థుడు

5. మధ్యస్థ : మధ్యవర్తి

6. ద్వేష్య : ద్వేషింప దగినవారు.

7. బంధు : బంధువు

8. సాధు : సాధువు

9. పాపేశు : పాపులు.

పై తెలిపిన తొమ్మిది వర్గముల వారియందును సమ భావము గలవాడే శ్రేష్ఠియగు యోగియని దైవము తెలుపుచున్నాడు.

ప్రస్తుత కాలమున యోగమను పదమును విరివిగ వాడుట జరుగుచున్నది. భగవంతుని దృష్టిలో ఆత్మసంయమ యోగము పొందుటకు యోగసాధకునికి వలసిన లక్షణములు దైవము వివరించినాడు. అవి యన్నియు మరియొక్క మారు పునస్మరణ చేయుట ఉత్తమము. అవి ఈ విధముగ నున్నవి.

1. ఫలముల నాసించక కర్తవ్యకర్మ నిర్వర్తించుట.
2. సంకల్పములను సన్యసించుట.
3. బంధము లేక కర్మను నిర్వర్తించుట.
4. శమము కలిగియుండుట.
5. శీతోష్ణములను, సుఖదుఃఖములను, మానావమానములను తటస్థుడై గమనించుట.

6. జ్ఞానమును ఆచరణమున విజ్ఞానముగ అమలు పరచుట.

7. నిలకడ, నిశ్చలత్వము కలిగియుండుట.

8. నిగ్రహింపబడిన ఇంద్రియములు కలిగియుండుట.

9. మట్టి, లోహము, బంగారము ఇట్టి వానియందు సమ దృష్టి యుండుట.

10. ముందు తెలిపిన తొమ్మిది వర్గముల వారియందు సమ దర్శన ముండుట.

పై తెలిపిన పది సూత్రములు పాటించుటకు యోగ సాధకుడు సంసిద్ధుడు కావలెను. అట్టి సంసిద్ధత లేనపుడు ధ్యానమున కుపక్ర మించుట అవివేకమని తెలియవలెను.

10

ఆత్మజ్ఞానము

యోగీ యుంజీత సతత మాత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥ 10

రహస్య ప్రదేశమున ఏకాంతముగ స్థితిగొని అంతర్ముఖమైన చిత్తము గలవాడై, ఆశ లేనివాడై యోగి సతతము ఆత్మయందు మనస్సును లగ్నమొనర్చును.

ఈ శ్లోకమున ఆత్మసంయమము గావించు విధానము తెలుపబడినది. అది ఇట్లున్నది.

1. ఏకాకి, రహసి స్థితః : రహస్యముగ, ఏకాంత స్థితియందు ఉండవలెను. దీని కొరకు పూర్వము ఆత్మసంయమము కొరకు యోగసాధకులు గుహలలో ఏకాంతముగ నుండెడివారు. ఏకాంత ప్రదేశమున కేగుట వలన కొంత మనసు కుదుటపడునని కొందరు భావింతురు. కాని కుదురు గల మనస్సు ఎచ్చటనైనను కుదురుగనే యుండును. గుహలకు, అడవులకు పోనవసరము లేదు. తన

గృహమునందు సాధకుడు ఒక నిర్ణీత ప్రదేశమున ఏకాంతముగ ఆశీనుడై యుండవచ్చును. మనస్సంతర్గతమై హృదయము నందు నిలిపినచో ఏకాంతము లభించును. హృదయగుహలో అను నిత్యము జరుగు హృదయ స్పందన యందు మనస్సు లగ్నము చేయుట ప్రధానము. స్పందనమందు మనస్సునకు గల ఆసక్తి వలన ప్రజ్ఞ లచ్చట నిలుపుటకు వీలుపడును. అపుడు చిత్తము అంతర్ముఖ మగును. స్పందనపై నియమించబడి యుండును.

లేదా మనో ప్రజ్ఞను భ్రూమధ్యమందు లగ్నముచేసి అచట వెలుగు దర్శనము చేయుటకు ప్రయత్నింపవలెను. మనస్సు అటు నిటు పోగలదు. కాని మరల మరల ప్రజ్ఞను భ్రూమధ్య మందలి వెలుగు దర్శనమునకు ప్రోత్సహించవలెను.

పై రెండు విధములతో జీవలక్షణమును బట్టి ఏ విధానము సులభమో దాని నవలంబించ వచ్చును. విధాన మేదైనను జరుగ వలసిన సాధన నిరంతరము కావలెను. ఒకే ప్రదేశమున నిర్వ ర్తించుటవలన ప్రకృతి ఆ ప్రదేశమున సహకరించగలదు. నిర్ణీత కాలము కూడ పాటించినచో ప్రయత్నమునకు సిద్ధి కలుగుటకు కాలము కూడ తోడ్పడును. ముందు శ్లోకములలో తెలిపినట్లు సమబుద్ధి ఏర్పడుట వలన చిత్త మంతర్గత మగుటకు గల అవరోధ ములు తగ్గును. ఒకే ప్రదేశము, ఒకే కాలము తోడగుట వలన అవరోధములు మరింత తగ్గును. అంతరంగమునందు ప్రజ్ఞ

నిలుపుటవలన సాధన రహస్యముగ సాగును. అంతరంగమున తానే కాంతుడు గనుక ఏకాంతము సిద్ధించును.

2. నిరాశి : ఆశ గలవానికి ఆత్మసంయమము కుదరదు. పంచభూతాత్మకమైన బహిరంగమందు ఆశ, ఆసక్తి సాధకుని అంత రంగ ప్రవేశమునకు అవకాశము కలుగనీయదు. ఆశ వలన ప్రజ్ఞ బహిర్ముఖ మగుచుండగ, అంతర్ముఖుడెట్లు కాగలడు? ఆశ ఉన్నంతకాలము జీవుడు బాహ్యముననే జీవించును గాని అంత రంగమున చేరజాలడు. కనుక తీరని కోరికలు, ఆశలు గలవారు ధ్యానముకు వలసిన ప్రాథమిక అర్హతను కోల్పోవుదురు. ధ్యానము పేరున అట్టివారు చేయు కృషి యంతయు వృథా ప్రయాసయే అగును. ఈ విషయము తెలియవలెను.

3. అపరిగ్రహః : ఇతరులను, ఇతరుల సంపదను తమ కొరకు వినియోగించువారు కర్మబద్ధు లగుదురు. ఉచితముగ ఇతరుల సహకారమును అందుకొనువారు ఋణగ్రస్తులు కాగలరు. గ్రహించుట, పరిగ్రహించుట ఆత్మసంయమమునకు విరుద్ధ ములు. దానము చేయుట, త్యాగము చేయుట దోహద కారకములు. యోగ సాధకుడు ఇతరుల నుండి లబ్ధిపొందు బుద్ధి కలిగి యుండ రాదు. తా నితరులకు చేయు హితము, తా నితరుల నుండి పొందు హితము కన్న మిక్కుటమై యుండవలెను. విలువగల వస్తువులు గాని, వెండి బంగారములు గాని, ధనముగాని, బహుమతులుగ

స్వీకరించరాదు. అట్లు స్వీకరించినను తక్షణమే సద్వినియోగము చేయవలెను. స్వంతమునకు వినియోగింపరాదు.

4. యత చిత్తాత్మా : నియమింపబడిన చిత్తముగలవాడై యుండవలెను. అందులకు కృషి చేయవలెను. ఆశ యతచిత్తము నకు వ్యతిరేకము. అట్లే పరిగ్రహము కూడ. అందువలననే నిరాశ, అపరిగ్రహము యతచిత్తమునకు ప్రధానమైన లక్షణములుగ ఈ శ్లోకమున పేర్కొనబడినది. నిజమునకు యతచిత్తము వలయు నన్నచో అహింస, సత్యప్రవర్తనము, బ్రహ్మచర్యము, దొంగబుద్ధి లేకుండుట, అపరిగ్రహము, బాహ్యశుచి, అంతఃశుచి, సంతోషము, నిత్య పఠనము, ఈశ్వర ప్రణిధానము ప్రధానమని పతంజలి మహర్షి బోధించెను. అట్టివానికే స్థిరము, సుఖము అగు చిత్త స్థితి కలుగునని తెలిపెను. భగవద్గీతయందు కూడ ముందు శ్లోకములలో ఈ విషయములే తెలుపబడినవి. ఆత్మజ్ఞానమునం దాసక్తి గలవారు సున్నితముగ పై తెలిపిన నియమములను పాటించుటకు త్రికరణ శుద్ధిగ శ్రమించవలెను.

11

స్థిరాసనము

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః ।
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్ ॥ 11

పరిశుద్ధమైన ప్రదేశమందు మిక్కిలి ఎత్తుగా గాని, లోతుగా గాని లేని సమతల ప్రదేశమందు ఒక దర్భాసనము పరిచి, దానిపై ఒక జింక చర్మమును పరిచి, దానిపైన వస్త్రమును పరిచి స్థిరమగు ఆసనమున ఆత్మసంయమమునకై కూర్చుండవలెను.

ధ్యానమున కుపక్రమించు యోగసాధకుడు తప్పక పాటింప వలసిన నియమము లివి.

1. ధ్యానము చేయు ప్రదేశము శుచిగ నుండవలెను. ప్రతి నిత్యము ఆ ప్రదేశమును నీటితో శుభ్రపరచుకొనవలెను. శుచిత్వ మేర్పడుటకు చందనపు అగరువత్తులను కూడ నేర్పరచుకొన వచ్చును.

2. శుచియగు ప్రదేశమున, మరీ ఎత్తుకాని చెక్కపీట నొక

దానిని అమర్చుకొనవలెను. దానిపై దర్భాసనము వేసుకొన్నచో మరింత శ్రేష్ఠము. లోహము, రాయికన్న చెక్కపీట శ్రేష్ఠము. దాని పైన పరచిన దర్భాసనము ఆసనమునకు మరికొంత సాత్వికతను ఆపాదించును. దానిపై ఒక పలుచని తెల్లని నూలు వస్త్రము వేసుకొనినచో మరికొంత సాత్వికత లభించును. శ్లోకమందు దర్భాసనముపై జింక చర్మమును వేసుకొనుట కూడ తెలిపినారు. వంశానుక్రమముగ జింక చర్మమున్నచో ఆసనముగ వాడుకొన వచ్చును. లేనిచో జింక చర్మమును పొందుటకు చేయు ప్రయత్నము ప్రస్తుత కాలమున నేరమగును. పీటపై దర్భ చాప, దానిపై తెల్లని వస్త్రము శుచియైన ప్రదేశమున ఏర్పరచుకొన్నచో చాలును.

3. సాధకుడు స్థిరాసనమును ఏర్పరచుకొనవలెను. ఆసన మనగ కూర్చుండు పద్ధతి. అది స్థిరముగ, నిశ్చలముగ నుండవలె నన్నచో దేహమునకు సుఖమిచ్చునదిగ నుండవలెను. లేనిచో సాధకు డటునిటు కదలుట తప్పనిసరియై, మనస్సును ఆత్మపై లగ్నము చేయుటకు వీలుపడదు. పూర్వకాలమున పద్మాసనము వేసు కొనెడివారు. అట్లే వీరాసనము కూడ వాడుక యందుండెడిది. ప్రస్తుతము జీవన విధానము ననుసరించి నేలపై కూర్చుండు అలవాటు తప్పుటచే, ఎవ్వరును పై తెలిపిన విధముగ కూర్చుం డుట లేదు. ఆసన మేదైనను అది ప్రధానముగ దేహమునకు స్థిరత్వము నీయవలెను. భగవద్గీతయందు స్థిరమాసనమే తెలిపిరి గాని, ప్రత్యేకముగ ఏ ఆసనమును నిర్దేశించ లేదు. ధ్యానమునకు

ప్రధానముగ వలసినది, మనస్సును ఆత్మపై లగ్నము చేయుట. ఆ ప్రయత్నమున దేహమున కంతరాయము కలిగింపరాదు. ఇది ప్రధానమని సాధకుడు తెలియవలెను. దేహస్థిరత్వము, మనో స్థిరత్వము ధ్యానమునకు ప్రధానమగు లక్షణములు. అందువలన కొందరు సద్గురువులు పరుండబెట్టి ధ్యానము నిత్తురు. మరి కొందరు కూర్చుండబెట్టి నిత్తురు. ఆసన మేదైనను ఒక గంట సమయము దేహమును కదపనవసరము లేనిదై యుండవలెను.

అటుపైన మనస్సును స్థిరమగు ప్రదేశమున అంతరంగమున లగ్నము చేయుట నిజమగు ఆసన మగును. మనసును హృదయమునందు గాని, భ్రూమధ్యమునందు గాని స్థిరముగ లగ్నము చేయుటకు ప్రయత్నము సాగవలెను. అట్టి స్థిరత్వము మనస్సునకు కలుగుటకు వలసిన లక్షణము లన్నియు ముందు శ్లోకములలో ఇప్పటికే తెలుపబడినవి. వాటిని పాటించినపుడే మనస్సునకు స్థిరాసనము ఏర్పడును. ఇట్లు ఈ శ్లోకమున స్థిరాసనము దేహమునకు, మనస్సునకు కూడ సూచింపబడినది.

12

యోగాభ్యాసము

తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।
ఉపవిశ్యాసనే యుంజ్యా ద్యోగ మాత్మవిశుద్ధయే ॥ 12

స్థిరమగు ఆసనముపై కూర్చుండి మనస్సును ఇంద్రియ వ్యాపారముల నుండి విరమింపజేసి "తత్" విషయముపై స్థిరముగ నిలుపుట అభ్యాసము చేయవలెను. దానివలన ఆత్మ మనో ఇంద్రియ వ్యాపారముల నుండి శుద్ధి చెంది తానను వెలుగుగ నిలచును.

ఈ శ్లోకము ఆత్మసంయమ యోగమునకు కీలక సూత్రము. ఈ అభ్యాసము చేయవలెనన్నచో ముందు తెలిపిన అర్హత లన్నియు సాధకునకు కూడవలెను. అందెట్టి లోపమున్నను ఆత్మ సంయమము అభ్యాసము చేయుటకు వీలుపడదు.

ఆత్మ నుండియే బుద్ధియను వెలుగు వ్యక్తమగును. ఆ వెలుగు ఆధారముగ పంచప్రాణములు, పంచేంద్రియములు, కర్మేంద్రియములు, దేహము ఏర్పడుచుండును. ఆ వెలుగు అంతః

కరణమున వ్యాపించి యుండును. ఇన్నిటిలోనికి వ్యాపించినది ఆత్మ వెలుగే. సూర్యుని నుండి కిరణములు వ్యాపించినట్లుగ ఆత్మనుండి వెలుగు కిరణములు మనస్సు, ఇంద్రియములు, దేహము, బాహ్యములోనికి వ్యాప్తి చెందుచుండును. సూర్య కిరణములు ప్రచండముగ వ్యాప్తి చెందినపుడు సూర్యబింబమును దర్శనము చేయలేము. అట్లే ఇంద్రియ వ్యాపారముల యందు అనేకానేక భావములతో తిరుగాడుచున్న సాధకునకు ఆత్మ దర్శనము దుర్లభము. కిరణములు ఉపసంహరింపబడినపుడు సూర్య బింబము మనోహరముగ గోచరించును. అట్లే సాధకుని యందు భావ పరంపరలన్నియు ఉపసంహరింపబడినపుడు వానికి మూల మైన వెలుగు తన అంతఃకరణయందు గోచరించును. కావున అట్లు గోచరించుటకు మనో ఇంద్రియ వ్యాపారములు నియమింప బడవలెను. మనస్సు, ఇంద్రియములు, నియమింపబడవలె నన్నచో, జీవన విధానమున యమనియమములు పాటింపబడ వలెను. యమనియమములను పాటించుటకు జీవుని స్వభావము అడ్డు తగులుచుండును. స్వభావము అడ్డు తగులకుండుటకై ఈశ్వర ప్రణిధానము నభ్యాసము చేయవలెను.

కేవలము ధ్యానముపై ఆసక్తి చాలదని, జీవితమున యమ నియమములు పాటింపనివారు యతచిత్తులు కాలేరని తెలియ వలెను. మనస్సు పరిపరి విధముల పోకుండుటకే యమనియమ ముల అభ్యాసము. అందువలననే ఈ శ్లోకమున "యతచిత్త ఇంద్రియః" అను పదములు సూచింపబడినవి. యయ నియమ

ములు పాటింపబడుట వలన స్వభావము కొంత శాంతపడును. మనస్సునకు నిలకడ చిక్కును. నిలకడగ నున్న మనస్సును గూర్చియే ఈ శ్లోకమున 'ఉపవిశ్య ఆసనే' అను పదమున తెలియ నగును. మనస్సు నిలకడ చెందినపుడు ఆసనము సిద్ధించినట్లే. మనసు నిలకడగ నున్నపుడు భావ తీవ్రత యుండదు. చూచినవి, విన్నవి, మాట్లాడినవి, తిన్నవి, స్పృశించినవి, వాసన చూచినవి ఏవియును అట్టి సమయమున కలవర పెట్టవు. దేహమునకు స్థిరమగు ఆసన మేర్పడును.

యోగమున ఆసనము స్థిరముగ నుండుట అనగ మనస్సు, ఇంద్రియములు, శరీరము స్థిరముగ నుండుట. సంచలనము లేక యుండుట. ఒకానొకచో సంచలము గోచరించిన, మనస్సును ఉచ్ఛ్వాస నిశ్వాసలపై లగ్నము చేయుటవలన సంచలనము తగ్గును. శ్వాస వేగమును క్రమముగ తగ్గించినకొలది భావవేగము తగ్గును. ప్రశాంతత చిక్కును. శ్వాసయందు మనస్సును లగ్నము చేయుట ముందు అధ్యాయములో తెలుపబడినది.

ఎట్లైనను ఆసనసిద్ధి కలిగిన తరువాతనే మనస్సును భావములు పుట్టు చోటుయందు లగ్నము చేయుటకు వీలు పడును. 'తత్రైకాగ్రం' అను పదము శ్లోకమున వాడబడినది. "అక్కడ మనసు లగ్నము చేయుట" అని ఆ పద తాత్పర్యము. అక్కడ అనగ ఎక్కడ అను ప్రశ్న పెద్దలచే పరిష్కరింపబడినది. భావములు పుట్టుచోటు అని నిర్ణయింపబడినది. ఆ చోటును దర్శించుటకు సాధకుని మనోప్రజ్ఞ లగ్నము చేయబడుట అభ్యాసముగ ఈ

శ్లోకము తెలుపుచున్నది. ఆ పుట్టు చోటును భ్రూమధ్యమున గాని, హృదయమున గాని దర్శించుటకు ప్రయత్నింపవచ్చును. ఇట్టి ప్రయత్నము చాలకాలము సాగవలెను. అపుడు సాధకుడు మనో నిశ్చలతను బట్టి అంతరంగ ప్రవేశము చేయును. బహిఃకరణముల నుండి అంతఃకరణముల లోనికి ప్రవేశించును. భ్రూమధ్య కేంద్ర ముగాని, హృదయ కేంద్రముగాని అంతఃకరణము లోనిదే. అందు ప్రవేశించుట కొరకే అంతర్ముఖముగ మనస్సును లగ్నము చేసి స్థిరపరచుట. అట్లు ప్రవేశించు ప్రయత్నము యోగాభ్యాసము ('యుం' జ్యాత్ యోగం).

పై విధమగు వివరములు తెలియక ధ్యానము చేయుట నిష్ప్రయోజనము.

13

ధారణ

సమం కాయ శిరో గ్రీవం ధారయ న్న చలం స్థిరః ।
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చా నవలోకయన్ ॥ 13

కాయము, శిరస్సు, కంఠము తిన్నగ నిలిపి కదలిక లేక స్థిరముగ కూర్చుండి చిత్తమును దిక్కులకు పయనింపనీయక నాసికాగ్రమును వీక్షించుచు ఉండవలెనని ఈ శ్లోకము నిర్దేశించుచున్నది.

11, 12, 13, 14, 15 శ్లోకములలో ఆత్మ సంయమమునకు నిత్యము చేయవలసిన అభ్యాసము వివరింపబడినది. ఆసనమున కూర్చుండు సాధకుడు ధ్యానమున కుపక్రమించు సమయమున శిరస్సును, కంఠమును, మొండెమును నిట్టనిలువుగ నుంచుటకు ప్రయత్నింపవలెను. శిరస్సు పైకెత్తుటగాని, క్రిందికి దించుటగాని చేయరాదు. వెన్నెముకను బాణమువలె వంచక, దండమువలె నిట్టనిలువుగ నుంచవలెను. ఇట్టి ఆసనము సిద్ధించుట చాల ముఖ్యము. ఇట్టి ఆసనము మాత్రమే ప్రజ్ఞా ప్రసారమునకు సహకరించును. అవరోధములు కలుగవు. ఇట్లు కూర్చుండుటలో సుఖము

కలుగవలెను. స్థిరము కలుగవలెను. అభ్యాసవశమున అది జరుగగలదు.

ఆసనము విషయమున అప్రమత్తత సాధకునకు తప్పని సరి. మనస్సు, ఇంద్రియములు, దేహము సహకరింపనిదే స్థిరము, సుఖము అగు ఆసనము కుదరదు. స్థిరము, సుఖము అగు ఆసనము కుదిరిన పిదప నాసికాగ్రమున దృష్టి నుంచవలెను. నాసికాగ్రమనగ భ్రూమధ్యము. భ్రూమధ్యమున దృష్టి సారించుట మానసికమేగాని భౌతికము కాదు. ఇట్లు భ్రూమధ్యమున ప్రజ్ఞను ధారణ చేయవలెను. ప్రజ్ఞ సహజమగు వెలుగు కనుక భ్రూమధ్య మున వెలుగును తానుగ దర్శించుట నిర్దేశింపబడినది. దిక్కులకు మనస్సు చెదరినను, మరల భ్రూమధ్యముననే లగ్నము చేసి వెలుగును దర్శింపవచ్చును. దీనిని 'ధారణ' అందురు.

ధారణ నిలుచుటకు జ్యోతిని చూచి కనులు మూసుకొనుట ఒక సంప్రదాయము. గురువు లేక దైవముయొక్క ప్రసన్న వదన మును ధారణ చేయుట మరియొక ఉపాయము. ఉదయించు చున్న సూర్యబింబమును అంతర్ముఖముగ ధారణ చేయుట మరియొక ఉపాయము. సూర్యుని కాంతిచే వికసించుచున్న తెల్లని పద్మము ధారణ చేయుటకూడ ఒక ఉపాయమే. అట్లే తాను, నేను అను తన వెలుగును ధారణ చేయుట గీతాచార్యుడు తెలిపిన ఉపాయము. చిత్తము ధారణచేయు వస్తువునందు లగ్నమై అచల స్థితి చెందవలెను. అప్పుడది క్రమముగ స్థిరమగు వెలుగుగ గోచరించును.

14

పూర్ణ జిజ్ఞాస

ప్రశాంతాత్మా విగతభీ ర్బ్రహ్మచారివ్రతే స్థితః ।
మన స్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥ 14

ప్రశాంతమైన మనస్సు కలవాడై, భయము వీడినవాడై బ్రహ్మ యందు చరించుట స్థిరమగు వ్రతము కలవాడై, సంయమము చెందిన ఇంద్రియములతో కూడిన మనస్సు కలవాడై, 'నా' యందు ఆసక్తి, ప్రేమ కల చిత్తము కలవాడై, మత్పరుడై 'నా'తో ముడిపడిన వాడై ఉండవలెను.

శ్రీకృష్ణుడు అందించిన ఈ ఉపదేశము ధ్యానమున మణి పూస వంటిది. ఇచ్చట 'నేను' అని కృష్ణుడు వాడిన పదము సాధకుని యందు అంతర్యామిగ నున్న నేను. అనగ జీవుని యందలి దైవము. జీవుల యందలి దైవముతో అనుసంధానము చెందుట యోగము. జీవుడహంకార ప్రజ్ఞ. అతడు త్రిగుణాత్మకుడు. నే నున్నానను ప్రత్యేక భావము కలవాడు. జీవులయందున్న దేవుడు త్రిగుణాతీతుడు. అంతర్యామి. అన్నిటియందు గుణముల కావల ఉండువాడు. కావున సర్వాంతర్యామి. అతడాధారముగ గుణము లేర్పడి,

అందుండి ప్రత్యగాత్మగ జీవు డేర్పడుచున్నాడు. నిజమునకు జీవుడు స్థితి మార్పు చెందిన దైవమే. జీవుని పేరు నేను. దైవము పేరు కూడ నేనే. నేనను జీవుడు, నేను అను దైవముతో అనుసంధానము చెందుటకు చేయు ప్రయత్నమే యోగాభ్యాసము. నేనను ప్రత్యేక ప్రజ్ఞ, నేనను అంతర్యామి ప్రజ్ఞతో జతపడవలెను. ఇది అంటు కట్టుట వంటిది. అట్లు భావనతో కట్టివుంచుటచే, క్రమముగ రెండుగ నున్నవి ఒకటిగ నేర్పడగలవు. "యుక్త ఆసి" అని శ్లోకము చెప్పుచున్నది. అనగ కలిపి యుంచవలెనని అర్థము. ఇట్లు చాల కాలము కలిపియుంచుటకు ప్రయత్నము సాగవలెను.

ఈ ప్రయత్నమున శ్రద్ధ, భక్తి దైనందినముగ నున్నచో క్రమముగ ప్రశాంతత చిక్కును. భయము తొలగును. అంతర్యామి యందే చరించు దినచర్య ఆరంభమగును. ఇంద్రియములు మనస్సు అనుకూలములగును. ఇది ఒక పద్ధతి. ఈ పద్ధతి యందు దైవమే కర్తయై నిలచును. మరియొక పద్ధతి ప్రశాంతమగు మనస్సు నేర్ప రచుకొనుట, భయమును తొలగించుకొనుట, మనస్సు ఇంద్రియ ములను మచ్చిక చేసుకొనుట, బ్రహ్మమునందు చరించుట తానుగ స్వప్రయత్నమున నిర్వర్తించుకొనుచు, తన యందలి అంతర్యామితో యోగించుట. ఇందు మొదటి పద్ధతి భక్తునకు సహజము. అతడు దైవమే ఉపాయమని, అంతట, అన్నిట దైవమునే చూచుచు, దైవ యుక్తుడగు చుండును. జ్ఞాని పురుష ప్రయత్నమున తనను తాను సమకూర్చుకొని దేవునితో యోజించుటకు ప్రయత్నించును. ఇరువురికిని ఫలప్రదాత దైవమే.

ప్రతినిత్యము పై తెలిపిన మూడు శ్లోకముల ననుసరించుచు, నిర్ణీత సమయమున ధ్యానము నాచరించుట ప్రధానమని తెలియవలెను. కేవలము దైవమునందే ఆసక్తి, ప్రేమ కల వారు ఆత్మ సంయమమును సులభముగ బడయుదురు. వారి దినచర్య యంతయు కూడ దైవదర్శనమునే అంతట, అన్నిట చేయుచు నిర్వర్తించుకొను చుందురు. అట్టి వారికి ఆత్మ సంయమము శీఘ్రగతిని సిద్ధించును. ఇతరములు గోచరించు వారికి సిద్ధించుట కష్టము. చిత్త మెంతవరకు దైవము నాశించునో అంతవరకు యోగము జరుగుచుండును. చిత్త మితర విషయములపై ఆసక్తిని చూపినపుడు యోగ మాగును. కావున పూర్ణ జిజ్ఞాసువులకే ఆత్మ సంయమము సాధ్యమగునని తెలియవలెను.

15

పరమ శాంతి

యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ నియతమానసః ।
శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి ॥ 15

నియతమగు మనస్సు కలిగి, ఎల్లపుడును ఆత్మతో కూడి యుండి, నా యందు స్థితిగొని, ప్రవృత్తి కతీతమగు శాంతిని యోగి పొందుచు నుండును.

భగవానుడు యోగి లక్షణము నొకదానిని ఇచ్చట ఆవిష్కరించు చున్నాడు. ఈ లక్షణము యోగసాధకునకు లక్ష్యమై యుండవలెను. నియత మానసుడనగ నియమింపబడిన మనస్సు గలవాడు. పరి పరివిధములపోక నిర్దేశించిన విషయమునందు మనస్సు స్థిరముగ నున్నపుడు అట్టి మనస్సును స్థిరమగు మనస్సు లేక చిత్తము అందురు. అట్టి స్థిరమగు చిత్తము పొందుటకు ఎన్నియో నియమ ములు పూర్వమున దైవము పేర్కొని యున్నాడు. భక్తి, శ్రద్ధ, దీక్ష గలవారు ఆ నియమములను పాటింతురు.

స్థిరమగు మనస్సు లేక ధ్యానమున కుపక్రమించుట పిల్ల

తనము. మనోప్రజ్ఞ స్థిరముగ నున్నపుడు ఆ ప్రజ్ఞను నేను అను వెలుగుపై లగ్నము చేయుటకు సాధ్యపడును. అట్లు లగ్నము చేసినపుడే సాలోక్యము సిద్ధించును. సాలోక్యమనగ సారించి చూచుట. చూచు విషయములు తప్ప, ఇతర విషయములు భాసింపవు. అపుడు తాను, చూడబడుచున్నవి మాత్రమే యుండును. దానిని చూచుటయే యుండును. ఇతరములు గోచరములు కావు. అట్లు నిరంతరముగ చూచుట వలన చూడబడు విషయము వైపునకు చూచువా డాకర్షింపబడును. ఇట్లాకర్షింపబడుట వలన చూచు విషయమునకు సామీప్యమున చేరును. క్రమముగ సాయుజ్యము లభించును. అనగ చూడబడు విషయముతో జత కట్టును. అట్లు నేనను ఆత్మ వెలుగుతో మనోప్రజ్ఞ జతకట్టుట ఈ శ్లోకమున తెలుపబడుచున్నది.

"*యుంజన్నేవం సదాஉஉత్మానం*" అని శ్లోకము ఆరంభ మగుచున్నది. నియతమగు మనస్సు నేనను వెలుగుతో ఎల్లప్పు డును జతకట్టి యుండుట ధ్యాన ప్రక్రియ. అట్లు జతకట్టి యుండుట వలన ప్రవృత్తి భావము లుండవు. అనగ ప్రాపంచిక విషయము లేవియు స్ఫురించవు. తాను, తన వెలుగు మాత్రమే యుండును. అది సాధకునకు చక్కని శాంతినిచ్చును. ఇతర భావము లన్నియు నిర్వాణము చెందుట వలన పరమశాంతి పొందును. దీని రుచి తెలిసినవాడు నేనను వెలుగున స్థిరపడుటకు ఉత్స హించును. ఇతరము లేవియు అంతకన్న విలువైన విషయము లనిపించవు. ప్రవృత్తి నధిగమించి, నివృత్తి యందు స్థిరపడి దేశకాలములను బట్టి నిమిత్తమాత్రుడై కార్యములను నిర్వర్తించును.

16

సమతుల్య ప్రవర్తన

నాత్యశ్నతస్తు యోగోఽస్తి న చైకాంత మనశ్నతః ।
న చాతిస్వప్న శీలస్య జాగ్రతో నైవ చార్జున ॥ 16

అతిగా భుజించువాడు, అసలు భుజించనివాడు యోగి కాడు. అతిగా మేల్కొని యుండువాడు మరియు అతిగ నిద్రించు వాడు కూడ యోగి కాడు.

సమతుల్యమే యోగమునకు ప్రధానము. అతిగా భుజించి నను, అతిగా నిద్రించినను సాధకునియందు మితిమీరిన తమస్సు ఏర్పడును. దేహము బరువెక్కును. సోమరితనము కలుగును. దానివలన మరపు కలుగును. చేయవలసిన పనులయందు అశ్రద్ధ, ఆలస్యము, వైఫల్యము కలుగుచుండును. సామాన్యముగ మానవు నకు దినమున ఆరేడు గంటలకన్న నిద్ర అవసరము కలుగదు. రెండుమూడుసార్లు కన్న అన్నపానీయము లావశ్యకత కలుగదు. ఆకలి, దాహము, నిద్ర అతిగానున్నచో జీవితమే బరువగును. ఇక యోగ మెక్కడ? తన దేహ పరిస్థితిని తానే గమనించి, తన దేహము నకు సరిపడు ఆహారము తానే తెలుసుకొని భుజింపవలెను. అజీర్తికి

తావియ్యరాదు. పగటి నిద్ర నిషిద్ధమని ఆర్యులు తెలుపుదురు. ఎండలు మండు కాలమున మధ్యాహ్నము నిద్రించుట కన్న, ఇరువది ముప్పది నిమిషములు విశ్రాంతి గొనుట మేలు. శరీరమునకు తగిన వ్యాయామము, స్నానాదిక శుచిత్వము, పరిశుద్ధమగు భోజనము, సౌకర్యమును గూర్చు వస్త్రధారణము ప్రధానములు.

నిజమునకు సూర్యరశ్మి, పీల్చుగాలి, నీరు కూడ ఆహారములే. వీనిని దండిగ గొనువారు ప్రాణశక్తిని చక్కగ నార్జించుకొందురు. ఆ మేరకు భోజనమును తగ్గించుకొందురు. ఏది ఎట్లున్నను శరీరమును ఆరోగ్యవంతముగ నుంచుకొనుట, బరువుగ తనకు అనిపించకుండుట ముఖ్యము. పరుగున బోవు గుఱ్ఱమువలె చురుకుగ నున్న శరీరము ప్రధానమని తెలియవలెను. ఆహారము, పని, నిద్ర విషయములందు సమతుల్యమును ప్రతి సాధకుడు తనకు తానుగ సాధించుకొనవలసినదే. అట్లు కానిచో యోగ సాధనకు అర్హత లేదు.

అదే విధముగ వలసిన భోజనమును భుజింపనివాడు, ఆవశ్యకమగు నిద్రను నిర్జించువాడు కూడ సమతుల్యమును కోల్పోవును. ఇట్టి వానియందు రజోగుణము మితిమీరును. దొరికినది తినుట, ఆలస్యముగ నిద్రించుట, ఐదుగంటలకన్న తక్కువ నిద్రించుట, నిద్రపట్టకపోవుట ఇట్టి వన్నియు రజోగుణ దోషములే. దీనివలన శరీరము శుష్కించును. సాధనకు పనికిరాదు. మితిమీరిన పరుగుతో పనులు చేయువారు ఆహారమును, నిద్రను లెక్క చేయరు. వీరును యోగార్హత కోల్పోవుదురు.

ప్రస్తుత కాలమున ఆహార వ్యవహార, నిద్రాదులయందు మానవజాతి సమతుల్యమును కోల్పోయినది. యోగసాధకుడు సంఘజీవనమున తనదగు క్రమము నేర్పరచుకొనవలెను. అవసర మగుచో కొన్ని సాంఘిక కార్యములను విసర్జించవలెను. మితిమీరిన పనులు, కార్యములు, కార్యక్రమములు సాధకుని సహజ ప్రశాంత తను హరించును. కావున సాధకుడు విచక్షణతో తనదగు క్రమ శిక్షణను సౌమ్యముగ నేర్పరచుకొనవలెను.

అట్లే ఏకాంతము పేరున సంఘమునకు, కుటుంబమునకు దూరమగుట యోగ సాధనకు పనికిరాదు. అట్లని వారితో మమైక మగుట కూడ సాధన కంతరాయమే. సమతుల్యమే యోగమునకు ప్రధాన సూత్రము.

17

యుక్త ప్రవర్తన

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు ।
యుక్త స్వప్నా వబోధస్య యోగో భవతి దుఃఖహా ॥ 17

మితమగు ఆహారము, విహారము, యుక్తమగు కర్మ, నిద్ర పాటించు యోగ సాధకునకు దుఃఖము లన్నియు హరింపబడి యోగము సిద్ధించును.

ఆహార, నిద్ర, నియమములతో పాటు విహారము, కర్మాచరణము కూడ జోడింపబడినవి. అపుడే యోగసాధన సిద్ధించు అవకాశము కలదు. జీవితమున బహిరంగ కార్యక్రమములు కర్మను బట్టి బంధించు అవకాశమెంతైన కలదు. మన పనులు, చేష్టలు, విహారములు, వ్యవహారములు సరిగ నిర్వర్తించనపుడు జీవుడు బాహ్య ప్రపంచమున బంధితుడగును. ఆహారము, నిద్ర విషయములయందు నియమములు పాటింపనపుడు అనారోగ్యము కలిగి దేహము బంధించును. దేహబంధము, బాహ్యబంధము కలుగకుండవలె నన్నచో విచక్షణతో సర్వమును నియంత్రించుకొన

వలెను. అట్టి విచక్షణా బుద్ధిని తనయందు బలపరచమని దైవమును అంతరంగమున ప్రార్థించవలెను.

యుక్తమగు ఆహారము, యుక్తమగు విహారము, యుక్తమగు వ్యవహారము, యుక్తమగు నిద్ర ఇవి ప్రతినిత్యము గమనించు కొనుచుండవలెను. ఈ విషయమునందు అశ్రద్ధ యుండరాదు.

బాహ్యమున సాధకుడు ప్రవర్తించు తీరునుండి చిక్కులు కొనితెచ్చుకొనుట జరుగుచుండును. ఇది సర్వసామాన్యము. తన స్వభావమునందుగల కోరికలు, సంఘమునందలి పోకడలు తనకు అందివచ్చు అవకాశములు సాధకుని యుక్తముకాని విషయ ములలోనికి ప్రోత్సహించును. తనకుగాని విషయమున తాను తలదూర్చుట వలన క్రొత్త చిక్కులను తెచ్చుకొనును. జన్మతః ఉన్న చిక్కులను అనగా ప్రారబ్ధమును నిర్వర్తింపకపోగ మరికొంత జోడగు చుండును. ఒక చిక్కును తొలగించుకొనబోయి పది చిక్కు లలో పడుట సాధారణముగ జరుగుచుండును. ఇది పనికిమాలిన తెలివి. తెలివితేటల వలన మాత్రమే చిక్కులను తొలగించుకొన లేము. సద్గుణము లున్నచోటనే తెలివి సమయమునకు పనికి వచ్చును. సద్గుణములు కలుగుటకు సకల సద్గుణ సంపన్నుడగు దైవము నారాధించుటే మార్గము కాని, అడ్డదారులు ఉపయోగ పడవు. దుఃఖము కలుగక యోగము సాగవలె నన్నచో కష్టమైనను, నష్టమైనను ఈ శ్లోకమున చెప్పినవి పాటింపవలెను.

18

నూతన చిత్తము

యదా వినియతం చిత్తమాత్మన్యే వావతిష్ఠతే ।
నిస్పృహ స్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥ 18

వినియతమైన చిత్తము ఎప్పుడును ఆత్మయందే తిష్ఠ వైచి యుండునపుడు సర్వకామమలు నిస్పృహ చెందును. అట్లు చెందుట వలన యోగసాధకుడు, యోగ యుక్తుడగు చున్నాడు.

సామాన్యముగ పరిపరి విధముల పోవు చిత్తమును నిర్దిష్ట ముగ ఒకే విషయమున నుంచుట ముందు తెలుపబడినది. చిత్తమును నియమింపుము అని ముందు శ్లోకములలో తెలుపుట జరిగినది. చిత్తమును దేనిపై నియమింపవలెను? ధ్యాన సమయ మున తాను, నేను అను వెలుగుపై తన లోపల నొకచోట నియ మింపవలెను. అట్లు నియమించుట హృదయమునందు గాని, భ్రూమధ్యము నందు గాని చేయవలెను. ఇట్లు ఏకాగ్రతతో చిత్తము ఒక నిర్దిష్ట కేంద్రమున నియమించుటకు వలసిన అనుగుణము లను ముందు శ్లోకములలో వివరించుట జరిగినది.

అభ్యాసవశమున చిత్తము పరిపరి విధముల ఇంద్రియ మార్గములలో ప్రవృత్తి లోనికి పరువెత్తుచుండును. దానిని మరల "తాను - నేను" అను వెలుగు వైపునకు మళ్లించు అభ్యాసము మరియొకటి నేర్వవలెను. ఇది అభ్యాస మగువరకు తిప్పలు తప్పవు. నిత్య పరిశ్రమ అభ్యాసమును కూర్చగలదు. అంతరంగ మున చిత్తము పూర్తిగ, స్థిరముగ నేనను వెలుగునందు తిష్ఠవేయుట ఈ శ్లోకమున చెప్పబడినది. దానికి వలసినది అనునిత్య అభ్యాసము. ప్రతిదినము రెండు మార్లుగాని, మూడు మార్లుగాని ఈ అభ్యాసము చేయవలెనని పెద్దలు తెలుపుదురు. త్రిసంధ్యలు అట్టి అభ్యాసమునకు అనుకూలమగు కాలమని కూడ పెద్దలు తెలిపిరి.

ఇంద్రియ ప్రవృత్తులలో తిరుగుట నేర్చిన చిత్తము, పై తెలిపిన విధముగ నియమింపబడుటకు సాధకునకు మిక్కిలి ఓర్పు, సహనము కావలెను. జన్మల తరబడి బహిరంగమున తిరుగాడెడి చిత్తమును నిర్దిష్టముగ నొకచోట నుంచుట పరిశ్రమతో కూడినది. తిరుగుబోతు స్వచ్ఛందముగ నింటనుండుట సాధ్యమా! గ్రామ వీధుల తిరుగాడు గ్రామసింహము (ఊరకుక్క) ఒక చోట నుండుట కిష్టపడునా! సాధకుని స్ఫూర్తిని బట్టి అతని యందు మరియొక చిత్త ముద్భవించును. అట్టి నూతన చిత్తమునకు బల మేర్పడుటకే అనునిత్య అభ్యాసము. స్ఫూర్తికి కారణము దైవ సంకల్పము. దైవ సంకల్పమే నూతన స్ఫూర్తిగ భాసించును. అదియే నూతన

చిత్తము. ఈ చిత్తమును దైవారాధన ద్వారా, నిత్య అభ్యాసముద్వారా బలపరచుకొనుట సాధకుని కర్తవ్యము.

సత్సాంగత్యము, సత్కర్మాచరణము, సద్గుణోపాసన, సద్గోష్ఠి ఈ చిత్తమునకు బలమీయగలవు. పరుగిడుతున్న గుఱ్ఱములకు కళ్ళెము వేసి, రౌతు అదుపులోనికి తెచ్చునట్లు సాధకుడు తనయందేర్పడుచున్న నూతన చిత్తమును కళ్ళెముగ వినియోగించి, స్వాభావిక చిత్తమును అదుపులోనికి తెచ్చుకొనవలెను. అందులకే యమ నియమములను పాటించుట కూడ. ఈ అభ్యాసము సాధకునికి కీలకము. నూతన చిత్తము బలపడనిదే ఆత్మ సంయమ మునకు దారి లేదు. బలపడనపుడు స్వాభావిక చిత్తమే నూతన చిత్తమును దమించును.

ఈ సందర్భమును గూర్చియే వేమన యోగి *'ఎలుక తోక తెచ్చి ఏడాది ఉతికిన.....'*; *'కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టిన...'* అను పద్యములను రచించెను. సాధకుడు యోగి అగుటగాని కాకుండుటగాని దీనిపై ఆధారపడియున్నది. నూతన చిత్తము బలపడినచో స్వభావమందలి మలినములు నశించి, దైవీ స్వభావము లేర్పడును. గొంగళిపురుగు సీతాకోక చిలుక అయినట్లు మలిన స్వభావము దైవీ స్వభావమై వెలు గొందును. కానిచో, గొంగళి పురుగుగనే జీవించి నశించును.

ఇనుము అయస్కాంతమగుట వంటిదే ఆత్మ సంయమ

యోగమునకు జరుగు ప్రకియ. అయస్కాంత సన్నిధిని ఇనుము తన స్వభావమును కోల్పోయి అయస్కాంత మగును. అట్లు చాల కాలము అయస్కాంత సన్నిధి నున్నపుడు స్వయముగ అయస్కాంతమై నిలచును. ప్రకృతి యందలి ఈ ధర్మము ననుసరించియే గురు-శిష్య సంప్రదాయ మేర్పడినది. గురువను అయస్కాంతము సన్నిధిని శిష్యుడను సాధకుడు తనయందు దైవానుగ్రహముగ కలిగిన నూతన స్ఫూర్తిని బలపరచుకొనగలడు. అందులకే భారతీయ సంప్రదాయమున గురుశిష్య సంప్రదాయము అతి ఉత్కృష్టముగ తెలుపబడినది.

స్ఫూర్తి గల యోగ సాధకుడు గురు సాన్నిధ్యమును కోరుట లోని ఆంతర్యము తనయందు స్వాభావికమగు మార్పు. ఇది కేవలము సద్గురువు నుండియే లభించును. సద్గురువు నుండి ఇతర విషయముల నాసించుట అవివేకము. కాని పరిపాటిగ ఇతర విషయములనే ఆశించు చుందురు.

నూతన స్ఫూర్తివంతమగు చిత్త మేర్పడుటచే, స్వాభావిక చిత్తము నియమింపబడి, నూతన చిత్తమై నిలచును. అట్టి నూతన చిత్తమునకు మూలము దివ్యస్ఫూర్తి గనుక, ఆ చిత్తము ఆత్మ యందు నిలచుటకే ఉత్సహించును. అట్టి సమయమునందే ఆత్మ యందు చిత్తము తిష్ఠ వేయుట జరుగును. ఆత్మయందే చిత్తము తిష్ఠవేసినపుడు ఇతర కోరికలు నిస్పృహ చెందును. వాటిని పోషించు చిత్తము లేకుండుట వలన కోరికలు సాధకుని వీడును.

ఆత్మయందు రుచిగొన్న చిత్తమునకు లౌకిక అంశములపై రుచి తగ్గును. వాని జోలికి పోరు. వానియందు ఆసక్తి లేకపోవుట వలన తటస్థముగ నిలచిపోవును. ఇతర విషయములను చేరుట కన్న ఆత్మ విషయము లేక దైవ విషయమునందు చేరుటకు ఉత్సహించును.

“నంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పానవిశేష మత్త చిత్త యేరీతి నితరంబు జేరనేర్చు?”

శ్రీమహా విష్ణువు పాదపద్మములను స్మరించు చిత్తము ఆ పాదముల దర్శన స్పర్శన ఆనంద అమృతము గ్రోలుచు, చిత్తము మత్తెక్కి యుండునుగదా. అట్టి చిత్తమునకు ఇతర విషయములం దాసక్తి ఎట్లుండును? పై ప్రశ్న ప్రహ్లాదుడు హిరణ్యకశిపుని అడుగును. సాధకునకు అట్టి చిత్తమే గమ్యము. సాధనయే మార్గము.

19

యతచిత్తము

యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।
యోగినో యతచిత్తస్య యుంజతో యోగ మాత్మనః॥ 19

గాలి తగులని దీపమెట్లు నిశ్చలముగ నుండునో అట్టి స్థిర చిత్తముతో 'నేను' అను వెలుగును భ్రూమధ్యమున యోగి దర్శించు చుండును.

నివాతస్థ దీపమనగ గాలిసోకని దీపము. గాలిసోకని దీపము నిశ్చలముగ నుండును. చిత్తము కూడ అట్లే నిశ్చలమై, 'నేను' అను వెలుగును భ్రూమధ్యమున యోగించు చుండవలెను. ధ్యానమునకు యతచిత్తమే ప్రధానము. చిత్తము ప్రవృత్తుల యందు తిరుగక ఒక వస్తువుపై కేంద్రీకృతమగుట అభ్యాసము చేయవలెను. ఈ అభ్యాసము కేవలము ధ్యాన సమయమున చేసినచో జరుగదు. దైనందినముగ మనము చేయు పనులన్నిటి యందు పూర్ణముగ మనస్సు లగ్నము చేయుట ప్రాథమికముగ నేర్వ వలయును. యథాలాపముగ ఏమియు చేయరాదు. చేయుపని ఏదైనను దానియందే పూర్ణచిత్తము నియోగించవలెను. దంత ధావనము,

స్నానము, వస్త్రధారణము, భోజనము వంటి కార్యములు యథాలాపముగ చేయక మనసుపెట్టి నిర్వర్తించవలెను. శ్రద్ధగ చేయవలెను. అక్షరాభ్యాస సమయము నుండి ఈ అభ్యాసము ప్రారంభించిన వారికి యతచిత్త మేర్పడుట సులభము. దైనందిన కార్యములందు యథాలాపముగ నుండువారు ధ్యానము నేర్చుటకు చాల శ్రమపడవలసి వచ్చును. ప్రస్తుతమున మనస్సు నిలుపుట, ఇతర ఆలోచనలు రాకుండుట జరుగవలెను. విను చున్నపుడు పూర్తిగ వినవలెను. చూచుచున్నపుడు పూర్తిగ చూడవలెను. అనగ మనస్సు పెట్టవలెను. అట్లే తినుచున్నపుడు, తిరుగు చున్నపుడు కూడ. ప్రస్తుతమున మనస్సు నిలచుట ప్రధానము. ఉదాహరణకు ఒక పాట వినుచున్నపుడు పాటను పూర్తిగ వినువారు అరుదు. ఆ నిమిషములోనే అనేకానేక భావములు కలిగి పాట వినుట జరుగదు.

యతచిత్తము గూర్చి భగవానుడు చాలమార్లు పలికినాడు. అట్టి యతచిత్తము కలుగుటకు కర్తవ్యమునందు దీక్ష, ఫలితముల యం దనాసక్తి, సంకల్పసన్యాసము, ప్రాపంచిక విలువల యందు ఉదాసీనత, జీవులయందు సమబుద్ధి, ఆశపడని మనసు, మిత భాషణము, మితమగు వ్యవహారము ఇత్యాది వెన్నియో గీతయందు తెలుపబడినవి. ఇవి ఏవియును పాటింపక, సరాసరి ధ్యానమందు కూర్చుండుటకు ప్రయత్నించుట అవివేకమే అని తెలియవలెను.

20

అనుగ్రహము

యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।
యత్రచైవాత్మనాఽఽత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥ 20

యోగాభ్యాసమున నిబద్ధము చేసిన చిత్తము ఆత్మను దర్శించుచు, ఉపరమించుచు తుష్టిచెందును. ఆత్మ 'నేను' అను దైవముగను, 'నేను' అను జీవుడుగను, 'నేను' అను స్వభావముగను, 'నేను' అను దేహముగను నష్టము చెందియుండును. అనగ సూత్రము నుండి విడిపడిన పూసలవలె విడిపడి బలము లేక పడియుండును. నేను అను దేహాత్మభావన, నేను అను స్వభావము లేక చిత్తము కూడి నేను అను వెలుగునందు లగ్నము చేయుట ఆత్మ సంయమ మగును. నేను అను జీవాహంకారము నేను అను దైవమునందు లగ్నము చేసినపుడు, అది అభ్యాసముగ నిలచినపుడు చిత్తము నేను అను వెలుగునందు ఉపరతి చెంది నచో, ఇతరముల జోలికి పోదు. నేను, తాను అను వెలుగునందు ఆసక్తి రతిగ మారవలెను. ఆసక్తి పెంపొందినకొలది రతి యగును. నేను అను వెలుగునందు రతి భావము లేక ప్రేమ భావము

లేనపుడు ఆత్మ దర్శనమునకు అవకాశము లేదు. నేను అను జీవాహంకారము నేను అను త్రిగుణాతీతమగు వెలుగునందు రతి కలుగుటకు ఉపాయమేమి?

ఆసక్తి, రతి, ప్రేమ ఉన్నచోట అప్రయత్నముగనే చిత్తము లగ్నమగును. అట్టి ప్రేమ కలిగించుకొనవలె నన్నచో కలుగదు. అనుగ్రహము వలననే కలుగును. భగవదనుగ్రహము జీవుని యందున్నపుడు, జీవునికి దైవముపై ఆసక్తి, ప్రేమ కలుగును. ప్రేమ లేనిచోట కలయక లేదు. యోగము లేదు. ఒకరినొకరు ప్రేమింపని యువతీ యువకులను ఒక చోట చేర్చినను ప్రేమ పుట్టదు. ప్రేమ కలిగినపుడు వారు వేరు వేరు ప్రదేశములలో నున్నను ఒకరినొకరు ప్రేమించుకొనుచు, ఆత్మీయ భావముతో ముడిపడుదురు. ఎన్ని అవరోధములు కలిగినను ఒకరినొకరు చేరుట మానరు.

ఇచ్చట భగవంతుడు ఒక రహస్యమును తెలుపుచున్నాడు. యోగసేవ వలన అనగ యోగాభ్యాసము వలన చిత్తము నిరోధింప బడినను అట్టి చిత్తమందుగల ప్రజ్ఞ నేనను ఆత్మయందు లగ్నము చేసి ఆత్మయను వెలుగును దర్శించుచు ఉపరమించ వలెనని, అట్లుపరమించునపుడు తుష్టి కలుగునని చెప్పుచున్నాడు. అట్లు భగవంతుని యందు రమించు బుద్ధి కలుగుట భగవదనుగ్రహము ననే జరుగవలెనుగాని, పుట్టించుకొనుట సాధ్యము కాదు.

బహుమతులు, కానుకలు, ధనము, కీర్తి, సంపద ఇట్లు అడిగిన వన్నియు ఇచ్చినను భగవంతునిపై ప్రీతి కలుగదు. అవి

యన్నియు వదలి అడవులకేగినను భగవంతునిపై ప్రీతి కలుగదు. నిజేచ్ఛనైన దైవమును ప్రేమించలేరు అని భాగవతము తెలుపుచున్నది. దైవ ప్రేరితమైనపుడు మాత్రము దైవమునందు ప్రేమ కలుగును. ఇది సత్యము. దైవము సాధించు విషయము కాదు. అనుగ్రహవశముచే దానిని పొందవచ్చును.

అనుగ్రహమునకు తీరుతెన్నులు లేవు. అనుగ్రహము కలుగు వరకు యజ్ఞార్థ కర్మలు నిర్వర్తించుట, తనకున్నదానిలో దానములు చేయుట, తన శక్తిమేరకు ఆరాధనలు గావించుట చేయుచు వేచి యుండవలసి యుండును. కమలములు సూర్య కిరణములకై వేచియున్నటులు, ఆలుచిప్ప స్వాతిచినుకుకై వేచియున్నట్లు, వేచి యుండుటయే కర్తవ్యము.

21

హృదయ కేంద్రము

సుఖ మత్యంతికం యత్త ద్బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్ ।
వేత్తి యత్ర న చైవాయం స్థిత శ్చలతి తత్త్వతః ॥ 21

ఇంద్రియములకు గ్రహింప నలవికానిది, బుద్ధికి మాత్రమే తెలియదగినది, ఆద్యంతము సుఖము నిచ్చునది అగు నేనను వెలుగునందు స్థితుడై ఏ మాత్రము చాంచల్యము లేక యోగి సుఖానుభూతిని తెలియుచున్నాడు.

ఇంద్రియములచే పొందు సుఖానుభూతి తాత్కాలికము. అదియును గాక సుఖము కలిగినట్లు భ్రమ కొలుపునేగాని, నిజ మగు సుఖము నీయదు. ఉదాహరణకు రుచికరమగు వస్తువొకటి భుజించినపుడు తాత్కాలికముగ సుఖము నిచ్చును. కాని ఇంద్రియము ద్వారా మనస్సు ఆ వస్తువును పదే పదే కోరుచు నుండును. అట్లే కన్ను నుండి చూచినవి, చెవినుండి విన్నవి, ముట్టుకొన్నవి, వాసన చూసినవి మరల మరల జ్ఞప్తి చేయుచు, మరల మరల వానినే కోరుచు, వాని కొరకై జీవుని ఎడతెరిపి లేక త్రిప్పుచు నుండును. తృప్తి నివ్వని సుఖము సుఖమే కాదు. తృప్తి

కలిగినచో మరల కోరుట యుండదు కదా! కావున ఈ సుఖము తృప్తినీయక, తాత్కాలికముగ తృప్తి నిచ్చినట్లు భ్రాంతిని మాత్రమే కలిగించును. మరల మరల మనసు కోరుటకు కారణమిదియే.

ఇంద్రియార్థముల వెంటబడుటకు జీవుడు మనస్సులోనికి దిగి, మనస్సునుండి ఇంద్రియములలోనికి మరింత దిగి, ఇంద్రి యార్థముల వెనుక బాహ్యము లోనికి ఐదు దిశలుగ పరుగిడుతు అలసట చెంది మరణించుట జరుగును. తృప్తి కలిగించని వాని వెంట, తృప్తి కలుగునని పరుగెత్తుట ఎంత అవివేకము! జీవుని చిత్తము మనస్సు నుండి బాహ్యమును దర్శించవచ్చును. దేహావ సరములను తీర్చుకొనవచ్చును. దేహపోషణము కూడ చేసుకొన వచ్చును. ఇవి యన్నియు వివేకముతో కూడి చేయు పనులు. వివేకము కోల్పోయిన జీవుడు మనస్సు నుండి కూడ దిగజారి పశువైపోవును.

అట్లని మనస్సును సౌకర్యమే లేనిచో, ఇంద్రియములే లేనిచో దేహ పోషణము జరుగదు. దేహ పోషణమునకును, బాహ్య సౌందర్య అనుభూతికిని, తదానందమునకును జీవుడు మనస్సేంద్రియము లను దైవమిచ్చిన సౌకర్యములుగ చూడవలెను. ఆ సౌకర్యము దుర్వినియోగము చేయరాదు.

ఉత్తమోత్తమమైన మోక్ష సాధనకు కూడ దేహము ప్రధాన మైనది గనుక, దేహ నిర్వహణకు మనసేంద్రియములు అవసరము కనుక, మనసేంద్రియములను తూలనాడరాదు. అశ్రద్ధ చేయ రాదు. హింసింపరాదు. వానిచే బంధింపబడకుండ, వానిని నిర్వర్తించు సామర్థ్యమును పొందవలెను.

చిత్తము బాహ్యమున నిర్వర్తించవలసిన కార్యము లేవియు లేనపుడు మనస్సున కూర్చుండ నవసరము లేదు. మనస్సు కార్యాలయము వంటిది. బాహ్యసంబంధిత కార్యములను నిర్వర్తించుటకే కదా మనము కార్యాలయమున కేగునది. బాహ్య కార్యములు లేనపుడు ప్రత్యేకించి సెలవుదినమున కార్యాలమున కేగము. అట్లే బాహ్యమగు కార్యములు లేనపుడు జీవుడు మనస్సున కూర్చుండ నవసరమే లేదు. అతడు బుద్ధిలోనికి చనుట మేలు.

బుద్ధి కేంద్రము హృదయమున నుండును. మనస్సును శ్వాసపై లగ్నము చేసినచో హృదయమును చేరవచ్చును. చిత్తము హృదయము నందుంచుట నేర్చినచో బుద్ధియందుండుట వీలుపడును. హృదయము నందుండుట అనినను, బుద్ధి యందుండుట అనినను, అంతరంగ మందుండుట అనినను ఒకటియే. మనస్సు బాహ్య రంగమునందు ప్రవేశించుటకు ఆధారము. బుద్ధి అంతరంగమును శోధించుటకు ఆధారము.

ఈ శ్లోకమందు ఆత్మ బుద్ధిగ్రాహ్యమని, మనసేంద్రియ గ్రాహ్యము కాదని చెప్పబడినది. బుద్ధి అను వెలుగున చేరి, నేనను వెలుగును భావించుచు, దర్శించుచు నుండుట చెప్పబడినది. అట్లు చేయువానికి ఆద్యంతములు లేని సుఖముండునని భగవంతుడు చెప్పుచున్నాడు. పై విధముగ బుద్ధియందు స్థిరముగ నుండి, "నేను" అను వెలుగును భావించుచు, దర్శించుచు నుండువాడు 'యోగి' అని తెలియవలెను. అతడు అవసరమును బట్టి మనస్సును ప్రవేశించునుగాని, సహజముగ బుద్ధియందే యుండును.

22

ఆత్మరతి

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥ 22

పై విధముగ నిశ్చలస్థితి యందు నిలచి 'నేను-తాను' అను వెలుగును దర్శించు యోగికి కలుగు ఆత్యంతికమగు సుఖమును మించిన సుఖము మరియొకటి యుండదు. అట్టి స్థితియందు స్థిరపడునటువంటి యోగిని ఎంతటి దుఃఖమైనను విచలనము కలిగించలేదు.

చిత్తము ఇంద్రియ ప్రవృత్తులనుండి నిరోధింపబడి, నేను అను వెలుగును అంతర్ముఖముగ దర్శించుచు, ఆ వెలుగునందు రమించుచు, స్థిరముగ నిలచి, ఆద్యంతములు లేని నిష్కారణ మగు సుఖము అనుభవించుట నేర్చినపుడు, ఇక యితర విషయము లందు ఆసక్తిగొనుట కష్టము. అట్లని యోగికి అనాసక్తి యుండదు. బాహ్యమున కర్తవ్యమును నిర్వర్తించుచు, విరామము చిక్కు నపుడెల్ల అంతర్ముఖుడై, అంతరానందము చెందుచు నుండును.

అంతరానందము వృద్ధి కలిగిన యోగికి ఇతరమగు విషయము లేవియు తత్తుల్యమగు ఆనందమును కలిగించలేవు. అంతకు మించిన ఆనందము ఉన్నదని చెప్పినను అతడు విశ్వసింపడు. ఆత్మరతి కన్న ఆనందము కలిగించు విషయ మేముండ గలదు? కావున ఇతర సుఖములుగాని, దుఃఖములుగాని అతని స్థిర చిత్తమునకు చికాకు కలిగింపలేవు.

సనక సనందనాదులు, నారదుడు, ప్రహ్లాద అంబరీషులు, బృందావనమందలి గోపికలు ఇట్టి ఆనందమునే రుచి చూచిరి. వారికి త్రిభువనములు కన్న ఆత్మరతియే ఆనందదాయకము. ఈ రుచులుగొన్న బలిచక్రవర్తి తన సమస్తమును, తనను దైవదత్తము గావించి బ్రహ్మానందమున నిలచెను.

23

ధ్యాన సిద్ధి

తం విద్యా ద్దుఃఖసంయోగ వియోగం యోగసంజ్ఞితమ్ ।
స నిశ్చయేన యోక్తావ్యో యోగోఽనిర్విణ్ణ చేతసా ॥ 23

పై తెలిపిన విధముగ ధ్యాన మార్గమున తత్త్వముతో యోగము చెంది, యోగ స్థితియందు నిలబడుటవలన సంయోగ వియోగ దుఃఖములు కలుగవని తెలుసుకొనుము. ఆ స్థితిని పొందుటయే కర్తవ్యమని తెలియుము.

బుద్ధిని శుద్ధము గావించి, అట్టి బుద్ధిని అది పుట్టిన చోటు యందు లగ్నము చేయుటవలన, అట్లు లగ్నము చేసి అందు స్థిర పడుట వలన యోగ సాధనము పరిపూర్ణమగును. సంయోగ వియోగ ములు, కలత చెందుట, చలించుట యిట్టి స్థితులన్నియు మనో మయ కోశమున నుండును. అందువలన మనస్సుచే ఆత్మతత్త్వ మును పొందగోరుట ఆకాశమునకు నిచ్చెన వేయుట వంటిది. మనస్సును పరిశుద్ధము గావించుకొన్నకొలది, అందలి చిత్తము (అనగ చైతన్యము) బుద్ధిలోనికి ప్రవేశించును. బుద్ధి అను వెలుగు చలింపదు. బుద్ధి అనునది స్థిరమగు వెలుగు. నూనె దీపము మనస్సు

వంటిది. అది గాలికి రెపరెప లాడును. విద్యుద్దీపము బుద్ధి వంటిది. దానిపై వాయు ప్రభావముగాని, నీటి ప్రభావముగాని యుండదు.

మనస్సు ఇంద్రియముల నుండి బాహ్యములోనికి దిగజారు చుండును. అట్టి మనస్సును కూడదీసి బుద్ధిలోనికి ప్రవేశింపజేయుట ప్రధాన కర్తవ్యము. అందులకే యుక్తమగు ఆహార వ్యవహారములు, యుక్తమగు చేష్టలు ముందు సూచింపబడినవి. మితభోజనము, మిత నిద్ర కూడ సూచింపబడినది. పై నియమముల వలన మనస్సు నకు కొంత స్థిరత్వ మేర్పడును. అంతఃర్బహి శుచి, సద్భావములు, లోకహితము, తటస్థమగు మనస్సు కూడ మనస్సునకు సాధుత్వము కలిగించును. లేనిచో ఇంద్రియముల లోనికి దిగజారుచున్న మనస్సు కలిగించు మోహమంతయు సత్య మనిపించును. శీతోష్ణ సుఖదుఃఖములు, మానావమానములు, ఆకలిదప్పులు, దేహ బాధలు మనస్సును పీడించుచుండగ అట్టి మనస్సుతో యోగ సాధనము జరుపుట హాస్యాస్పదము.

పై తెలిపిన సూత్రములను దీర్ఘకాలము దినచర్య యందు స్థిరపడినచో అపుడు మనస్సునకు స్థిర మేర్పడును. అట్టి మనస్సును బుద్ధిపై చాలకాలము లగ్నము చేయుట వలన తాను వెలుగు నందు స్థిరపడును. అట్టివాడు బుద్ధిమంతుడగును. బుద్ధి ప్రధాన ముగ జీవించును. బుద్ధియను వెలుగునందు స్థిరపడి ఆ వెలుగునకు మూలమైన దానిని ధ్యానము చేయుట, దానిపై బుద్ధిని లగ్నము చేయుట ధ్యాన మనబడును.

హృదయలోకమే నిజమగు బుద్ధిలోకము. హృదయమే నిజమగు తపస్సునకు గుహ. హృదయపు గుహ దేహభాగమున సింహరాశితో సమన్వయింపబడినది. ఇందు ప్రవేశించినవాడు హింసను మాని హంస యగును. అచ్చట హంస శబ్దము ఎప్పుడును ప్రాణస్పందనముగ సాగుచు నుండును. ఆ శబ్దము ననుసరించుచు వెలుగు మూలములోనికి, నాద మూలములోనికి క్రమముగ ప్రవేశించును. మూలమును చేరి అచ్చట స్థిరపడుట ధ్యానమునకు సిద్ధి. అట్టి వానికే ఆత్మ సంయమము సత్యము.

24

ఆరోహణ మార్గము

సంకల్ప ప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వా నశేషతః ।
మనసై వేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥ 24

సంకల్ప ప్రభావముచేత కలిగెడి కోరిక లన్నింటిని పరిపూర్ణ ముగ విడిచిపెట్టి, మనసేంద్రియములు వినిమయము కలిగి మెల్ల మెల్లగ ధృతి, బుద్ధియందు విశ్రాంతి చెందును. అట్టి ధృతిని బుద్ధి మూలమునందు లగ్నము చేయగ ధ్యానమగును. అట్టి ధ్యానము ఆత్మయోగమును కల్పించును. అపుడు ఇతర విషయములు లేని కేవలస్థితి కలుగును. దానినే కైవల్యమందురు.

కోరికలు గలవానికి యోగము లేదని కర్మయోగమున తెలుప బడినది. కోరికలు గలవారు కర్మయోగమున కూడ చెందలేరు. కోరికలు ఇంద్రియముల రూపమున ప్రజ్ఞను బాహ్యములోనికి ప్రసరింపచేయును. ఎన్ని కోరికలున్న అంతగ బహిః ప్రవాహ మేర్పడి జీవుడు నీరసించును. కోరికలకు గాని, ఆలోచనలకు గాని, యోగ మునకు గాని పెట్టుబడి జీవచైతన్యమే! దానినెట్లు వినియోగింప వలెనో కృష్ణపరమాత్మ కర్మయోగమున సూచించినాడు.

జీవితమును కోరికలకై వెచ్చింపక, కర్తవ్యమునకై మళ్ళించుట మొదటిమెట్టు. కర్తవ్య నిర్వహణమే కర్మ నిర్వహణము. అది కాలము, దేశము రూపమున ప్రతి వ్యక్తిని సమీపించును. వాటి నిర్వహణమున ఫలాసక్తి లేకుండుట, వక్రతలు లేకుండుట, విజయ మందినపుడు మోహపడకుండుట, అపజయము కలిగినపుడు శోకము చెందకుండుట జరిగినచో కర్మయోగము సిద్ధించినట్లే. ఇట్లు జరుగుటకు దైవమును ఆరాధించుట, ఆశ్రయించుట నెంతయో ఉపయోగకరము.

అటుపైన తనకున్నదానిలో ఆత్మవంచన లేక ఇతరులకు హితము ఒనర్చుట వలన మనోమాలిన్యములు తొలగి, జ్ఞానాసక్తి ఏర్పడును. తనకున్నవన్నియు దైవమిచ్చినవేయని తలచి, దైవదత్త మని ఎరిగి, ఆర్తులగు జీవులకు వానిని పంచుటవలన మనోనైర్మల్య మేర్పడి బుద్ధియందు ప్రవేశించుట కవకాశ మేర్పడును. తన శరీర మును, ఇంద్రియములను, మనోమేధస్సును ఇతరుల కుపయోగ పడునట్లు కర్తవ్య నిర్వహణముతోపాటు సాగుచుండగ జ్ఞానోదయ మున కవకాశ మేర్పడును. అంతరంగమున వినిపించుట, కనిపిం చుట జరిగి జ్ఞానయోగమునకు దారిచూపును.

మనిషికి జ్ఞానము కలుగుచున్నదా, లేదా అను విషయము నకు గీటురాయి ఒకటియే. ఎట్టి సమయమునందు కాంక్ష, ద్వేషము లేకుండుట, జ్ఞానులనుకొన్న వారికి, భక్తులనుకొన్న వారికి, వారి కాంక్షా ద్వేషము లెట్లున్నవో, ఎప్పటికప్పుడు తరచి చూచుకొనుచుండ వచ్చును. ఈ క్రమమున సమ్యగ్ న్యాసము లభించును. అదియే సన్న్యాసయోగము.

కాషాయము కట్టినను కాంక్షలు, ద్వేషము వీడనివారు సన్యాసులు కారు. సంసార మందున్నను, కాంక్షాద్వేషములు లేనివారు సన్యాసులే. ఎందరో యోగులు సంసారమందు సన్యాస స్థితిలో గడిపిరి. అట్లే సన్యాసుల యందుగూడ నిజమగు యోగులున్నారు.

పై తెలిపిన సోపానక్రమమే భగవానుడు మరల మరల తెలియజెప్పుచు ముందడుగు వేయించుట భగవద్గీతయందు నిత్యము కన్పట్టును. సంకల్పము సన్యసించుట యోగమున కావశ్యకమని ఈ అధ్యాయమున రెండవ శ్లోకమున దైవము తెలిపి నాడు. సంకల్పము సన్యసించినపుడు కోరికలే కలుగవు. కర్తవ్య స్ఫురణయే యుండును. దానిని ఈ సూత్రమున ఆవిష్కరించు చున్నాడు. కర్తవ్యము మాత్రమే నిర్వర్తించుచు, ఇతరమగు కోరికలు లేనపుడు, ఇంద్రియములకంత పనియుండదు. తీరుబడిలేక ఇంద్రియ ద్వారమున జీవుడు బాహ్యమున తిరుగడు. అప్పుడా ఇంద్రియములు జాతికుక్కలవలె మనస్సును యజమానిని అంటి పెట్టుకొని యుండును.

సంకల్పములు తీవ్రముగ లేనపుడు మనస్సునకుగూడ తీరుబడి ఉండును. సంకల్పములే సన్యసింపబడినపుడు మనస్సు నకు తీరుబడి పెరుగును. ప్రశాంతతకూడ పెరుగును. అట్టి మనస్సును బుద్ధితో లగ్నము చేయుట సులభము. బుద్ధియను వెలుగుపై మనస్సు నిలచినపుడు మనస్సు వెలుగై, బుద్ధియై నిలచును. అట్టి బుద్ధిని దానిమూలముపై లగ్నము చేయుట ఈ అధ్యాయమున తెలుపబడుచున్నది. అట్లు అంతరంగ ధ్యానమున

నిలచిన స్థితి మనో బుద్ధ్యాత్మ స్థితి. అపుడా మనస్సున కితర చింత లెట్లు కలుగును.

ఇట్లు పరమాత్మ సోపానక్రమమున ఆత్మతో యోగమును అందించినాడు. సోపానమును ఎవరైనను ఈ విధముగనే ఆరోహ ణము చేయనగును. ఇతర మార్గములు భ్రమ గొల్పును.

25

ఆత్మ దర్శనము

శనైః శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతి గ్రహీతయా।
ఆత్మ సంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్॥ 25

మెల్ల మెల్లగ అంతర్ముఖమైన చిత్తము బుద్ధియందు చేరి ఆత్మయందు లగ్నము కాగా, ఇతర చింతలు క్రమముగ తొలగి పోవును. బాహ్య ప్రపంచ విషయముల నుండి సులభముగ విడుదల కలిగి అంతరంగ దివ్యానుభూతియందు, దాని మూలమైన చిత్తము నందు స్థిరము చెంది, దీర్ఘమగు ప్రశాంతిని పొందును. ఆత్మ యందు రతి బలమగుటచేత బాహ్యము నందు కూడ క్రమముగ ఆత్మదర్శనము ప్రాప్తించును. నిజమున కాత్మ అన్ని రూపములకు మూలమై ఉన్నది కనుక దానిని చూచుట ప్రారంభ మగును. అంతరంగమునందే గాక బహిరంగమున కూడ ఆత్మ గోచరించు చుండుట వలన, ఆత్మ సాధకునకు ఉత్సాహము కలుగుచు నుండును. ఇది ఒక శుభమగు స్థితి.

26

ఆత్మ వైభవము

యతో యతో నిశ్చరతి మన శ్చంచల మస్థిరమ్ ।
తతస్తతో నియమ్యై దాత్మన్యేవ వశం నయేత్ ॥ 26

ఈ క్రమమగు సాధన చేయు సాధకునకు చంచలమగు మనస్సు క్రమముగ స్థిరచిత్తముగ మారి, బుద్ధియందు ప్రవేశించి, ఆత్మయందు లగ్నమగుట వలన మనస్సెచ్చటకు సంచరించినను, అచట ఆత్మ దర్శనము జరుగుచు, సమస్తమునందు గల ఆత్మ దర్శన మిచ్చి, ఆత్మ యందు నిలచి, ఆత్మను చూచు ఉత్తమమగు స్థితి కలుగును.

"*ఆత్మన్యేవ వశం నయేత్*" అనునది ఈ శ్లోకమున ఫల శ్రుతి. చపల స్వభావముగల మానవుడు నిలకడలేని మనస్సుతో ఇదివర కెచటెచట సంచరించెనో అచటచటనే క్రమముగ ఆత్మ దర్శన మగుట కన్న అద్భుత మేమున్నది? ఇల్లు వాకిలి, భర్త భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, వృత్తి వ్యాపారాదులు, ఆస్తిపాస్తులు ఇదివరకు గోచరించిన రీతిగ గాక ఆత్మ వైభవముగ గోచరించును. తనను బంధించునవిగాక,

ఆనందమునకు నిలయములై గోచరించును. భార్యను చూచి నను, అట్లే భార్య భర్తను చూచినను పై తెలిపిన ఇతరము లన్నియు ఏమి చూచినను, అందాత్మవైభవమే గోచరించి ఆనందము కలిగించును.

పూర్వము చపల స్వభావముతో చూచుట జరిగినది. అది గ్రుడ్డివాని చూపువంటిది. ప్రస్తుతము ఆత్మ, బుద్ధి, మనస్సు ఏకత్వ మొందుట వలన సమస్తము నందలి ఆత్మయే గోచరించుచు నుండును. ఈ యనుభవమునే గోపికల అనుభవముగ భాగవతము దశమ స్కంధమున వర్ణింబడినది. ఇట్టివాని జీవితము దివ్యవైభ వముతో నిండియుండును. అన్నిట, అంతట, సర్వకాలముల యందు ఆత్మయందే తా నున్నట్లు, తనయందు ఆత్మ యున్నట్లు భావన కలుగును. పరమ భక్తులు, యోగులు నిత్యము పొందు అనుభూతి ఇదియే. అట్టి వారికి సర్వమును దివ్యమే. దైవము యొక్క లీలావిలాసము.

27

ప్రశాంత స్థితి

ప్రశాంత మనసం హ్యేనం యోగినం సుఖ ముత్తమమ్ ।
ఉపైతి శాంత రజసం బ్రహ్మభూత మకల్మషమ్ ॥ 27

కల్మషరహితుడై ఆత్మతో యోగము చెందిన యోగి ప్రశాంతుడై, బ్రహ్మమును పొందినవాడై ఉత్తమ సుఖమును పొందుచున్నాడు. అట్టి వానిని రజస్తమో గుణముల వికారములు అంటవు.

రజస్తమస్సులు జీవితమున కుడి ఎడమలకు లాగుచుండును. జీవితము ఊయల కెక్కిన వానివలె తలత్రిప్పటగ సాగును. హెచ్చు తగ్గులతో కూడిన రహదారియందు ప్రయాణము చేయుటవలె అలసటగ జీవితముండును. వరద ప్రవాహమునందు ఈతకొట్టుటవలె నుండును. విశ్రాంతి ఎండమావులవలె గోచరించును. ప్రశాంతి అను పదమున కర్థమే లేదు. సుఖము కొరకు యత్నించుటే గాని సుఖముండదు. ఇంతలో అనారోగ్యము, ముసలితనము ఆవరించి మరణము ద్వారా మాత్రమే విశ్రాంతి లభించును. ఇట్టి జీవితము లన్నియు రజస్తమస్సులుగ, ఆటుపోట్లలో వృథా అయిన జీవితములుగ తెలియవలెను.

గాలికి రెప రెపలాడుచు వెలుగుచున్న ద్వీపజ్వాలవంటి జీవితములు ఎప్పుడైనను ఆరిపోవచ్చును. రజస్తమస్సుల ఆటు పోట్ల నుండి రక్షింపబడుటకు దీపమున కేర్పరచు చిమ్నీ ఎట్టిదో, అంతరంగ ప్రవేశమట్టిది. చిమ్నీ లోపలి దీపము ఎట్లు స్థిరముగ నుండునో అంతరంగమునకు మరల్చబడిన మనస్సను దీపము స్థిరముగ నుండుట కవకాశ మేర్పడును. గుహలో నున్నవానిపై వాతావరణ ప్రభావము ఎట్లుండదో, అట్లే అంతరంగమున చేరు అభ్యాసమున బహిరంగపు ఆటుపోట్లు ఉండవు. అంతరంగము గుహ వంటిది. గాలి వాన ఎండ చలి ఇట్టివాని ప్రభావము బహి రంగమందే యుండుట వలన గుహలోని వానికి ప్రశాంతత సహజ ముగ నుండును.

ప్రశాంత చిత్తమును దాని మూలమగు బుద్ధిపై నిలపి, బుద్ధి యను వెలుగునందు ప్రవేశించి, అటుపైన బుద్ధి మూలమైన ఆత్మ యందు ధారణ చేసి, ధ్యానించి, ఆత్మతో యోగము చెందుట వలన రజస్తమస్సులు తాకని స్థిరచిత్త మేర్పడును. అదియే ఉత్తమ సుఖము. కావున ప్రశాంత మనస్కు డగునని తెలుపబడినది. ప్రశాంతమనగ ప్రశస్తమగు శాంతము. చెదరని శాంతము ఆత్మ బ్రహ్మమునందు నిలచినవానికి ఇట్టి చెదరని స్థితి నిలచి యుండును. మరణమును కూడ దర్శించునే కాని కలత చెందదు. అట్టి వానికి మరణము దేహ విసర్జనమే కాని తనకు అంతము కాదు.

28

అత్యంత సుఖము

యుంజన్నేవం సదాఽఽత్మానం యోగీ విగతకల్మషః ।
సుఖేన బ్రహ్మసంస్పర్శ మత్యంతం సుఖ మశ్నుతే ॥ 28

ఎల్లప్పుడును ఆత్మతోనే సాయుజ్యము చేయుచు యోగమున నిలచినవాడు బ్రహ్మస్పర్శ లభించుటచే అత్యంత సుఖమును పొందుచున్నాడు.

ఈ శ్లోకము ముందు శ్లోకమునకు కొనసాగింపే. ఆత్మతో బాగుగ రతి చెందిన చిత్తము సమస్తము నందు దానినే దర్శించుచు, బ్రహ్మము స్పర్శను పొందుచు, బ్రహ్మానందము పొందుచు నుండును. అట్టివాడు విగత కల్మషుడని, సుఖవంతుడని ముందు శ్లోకములలోనే చెప్పబడినది. మరల మరల చెప్పుటలో సుఖ మెంత సుఖమో తెలుపుచున్నారు. సుఖము పొందునని, ఉత్తమ సుఖము పొందునని, అత్యుత్తమ సుఖము పొందునని, సోపాన క్రమమున సుఖమును గూర్చి గీతాచార్యుడు తెలుపుచున్నాడు. శారీరక సుఖము కన్న యింద్రియ సుఖము గొప్పది. ఇంద్రియ

సుఖము కన్న మనో సుఖము గొప్పది. మనో సుఖము కన్న బుద్ధి లోక సుఖము గొప్పది. అంతకన్న గొప్పది ఆత్మ సుఖము. ఆత్మ బ్రహ్మాస్పర్శతో పొందునది పూర్ణ సుఖము. ఇట్టి సోపానక్రమమున ప్రాథమిక సుఖములు అశాశ్వతములు. మాధ్యమిక సుఖములు శాశ్వతములు. ఉత్తమ సుఖములు శాశ్వత సుఖములలోకూడ ఉత్తమ శ్రేణికి చెందినవి. అందువలన అత్యంత సుఖమని ఈ శ్లోకమున చెప్పబడుచున్నది. ఆత్మసుఖము కలవానికి ఇతర సుఖ ములు లేనిచో ఇబ్బంది లేదు. అట్టి వానికి మనస్సేంద్రియ శరీర ములు ఉన్నను లేకున్నను ఒక్కటియే. మనస్సేంద్రియ శరీర సుఖములు స్థిరములు కావు. బుధ్యాత్మ సుఖములు స్థిరము. ఇట్టి సోపాన సుఖమును అవగాహన చేసుకొనుట బుద్ధిమంతుల కావశ్యకము. కేవలము అన్నపానాదులు, హాస నిద్రాదులు మాత్రమే సుఖ మనుకొనువారు పసివారు. మానవులయందు వీరే ఎక్కువ. ఉత్తమోత్తమ సుఖములు తెలిసినవారు ఇట్టి పసివారికి కూడ అత్యుత్తమ సుఖము కలుగవలెనని ఆరాట పడుచుందురు. వారి ఆరాటమునకు విశ్వప్రేమయే కారణము కాని, తాపత్రయము కారణము కాదు.

29

అనన్య స్థితి

సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥ 29

ఆత్మతో యుక్తము చెందిన యోగి సర్వము నందును ఆత్మనే దర్శించును. సర్వభూతములను తనయందు దర్శించును.

ఆత్మ సంయమ యోగమున ఇది ఒక విభూతి. తా నాత్మనని ధ్యానించి దర్శించినవాడు ప్రపంచమునందన్ని వస్తువుల యందును ఆత్మనే దర్శించును. తా నాత్మతో యోగము చెందియున్నాడు గనుక అన్ని జీవులు కూడ ఆత్మ స్వరూపమే అని తెలియును. చూచువాని యందెల్ల ఆత్మ కనబడుటచే తననే వారియందు దర్శించు చుండును. అట్టి వానికి పరిసరములన్నియు అద్దపు గదివలె గోచరించును. అద్దపు గదిలో ప్రవేశించినవానికి ఎటు చూచినను తానే కనపడును గదా! అట్లే ఆత్మదర్శనునికి సమస్తము నందు తానే గోచరించి అనన్య స్థితి కలుగును. అంతే గాక సర్వ భూతములు తనయందే ఉన్నట్లు కూడ గోచరించును. తా నన్నిటి యందు

ఉన్నట్లే, తనయందే అన్నియు ఉన్నవని తెలియును. ఇది అత్యుత్తమమగు విభూతి. గీతాచార్యుడగు కృష్ణుని స్థితి ఇదియే. ఇట్టి స్థితియే అర్జునునకు కూడ కలుగవలెనని ఆప్యాయముగ బోధించు చున్నాడు. పురాణ పురుషుడగు శ్రీకృష్ణుడు మాత్రమే ఇట్టి బోధనను చేయగలవాడు. కనుకనే తరువాతి శ్లోకమున తన నిజస్థితిని వివరించు చున్నాడు. ఈ శ్లోకమందలి అనుభూతి పూర్ణ మగు అద్వైత స్థితి. అనన్య స్థితి అని కూడ తెలియనగును.

30

వాసుదేవోపాసన

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥ 30

సమస్త భూతముల యందును ఎవడు నన్ను చూచునో, అట్లే సమస్త భూతములను నాయందు చూచునో అట్టి వానికి నేను కనబడకపోను. అట్టివాడు నాకు కనబడకపోడు.

ఇది శ్రీకృష్ణుని యొక్క అంతర్వాణి స్వరూపము. కృష్ణుడు తనను అన్నిట దర్శించును. అన్నిటిని తనయందు కూడ దర్శించును. అతడు విశ్వాత్మ. విశ్వరూపుడు. సమస్తము నందు వసించి యుండువాడు. సమస్తము అతనియందే వసించి యున్నది కనుక వాసుదేవుడు.

వాసుదేవోపాసన మనగ ఇదియే సమస్తము నందును, తనయందును నిత్యము దైవమును దర్శించువాడు వాసుదేవోపాసకుడు. దినచర్యలో తనకు గోచరించు సమస్త జీవులయందును, వస్తువుల యందును, ప్రకృతి యందును దైవమును దర్శించుట నిజమగు సాధన. ఇట్టి సాధన చేయువారికి దినచర్యయే యోగ

సాధనగ సాగును. యోగజీవనము అలవడును. ఇట్టివారు ప్రత్యేక ముగ క్రతువులు, ఆరాధనలు, అభిషేకములు, హోమములు చేయు అగత్యము లేదు. చేయుట వారి ముచ్చట.

యోగసాధనము వేరుగను, యోగజీవనము వేరుగను భావించువారు అజ్ఞానమున పడినవారు. యోగసాధన పేరిట వారు మోహము చెంది మాయలో పడుదురు. అట్లే భక్తులు, జ్ఞానులు కూడ. అన్నిట, అంతట దైవమే నిండియున్నపుడు చూచుట దైవమును చూచుటగనే యుండవలెను. వినుట దైవమును వినుటగనే యుండవలెను. సంభాషించుట దైవముతో సంభాషించు టగ యుండవలెను. సేవ చేయుట దైవమునకే అని తెలిసి చేయ వలెను. తనకు సేవచేయువారి రూపములో కూడ దైవమే యున్నా డని తెలియవలెను.

తన లోపల బయట కూడ ఉన్నది దైవమే అయినపుడు, దానిని చూచునపుడు అది తనను చూచును. దానిని వినుచుండు నపుడు అది తనను వినును. తాను సేవించునపుడు, తనను కూడ సేవించును. ఈ విషయమున ఎట్టి సందేహము అవసరము లేదు. ఇది ముమ్మాటికిని సత్యము.

అర్జునునికి బోధ చేయు సమయమున కృష్ణుడు, తాను అంతర్యామిగ బోధించెనే గాని ఒక వ్యక్తిగ బోధించలేదు. ఇది సాధనల కన్నిటి కన్నను ఉత్తమమైన సాధన. జీవితమందు మిళిత మైన సాధన. ఈ నిత్య జీవన సాధన నిత్యయోగ జీవనమై నిలచును. ఇట్టి వానికి దైవముతో అవినాభావ సంబంధ మేర్పడును.

31

ఏకాత్మ బుద్ధి

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥ 31

ఎవడు సమస్త భూతముల యందున్న నన్ను దర్శించి సేవించు చున్నాడో, సర్వత్ర అట్లే వర్తించుచున్నాడో, అట్టి యోగి నాయందే వసించును, వర్తించును.

ఈ శ్లోకమున *"ఏకత్వ మాస్థితః"* అనునది ప్రధానము. సర్వ భూతముల యందు స్థితిగొన్న నన్ను భేదబుద్ధిలేక ఎవడు దర్శించి సేవించునో అట్టి యోగి నాయందే వర్తించు చున్నాడు, నాయందే వసించు చున్నాడు అని దైవము పలుకుటలో జీవులు చూపించు భేదబుద్ధిని హెచ్చరిక చేయుచున్నాడు. చిన్నవాడని - పెద్దవాడని, ధనవంతుడని - పేదవాడని, అధికారియని - సేవకుడని, పాపియని- పుణ్యుడని, జ్ఞానియని - అజ్ఞానియని, ఉత్తముడని - అధముడని, స్వర్గమని - నరకమని భేదబుద్ధి జీవులకున్నది గాని దైవమునకు లేదు. దైవమునది అభేద బుద్ధి. రామకృష్ణాదుల జీవితములలో

ఈ అభేదబుద్ధిని దర్శించవచ్చును. భేదబుద్ధి తొలగనిదే దైవము కనపడడు. భేదబుద్ధిని విసర్జించిన వానికే అందరియందున్న ఒకే దైవము కనిపించును. **మతభేదము కలవారెవ్వరును దైవమును చూచినవారు కాదు. ఇది ముమ్మాటికి సత్యము.** మనకు యిష్టమైన వానియందు, యిష్టము కాని వానియందు కూడ దైవమున్నాడు. ఈ సత్యము నంగీకరించుకొలది దైవమునకు చేరువగుదుము. దర్శించినకొలది, అట్లే అభేద బుద్ధితో సేవించినకొలది దైవముతో యోగము సంభవించును. అట్టివాడు అన్ని వ్యవహారముల యందును దైవముతోనే వర్తించుచు, ఆనందము చెందుచు నుండును. అతడే నిజమగు యోగి.

అభేద బుద్ధిని ఏకాత్మ బుద్ధియందురు. ఒకే దైవమును అన్నిట భేదము లేక దర్శించుట ఏకాత్మబుద్ధి. అట్టి ఏకాత్మబుద్ధి కలవాడు ఏ మార్గమునందు వర్తించుచున్న వాడైనను, అతడు యోగస్థితి యందున్నట్లే. *"సర్వధా వర్తమానోపి"* అనుటలో అతడు వర్తించు మార్గమేదైనను తనకు సమ్మతమే అని అర్థము. భగవద్భక్తు లలో ఉత్తమోత్తములైన వారు కుమ్మరులుగను, వడ్రంగులుగను, మాంసము నమ్ముకొను వారుగను, గోపాలకులుగను, గొఱ్ఱెల కాపరులుగను కూడ వర్తించిరి. దైవముతో కూడియున్న వానికి ప్రాపంచిక విలువలతో సంబంధము లేదు. ఇట్టివారు మహోన్నత శీలసంపత్తి కలవారు.

32

సమదర్శనము

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32

ఓ అర్జునా! సర్వప్రాణులను తనవలెనే ఆత్మలుగ భావించుచు, వారియందలి ఆత్మను దర్శించుచు, వారి సుఖ దుఃఖములను తన సుఖదుఃఖములుగ సమవేదన చెందువాడు యోగులలో శ్రేష్ఠుడని నా మతము.

జీవరాసు లన్నిటికిని మూల మాత్మయే. ఆత్మ కేంద్రముగ త్రిగుణములు, పంచభూతములు రూపముగ నేర్పడి, రూప కదలికకు ప్రాణము లేర్పడును. అందరి యందున్నది ఆత్మయే. అందరి రూపములు త్రిగుణములు మరియు పంచభూతముల సమ్మేళ నమే. అందరియందు కదలిక కలిగించునది ప్రాణమే. అందరి యందలి చైతన్యము కూడ విశ్వచైతన్యమే.

జీవుల వైవిధ్యము మరి ఎచ్చటి నుండి ఏర్పడినది? వారి వారి స్వభావమును బట్టి ఏర్పడినది. స్వభావ వైవిధ్యమును బట్టియే

గుణ సమ్మేళనమునందు, పంచభూతముల సమ్మేళనము నందు వైవిధ్య మేర్పడినది. తత్కారణముగనే ప్రాణగతుల వైవిధ్య మేర్పడి నది. స్వభావ వైవిధ్యము జీవుల పరిపక్వతను బట్టి ఏర్పడినది. పచ్చికాయ వగరుగ నుండగ, పండు తీయగ, రుచిగ నుండును. పరిపక్వత యందలి భేదము వలన జీవులయందు సుఖదుఃఖము లేర్పడును.

ఇట్టి విధముగ జీవుల స్వభావ భేదమును బట్టి వారి వారికి కలుగు సుఖదుఃఖములను, పక్వత చెందిన ఆత్మయోగి జీవుల యందు సానుభూతి కలిగి యుండును. వారి దుఃఖములను తన దుఃఖములుగ సహవేదన మనుభవించును. దానికి కారణము, ఇరువురి యందలి మూలము ఆత్మయే కదా! నిజమగు యోగులు ఇతరుల దుఃఖమునకు సంతసించరు. తటస్థముగ గూడ నుండరు. వారియందు సానుభూతి కలిగి తగు విధముగ హితము గావింతురు. ఇట్టి కారుణ్యము గలవారే ఆత్మ యోగమున నుండగలరు. వారే నిజమగు భక్తులు కూడ. కేవలము వాత్సల్యము చూపువారు కపటులు.

ఇట్టి కారుణ్య భావము సోదరత్వము అని పిలువబడును. సోదరులపైనే కరుణ లేనివాడు ఆత్మసోదరత్వమెట్లు సాధించ గలడు.

ఈ శ్లోకమున *"సర్వత్ర సమం పశ్యతి"* అని భగవానుడు

పలికినాడు. సర్వత్ర అను పదము సమస్తమగు ప్రాణులను సమముగ దర్శించుట అని అర్థమిచ్చును. ఆత్మ దర్శనమే సమదర్శనమని తెలియవలెను. దేశ కాల మత జాతి భేదముల నధిగమించి ఆత్మను దర్శించువాడే యోగి గాని, ఇతరులెట్లు యోగులు కాగలరు! ఆత్మ దర్శునకు సర్వము తానుగనే దర్శన మగుచుండును. కనుక వారి బాగోగులు తనకు సహవేదన కలిగించుట సహజము. అట్టి సహజ స్థితియందున్న వాడు యోగులలో శ్రేష్ఠుడని శ్రీకృష్ణుడు తన అభిప్రాయమును వెల్లడించి నాడు. ఈ ఆశయము సిద్ధించు వరకు యోగసాధన సాగుచునే యుండవలెను.

33

సంశయము

యోஉయం యోగస్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన ।
ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥ 33

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవ ద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయో రివ సుదుష్కరమ్ ॥ 34

ఓ మధుసూదనా! ఏ యోగమునైతే నీవు సామ్యముగా తెలిపితివో ఆ స్థిరమగు యోగమును మనస్సాంచల్యము చేత నేను తెలుసుకొనజాలకున్నాను.

ఓ కృష్ణా! మనసు చాల చంచలమైనది. సంక్షోభములను కలుగజేయుచు నుండును. స్వభావవశమున దాని బలము దాని కున్నది. దానిని నిగ్రహించుట, అచంచలముగ నేర్పరచుట గాలిని పిడికిలిలో పట్టియుంచుటవలె చాల కష్టమని నా కనిపించు చున్నది.

పై రెండు శ్లోకములలో అర్జునుడు నరజాతి ప్రతినిధివలె పరిప్రశ్నము చేసెను. అతడు నరుడు. శ్రీకృష్ణుడు నారాయణుడు.

నారాయణునకు ఆత్మవశమున బుద్ధి, బుద్ధివశమున చిత్తము యుండును. కనుక అతడు స్వామి. అది అతని సహజస్థితి. అట్లే నరుల సహజస్థితి చంచలమగు మనస్సున కధీనులై యుండుట. సామాన్య మానవుల మనస్సు ఇంద్రియముల ద్వారమున బాహ్య ప్రపంచమందు లగ్నమై యుండును. ప్రపంచము ఎప్పటికప్పుడు మారుచుండును గనుక, ప్రపంచమున మార్పు సహజము గనుక దాని ప్రభావము మనస్సుపై నిరంతర ముండుటచే మనస్సు అహర్నిశలు చంచలమై యుండును. యోగమునకు అచంచల మగు మనస్సు ప్రధానము. చంచలమగు మనస్సుతో అచంచ లము అగు మనస్సును ఎట్లు నిర్మించుట జరుగును అన్నది అర్జునుని మొదటి ప్రశ్న.

రెండవ ప్రశ్న మనస్సు కలుగజేయు సంక్షోభము. సన్నివేశముల యందు మనస్సు సంక్షోభము కలుగజేయును. ఆ సంక్షోభము నుండి బయల్పడుటెట్లు? అంతియేగాక అభ్యాసవశము చేత మనస్సెప్పుడు పరుగిడుతునే యుండును. దేహేంద్రియాదులను క్షోభ పెట్టును. బలము గలదై ఆంబోతువలె ప్రవర్తించును. మనో వేగమును మించిన వేగము లేదు. భావముల పరుగు ఇంతింత అని తెలుపలేము. పట్టశక్యము కాని విధముగ అది చిందులు వేయును. దానిని పట్టుట సాధ్యమా? లేడిని, కుందేలును పట్ట వచ్చును. చురుకైన జంతువును పట్టవచ్చును. పట్టశక్యము కాని

మనస్సును పట్టుటెట్లు? పట్టినను, గాలి మూటకట్టినట్లు ఉండును గాని, పట్టు చిక్కదు. కావున శ్రీకృష్ణుడు తెలిపిన యోగము దుష్కరమేగాక అతి దుష్కరమని అర్జునుడు నిశ్చయముగ పలికినాడు. అర్జునుని ఈ ప్రశ్న యోగసాధకు లందరికి వింతయైన విషయమే. కావుననే యోగాభ్యాసము ఆవశ్యకమై నిలచినది.

34

అభ్యాసము

అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్య తే ॥ 35

అర్జునుని ప్రశ్నకు భగవానుడు చిరునవ్వుతో ఇట్లు సమాధానము చెప్పుచున్నాడు. "మహాబాహువులు గల ఓ అర్జునా! చంచలమైన మనస్సును నిగ్రహించుట చాల కష్టము. అది నిజము. సంశయము లేదు. కాని అభ్యాసము చేత, వైరాగ్యముచేత నిగ్రహించవచ్చును సుమా!"

అభ్యాసము, వైరాగ్యము అనునవి ఆత్మసాధనకు అత్యున్నతమైన సాధనములు. అభ్యాసము నిరంతరత్వమును ప్రసాదించును. అభ్యాసమనగా అంతరములు, అంతరాయములు లేక నిరంతరము కృషి సల్పుట. అట్లు సలిపినవారికి ఏ పనియైనను సిద్ధించును. అక్షరాభ్యాసము, అనగా అక్షరములను నిరంతరము అభ్యసించుట. అట్లభ్యసించిన వారికి అక్షరములు క్షుణ్ణముగ పలుకుట, వ్రాయుట తప్పక సిద్ధించును. అట్లే విద్యాభ్యాసము

కూడ. ప్రాధాన్యత విద్యకే నిచ్చి, నిరంతరముగ విద్య నభ్యసించి నపుడు తప్పక మేధస్సు ఉన్ముఖమై విద్య నభ్యసించుట జరుగును. అదే విధముగ యోగాభ్యాసము కూడ సాగును.

"అభ్యాసము కూసువిద్య" అను సూక్తి కలదు. దేనినైనను అభ్యసించుట ప్రారంభించినపుడు అది దుష్కరముగ గోచరించి నను అభ్యాసవశమున సుళువు తెలియుట, అనాయాసముగ నిర్వర్తించుట కూడ జరుగగలదు. ఉదాహరణకు ఎత్తైన ప్రదేశము లందు ఒక శిఖరము నుండి మరియొక శిఖరమునకు, లేక ఒక ధృవమునుండి మరియొక ధృవమునకు త్రాటిపై నడచుట సాధ్యమా! అభ్యాసవశమున సాధ్యపడును. అట్లే రెండు చక్రముల బండిపై (సైకిలు) సవారి చేయుట సాధ్యమా! అభ్యాసవశమున సాధ్యమే. ఇట్లెన్నో ఉదాహరణలు చెప్పవచ్చును. దుస్సాధ్యమగు విషయములు సాధ్యమగుటకు వినియోగపడు ఏకైక సాధనము అభ్యాసము.

అభ్యాసమునకు శ్రద్ధ, నిరంతరత్వము ముఖ్యము. ఏ విషయము నేర్వవలెనన్నను, ప్రతిదినము అదే సమయమున అదే పని శ్రద్ధతో చేయుట వలన ఆ విషయముపై పట్టు చిక్కును. వ్యాయామము కాని, ప్రాణాయామము కాని, ప్రార్థన కాని, ధ్యానము కాని అట్లే నిత్యము నిర్వర్తించుట వలన, మరియు శ్రద్ధతో నిర్వర్తిం చుట వలన సాధ్యమగును. శ్రద్ధ గలవానికే సిద్ధి. అశ్రద్ధ కలవాడు

అసమర్థుడుగనే ఉండిపోవును. అర్జునుడు సమర్థుడే గాని అసమర్థుడు కాదు గదా! అతనికి ఆ సమర్థత శ్రద్ధ వలనను అభ్యాసము వలనను కలిగినది. కనుకనే శాస్త్ర విద్యలన్నియు అతనికి సిద్ధించినవి. అట్టి శ్రద్ధను అంతర్జ్యోతిపై నిలిపినపుడు అభ్యాసవశమున అదియును సిద్ధించును.

రుచి కలిగిన విషయములందు జీవుడట్టి ఆసక్తియే చూపును. కాఫీ, టీ వంటి పానీయములు, ఉపాహారము, భోజనము వంటి విషయములయందు రుచి ఉండుట వలనను గదా వాని నభ్యసించి, సిద్ధించుకొందురు. ఉదయముననే కాఫీ టీలు త్రాగవలెనని, ఫలహారము చేయవలెనని, భోజనాదికములు గావించవలెనని ఎవ్వరును చెప్పకయే చేతురు. కారణము నిరంతరత్వమే. ఆ సమయమునకు గుర్తు వచ్చుట, రుచి కలిగి నిర్వర్తించుట జరుగుచున్నది గదా. అట్లే ప్రార్థనాదికములు గూడ నిర్వర్తించుట అభ్యసింపవలెను. రుచి, శ్రద్ధ నిరంతరత్వము వలన మానవుడు సాధింపలేనిది ఏదియును లేదు.

ప్రతినిత్యము కాఫీ ఫలహారముల వలెనే నిర్ణీత సమయమునకు ధ్యానము చేయవలెను. 11, 12, 13, 14వ శ్లోకములలో చెప్పిన రీతిని శరీరము, శిరస్సు, కంఠము తిన్నగ నిలపి, కదలక స్థిరముగ కూర్చుండి భ్రూమధ్యమును ప్రశాంతచిత్తుడై దర్శించుచు నుండవలెను. అచట నొక స్థిరమగు జ్యోతిని దర్శించుచు నుండ

వలెను. మనోభావము అచటి నుండి మరలినచో మరల జ్యోతి దర్శనమునకే ప్రయత్నించవలెను. ఇట్లు నిత్యము ప్రయత్నము గావించినచో క్రమముగ మనస్సెచ్చట లగ్నము చేయబడెనో, అచ్చటనే యుండుట నేర్చును. ఇది మనస్సున కీయవలసిన శిక్షణ. అటునిటు తిరుగాడు జంతువునకు కూడ ఓర్పుతో శిక్షణ నిచ్చి నపుడు అది చెప్పిన చోట కూర్చుండును. విశ్రాంతికి ఒక ప్రదేశము, భుజించుట కొక ప్రదేశము, మలమూత్ర విసర్జనకు ఒక ప్రదేశము నేర్పినచో, జంతువులు సైతము వాటిని పాటించును. కావున మానవ మనస్సునకు ఓర్పుతో శిక్షణ మిచ్చినచో తప్పక చంచల స్థితి నుండి అచంచల స్థితికి చేరవచ్చును. ఇందుకు వలసిన అంశములు ఆసక్తి, శ్రద్ధ, నిరంతరత్వము. అపుడే అభ్యాసము అగును. అట్టి అభ్యాసము వలన చంచలము, దుర్నిగ్రహము అగు మనస్సును. స్థిరపరచవచ్చును. ఇది అభ్యాసము.

పై తెలిపిన అభ్యాసము సిద్ధించుటకు వైరాగ్యము కూడ నవసరము. అందులకే భగవానుడు యుక్తమగు విహారము, ఆహారము తెలిపినాడు. అమిత భోజనము, ఉపవాసములు కూడ దని తెలిపినాడు. అతనిద్ర, అసలు నిద్ర లేకుండుట విసర్జించ వలెనని తెలిపినాడు. అనవసరమగు భాషణములు, తిరుగుడు విసర్జించవలెనని తెలిపినాడు. కేవలము కర్తవ్యములను మాత్రము నిర్వర్తించుచు, సమయము వృధా చేయక విచక్షణా బుద్ధితో జీవించుడని తెలిపినాడు. ఇవి యన్నియు 15, 16, 17, 18, 19వ

శ్లోకములలో తెలిపినాడు. ఈ మాత్రపు నియమములను పాటించి నచో ప్రాథమికమగు వైరాగ్యమబ్బును. దానివలన మనస్సు కప్పగంతులు వేయక, చిందులు తొక్కక ఏకోన్ముఖమై యుండును. కుందేలు నడకగా కాక, తాబేలు నడకగ సాగును. సాధన సిద్ధించును. నిత్యానిత్య వస్తువివేకమే వైరాగ్యమునకు మూలము. ఏది నిత్యము, ఏది అనిత్యము అను విచక్షణ లేనపుడు వైరాగ్యమునకు తావు లేదు. సాధకులకు రెంటియందు ఆసక్తి కలగాపులగముగా నుండును. అతడు నిత్య దినచర్యయందు భాగముగ నిత్యమగు విషయమేమి? అనిత్యమగు విషయమేమి? అని విచారించి తెలుసుకొనుచుండును. తానొకడే నిత్యుడు. దేహముతోపాటు తన కేర్పడినవన్నీ అనిత్యము. తాను నేర్చినది కూడా తనతోపాటు జన్మ జన్మలు అనుసరించు చుండును. జ్ఞానము - అజ్ఞానము, బలము - బలహీనత కూడా వాసనల రూపమున వెంటనంటి వచ్చు చుండును. అట్లే కళత్ర బాంధవ్యము, సంతానము, బంధు మిత్రులు, పరిచయములు, ఆస్తిపాస్తులు కూడా ఏర్పడు చుండును. ఇది ఏర్పడుటకు కూడా శుభాశుభ వాసనలే కారణము. శుభవాసనలు శ్రేయస్కరమగు సంపర్కముల నిచ్చును. అశుభ వాసనలు అపాయము కల్గించు సంపర్కముల నిచ్చును. ఇవి అన్నియు మిశ్రమముగా సంస్కారముల రూపమున వెంటనంటి వచ్చుచుండును. ధనికుడగుట, పేదయగుట, పురుషుడగుట, స్త్రీ యగుట యిత్యాది వన్నియూ కూడ సంస్కారముల కారణముగనే జరుగును.

తాను జీవుడని మాత్రము గుర్తుండుట, జీవుడుగా తాను దేవునికి చెందినవాడని కూడా గుర్తుండుట వైరాగ్యమునకు చిహ్నము. ఇతరమగు సంబంధములన్నియు దైవలీలగా భావించి దైవవిలాసమున తన పాత్రను హెచ్చుతగ్గులు లేక పోషించువాడు విరాగి. వైరాగ్యము కొరకై దేనినైననూ విసర్జించుట కృష్ణుడిచ్చిన మార్గము కాదు. విసర్జించుట, నిర్జించుట, బహిష్కరించుట అనునవి విరాగికి వుండవు. అట్లే అంటుకొని యుండుట కూడా వుండదు. కేవలము ప్రేమపూర్వకమగు జీవ సంబంధమే యుండును. జీవుడు సహజముగ ప్రేమ స్వరూపుడు గనుక, అది ఒక్కటి జ్ఞానమై మిగులును. ఇట్టి వైరాగ్యము సిద్ధించుటకు నిత్య స్మరణ మార్గమొకటి యున్నది. “నేను జీవుడను. జీవుడుగా దైవ కుమారుడను. అట్లే సమస్త జీవులునూ. వారును దైవమునుండి ఉద్భవించినవారే. జీవులుగా అందరునూ సమానులే. అందరి యందు నేను సోదరభావమును ప్రయత్నింతును. ఇతరమగు విషయములయందు నాకున్నది పాత్ర పోషణమే. దానిని శ్రద్ధ, భక్తి, అనురక్తిలతో నిర్వర్తించెదను. ఇట్టి జ్ఞానము చర్యలలో నిల బడుటకు నా కాధారము దైవమే. అనిత్యమగు విషయము లందు అనాసక్తి చూపక, అట్లని మమకారపడక జీవించు స్థైర్యము కూడ నాకు దైవమే ఈయవలెను.

వైరాగ్యమునకు రెండు ప్రధానమగు విఘ్నములు కలవు. ఒకటి మమకారము, రెండు అహంకారము. పై స్మరణమున

మమకారము కల్గిననూ అహంకారము యింకనూ యుండును. అది కలుగుటకు దైవమే నేనై యున్నాను, అతడే నేనుగ నున్నాను అని కూడా భావింపవలెను. శ్వాస రూపమున ఈ సత్యమునే హృదయము పలుకుచున్నది. దానినే సంస్కృతమున 'సోహమస్మి' అను మంత్రముగ తెలిపిరి. దీనిని నిత్యము అనుష్ఠానము చేయు వానికి అహంకారము తొలగును. అతడే తానుగ నున్నాడు అని నిశ్చయమైనపుడు యిక తనను గూర్చి భావన జారును. అదియే నిరహంకార స్థితి. ఇట్టి వైరాగ్యము భావనాపరముగ నిత్యము పటిష్ఠము గావించుకొనుచూ, ముందు తెలిపిన అభ్యాసమును నిర్వర్తించుచూ యోగసాధకుడు క్రమముగా యోగసిద్ధి దిశకు సాగును. ఈ కారణముగనే అభ్యాసము, వైరాగ్యము రెంటిని సాధనములుగ భగవంతుడు పేర్కొనినాడు.

35

స్థిరత్వము

అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।
వశ్యాత్మనా తు యతతా శక్యోఽవాప్తు ముపాయతః ॥ 36

స్థిరచిత్తము లేనివారికి బ్రహ్మముతో యోగము చెందుట అశక్యము. స్వాధీనమైన మనస్సు కలిగి దైవముతో యోగించుటకు ప్రయత్నించువానికి నే తెలిపిన ఉపాయము చేత సాధ్యమగును. ఇది నా అభిప్రాయము.

చంచలమైన మనస్సు ఐహిక జీవనమునకు గూడ వినియోగ పడదు. అట్టి మనస్సునకు సామర్థ్యముండదు. ఒక కార్యముపై ఎక్కువసేపు నిలచి పనిచేయుట కూడ యుండదు. దీక్షతో ఏకాగ్ర మైన మనస్సుతో కార్యములను నిర్వర్తించినపుడు కార్యసిద్ధి కవకాశము మెండుగ నుండును. చిందులు వేయు మనస్సునకు ఎట్టి అవకాశము ఉండదు. చిందులు వేయు మనసును అనాదిగ మర్కటముతో పోల్చుదురు. మర్కట మనగ కోతి. కోతి ఒక చెట్టుపై నిలకడగ ఉండదు. ఒక కొమ్మపై అసలుండదు. ఏ పండును

పూర్తిగ భుజించదు. తోటలో సమృద్ధిగ పండ్లున్నపుడు అన్ని పండ్లను ఎంగిలి చేయుటయేగాని, సమగ్రముగ భుజింపదు. ఒక పండు తినుచు మరొక పండును చూచును. అపుడున్న పండును విసర్జించి మరియొక పండునకై గెంతును. ఇట్లే సామాన్య మానవులు కూడ గమ్యమున నడవక ప్రక్కదారులను పట్టి పోవుచుందురు. అట్టి వారు కార్యములను చక్కబెట్టలేరు. బాధ్యతలను సమగ్రముగ నిర్వర్తించలేరు. ఒక పాఠ్యాంశమును కూడ పరిపూర్ణముగ పఠించ లేరు. ఒక పని చేయుచున్నపుడు మరియొక పని గుర్తు వచ్చు చుండును. ఉదాహరణకు భోజనము చేయునపుడు వృత్తిపరమైన భావములు స్ఫురించుట, తత్కారణముగ భోజనమును అనుభూతి చెందలేరు. అట్లే వృత్తి యందున్నపుడు మరియొక అంశముపైకి మనస్సు గెంతును. అందువలన వృత్తి నిర్వహణము జరుగును. నిదురించుచున్నపుడు తాను చేయవలసిన పనులు, మరచిన పనులు జ్ఞప్తికి వచ్చి నిదుర పట్టదు. ఏ పనియందైనను ఏకాగ్రత ఉండకుండుట వలన పని చెడి, ఎక్కువ పని ఏర్పడును. పనులు జరుగుట మానును. దానితో అసహనత, కోపము పెరుగును. ఇట్లు మనస్సు పెట్టు తిప్పలు, త్రిప్పటల వలన అలసిపోవుటయే యుండును. జీవచైతన్యము ఒక ప్రవాహముగ సాగదు. ఇట్లు ఎంతైనను సామాన్య మానవుని మనస్సు గూర్చి విశ్లేషించవచ్చును. ఆరాట పడుటయే గాని, తగు విధమగు ఆచరణముండకపోవుటచే, స్థిరము లేక సూత్రము తెగిన గాలిపటమువలె జీవితము గాలి

వాటున సాగుచుండును. ఇట్లు వృత్తములలో గిరగిర తిరుగు చిత్తమును నిగ్రహించుట గాలిపటమునకు సూత్రము కట్టుట వంటిది. ఎద్దు ముక్కునకు త్రాడు వేయుట వంటిది. గుఱ్ఱమునకు కళ్ళెము కట్టుట వంటిది. అపుడే ప్రయాణము సాగును. జీవన ప్రయోజనము నెరవేరును. ఇది నిస్సంశయము.

కళ్ళెము లేని గుఱ్ఱముపై ప్రయాణము గమ్యమునకు చేర్చదు. ముక్కుకు త్రాడు వేయని ఎద్దుతో పొలము దున్నలేము. అట్లు మనస్సును అంతరంగమునుండి పట్టనిచో అది పలు విధముల పరుగెట్టుచుండును.

అంతరంగమందు సుందర తేజోరూపమునో, జ్యోతినో లేక స్పందనాత్మక చర్యనో పట్టుట వలన క్రమముగ స్థిరమగు మనసు ఏర్పడును. అట్టి స్థిరమనస్సు అంతర్ముఖముగ అంతరంగమున దర్శించినచో ఆసక్తికరము, రుచికరము అగు బుద్ధి ఆవరణము గోచరించును. అందు ప్రవేశించిన వానికి బుద్ధియను వెలుగునకు మూలమగు దానియందు ఆసక్తి కలుగును. ఇట్లు అంతరంగమును శోధించుచు తన మూలమును చేరుట వలన యోగము పరిపూర్ణ మగును. పరమాత్మ, జీవాత్మ, బుద్ధి, స్థిరచిత్తము ఒకే సూత్రముగ, తేజోమయముగ గోచరించును.

పై విధమగు దర్శనము అనుభూతి కలుగవలె నన్నచో స్థిర చిత్తము పునాదిరాయి. స్థిరచిత్త మేర్పడుటకే అనేకమగు ప్రాథమిక

దీక్ష లున్నవి. ప్రతినిత్యము ఒక పనిని అదే సమయమున నిర్వర్తించుట, అంతే శ్రద్ధతో నిర్వర్తించుట, ఆసక్తితో రుచి కలిగి నిర్వర్తించుట వలన అస్థిరత్వము నుండి చిత్తమునకు స్థిరత్వ మేర్పడును. అట్లేర్పడుటకు చాలకాలమట్లే నిర్వర్తించవలెను. నిరంతరత్వము, దీర్ఘకాలము అను రెండంశము లాధారముగ నేర్వవలసిన విషయమును నేర్చుట సిద్ధించును. మరియొక మార్గము లేదు.

భగవంతుడు శ్రీకృష్ణుడు ఈ శ్లోకమున "స్థిరచిత్తము లేనిచో యోగము లేదు. ఇది నా మతము" అని పలికినాడు. కేవలము ఇది తన అభిప్రాయమని తెలిపినను మరియొక మార్గము లేదని తెలియవలెను. అభ్యాసము చేతను, వైరాగ్యము చేతను స్థిరచిత్త మేర్పరచుకొన వచ్చును. అపుడే యోగమున కర్హత కలుగును.

36

మనో నిగ్రహము

అయతి శ్రద్ధయోపేతో యోగాచ్చలిత మానసః ।
అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥ 37

అర్జునుడు మరియొక సందేహమును వెలిబుచ్చెను. శ్రద్ధ యున్నను మనోనిగ్రహము లేనివాడు, చంచలమగు మనస్సు కలవాడు యోగసిద్ధిని పొందనపుడు అత డే గతి పొందును?

ఈ ప్రశ్న చాల సమంజసమగు ప్రశ్న. శ్రద్ధ యున్నను మనో నిగ్రహము లేకపోవుట సర్వసామాన్యముగ శిష్టుల ఎడ గోచ రించును. మనో చాంచల్యము వలన యోగము కుదరదు. యత చిత్తుడు కానిదే యోగాభ్యాసమును గూర్చి భావించుట నిరర్ధకము గదా! కావున శ్రద్ధ కలవాడు మొట్టమొదటగ కర్మఫలములను విసర్జించుట నేర్వవలెను. కర్తవ్య కర్మనే నిర్వర్తించుట నేర్వవలెను. ఇష్టాయిష్టములను ఆధారముగ చేసుకొని జీవించుటగాక కర్తవ్య మునే అనుసరించుట నేర్వవలెను. క్రమముగ స్వంత సంకల్పము లను విసర్జించి అందివచ్చు కర్తవ్యములను మాత్రము నిర్వర్తించుచు

జీవించవలెను. శీతోష్ణ సుఖదుఃఖములు, మానావమానములు వైరాగ్య దృష్టితో గ్రహించవలెను. సమ భావమును అందరియందు నిర్వర్తించుట నేర్వవలెను. శ్రద్ధ ఆధారముగ ఈ విషయములను నేర్చినచో మనో నిగ్రహ మేర్పడును. అర్జునుడు సహజముగ శ్రద్ధా వంతుడు అగుటచే శ్రద్ధ ఆధారముగ యోగమును నిర్వర్తించుట వీలుపడు నేమోనని, చంచలమైన మనస్సు కలిగినను యోగ మభ్యసించవచ్చునేమోనని కొంత తడవు భావించి, చలిత మానసు లకు యోగాభ్యాసము కుదరదని నిశ్చయించుకొని పై విధముగ ప్రశ్నించెను.

శ్రద్ధ ప్రధానమగు విషయము. శ్రద్ధను ముందు తెలిపిన ప్రాథమిక విషయములపై నిలుపవలెను. అపుడు స్థిరమగు మనస్సు లేక యతచిత్తము ఏర్పడును. యతచిత్త మేర్పడినవాడు యతి. ఈ శ్లోకమున అయతి గూర్చి అర్జునుడు పలుకుచున్నాడు. అయతికి మనస్సు చలించు చుండును. యతి మనస్సు చలింపదు. యతియైనవాడికే యోగాభ్యాసము సిద్ధించును. కానివాడు ముందు యతచిత్తము నేర్పరచుకొనవలెను. కేవలము శ్రద్ధ కలిగి చరిత మనస్కులగు వారు యోగసిద్ధిని పొందలేరు గదా! అట్టివారు ఏ గతి పొందుదురని అర్జునుని ప్రశ్న.

37

యోగ వికారములు

కచ్చిన్నో భయవిభ్రష్ట శ్ఛిన్నాభ్రమివ నశ్యతి ।
అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥ 38

అర్జునుడు తన పరిప్రశ్నము నింకను కొనసాగించెను. ఉభయభ్రష్టుడు చెదిరిన మేఘమువలె నశించిపోవును గదా? అందువలన యోగమార్గము ననుసరించు అయతి ఇహపరములను మోసము చెంది నశించును గదా?

ప్రస్తుత కాలమున ప్రతివారును యోగవిద్యయందు ప్రవేశించి యోగులు కావలెనని ఆకాంక్షించు చున్నారు. ఇట్టి ఆకాంక్షను ఆవేశ మావరించి కర్తవ్య విముఖులగు చున్నారు. కర్తవ్య విముఖులకు యోగము లేదు. కర్తవ్యము నుండి పారిపోవు వారికి యోగము కుదరదు. కర్తవ్యములను తప్పించుకు తిరుగు వారికి యోగము కుదరదు. కర్తవ్య నిర్వహణమున వక్రబుద్ధిని ప్రదర్శించు వారికి యోగము కుదరదు. త్రికరణశుద్ధిగ కర్తవ్యములను నిర్వహించువారికే యోగము కుదురును. జీవితమున కర్తవ్య

నిర్వహణము యోగ సాధనమున భాగమే. అందువలన ప్రపంచ మును మోసగించుచు యోగము సాధించుటకు వీలుపడదు. కుటుంబ పోషణము, సంఘము నందు వృత్తి ఉద్యోగ వ్యాపార మార్గమున సహకారము, జీవుల ఎడల కారుణ్యబుద్ధి, తలిదండ్రుల ఎడల భక్తి ఇత్యాదివి లేకుండ యోగ ప్రవేశము నిష్ఫలము. కర్మ ఫలములను ఆశ్రయించుచు యోగాభ్యాసము చేయువానికి మనసు నిలుకడగ నుండదు. మిక్కుటమగు ఇష్టాయిష్టములందు కొట్టు మిట్టాడువానికి యోగము జరుగదు. అట్టి వానికి ప్రశాంతత యుండదు. తటస్థబుద్ధి, సమబుద్ధి అనునవి మృగ్యములై, రాగ ద్వేషములతో జీవించును. సంకల్పములు పుట్టలు పుట్టలుగ వచ్చు చుండగ యోగాభ్యాసము చేసి ఉపయోగము లేదు. యోగవిద్య సత్వగుణ సంబంధితము. రజస్తమస్సుల కది అందదు. రజోగుణ ప్రేరితుడైన వాని నుండి నిత్యము సంకల్పములు కోకొల్లలుగ వచ్చుచుండును. అవి మానవుని బాహ్య ప్రపంచములోనికి నెట్టు చుండును. ఇట్టివాడు యోగము పేరున కర్తవ్య నిర్వహణము మాని భ్రష్టుడగుట జరుగును. యోగమునకు కర్మయోగ సిద్ధాంతము మొదటి మెట్టు. యజ్ఞార్థ జీవనము రెండవ మెట్టు. ద్వంద్వములను దాటుట మూడవ మెట్టు. తటస్థుడై యుండుట నాల్గవ మెట్టు. అట్టివాడు ఆత్మ సంయమమునకు కృషి చేయవచ్చును. సోపాన క్రమమును పాటింపక అడ్డదిడ్డముగ తోచినది చేయువారు యోగ సాధకుల మని భ్రమపడుటయేగాని, యోగము సిద్ధింపనేరదు.

అక్షరములను సరిగ నేర్వక గ్రంథములను రచింతునని పూనుకున్న ట్లుండును. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెనలు వేసినట్లు, యోగ సాధన పేరున రకరకములుగ వికారములు ప్రకటింపబడు చుండును. ఇవి యన్నియు నరజాతి పోకడలు. అర్జునుడు నరుడగుటచే నరుల ప్రతినిధిగ ఈ పరిప్రశ్నమును చేసెను.

38

యోగ రసాయనము

ఏతం మే సంశయం కృష్ణ ఛేత్తు మర్హ స్యశేషతః ।
త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥ 39

అర్జునుడింకను పలుకుచున్నాడు. "ఈ నా సంశయమును శేషము లేకుండ ఛేదించుము. అట్లు ఛేదించుటకు నీకన్న అన్యుడెవరు లభింపగలడు?"

శ్రద్ధ కలిగి యతచిత్తము లేనివాని గూర్చి అర్జునుడు ప్రశ్నించినాడు. వాని పరిస్థితి ఏమగునని ప్రశ్న. శ్రద్ధయున్నను నియతమగు మనసు లేనివాడు యోగమున ప్రవేశించినను అతడు యోగమును పొందలేడు. అట్టివాని గతి ఏమి? యోగవిద్యలో ప్రవేశించి యోగ నియమములను పాటింపలేక, నియతమగు మనస్సును పొందలేక సతమతమగువా రెందరో వుందురు. ఉత్తర జన్మలలో వారికి ఏమగును? అటునిటు కాక దుఃఖపడునా? నశించునా?

యోగవిద్య ఒక రసాయనము విద్య వంటిది. యోగ సాధకుడు ఉన్నతస్థితి నుండి ఉత్తమస్థితి కొరకై సాధనా మార్గమున

యత్నించు చుండగ అతనిలో కొన్ని మార్పులు జరుగును. మార్పులు పూర్తిగాక అసంపూర్ణముగ జీవితము చాలించినచో ఏమి కాగలదు? వంటను ప్రారంభించి సగము వంట జరిగిన వెనుక వంట సాగనిచో వండబడుచున్న పదార్థ మేమగును? యోగవిద్యలో మానవుని పాశవిక స్వభావము హరింపబడును. మానవ స్వభావము సంస్కరింపబడును. దైవీ స్వభావము ఆవిష్కరింపబడును. కందమూలమును శుభ్రపరచి, తొక్కు తీసి, ఉడకపెట్టి, పోపు వేసినపుడుగదా అది రుచికరముగ నుండును. లేనిచో తిను వానికి నాలుకతో ప్రారంభమై దేహమంతయు దురద కలుగును. అట్లే మానవుని యందు జమిలిగ పాశవికము, మానవికము, దైవికము అగు స్వభావములు కలసిపోయి ఉండును. పాశవిక భావముల నుండి సంస్కరించి మానవతా భావములను పెంపొందించి, దైవీ స్వభావమున స్థిరపడునట్లు చేయుట, తినలేని కందదుంపను రుచికరముగ భుజింపచేయుట యోగవిద్య చేయు మార్పు. అట్లే గొంగళిపురుగు తన చుట్టును గూడు కట్టుకొని 90 దినములలో సీతాకోకచిలుకగ మారును. గొంగళిపురుగు దేహముపై పాకిన కంపరము కలుగును. సీతాకోకచిలుక మేనుపై వాలిన ఆహ్లాదము కలుగును. ఇట్టి రసాయనమే యోగవిద్య యందున్నది. ఈ రసాయన ప్రక్రియ సగములో ఆగినచో ఏమగునని అర్జునుని పరిప్రశ్నము.

39

నిత్యజీవన యోగసాధన

పార్థ నై వేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే ।
న హి కల్యాణకృ త్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి ॥ 40

పార్థా! అట్టి యోగభ్రష్టునకు ఈ లోకమునందు గాని, పరలోకమునందు గాని పతనముండదని తెలియుము. మంచి పని చేయుటకై సంకల్పించినవాడు దుర్గతి చెందనేరడు. ఈ విషయమున నీకు సందేహము వలదు.

శ్రీకృష్ణుడు ఒక విశేషమగు సృష్టిరహస్యము అర్జునునకు ఆవిష్కరించినాడు. సత్సంకల్పముతో కార్యముల నారంభించు వారు కార్యములందు కృతకృత్యులు కాకపోయినను సంకల్పము శుభకర మగుటచే సృష్టియందు నాశనము చెందరు. అతడు కార్యము లందు నిపుణత లేకపోవుట వలన కొన్ని చిక్కు లేర్పరచు కొనినను, సంకల్పము దైవమును చేరు శుభ సంకల్పమే గనుక ఆ సంకల్ప మెరిగిన ప్రకృతి పురుషులు అతనిని ఆశీర్వదింతురే గాని, అతనిని భ్రష్టుని గావింపరు. *"కల్యాణ కృత్"* అనగా కల్యాణము

కలిగించు కార్యము. తనకుగాని, యితరులకు గాని చైతన్యపరమగు ఉన్నతిని గావించు కార్యము. చేయుటలో సమర్థతనుబట్టి సిద్ధి యుండును. యోగవిద్యకు కావలసిన ఏకైక సమర్థత మనో నియతి. శ్రద్ధ కలిగినను మనోనియతి లేనిచో యోగము సిద్ధించుట జరుగదు. వైఫల్యము కలిగినపుడెల్ల మరికొంత నియతిని యోగ సాధకుడు పొందుటకు యత్నించును. అట్లు యత్నింపవలెను కూడ. యత్నించుటకు కూడ వైఫల్యము లుండ వచ్చును. కాని మరల మరల యత్నించుటలో అభ్యాసవశమున యతీంద్రియుడు కాగలడు. యతచిత్తుడు కాగలడు. క్రమముగ అభ్యాసవశముననే సమబుద్ధిని పొందగలడు. శీతోష్ణములకు, సుఖదుఃఖములకు, మానావమానములకు తీవ్రమగు బాధ పొందుట క్రమముగ తగ్గును. నిత్య జీవితమున అభ్యాసవశమున తగ్గునే కాని మరియొక మార్గము లేదు. నిత్య జీవితమున అనుభవ జ్ఞానము చేతను, అటుపైన అధ్యయన జ్ఞానము చేతను క్రమముగ కూటస్థుడగును. కూటస్థుడగుట యనగ చంచలత్వము నుండి స్థిరత్వమునకు చేరినవాడు. అట్టివానికి సన్నివేశమును బట్టి వికారమగు మార్పులు కలుగవు. నిర్వికారుడు గనే యుండును.

దైనందిన జీవితమున కర్మ జ్ఞాన సన్యాస యోగసూత్రములను నిత్యము అనుసరించుట వలననే యతచిత్తము కలుగును గాని కేవలము పఠనము వలన గాని, ఉభయ సంధ్యలయందు సాధనవలన గాని పట్టు చిక్కదు. కనుకనే యోగసాధన నిత్య

జీవితమునందు విలీనము కావలెను. యోగసాధన వేరుగను, నిత్యజీవితము వేరుగను నిర్వర్తించువారికి యతచిత్తము లభించదు. యతచిత్తము లభింపనిదే యోగస్థితికి అవకాశము లేదు.

అందువలన నిత్యజీవన అభ్యాసముగ యోగము సాగవలెను. శ్రద్ధ ఉండుటచే ఆ ప్రయత్నమున నున్నవాడు క్రమముగ వృద్ధి చెందును. నాశనము పొందదు. "*కల్యాణ కృత్ కశ్చిత్ దుర్గతి గచ్ఛతి*". కల్యాణమగు కర్మకు పూనుకొనువానికి దుర్గతి ఎట్లు కలుగును? కలుగుటకు వీలు లేదు. అట్టివానికి ఇహమునందు గాని, అటుపైన గాని వినాశము లేదు అని తెలియుము అనుచు కృష్ణుడు నిస్సందేహముగ తెలిపెను.

40

యోగసిద్ధి

ప్రాప్య పుణ్యకృతాం లోకా నుషిత్వా శాశ్వతీః సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥ 41

యోగమునందు సిద్ధి పొందని యోగసాధకుడు, యోగము నభ్యసించుచు యతచిత్తము లేకపోవుట వలన జారిన యోగ భ్రష్టుడు. చేసిన పుణ్యములను బట్టి, అనేక సంవత్సరములు పుణ్య లోకములయందు వసించి తదుపరి పరిశుద్ధులైనట్టి శ్రీమంతుల గృహములలో మరల పుట్టును.

యోగాభ్యాసి చేసిన అభ్యాసము ఇసుమంత అయినను అది ఉత్తర జన్మలలో శ్రేయస్సే కలిగించును గాని భ్రష్టత్వము కలిగించ దని తెలుపుచు, అట్టివాడు యోగసిద్ధి పొందకగాని, యోగ భ్రష్టత్వము పొందిగాని మరణించినపుడు చేసిన పుణ్యములను బట్టి కొన్ని సంవత్సరములు పుణ్య లోకములందు వసించి అటు పైన శుచి, సంస్కారము గల శ్రీమంతుల కుటుంబములో పుట్టునని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు. దీనివలన యోగవిద్యయందు ప్రవేశించుట శ్రేయస్కరమని, ఉత్తమమని తెలియుచున్నది. అహింస, సత్యము,

బ్రహ్మచర్యము, ఆస్తేయము, అపరిగ్రహము, కర్మఫలత్యాగము, దానధర్మములు ఇత్యాది కార్యములు యోగజీవనమున నిర్వర్తించుట వలన చేసిన పుణ్యము కారణముగ మరణించిన పిదప యోగాభ్యాసి పుణ్యలోకములకే చనును. అటుపైన జన్మించును. అట్టివానికి సత్సంపద కలిగిన గృహములందు జన్మ కలుగుట వలన చక్కని సంస్కారములు చిన్నతనము నుండి అబ్బును. సత్సంపద యుండుటచే దానధర్మాది గుణములు కూడ అలవడును. అన్నవస్త్రాదులకు లోటు ఉండదు గనుక ఉన్నత భావములపై జీవితమును కేంద్రీకరించు బుద్ధి కలుగును. మరల యోగవిద్య యందు ప్రవేశించుటకు, సాధన చేయుటకు వలసిన వాతావరణ మేర్పడును. కుసంస్కార మున్నచోట అశుచి యుండును. సంపదలు లేనిచోట అన్నవస్త్రాదులే జీవితాశయములై, జీవిత మంతయు ధనార్జనమునకే కృషి సలుపవలసి యుండును. ఇట్టి పరిస్థితులలో యోగాభ్యాసము సాగదు. యోగాభ్యాసము సాగుటకు వలసిన వాతావరణము చిన్నతనముననే అందివచ్చుట అదృష్టము. అట్టి అదృష్టము పూర్వజన్మలయందలి యోగాభ్యాస ప్రయత్నముగ లభించును. అందువలన యోగవిద్య నేర్చువాడు మరణించు సమయమున యోగసిద్ధి కలుగలేదని దుఃఖము చెంద నవసరము లేదు. యోగభ్రష్టుడనైతినని బాధ పడనవసరము లేదు. యోగము ఈ కారణముగ అత్యుత్తమ విద్యగ తెలియదగును. శ్రీకృష్ణుడు అర్జునుని *"యోగీ భవ అర్జున"* అనుచు అర్జునునిపై తనకు గల ప్రేమను చాటుకొనెను.

41

యోగిజన్మ

అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥ 42

యోగాభ్యాసి యోగ విద్యయందు ప్రవేశించి శ్రద్ధతో యోగము చేయుచు, యోగసిద్ధి చెందకయే మరణించినచో అతని యోగాభ్యాస నాణ్యతను బట్టి యోగుల కుటుంబముననే జన్మించ గలడు.

యోగుల కుటుంబమున జన్మించుట, శ్రీమంతుల కుటుంబమున జన్మించుట కన్న శ్రేష్ఠమని తెలుపబడుచున్నది. యోగుల కుటుంబములో జన్మించినపుడు పూర్వ జన్మ వాసనల వలన చిన్నవయస్సుననే యోగమున ప్రవేశించు టకు అవకాశ మేర్పడును. యోగుల కుటుంబమందు దైవీ వాతావరణము సహజముగ నుండును. భక్తి జ్ఞానము లుండును. చిల్లర విషయ ములు గూర్చి చర్చగాని, చేష్టగాని యుండదు. భారత భాగవత

రామాయణాది సద్గ్రంథముల చర్చలు, యోగాభ్యాస పరమైన ప్రవర్తన యుండును.

యోగము కొనసాగుట కంతకన్న ఉత్తమమైన వాతావరణము ఏమి కావలయును?

ప్రపంచమున అన్ని రకముల జన్మల కంటెను మానవ జన్మ ఒక అదృష్టము. అట్టి మానవజన్మ యోగుల కుటుంబమున జరిగినచో అంతకన్న గొప్ప అవకాశము జీవునకు మరియొకటి లేదు. ధనికులు, అధిపతులు, రాజాధిరాజుల జన్మల కన్న యోగుల జన్మమే గొప్పది. ఇంద్రుని జన్మ కన్న కూడ యోగిజన్మ గొప్పది.

యోగులు ధీమంతులు. ఆత్మారాములు. నిష్కపటులు వారు కేవలము ప్రపంచమునకు హితము చేయుటకే జన్మింతురు. అట్టి వారి కుటుంబములలో పుట్టుట మహాదుర్లభమైన విషయము.

వశిష్ఠ మహర్షి సాక్షాత్తు బ్రహ్మమే. అతని కుటుంబమున పుట్టిన శక్తి మహర్షి సూటిగ ధ్యానమందు నిలచి, బ్రహ్మమును చేరి బ్రహ్మమై యున్నాడు. అతని కుమారునిగ జన్మించిన పరాశర మహర్షి మహాయోగియై, జగద్గురువై, మైత్రేయాది జగద్గురువులకు కూడ గురుస్థానము నలంకరించినాడు. పరాశర మహర్షి కుమారుడు వేదవ్యాసుడు. తండ్రిని మించిన తనయుడు. తండ్రి అందించిన యోగమును, ధ్యానమును సమస్తమును విపులీకరించి, వేదములను నిర్వచించి, పురాణములను వర్గీకరించి, భారత భాగవతాది

గ్రంథములు రచించి, కలియుగమందు మానవులు తరించుటకు మహత్తర కృషి గావించినాడు. అతని కుమారుడు శుకుడు చిన్నతనముననే బ్రహ్మత్వము సాధించినాడు. యోగస్పర్శ గలవారే యోగుల కుటుంబమున జన్మింతురు. అట్లు జన్మించి యోగసిద్ధిని పొందుదురు.

నిజమునకు జీవులు మరణ సమయమునకు ఏ యే వాసనలు కలిగియుందురో ఆయా వాసనల పరితృప్తికై తదనుగుణ మైన వాతావరణమున మరల జన్మింతురు. అట్లే యోగవాసన ప్రబలముగ నుండగ మరణించినవారు యోగుల కుటుంబమున జన్మింతురు. గుఱ్ఱమునకు గుఱ్ఱము, గాడిదకు గాడిద పుట్టుట ప్రకృతి విధానము. కాకికి కోకిల పుట్టదు. కోకిలకు కాకి పుట్టదు. శుభవాసనలు గలవారు శుభంకరమగు గృహములలో జన్మింతురు. అశుభ వాసనలు గలవారు అట్టి వాసనలు గల కుటుంబములలో జన్మింతురు. సామాన్యముగ శుభాశుభ మిశ్రమముగ వాసన లుండును. కావున అట్టి కుటుంబములో జన్మించుట జరుగును. ముందు జన్మలు ఉత్తమముగ నుండవలెనన్నచో, శుభ వాసనల నాశ్రయించుట కర్తవ్యమై నిలచును. అట్లే యోగుల కుటుంబము లలో జన్మించుట కూడ పూర్వ వాసనలను బట్టి యుండును.

42

ఆత్మ సంయోగము

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికమ్ ।
యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥ 43

పూర్వజన్మము నందు బుద్ధితో సంయోగము చెందుటకు ప్రయత్నము జరుగుట వలన ఈ జన్మలో బుద్ధి సంయోగము పొందుటకు వలసిన వాతావరణమునందు జన్మించి, సిద్ధికొరకు యోగ సాధకుడు ప్రయత్నము సాగించును.

యోగుల కుటుంబమునందు జన్మించుట దుర్లభమని, ఉత్తమోత్తమ మని, అత్యంత శ్రేయస్కరమని తెలిపిన భగవానుడు, అట్టి యోగుల కుటుంబమున పుట్టుట కేవలము యోగపరమగు పూర్వజన్మ సంస్కారమును సంసిద్ధిగ పొందుటకే. పూర్వజన్మమున అసంపూర్తిగ మిగులునట్టి ప్రయత్నము ఉత్తర జన్మమున కొన సాగును. పూర్వజన్మ సంస్కారము వలననే ఈ జన్మయందు అవకాశము మరల లభించినది. కనుక ఈ జన్మమున పూర్ణసిద్ధి కొరకు అతడు తప్పక ప్రయత్నించును. మహారాష్ట్రమున పుండరీ

కుని కథ, ఆంధ్రమున వేమనకథ ఈ సందర్భమున ఉదాహరణ ముగ చెప్పుకొనవచ్చును. వారిరువురును పూర్వ జన్మమున యోగ సంస్కారముతో పాటు కొంత స్త్రీ కామ సంబంధితమైన సంస్కారము కూడ మిగిలినది. తత్కారణముగ తరువాత జన్మలో యోగుల కుటుంబమున జన్మించి, భోగ విషయైక సంపర్కమున తదను గుణమైన మిథ్యను గ్రహించి, ఆ సంస్కార మంతము కాగ యోగ సంస్కారముననే నిలచి సిద్ధిని పొందిరి.

అజామీళుని కథకూడ దైవస్మరణతో మరణించినవారు మరు జన్మలలో ఆ సంస్కారములు వెంటరాగా, వరుసగ కొన్ని జన్మలలో యోగసిద్ధి చెందుదురని సూచించును. అజామీళుడా జన్మయందు 'నారా' శబ్దము పలుకుచు మరణించెను. మరు జన్మలలో ఉత్తమోత్తమ మగు త్రివేణి సంగమ తీరమునందు జన్మలు పొంది, దైవీ సంస్కారమును పెంపొందించుకొనుచు సాగెను. కొద్ది జన్మలలోనే సిద్ధి పొందెను.

కావున జీవుల వెంటవచ్చు సంస్కారములలో దైవీ సంపర్క సంస్కారము జీవుని వెంటనంటి అతనిని కడతేర్చును. ఇతర సంస్కారములు మార్గమున నశించును. కావున మనసును బుద్ధితో చేర్చుచు పరిశుద్ధము, సుగంధభరితమునగు ఆత్మ సంస్కారము కొరకై ప్రయత్నించుటయే శుభకరము. చేసిన ప్రతి ప్రయత్నము జీవునియందు వికాసము కలిగించుచునే యుండును.

ఇట్టి యోగ సంస్కారముననే జీవుడు మరణమును దాటి, తా నెవరో తనకు తెలిసి, చిరంజీవియై నిలచి, జగత్కల్యాణ కారక మగు దివ్య ప్రణాళికలో అంతర్భాగమై శాశ్వతముగ నిలచి యుండును. దీనికొరకే బుద్ధియోగము, అటుపైన ఆత్మయోగము ఆవశ్యకమైనవి. ఇట్టి శాశ్వతత్వమునిచ్చు విద్య మానవులకే సాధ్యము. కనుక మానవుడు తన కందివచ్చిన నరజన్మమును, మనో యింద్రియ శరీరముల పరితృప్తి కొరకు వ్యర్థము చేయరాదు. జీవుడు పశుజన్మ లెత్తునపుడు ఇంద్రియ పరితృప్తి, శరీర పరితృప్తి చాలకాలము సాగించును. బుద్ధి పరితృప్తి, ఆత్మ పరితృప్తి కొరకే నరజన్మ ప్రకృతి అందించును. ఆత్మ సంయోగము జరిగినపుడే నరజన్మ సార్థక్యమగును. అట్టి ప్రయత్నము జరుగుచున్న తడ వంతయు ప్రకృతి నరజన్మ మందించగలదు. క్రమముగ ఉత్త మోత్తమ జన్మలు కూడ తనవంతు సహకారముగ అందించగలదు. దైవమిచ్చిన కర్మ జ్ఞాన సన్యాస సూత్రములను నిత్య జీవనమందు పాటించుచు, యతచిత్తుడై, మనస్సును బుద్ధిపై నిలపి బుద్ధితో సంయోగము చెంది, ఆ పిమ్మట బుద్ధియందు నిలచి, ఆత్మ సంయోగమునకు కృషి సలిపి ఆత్మయై నిలువవలెను. అపుడు ఆత్మ, బుద్ధి, మనసు, ఇంద్రియములు, శరీరము సూత్రమున కెక్కించిన మణులవలె ఒక మాలగ ఏర్పడును. అపుడు జీవుడు సమర్థుడై, సంపూర్ణుడై ప్రకాశించును.

43

యోగాభ్యాస సంస్కారములు

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః ।
జిజ్ఞాసు రపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥ 44

క్రమముగ పూర్వ యోగాభ్యాస సంస్కారములు జన్మ జన్మలకును బలపడుచుండగ, యోగాభ్యాసి తదభ్యాసవశముచే యోగవిద్య వైపునకు బలముగ ఈడ్వబడును. అట్టి జిజ్ఞాసువు వేదోక్తమగు కర్మలను అప్రయత్నముగనే నిర్వర్తించును. కర్మ లంటని రీతిని ప్రవర్తించును.

జన్మల తరబడి యోగాభ్యాసము చేసిన సాధకుడు క్రమముగ నిష్కామ కర్మయోగము నందు నిపుణుడై వర్తించును. ఫలమం దాసక్తి లేక, వక్రబుద్ధి లేక త్రికరణశుద్ధిగ తనవంతు కర్తవ్యమునే నిర్వర్తించుట, ఇతర విషయముల జోలికి పోకుండుట, అట్టివానికి సహజ లక్షణమై యుండును. పరహితము, దాన ధర్మములు సహజ ముగ నుండును. ధ్యానము నందు ఆసక్తి మెండుగ నుండును. ఇష్టాయిష్టములు తీవ్రముగ నుండవు. వీనికి కారణము పూర్వ

కృషియే. పూర్వకృషియే ప్రస్తుతమున తదనుగుణమైన సిద్ధినిచ్చి మార్గము సుగమము చేయును. చిన్నతనము నుండియే తన ప్రవర్తనమునందు ఈ వైశిష్యము కన్పట్టుచుండును. అట్టివాడు సంస్కారపరముగ వేదోక్త కర్మానుష్ఠానమును అతిక్రమించి యుండు నని శ్రీకృష్ణుడు చెప్పుటలో అంతరార్థము పై తెలిపిన సత్యమే.

"శబ్ద బ్రహ్మ అతివర్తతే" అనగ వేదోక్త కర్మానుష్ఠానమును అతిక్రమించును అని అర్థము. ఇచట అతిక్రమణ మనగ దాటుట అని అర్థముగాని, నిర్లక్ష్యము చేయుట, నిర్వహింపకుండుట, వ్యతిరేకించుట కాదు. జీవకోట్లు ఫలముల నాశించి కర్మబద్ధత్వము కలిగి యుందురు. ఫలములకై వక్రగతులు అనుసరింతురు. పొందిన ఫలములందు మోహముచే తగులుకొని యుందురు. ఇట్లు అవిద్యావరణముననే జన్మ పరంపరలు సాగుచుండును. యోగ కారణమున జీవుడు క్రమబద్ధముగ తారణము చెందుచు కర్మ ఫలములను ఆశ్రయించక కర్మలను శుద్ధిగ నిర్వర్తించు స్థితికి చేరును. అతని ప్రవర్తనమున కర్మ జ్ఞాన సన్యాస యోగ సూత్రములు ప్రకటితమగు చుండును. అట్టివాడు కర్మలచే బంధింపబడడు. బంధము లేక కర్మలను నిర్వర్తించు చుండును. యోగ మార్గమున ఇట్టి స్థితికి చేరిన సాధకుడు, ఆత్మ సంయోగమునకు అతి చేరువలో నిలచును. ఇట్లు జన్మల తరబడి యోగవిద్యాభ్యాసము సాగును. ఇట్టివాడు సాంఘిక సంప్రదాయ తీరములను కూడ దాటుట సున్నితముగ జరుగును.

44

యోగ సంసిద్ధి

ప్రయత్నా ద్యతమానసు యోగీ సంశుద్ధకిల్బిషః ।
అనేకజన్మ సంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్ ॥ 45

యత మానసుడై జన్మల తరబడి ప్రయత్నము చేయుచున్న యోగాభ్యాసి కిల్బిషము లన్నియు హరింపబడగ, సంశుద్ధుడై యోగ సంసిద్ధిని చెంది తరించును.

శ్రీకృష్ణుడు తెలుపుచున్న యోగవిద్య జీవులకు జన్మజన్మల అభ్యాసముగ సాగునని అంతకంతకును స్పష్ట మగుచున్నది. క్రమ బద్ధముగ నేర్చు యోగవిద్య సిద్ధించుటకు ఎన్ని సంవత్సరములు పట్టినను భయము లేదు. అభ్యాసము ఆరోహణ క్రమమున సాగవలెను. యోగాభ్యాసము సాగుచుండగ జీవుని అంతఃకరణ బహిఃకరణములు పరిశుద్ధి చెందవలెను. వాని నడుమ సంయమ మేర్పడవలెను. కర్మ; కర్తవ్య కర్మమే కావలెను. కామ్యకర్మ కారాదు. కర్మలం దాసక్తి జనించుట కూడ తరింపబడవలెను. అహింస, ఆస్తేయము, అపరిగ్రహము ఆదిగా గల గుణములు సహజమై

యుండవలెను. దానధర్మాదులు దినచర్యలో భాగమై పోవలయును. ఇష్టాయిష్టములు కరుగవలెను. ఇత్యాది అంశములు సిద్ధించుటకు జన్మలు పట్టుటలో ఆశ్చర్యము లేదు. పతంజలి మహర్షి తెలిపిన యమ నియమ, ఆసన, ప్రాణాయామాది సూత్రములు, శ్రీకృష్ణ భగవానుడు తెలిపిన కర్మ జ్ఞాన సన్యాస సూత్రములు సిద్ధించుటకు కొన్ని జన్మల పరంపర సాగవచ్చును. కాని ఇవి యన్నియు యోగ మార్గమున సార్థకత నిచ్చునవి, సాఫల్యతను కలిగించునవే.

జీవుని స్వభావములో అనేకానేక జన్మ పరంపరల వాసన లుండును. అట్టి వాసన లన్నియు ఒక్కమారుగ పోవుటకు వీలు పడదు. క్రమ క్రమముగ శుభవాసన లేర్పడి అశుభ వాసనలు తొలగింపబడి జీవుడు ముందుకు సాగును. అతనియందలి భయము, కామము, క్రోధము, మోహ లోభములు, ఈర్ష్య అసూయలు, మదమాత్సర్యములు ఇత్యాది వాసనలను- యోగ సూత్రములను దీర్ఘకాలము అభ్యసించుట ద్వారా మాత్రమే నిర్మూ లింప వచ్చును. అభ్యాసము సాగుతున్నంతకాలము శుద్ధి ఏర్పడుచు నుండును. అశుద్ధి నుండి బయల్పడును. ఇట్లు సంయత్ శుద్ధిని చేరుసరికి సాధకుడు చాల దృఢచిత్తుడై తన మూలముతో యోగము చెందుటకు సంసిద్ధుడు కాగలడు. కనుక యోగము అనేక జన్మల సంసిద్ధి అని తెలియవలెను.

45

యోగీభవ

తపస్విభ్యోஉధికో యోగీ జ్ఞానిభ్యోஉపి మతోஉధికః ।
కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భవార్జున ॥ 46

యోగినా మపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః॥ 47

తపస్సు చేయువారి కంటెను, జ్ఞానుల కంటెను, ఉత్తమోత్తమ కర్మలు చేయువారి కంటెను యోగి అధికుడు. కావున ఓ అర్జునా! నీవు యోగివి కమ్ము.

శ్రీకృష్ణుడు యోగి యొక్క ఉత్తమ స్థితిని తెలుపుచున్నాడు. తపస్సులు చేయువారు, జ్ఞానులు, శ్రేష్ఠమగు కర్మల నాచరించు వారు లోకమునందు అధికులుగ భావింపబడుదురు. కాని వారి యందు సమభావము, సమదర్శనము, సమతుల్యము నుండుట అరుదుగ నుండును.

తీవ్ర తపస్సులు చేసి దైవానుగ్రహము పొందినవారు కూడ

సమదర్శనులు కాక ప్రవర్తించు సన్నివేశములున్నవి. కోపాద్రిక్తతతో శపించిన తపస్విజనులు కలరు. తపస్విజనులు శక్తివంతు లగుదురు. మహిమలు కలిగి యుందురు. కాని మట్టిని, బంగారమును, పాపిని, పుణ్యుని, ఏనుగును, దోమను, రాజును, బంటును చూచినపుడు సమదృష్టి లేక వైవిధ్యమును చూపుదురు. ప్రత్యేకించి పాపులను చూచునపుడు ఉదాసీనులై యుండలేరు. హీనులను చూచునపుడు నిరసించుట కూడ జరుగును. యోగులు అట్టివారందరి యెడల ఉదాసీనులై యుందురు. శ్రీకృష్ణుడు యోగేశ్వరుడు. అతడు తన జీవితమున దుర్వాసుడు, విశ్వామిత్రుడు, కణ్వుడు ఇత్యాది తపస్వి జనులను చూచెను. వారి ప్రవర్తనమున సమదర్శనము లేక వారు శపించినవారిని తాను కాచుట జరిగినది. తపఃశక్తి వలన అపు డపుడు సహనము కోల్పోవుట జరుగుచుండును. సమదర్శనము లేనిచో సహన ముండదు. సహనము కోల్పోయినపుడు సంయమ ముండదు. సమభావము కలుగదు. యాదవుల ప్రవర్తనకు కలత చెందిన కణ్వ విశ్వామిత్ర మహర్షులు సహనమును కోల్పోయిరి. అట్టి యాదవులతో తన జీవిత మంతయు గడిపినవాడు శ్రీకృష్ణుడు. అతడు యోగేశ్వరుడు. అట్టివారి వృద్ధికై శ్రమించినవాడు వాసు దేవుడు. అతడు యోగీశ్వరుడు. ఇట్లు యోగులు సమతుల్యమైన ప్రవర్తన కలిగియుందురు. కావున తపస్విజనుల కన్న అధికులు.

జ్ఞానులు జ్ఞానుల సాంగత్యమే కోరుదురు. అజ్ఞానుల నడుమ నుండలేరు. అవిద్యను సహించలేరు. అవిద్యావర్తనులను చూచి నపుడు వారికి (జ్ఞానులకు) చులకన భావన కలుగును. అట్టి

వారియందు కూడ ఈశ్వరు డున్నాడని మరతురు. వారు అవిద్య, అశుచిలను సహింపలేరు. శ్రీకృష్ణుడు గోపకులతో కూడి ఎంగిలి ముద్దలను తినెను. పూలమ్ముకొను వానిని శీఘ్రముగ అను గ్రహించెను. పచ్చికబయళ్ళపై పరుండెను. కాలమును దేశమును బట్టి తానున్న పరిసరములయందు, జీవుల యందు అంతర్యామిని దర్శించు సమబుద్ధి యోగుల కున్నట్లు జ్ఞానుల కుండదు. శ్రీరాముడు అడవి మనుషులతోను, కోతులతోను, అసురులతోను, ఋషులలోను ఒకే విధమగు మైత్రీభావముతో మెలగెను. అట్టివారు యోగులు. ఇటీవలి కాలమున రామకృష్ణ పరమహంస, షిరిడీ సాయిబాబ అట్టి సమదర్శనమును నెరపి యోగ మన నేమో తెలిపిరి. కుమ్మరియందు, కమ్మరియందు, మాంసము అమ్ముకొని జీవించు వారి యందు, గృహిణులయందు యోగులు గోచరింతురు. ఇట్టి యోగులు పై తెలిపిన జ్ఞానుల కన్న ఎక్కువగ హితము చేకూర్చ గలరు. అందువలన యోగు లధికులు.

ఉత్తమోత్తమ కర్మలు చేయువారు కూడ ఆ కర్మల సాఫల్య మును బట్టి కీర్తిప్రతిష్ఠలు పొందుచు వానిపై మోహము కలిగి యుందురు. సద్గుణములు కలిగి, దానధర్మాది యజ్ఞములు చేయుచు ప్రపంచపు గుర్తింపునందు సంతృప్తి చెందుచు గుహ్య మగు జీవనము లేక బాహ్యామందలి మేళములకు అలవడి జీవింతురు. అట్టి వారికిని సమభావముండదు.

యోగియందు తపస్సు, జ్ఞానము, యజ్ఞము, దానము అన్నియు ఇమిడి యుండును. కాలమును దేశమును బట్టి వానిని

నిర్వర్తించుటేగాని, నిర్వర్తింపబడు విషయములయందు తగులు కొనడు. జ్ఞాన మతనియందు భాసించుటయే గాని, జ్ఞానమున కూడ తగులుకొనక తానుగ నుండును. జ్ఞాన ప్రదర్శన నెపుడును చేయడు. అట్లే తపస్సు వలన కలిగిన శక్తుల నాశ్రయింపక వర్తించునే గాని వానిని తనకై తానుగ వినియోగింపడు. యోగి అనగా దైవముతో యోగము చెందియుండువాడు. అట్టివాని నుండి దైవమే సర్వము నిర్వర్తించును. తానుగ అతడేమియు నిర్వర్తించడు. ఇట్టి యోగస్థితి కన్న సుందరము వైభవము అగు జీవనము లేదు. అతడు తన కొరకు గాక దైవము కొరకు, దైవమునందు వసించి యుండును. అట్టి యోగికన్న దైవమునకు ప్రియు డెవ్వరును లేరు. యోగి అనగ భక్తుడే. దైవముతో విభక్తి లేక యుండును. అతని యందు జ్ఞానము భాసించును. మహత్తరమగు కార్యములు జరుగును. ఈ రహస్యములు తెలియుటకే రామాయణమున సుందరకాండము ఈయబడినది. హనుమంతుడు పరులు గుర్తింప లేని మహాయోగి. హనుమంతుని జీవితము తనకొరకు జీవింపబడ లేదు. దైవము కొరకే తన ఉనికి. అతడు సహజయోగి. అతని యందు నాలుగు వేదములు భాసించును. అతనిని మించిన జ్ఞాని లేడు. కాని అతడు జ్ఞానమునకు తగులుకొని యుండడు. అతడు మహత్తరమగు కార్యములను నిర్వర్తించెను. అతడు సాధించిన కార్యములు అనితర సాధ్యము. కాని వానిని గూర్చిన జ్ఞప్తి కూడ అతనికి ఉండదు. అతడు నిత్య తపస్వి. విశ్వాత్మ రాముని చింతనలో తనను తాను మరచి యుండును. తాను భక్తుడనని, యోగినని,

జ్ఞానినని, శక్తివంతుడనని భావింపడు. తన భావన, తను భావన లేక కేవలము బ్రహ్మము వలె వసించి యుండును. శ్రీకృష్ణుడు అర్జునునకు యోగమును బోధించు సమయమున అర్జునుని రథముపై జెండావలె యుండెను. అధర్మమునకు ప్రతికూలముగ, ధర్మమునకు అనుకూలముగ వాయువులను ప్రసరింపజేసి అర్జును నకు తోడ్పడెను. అతడి యునికి ఎవరు గుర్తించిరి? సహాయము పొందినవారు కూడ గుర్తింపలేని రీతులలో సహాయము చేయు మహాయోగి. అట్టివాడు కృష్ణుడు అర్జునునికి బోధించినపుడు అచటనే యున్నాడు. అతని యునికి కృష్ణునికే తెలుసును. యోగు లను గూర్చి ఎంత వివరించినను అది అసంపూర్ణమే యగును. అందువలన శ్రీకృష్ణుడు అర్జునునికి జీవిత గమ్యమును నిర్వచించి మార్గమును నిర్దేశించెను.

ఆత్మ సంయమ యోగము అను ఈ ఆరవ అధ్యాయము ధ్యాన యోగమని పిలుతురు. ఆత్మ సంయమమునకు వలసిన సూత్రము లన్నియు ఈ ఆరు అధ్యాయములయందు భగవంతుని పలుకులుగ తెలుపబడినవి. ఇవి అత్యంత గంభీరములు. ఇందలి రహస్యము లన్నియు శ్రద్ధ గలవారికి గోచరింపగలవు. వానిని భక్తి శ్రద్ధలతో అభ్యసించువాడు తప్పక యోగి కాగలడు. ఈ సూత్రములు ఆచరణకే గాని పారాయణకు కాదు. ఆచరించినవారు తరించుట తథ్యము. ఆచరించని వారు తరించకుండుట కూడ తథ్యము.

గీతా సూత్రములను అవగాహన చేసుకొనుట, ధీరతతో ఆచ రించుట తరుణోపాయము. ఈ సూత్రముల వైశిష్యము లెక్క

చేయక దొడ్డిదారులలో గమ్యమును చేరవలెనని భావించువారు తమకు తాము మోసగించుకొనువారు.

కర్మము సుళువు తెలిసి కర్మమున నిలచి, దానముల విలువ తెలిసి, దానధర్మాదుల నాచరించుచు, ద్వంద్వముల మాయ తెలిసి వానియందు సమ్యక్ న్యాసము చెంది, తద్వారమున యతచిత్తుడై బుద్ధిని చేరి, బుద్ధియను వెలుగు మూలమును ధారణచేసి, ధ్యానించి ఆత్మగ తనను తాను తెలియుట ఈ మొత్తము సాధన. క్రమము నంతయు విపులముగ, విశిష్టముగ దైవ మెరిగించినాడు. కావున ఈ ఆరు అధ్యాయములను సాధన షట్కమని పేర్కొనిరి. ఆచరించి తరించుటకు భగవద్గీతకన్న మించిన గ్రంథము ప్రపంచ ములో లేదు. ఇది ముమ్మాటికిని సత్యము. పాఠకులు గ్రహించి, ధీరతతో ఆచరించి తరింతురు గాక!

శ్రీమద్భగవద్గీత యందలి 6వ అధ్యాయము
'ధ్యాన యోగ' వివరణము
సంపూర్ణము.

Dhanistha Publications

OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.

1.	Agni (E/G/S)	60-00
2.	Amanaskudu (T/K)	18-00
3.	Antardarsana Dhyanamulu (T)	100-00
4.	Anveshakudu (T)	60-00
5.	Asangudu (T)	15-00
6.	Ashram Leaves (E/G/S)	100-00
7.	Ayurvedic Principles (E)	
8.	Bharateeya Sampradayamu (T/Hi)	10-00
9.	Cow ('Govu' Mahatyam Vivarana) (E/T/K)	20-00
10.	Devapi Maharshi Bodhalu (T/Hi)	60-00
11.	Dhanakamuni Katha (T)	25-00
12.	Doctorine of Eternal Presence (E)	10-00
13.	Gayatri Mantra - Avagahana (T)	10-00
14.	Geetopanishad - Gnana Yogamu (T)	25-00
15.	Geetopanishad - Karma Yogamu (T)	20-00
16.	Geetopanishad - Sankhya Yogamu (T)	25-00
17.	Geetopanishad - Karmasanyasa Yogamu (T)	20-00
18.	Good Friday (E/G/S/F/H)	10-00

19	Gurupaduka Sthavam (E)	
20.	Health & Harmony (E)	120-00
21.	Hercules-The Man and the Symbol (E/G/S/F)	100-00
22.	Himalaya Guru Parampara (T/Hi)	12-00
23.	Jupiter-The Path of Expansion (E/G/S)	40-00
24.	Jyotirlinga Yatra (T)	20-00
25.	Katha Deepika (T)	40-00
26.	Listening to Invisible Master (E/G/S/F/H)	20-00
27.	Lord Maitreya-The World Teacher (E/G/S/F/H)	
28.	Maitreya Maharshi Bodhalu (T/Hi)	60-00
29.	Mana Mastaru Garu (T)	60-00
30.	Mantrams-Their Significance and Practice (E/G/S)	35-00
31.	Maria Magdalena (E/S/G/F)	
32.	Marriage-A Sacrament (E)	
33.	Maruvu Maharshi Bodhalu (T/Hi)	60-00
34.	Master C.V.V. (Birthday Message) (T)	30-00
35.	Master C.V.V. Noothana Yogamu (T)	20-00
36.	Master C.V.V. Yogamu (T)	20-00
37.	Master C.V.V. Yogamu-Karma Rahityamu (T)	10-00
38.	Master C.V.V. - May Call !(E/G/S)	100-00
39.	Master C.V.V. - May Call ! II (E)	100-00

40.	Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror (E)	15-00
41.	Master C.V.V. - Saturn Regulations	125-00
42.	Master E.K. - The New Age Teacher (E/G/S)	70-00
43.	Mithila-A New Age Syllabus (E/G/S)	100-00
44.	Occult Meditations (E/G/S)	100-00
45.	Omkaram (T)	30-00
46.	On Change (E/G/S)	50-00
47.	On Healing (E/G/S)	100-00
48.	On Love (E/G/S)	50-00
49.	On Service (E/G/S)	50-00
50.	On Silence (E/G/S)	50-00
51.	Pranayamam (T)	10-00
52.	Prayers (E/G/S)	100-00
53.	Rudra (E/G/S)	30-00
54.	Sankhya - The Sacred Doctrine (E/G/S)	75-00
55.	Saraswathi - The Word (E/G/S)	60-00
56.	Saturn-The Path of Systematised Growth (E/G/S)	40-00
57.	Shodasopachara Pooja - Avagahana (T)	10-00
58.	Sound-The Key and its Application (E/G/S)	40-00
59.	Spiritualism - Business and Management (E/G/S)	25-00
60.	Sri Dattatreya (E/G/S/T/Hi)	33-00
61.	Sri Gurupaduka Sthavam (T)	30-00

62.	Sri Krishna Namamrutham (T)	25-00
63.	Sri Lalitha-1 (T)	40-00
64.	Sri Lalitha-2 (T)	40-00
65.	Sri Lalitha-3 (T)	40-00
66.	Sri Lalitha-4 (T)	40-00
67.	Sri Lalitha-5 (T)	40-00
68.	Sri Lalitha-6 (T)	40-00
69.	Sri Sastri Garu (E/G/S/F/T/H)	40-00
70.	Sri Shiridi Sai Sayings (E/G/S/T/Hi)	80-00
71.	Steps on Silence (E)	75-00
72.	Suvarna Sopanamulu	
73.	The Aquarian Cross (E/G/S)	100-00
74.	The Aquarian Master (E/G/S)	75-00
75.	The Doctorine of Ethics (E)	35-00
76.	The Etheric Body (E/G/S)	
77.	The Path of Synthesis (E)	40-00
78.	The Splendor of Seven Hills (E/T/Hi)	15-00
79.	The Teachigs of Lord Sanatkumara	150-00
80.	The Theosophical Movement (E/G/S)	60-00
81.	The White Lotus (E/G/S)	20-00
82.	Time - The Key (E/G/S)	
83.	Uranus - The Alchemist of the Age	150-00
84.	Venus - The Path of Immortality (E/G/S)	80-00

85.	Violet Flame Invocation (E/G)	60-00
86.	Vrutrasura Rahasyam (T)	35-00
87.	Varunagraha Prabhavamu (T)	22-00
88.	Wisdom Buds (E/S)	20-00
89.	Wisdom Teachings of Vidura (E/G/S)	80-00
90.	Moon & Spiritual Astrology (S)	
91.	The Death & Reincarnation (S)	
92.	Commentary on Om Namonarayanaya (S)	
93.	Master Jesus, Life and Teachings (S)	
94.	The Science of Ayurveda & Homoeopathy (S)	
95.	The Teachings of Master D.K. (S)	
96.	The Human Constitution (S)	
97.	The Masters of Wisdom (S)	
98.	The Path of Meditation (S)	
99.	Stories for Disciples (S)	
100.	Spirituality in Daily Life (S)	
101.	Special Practices for Disciples (S)	
102.	Fundamentals of Health & Healing (S)	
103.	Ganesha, The Cosmic Lord of Groupings (S)	
104.	Astrology and Healing (S)	

DHANISHTA OTHER PUBLICATIONS

1.	Puranapurushuni Pooja Vidhanam (T)	10-00
2.	Sarannavaratra Pooja Vidhanamu (T)	30-00
3.	Sri Dattatreya Pooja Vidhanamu (T)	10-00
4.	Sri Hanuman Chalisa (T)	15-00
5.	Sri Mahalakshmi Pooja Vidhanamu (T)	12-00
6.	Sri Rama Pooja Vidhanamu (T)	10-00
7.	Sri Siva Hridayamu (T)	5-00
8.	Sri Siva Pooja (T)	15-00
9.	Sri Soukumarya Satakam (T)	10-00
10.	Sri Surya Pooja Vidhanamu (T)	7-00
11.	Sri Venkateswara Pooja Vidhanamu (T)	8-00
12.	Vinayaka Vratakalpamu (T)	25-00
13.	Vishnu Sahasranamam (T)	12-00
14.	Sri Rama Charitramu (T)	
15.	Sri Subrahmanya Pooja Vidhanamu (T)	10-00
16.	Sri Yoga Ganapathi Pooja Vidhanamu (T)	12-00



mohan PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం,
రాజమహేంద్రవరము - 533101.
ఫోన్ : 0883 - 2462565
e-mail : mohanpublications@gmail.com

మావద్ద లభించు గ్రంథములు



వ్రత కథలు - పూజలు

1.	శ్రీ వినాయక వ్రతం	వెల రూ. 10-00
2.	శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	30-00
3.	శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్యంతో)	10-00
4.	సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	30-00
5.	వరలక్ష్మీవ్రతం	10-00
6.	కేదారేశ్వర వ్రతం	10-00
7.	త్రినాధ వ్రతం(కలర్)	10-00
8.	త్రినాధవ్రతం(సాదా)	5-00
9.	క్షీరాబ్ధి వ్రతం	12-00
10.	మంగళ గౌరీవ్రతం	10-00
11.	వైభవలక్ష్మీవ్రతం ఫోటో యంత్రంతో	25-00
12.	శ్రీలక్ష్మీకుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	25-00
13.	కనకమహాలక్ష్మీవ్రతం (కామేశ్వరీపాటతో)	25-00
14.	సంతోషీమాతా వ్రతం	25-00
15.	ఏడు శనివారాల వ్రతం	25-00
16.	సత్యనారాయణవ్రతం	25-00
17.	శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	30-00
18.	శివదీక్ష	10-00
19.	కాత్యాయనీ వ్రతం	20-00
20.	సౌభాగ్య గౌరీవ్రతం	20-00
21.	తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	36-00
22.	స్త్రీల వ్రతకథలు	36-00
23.	స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారు)	54-00
24.	పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో)	36-00
25.	సర్వదేవతా పూజావిధానం	25-00
26.	ఆరువ్రతాలు	30-00
27.	రాహుకాలంలోదుర్గాదేవీపూజా	10-00
28.	తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	10-00
29.	శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	36-00
30.	శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	36-00

31. లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	10-00
32. శ్రీ సరస్వతీ నిత్యపూజ	10-00
33. శ్రీ దుర్గానిత్యపూజ	10-00
34. కాలభైరవ నిత్యపూజ	10-00
35. శివపూజ	10-00
36. వీరభద్ర పూజ	10-00
37. ఆంజనేయ నిత్యపూజ	10-00
38. నాగేంద్ర స్వామి పూజ	10-00
39. సుబ్రహ్మణ్య నిత్యపూజ	10-00
40. రామదేవుని కథ	10-00
41. శివదేవుని కథ	10-00
42. లక్ష్మీనరసింహపూజ	10-00
43. వేంకటేశ్వరపూజ	10-00
44. బ్రహ్మంగారి నిత్యపూజ	10-00
45. సూర్య నిత్యపూజ	10-00
46. నవగ్రహ నిత్యపూజ	10-00
47. రుక్మిణీ కల్యాణం	25-00
48. ఉమామహేశ్వర వ్రతం	36-00
49. శ్రీ కామేశ్వరీ వ్రతం	36-00
50. 16 సోమవారముల వ్రతము	25-00
51. పార్వతీకల్యాణం	25-00
52. సహస్రకమలవర్తి వ్రతము	25-00
53. పంచముఖ ఆంజనేయ పూజావిధానము	36-00
54. అష్టనాగపూజ	36-00
55. పూజలు ఎందుకుచేయాలి ?	36-00
56. ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	36-00
57. ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	36-00
58. ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	36-00
59. ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	36-00
60. హనుమద్ వ్రతం	36-00
61. పంచాయతన పూజ	63-00
62. 28 వ్రతములు	120-00
63. కలశపూజలు (9ఒకేసారి)	150-00
64. కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో)	....
65. హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో)	....
66. గోమాత	40-00



స్తోత్రాలు సహస్రనామములు

1.	శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	45-00
2.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	50-00
3.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	50-00
4.	స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	99-00
5.	లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి	63-00
6.	స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్	108-00
7.	సర్వదేవతా స్తోత్రమంజరి	120-00
8.	సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	24-00
9.	విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	25-00
10.	లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్)	36-00
11.	లలితా సహస్రనామములు	24-00
12.	లక్ష్మీ సహస్రనామములు	24-00
13.	దుర్గా సహస్రనామములు	24-00
14.	ఆంజనేయ సహస్రనామములు	24-00
15.	శివ సహస్రనామములు	24-00
16.	విష్ణు సహస్రనామములు	24-00
17.	గణపతి సహస్రనామములు	24-00
18.	సుబ్రహ్మణ్య సహస్రనామములు	24-00
19.	గాయత్రి సహస్రనామములు	24-00
20.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	24-00
21.	శ్రీరామా సహస్రనామములు	24-00
22.	సరస్వతి సహస్రనామములు	24-00
23.	సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం	24-00
24.	శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	24-00
25.	మణిద్వీపవర్ణన (పెద్దది)	24-00
26.	సంధ్యావందనం	24-00
27.	మంత్రపుష్పమ్	....
28.	త్రిభాషా హనుమాన్‌చాలీసా	15-00
29.	హనుమాన్ చాలీసా	10-00
30.	మణిద్వీపవర్ణన (పాకెట్)	10-00
31.	ఆరు చాలీసాలు	10-00
32.	శివారాధన (శివస్తోత్రాలు)	10-00
33.	వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	10-00
34.	ఆరుదండకాలు	5-00
35.	వేంకటేశ్వర గోవిందనామములు	5-00

36.	అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	10-00
37.	దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో)	10-00
38.	సుందరకాండ (పాకెట్)	10-00
39.	భగవద్గీత మూలం	27-00
40.	రామరక్షాస్తోత్రమ్	15-00
41.	స్తోత్ర రత్నావళి	36-00
42.	పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
43.	పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
44.	పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	10-00
45.	పురాణపండ ఆదిత్య హృదయం	10-00
46.	మంత్రపుష్పం (మినీ)	10-00
47.	శివానందలహరి-సౌందర్యలహరి	36-00
48.	కుజదోషం	10-00
49.	కాలసర్ప దోషం	10-00
50.	మీ అప్పులు తీరాలా?	10-00
51.	దృష్టిదోషాలు నివారణ	10-00
52.	పంచసూక్తములు	10-00
53.	సంధ్యావందనం	10-00
54.	రుద్రనమకమ్-చమకమ్	10-00
55.	గాయత్రీమంత్రాలు	10-00
56.	హయగ్రీవ స్తోత్రమాల	10-00
57.	దక్షిణామూర్తి స్తోత్రమాల	10-00
58.	ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో	10-00
59.	శ్రీసూక్తం పురుష సూక్తం	10-00
60.	నవగ్రహస్తోత్రమాల	36-00
61.	మహాన్యాసమ్	36-00
62.	సుందరకాండ గానామృతం	36-00
63.	గోమాతపూజావిధానము	10-00
64.	ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల	108-00
65.	ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి	108-00
66.	ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల	108-00
67.	శ్రీ కాలభైరవ రక్షా కవచమ్	63-00
68.	అర్చన	40-00
69.	నిత్యదేవతార్చన	40-00
70.	సర్వదేవతా స్తోత్ర నిధి	99-00
71.	శ్రీచక్ర నవవరణార్చన	63-00
72.	చండీ సప్తశతి పారాయణ క్రమం	99-00
73.	శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో	99-00
74.	వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్	63-00
75.	శ్రీ కాలభైరవ వ్రతము	63-00



శ్రీ సాయి దత్త గ్రంథములు

1.	శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	120-00
2.	సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	120-00
3.	శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	120-00
4.	శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	63-00
5.	శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	63-00
6.	నవనాథ చరిత్ర	99-00
7.	శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
8.	శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
9.	సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో	30-00
10.	అనఘాదేవీ వ్రతం	30-00
11.	భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	30-00
12.	శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	25-00
13.	శ్రీ సాయిభజనమాల	20-00
14.	శ్రీ సాయి భజన్స్	20-00
15.	శ్రీ సాయిభక్తి గీతాలు	20-00
16.	శిరిడిహారతులు (భావంతో)	20-00
17.	"శ్రీసాయి"కోటి	27-00
18.	"శ్రీసాయిరామ్"కోటి	20-00
19.	శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	10-00
20.	శ్రీ సాయివేయినామాలు	8-00
21.	శ్రీ సాయి హారతులు (పాకెట్)	15-00
22.	శ్రీ సాయి స్తవనమంజరి	10-00
23.	హిందీ శ్రీ సాయి హారతులు	15-00
24.	శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	63-00
25.	ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	15-00
26.	షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	99-00
27.	సాయిసత్యవ్రతం	30-00
28.	సాయి అనుగ్రహమ్	120-00
29.	నవగురువారాల వ్రతకల్పము	15-00
30.	శ్రీదత్తలీలామృతము	99-00
31.	హృదయంలో సాయి	15-00
32.	శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్చరిత్ర)	120-00
33.	గజాననమహరాజ్ చరిత్ర	99-00



జ్యోతిషాలు

1. 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	72.00
2. **గ్రహభూమి పంచాంగము** (గార్గేయ)	108.00
3. **ఆనందసిద్ధి పంచాంగం** (వై.వి.శాస్త్రి)	63.00
4. **ములుగు వారి రాశిఫలితాలు** (12రాశులువారికి)	45.00
5. **ములుగు వారి రాశిఫలితాలు** విడివిడిగాఒక్కొక్కటి	12.00
6. కాలచక్రంజ్యోతిషక్యాలండర్	30.00
7. **గ్రహబలం క్యాలండర్** (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	30.00
8. **శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్**	30.00
9. సాదా క్యాలండర్	5.00
10. పాకెట్ క్యాలండర్	15.00
11. తాజకనీలకంఠీయమ్	100-00
12. కేరళ జ్యోతిష రహస్యాలు	180-00
13. జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	180-00
14. మానసాగరి జాతకపద్ధతి	180-00
15. వరాహమిహిర జాతకపద్ధతి	180-00
16. వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	99-00
17. సింపుల్ రెమిడీస్	180-00
18. శంభు హోరప్రకాశిక	250-00
19. పూర్వ పరాశరి	100-00
20. పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200-00
21. ప్రశ్న సింధు	99-00
22. నక్షత్ర విశేష ఫలితాలు	63-00
23. సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా?	180-00
24. దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా?	180-00
25. ఆయుర్దాయ నిర్ణయం	63-00
26. జాతక గణిత ప్రవేశిక	63-00
27. జ్యోతిషమర్మబోధిని	63-00
28. జ్యోతిష ప్రశ్నోత్తరమాల	63-00
29. ముహూర్తం నిర్ణయించడంఎలా?	63-00
30. జాతక మకరందం	63-00
31. జ్యోతిష సరస్వతి	63-00
32. మీజననకాల విశేషాలు	63-00
33. ముహూర్త విజ్ఞాన భాస్కరం	63-00
34. జ్యోతిష స్వయంబోధిని	63-00
35. శుభముహూర్త శిరోమణి	63-00
36. నక్షత్ర ఫలమంజరి	36-00
37. పంచాంగం చూసే విధానం	36-00
38. సర్వార్థ జ్యోతిషం	36-00
39. ప్రాథమిక జ్యోతిషం	36-00
40. నవరత్నములు శుభయోగములు	36-00

41. శుభశకునాలు	30-00
42. హస్తరేఖాఫలితాలు	36-00
43. సంఖ్యల్లో భవిష్యత్	36-00
44. ముహూర్త దీపిక	99-00
45. పుట్టుమచ్చలు ఫలితాలు	30-00
46. కలలు ఫలితాలు	30-00
47. జాతక చక్రం వేయడం ఎలా?	36-00
48. మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250-00
49. జ్యోతిషశాస్త్ర చిట్కాలు	120-00
50. గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050)	999-00
51. ప్రశ్నచండేశ్వరమ్	63-00
52. ద్వాదశభావ ఫలచంద్రిక	250-00
53. జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	120-00
54. అంగసాముద్రికం	36-00
55. హస్త సాముద్రికం	63-00
56. లాల్ కితాబ్	99-00
57. శకునశాస్త్రం	63-00
58. ఆధునికప్రశ్నశాస్త్రం	120-00
59. పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	180-00
60. అష్టకవర్గు (కొండపల్లి)	63-00
61. బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	250-00
62. లగ్నరత్నాకరం	63-00
63. షట్పంచాశిక	120-00
64. 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	270-00
65. 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	180-00
66. 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	180-00
67. 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	270-00
68. 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి	250-00
69. మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి)	270-00
70. కె.పి.జ్యోతిషం (పరిచయం)	63-00
71. ముహూర్తచింతామణి	99-00
72. సూర్యచంద్ర గ్రహణములు	63-00
73. ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	180-00
74. అదృష్టరెమెడీస్	144-00
75. గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	63-00
76. జ్యోతిష రెమిడీస్	300-00
77. జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
78. జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
79. నాడీజ్యోతిషం	63-00
80. నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00

81. లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
82. గౌతమసంహిత	63-00
83. హోరరత్నమాల	63-00
84. జాతకఫల మణిమంజరి	200-00
85. పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25)	560-00
86. దశాభుక్తిఫల నిర్ణయం	250-00
87. వింత జోష్యములు	63-00
88. షోడశవర్గులు	200-00
89. రవిగ్రహ సమస్త ప్రభావములు	99-00
90. చంద్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
91. కుజ గ్రహ సమస్త ప్రభావములు	99-00
92. బుధ గ్రహ సమస్త ప్రభావములు	99-00
93. గురు గ్రహ సమస్త ప్రభావములు	99-00
94. శుక్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
95. శని గ్రహ సమస్త ప్రభావములు	99-00
96. రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు	99-00
97. ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు	99-00
98. ముహూర్తమార్తాండం	63-00
99. లఘుజాతకం	63-00
100. జాతకాలంకారము	63-00
101. మేషలగ్న ఫలితములు	99-00
102. వృషభ లగ్న ఫలితములు	99-00
103. మిథున లగ్న ఫలితములు	99-00
104. కర్కాటక లగ్న ఫలితములు	99-00
105. సింహలగ్న ఫలితములు	99-00
106. కన్యలగ్న ఫలితములు	99-00
107. తుల లగ్న ఫలితములు	99-00
108. వృశ్చిక లగ్న ఫలితములు	99-00
109. ధనుస్సు లగ్న ఫలితములు	99-00
110. మకర లగ్న ఫలితములు	99-00
111. కుంభ లగ్న ఫలితములు	99-00
112. మీన లగ్న ఫలితములు	99-00
113. నారద సంహిత	200-00
114. పంచాంగపీఠికలేఖికాగణితం	250-00
115. తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప)	99-00
116. సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా)	200-00
117. రాహు కేతువుల యోగము	99-00
118. ఛాయాగ్రహములు	99-00
119. జ్యోతిషవిజ్ఞాన దీపిక	63-00

బి.వి.రామన్ గారి గ్రంథములు

120. జ్యోతిష విద్యారంభం	50-00
121 గ్రహభావ బలములు	50-00
122. కాలచక్రదశ	50-00
123. అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50-00
124. జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50-00
125. పురోగామి జాతకం	50-00
126. భావార్థరత్నాకరం	75-00
127. భారతీయజ్యోతిష సర్వస్వం	75-00
128. అష్టకవర్గ పద్ధతిః	75-00
129. జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75-00
130. ప్రశ్నతంత్ర	75-00
131. ముహూర్తం	75-00
132. విశిష్ట జాతకములు	125-00
133. భారతీయఫలితజ్యోతిషం	125-00
134. 300 ముఖ్యమైన యోగములు	125-00
135. జాతకంపరిశీలించడంఎలా ?	300-00

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

136. బృహత్పరాశరహోరాశాస్త్రము-1	200-00
137. బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200-00
138. బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200-00
139. బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200-00
140. భావార్థరత్నాకరము	100-00
141. ముహూర్త చింతామణి	100-00
142. ముహుర్త చింతామణి-పార్టు2	200-00
143. స్వప్న శాస్త్రము	36-00
144. శతయోగమంజరి	50-00
145. వ్రతనిర్ణయకల్పవల్లి	250-00
146. దైవజ్ఞవల్లభం	75-00
147. వసంతరాజశకునమ్ (బృహత్‌శకునశాస్త్రం)	250-00
148. వాస్తుశాస్త్రవివేకము-1	100-00
149. వాస్తుశాస్త్రవివేకము-2	200-00
150. వాస్తుశాస్త్రవివేకము-3	100-00
151. వాస్తుశాస్త్రవివేకము-4	200-00
152. అనుభవసులభవాస్తు - 1	50-00
153. అనుభవసులభవాస్తు - 2	100-00
154. పంచాంగ వివేకము	99-00
155. వశిష్ఠ సంహిత	360-00
156. పంచపక్షి శాస్త్రం (కేస్‌బైండ్)	200-00



వాస్తులు

1.	40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180-00
2.	వాస్తుశాస్త్ర రహస్యములు	200-00
3.	వాస్తునుబట్టి మీ ఇల్లు	63-00
4.	మీరూ మీ వాస్తు	63-00
5.	గృహవాస్తు చిట్కాలు	63-00
6.	వాస్తు పూజ	63-00
7.	వాస్తు సూత్రములు	63-00
8.	వాస్తుశాస్త్ర రహస్యాలు	63-00
9.	గృహవాస్తు వర్గులు	99-00
10.	విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	63-00
11.	విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు	99-00
12.	విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా)	180-00
13.	ఆధునిక గృహవాస్తు	99-00
14.	శుభవాస్తు	270-00
15.	వాస్తుయంత్ర రత్నావళి	120-00
16.	వాస్తుశాస్త్రం	120-00
17.	హౌస్ ప్లాన్స్	63-00
18.	గృహనిర్మాణ వాస్తు	63-00
19.	వాస్తు రెమెడీస్	63-00
20.	గృహవాస్తు దర్పణం	63-00
21.	జ్యోతిష-గృహవాస్తుచంద్రిక	200-00
22.	వాస్తురత్నాకరం (కొండపల్లి)	63-00
23.	వాస్తుశిరోమణి ,,	120-00
24.	వాస్తుసంగ్రహమ్ ,,	63-00
25.	పంచవాస్తు పారిజాతం ,,	120-00
26.	వాస్తుడిండిమమ్ ,,	63-00
27.	వాస్తుదుందిభి ,,	120-00
28.	విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్)	250-00
29.	కృష్ణవాస్తుశాస్త్రము	63-00
30.	జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్)	99-00
31.	మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120-00
32.	వాస్తు జ్యోతి	63-00
33.	మన ఇల్లు-మనవాస్తు	99-00
34.	వాస్తవ వాస్తుపూజావిధానము	108-00
35.	వాస్తు దర్పణం	120-00



మంత్రశాస్త్రాలు



1.	మంత్రసాధన	63-00
2.	తంత్రజాలం	63-00
3.	మంత్రశక్తి	63-00
4.	దత్తాత్రేయ తంత్రవిద్య	63-00
5.	దత్తాత్రేయ మూలికాతంత్రమ్	63-00
6.	తాంత్రిక పంచాంగం	63-00
7.	యక్షిణీ తంత్రం	63-00
8.	మంత్రానుష్ఠాన చంద్రిక	63-00
9.	సర్వదేవతా మంత్రకవచములు	63-00
10.	మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు)	63-00
11.	సర్వదేవతా మంత్రరత్నావళి	63-00
12.	సదాచార దీపిక	63-00
13.	యోగినీ-వామకేశ్వరతంత్రం	63-00
14.	ప్రపంచసారతంత్రం	63-00
15.	బదనిక తంత్రమ్	63-00
16.	ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	63-00
17.	గుప్త సాధన తంత్రం	63-00
18.	గంధర్వ తంత్రమ్	63-00
19.	సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	63-00
20.	యంత్ర మంత్ర తంత్ర	63-00
21.	పాశుపత తంత్రం	99-00
22.	పంచదశ మహాఖడ్గ తంత్రం	99-00
23.	రుద్రాష్టాధ్యాయః	99-00
24.	మంత్రసిద్ధి	120-00
25.	పరశురామతంత్రమ్	108-00
26.	శ్రీలలితావిలోమ పంచదశీ	108-00
27.	శ్రీ గురు తంత్రం	108-00
28.	గాయత్రీ తంత్రమ్	108-00
29.	మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150-00
30.	శ్రీ దుర్గ తంత్రమ్	200-00
31.	మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	200-00
32.	సర్ప (నాగ)తంత్రం	250-00
33.	హవన తంత్రం	250-00
34.	షోడశనిత్యతంత్రం	250-00
35.	శాక్తేయతంత్రం	250-00

36. రుద్రయామళతంత్రం	250-00
37. లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250-00
38. హిరణ్యశూలినీ తంత్రమ్	250-00
39. మాయాప్రత్యంగిరా తంత్రమ్	250-00
40. శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250-00
41. స్వర్ణాకర్షణభైరవతంత్రం	250-00
42. కాశీవిశాలాక్షి తంత్రం	250-00
43. శాంతితంత్రమ్	250-00
44. యంత్రసిద్ధి	360-00
45. శ్రీ లక్ష్మీ తంత్రమ్	360-00
46. మంత్రమహోదధి (స్త్రీదేవతాకల్పమ్)	360-00
47. మంత్రమహోదధి (పురుషదేవతాకల్పమ్)	360-00
48. మంత్రశాస్త్రం (గ్రంథము)	360-00
49. ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360-00
50. కామధేనువు తంత్రం	360-00
51. శూలినీదుర్గాతంత్రం	360-00
52. శ్రీవిద్య రహస్యం	290-00
53. కులార్ణవ తంత్రమ్	150-00
54. ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్)	390-00
55. సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం)	63-00



గ్రంథాలు - ఆరాధనలు

1. భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	54-00
2. భగవద్గీత (వచనం)	99-00
3. భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్	72-00
2. గణేశ ఆరాధన 1	99-00
3. గణేశోపాసన 2	99-00
4. నవగ్రహవైభవం	99-00
5. నవగ్రహ రెమెడీస్	99-00
6. నవగ్రహ వేదం	99-00
7. శనిగ్రహారాధన	99-00
8. ఆదిత్యారాధన	99-00
9. సుబ్రహ్మణ్యారాధన	99-00
10. శ్రీ శివ ఆరాధన	99-00
11. లక్ష్మీ ఆరాధన	99-00
12. హనుమదారాధన	99-00
13. లలితారాధన	99-00

14.	శ్రీ చక్రారాధన	99-00
15.	గాయత్రీ ఆరాధన	99-00
16.	వీరభద్రారాధన	99-00
17.	కుజగ్రహారాధన	99-00
18.	భైరవారాధన	99-00
19.	దైవారాధన	99-00
20.	గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత)	99-00
21.	శ్రీవేంకటేశ్వరాధన	99-00
22.	హయగ్రీవారాధన	99-00
23.	లక్ష్మీనరసింహారాధన	99-00
24.	శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం	99-00
25.	దేవీ లీలామృతం	99-00
26.	పురాణపండ సుందరకాండ వచనం	99-00
27.	పురాణపండ రామాయణం	99-00
28.	పురాణపండ భారతం	99-00
29.	పురాణపండ భాగవతం	99-00
30.	(సూరి) వాల్మీకి రామాయణం	99-00
31.	కాలసర్ప యోగం	99-00
32.	నిత్య జీవితములో రుద్రాక్షలు	99-00
33.	నిత్య జీవితములో నవరత్నాలు	99-00
34.	వేదసూక్తములు	99-00
35.	వేమన పద్యసారామృతం	99-00
36.	పండగలు పర్వదినాలు	99-00
37.	సూక్తిరత్నాలు	99-00
38.	హనుమచ్చరిత్ర	99-00
39.	నవగ్రహ దర్శనమ్	99-00
40.	నిత్యజీవితంలో నవగ్రహాలు	99-00
41.	సాలగ్రామములు	99-00
42.	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	99-00
43.	శనిగ్రహరెమిడీస్	99-00
44.	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	99-00
45.	వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి)	99-00
46.	మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,,	99-00
47.	మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,,	99-00
48.	న్యూమరాలజీ రెమిడీస్	99-00
49.	మూకపంచశతీ	99-00
50.	శ్రీరామకర్ణామృతం	99-00
51.	రహస్యకుక్కుటశాస్త్రం	300-00
52.	ఉపాసన విధానం	99-00
53.	పంచమవేదం మహాభారతం	99-00

54. దేవుళ్ళు డాట్ కామ్		99-00
55. గణపతిభాష్యం		99-00
56. యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి		99-00
57. నవయోగులు		99-00
58. ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు		99-00
59. సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో)		99-00
60. సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్)		216-00
61. సకలదేవతా సహస్రనామములు		99-00
62. ఆధ్యాత్మిక సూక్తి నిధి		99-00
63. బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు		99-00
64. సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు		99-00
65. శ్రీ లక్ష్మీసన్నిధి		99-00
66. శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం		99-00
67. మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)		99-00
68. మ్యాజిక్‌గైడ్		99-00
69. చదరంగం		99-00
70. పంచముఖ హనుమత్ వైభవం		63-00
71. గరుడపురాణం		40-00
72. మాఘపురాణం		36-00
73. శివపురాణం		36-00
74. వైశాఖపురాణం		36-00
75. కార్తీక పురాణం		36-00
76. కార్తీక పురాణం (చిన్నది)		25-00
77. సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ		63-00
78. పెద్దబాలశిక్ష		50-00
79. గాయత్రీ మహిమ		36-00
80. వృక్షదేవతలు		63-00
81. యాజుష స్మార్త సంస్కార చంద్రిక		200-00
82. సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్		150-00
83. చతుర్వేదములు		120-00
84. నవగ్రహారాధన		120-00
85. తాళపత్ర సమాహార గోపురం		120-00
86. మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు)		250-00
87. మానవధర్మములు		120-00
88. వేదమంత్ర సంహిత		120-00
89. సహస్రలింగార్చన		120-00
90. శ్రీ శివగీత		120-00
91. ద్వాదశఉపనిషత్తులు		120-00
92. పురాణపండవారి సౌందర్యలహరి	(కేస్‌బైండ్)	250-00
(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	సాదా	120-00
93. బృహత్ శివ స్తోత్ర రత్నాకరము		200-00
94. బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము		200-00
95. బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము		200-00

96. కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు	63-00
97. దక్షిణావృత శంఖములు	63-00
98. 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని	36-00
99. ధర్మసింధువు(కేస్‌బైండింగ్)	270-00
100. భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని	99-00
101. చిలుకూరి బాలాజీచరిత్ర	36-00
102. భగవత్‌స్తుతి	63-00
103. సూర్యోపాసన	36-00
104. కాశీఖండం	250-00
105. దేవీభాగవతం	360-00
106. శ్రీ ఆంజనేయం	216-00
107. ధర్మసందేహాలు	216-00
108. ఆధ్యాత్మిక దైవిక వస్తువులు	250-00
109. రామాయణం	600-00
110. పోతన భాగవతం	900-00
111. శివమంత్రములు	63-00



వైద్య గ్రంథాలు

1. ఆహారం ఆరోగ్యం	36-00
2. మూలికావైద్య చిట్కాలు	36-00
3. ఆయుర్వేద వైద్య చిట్కాలు	30-00
4. గృహవైద్య రహస్యాలు	36-00
5. గృహవైద్యసారం	36-00
6. హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	63-00
7. ప్రకృతివైద్యం	36-00
8. ఆహారం-వైద్యం	99-00
9. సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	99-00
10. ఆయుర్వేదమ్	36-00
11. ఆయుర్వేద మూలికావైద్యదీపిక	99-00
12. దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు)	99-00
13. ఏకమూలికావైద్యం	99-00
14. అష్టాంగ హృదయం (4భాగాలు)	1200-00
15. రహస్యసిద్ధయోగవైద్యసారమ్	99-00
16. ప్రాథమిక హోమియోవైద్యం	99-00
17. ఒబెసిటీ	99-00
18. హెల్త్‌గైడ్	99-00
19. ఆయుర్వేదం-జీవనవేదం	99-00
20. ఫుడ్‌థెరపి	63-00

21. న్యాచురల్‌థెరపి	99-00
22. సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	63-00
23. కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	99-00
24. యోగామంత్ర	63-00
25. యోగా మండే టు సండే	63-00
26. హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	99-00
27. హెల్త్‌ఫైల్	108-00
28. వస్తుగుణపాఠం	250-00
29. రసాయన వాజీకరణ తంత్రం	150-00
30. వస్తుగుణ మకరందం	400-00
31. నాటువైద్యం -(కేస్‌బైండ్)	360-00
32. నాటువైద్యం (చిన్నది)	99-00
33. ప్రాణాయామము-యోగ	63-00



అయ్యప్ప - భవానీ దీక్షలు

1. శ్రీ అయ్యప్ప లీలామృతం	30-00
2. శ్రీ అయ్యప్ప భజనపాటలు	63-00
3. శ్రీ అయ్యప్ప పూజాకల్పం	20-00
4. శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	20-00
5. హారతిగైకొనుమా	40-00
6. శ్రీ అయ్యప్ప దీక్ష F	10-00
7. శ్రీ అయ్యప్ప భజనమాల F	10-00
8. శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	10-00
9. శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	10-00
10. భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం)	36-00
11. దేవీలీలామృతం	99-00
12. శ్రీ దేవీ పూజాకల్పం	20-00
13. దేవీ భక్తిగీతాలు	20-00
14. భవానీదీక్ష P	10-00
15. దేవీ భక్తిమాల F	10-00
16. శ్రీ అయ్యప్ప భజనావళి	120-00
17. అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	24-00



భజనలు - కీర్తనలు

1.	అన్నమయ్య కీర్తనలు	20-00
2.	శ్రీరామదాసు కీర్తనలు	20-00
3.	సర్వదేవతా మంగళహారతులు	20-00
4.	వసుంధర మంగళ హారతులు	25-00
5.	సౌభాగ్య దేవతా మంగళహారతులు	36-00
6.	సర్వదేవతా భజనలు	36-00
7.	చిట్టి పొట్టి పాటలు	10-00
8.	జాతీయ గీతాలు	10-00
9.	దేశభక్తి గీతాలు	36-00
10.	పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	36-00
11.	గొబ్బిళ్ళపాటలు.లాలిపాటలు.కోలాటపాటలు	36-00
12.	అన్నమయ్య సంకీర్తనలు	99-00
13.	పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	36-00
14.	భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	36-00
15.	సర్వదేవతాభక్తిమణిమాల	36-00
16.	బతుకమ్మ ఉయ్యాల పాటలు	36-00
17.	అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు)	270-00



హిట్ సాంగ్స్



1.	ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత	36-00
2.	ఎస్.పి.బాలు భక్తిగీతాలు	36-00
3.	ఘంటసాల సుమధురగీతాలు	99-00
4.	పి. సుశీల సుమధురగీతాలు	99-00
5.	ఎస్.పి. బాలు సుమధురగీతాలు	99-00
6.	ఎస్.జానకి సుమధురగీతాలు	99-00
7.	వేటూరి సుందరరామమూర్తిహిట్స్	99-00
8.	సర్వదేవతా సినీభక్తిగీతాలు	99-00



స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

1.	శ్రీకాంతామణి వంటలు (వెజ్)	63-00
2.	శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	63-00
3.	శాకాహార వంటలు	30-00
4.	మాంసాహారవంటలు	30-00
5.	చిట్టిచిట్కాలు	30-00
6.	అందానికి చిట్కాలు	30-00
7.	పిల్లల పేర్లు (పెద్దది)	30-00
8.	పిల్లల పేర్లు (చిన్నది)	10-00
9.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్	36-00
10.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	36-00
11.	చిన్నారులకు చిరుతిళ్ళు	30-00
12.	పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	30-00
13.	పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	30-00
14.	వేపుళ్ళు-ఇగుర్లు	30-00
15.	బ్రేక్‌ఫాస్ట్ వంటలు	30-00
16.	పండుగలలో చేసుకొనే పిండివంటలు	30-00
17.	మైక్రోవోవెన్ వంటలు	99-00
18.	సర్వదేవతాభక్తిమాల	36-00
19.	పిల్లలపేర్లు (బాబు)	36-00
20.	పిల్లలపేర్లు (పాప)	36-00
21.	మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	36-00
22.	మోడ్రన్ పిల్లలపేర్లు	99-00
23.	నోరూరించే నాన్‌వెజ్‌వంటలు	99-00
24.	మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్)	99-00

వివిధ రకములు

ఎందరోమహానుభావులు	270-00
యోగాసనాలు	36-00
సూర్యనమస్కారములు	36-00
పొడుపు కథలు (చిన్నవి)	10-00

మావద్ద లభించు గ్రంథములు...మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం,రాజమహేంద్రవరం.

హిందీ-తెలుగు-స్వబోధిని	20-00
ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	20-00
జనరల్ నాలెడ్జ్	20-00
నూరు ఎక్కాలు	10-00
1-100 టేబుల్ బుక్	10-00
1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు)	4-50
శ్రీరామకోటి	27-00
శ్రీశివకోటి	27-00
మేజిక్	30-00
అంకెలతో గారడీ	30-00
హృదయస్పందన (కవితలు)	30-00
వాత్స్యయన కామసూత్రాలు	36-00
ఎ.పి.టూరిస్ట్ గైడు	36-00
ఇంద్రజాల రహస్యాలు	30-00
మహేంద్రజాల రహస్యాలు	30-00
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	99-00
క్రియాయోగం	36-00
ఆనందంగా జీవిద్దాం	99-00
హరిశ్చంద్ర నాటకం	50-00
వాత్సాయనకామసూత్రాలు	99-00
పంచసాయకం	99-00
రతిరహస్యాలు	99-00
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
గాయత్రీవిజ్ఞాన్	99-00
చింతామణి (నాటకం)	50-00
బాలనాగమ్మ	50-00
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	36-00
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	50-00
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	36-00
కాళహస్తి గృహవాస్తు చింతామణి	99-00
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	63-00
రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు)	90-00
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	10-00
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	80-00
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	125-00
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	40-00
కాశీరామేశ్వర మజిలీ కథలు	63-00
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)	600-00

మావద్ద లభించు గ్రంథములు...మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం,రాజమహేంద్రవరం.

ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు	595-00
ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు	
విశ్వకర్మ ప్రకాశము	80-00
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన ..	250-00
నారద సంహిత ..	150-00
వాస్తురాజవల్లభము-మూలానువాదము ..	60-00
మయమతము - వచనము ..	80-00
బృహత్సంహిత - వచనము ..	160-00
వాస్తువిజ్ఞానజ్యోతి	......
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)	....
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు ..	....
వాస్తు విజ్ఞాన చంద్రిక ..	....
మహాదశా పారిజాతం ..	....
వాస్తు నారాయణీయం ..	120-00
యోగావళీఖండం ..	120-00
ముహూర్తసింధువు	150-00
సర్వార్థచంద్రిక (4భాగాలు)	1208-00
మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్)	370-00
నిర్ణయసింధు (2భాగాలు)	590-00
సాయి... ..	45-00
శ్రీ దుర్గానందలహరి ..	200-00
ఆరతిసాయిబాబా ..	11-00
ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి)	500-00
తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర	100-00



సుమారు 100 సం॥రాలు నాటి ప్రాచీన ప్రతులు (జిరాక్స్ ప్రింట్)

శ్రీరామ మంత్రానుష్ఠానము	300-00
శ్రీరామనవరాత్రోత్సవకల్పః	300-00
సీతారామ కథా సుధ అయోధ్యకాండ	200-00
సీతారామ కథా సుధ బాలకాండ	150-00
అరణ్యకాండ	100-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు	200-00
స్మార్త కాపర్ది కారికలు	200-00
నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి	200-00
విషవైద్య చింతామణి	200-00
హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః	300-00
సర్వమూలికా గుణరత్నాకరం	300-00
ఆపస్థంబీయ ధర్మసూత్రాలు	300-00
సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం	200-00

గణకరంజని	200-00
సంతాన దీపిక	200-00
తిథినిర్ణయ కాణ్డః	250-00
ముహూర్త దర్పణం	200-00
జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి)	250-00
లఘుతాచకము	200-00
శ్రీ వైఖనస పైతృమేదిక ప్రయోగః	300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం)	400-00
జాతకామృతతసారం	300-00
జాతక బోధిని	300-00
సంగీత విద్యాదర్పణం	300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం	300-00
ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం)	450-00
జాతకరహస్యం	200-00
రాజమార్తాండం	200-00
ఆయుర్దాయదీపిక	200-00
వైద్యామృతం	200-00
అనుపానమంజరీ	200-00
నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః	200-00
చికిత్సరత్నము	200-00
స్వరచింతామణి	200-00
ద్వాదశలోహ భస్మవిధానం	200-00
దైవజ్ఞయశో విభూషణం	200-00
అనుపాన రత్నకరము	200-00
కాలామృతము	250-00
దైవజ్ఞకర్ణామృతము	300-00
రసేంద్ర చింతామణి	300-00
రసరత్న సముచ్చయం	300-00
వస్తుగుణరత్నాకరము	300-00
హోరానుభవదర్పణము	360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము	250-00
స్త్రీజన కల్పవల్లి	450-00
సంగీత సర్వార్థ సంగ్రహం	300-00
సంగీత సుధాసంగ్రహము	250-00
అర్క ప్రకాశము	200-00
సంగీత మార్తాండము	200-00
సంగీత ప్రథమబోధిని	200-00
వైద్యకల్పతరువు	200-00
రసప్రదీపిక	250-00
గణకానందము	250-00

శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో	200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం	200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక	360-00
సంగీతమార్తాండము	250-00
సారావళి	360-00
భేషజకల్పము	200-00
గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి	360-00
జాతకమణి	200-00
సర్వశకున ప్రకాశిక	200-00
యాజుష ప్రయోగ చంద్రిక	250-00
శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ	300-00
వసంతరాజ శకునము	250-00
తొట్టి వైద్యం	450-00
జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)	300-00
సహస్ర యోగప్రకాశిక	300-00
శ్రీవిద్యారహస్యం	290-00
మహర్షుల చరిత్ర 1,3 300+300	
వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము	250-00
శ్రీఆంజనేయం	216-00
రాశితుల్యవత్సర ఫలితం	200-00
నాడి జ్యోతిష విశ్లేషణ	400-00
రహస్యకుక్కుటశస్త్రం	300-00
స్త్రీ ధర్మరత్న బాండాగారము	200-00
శైవోత్సవరత్నాకరం	300-00
యాజుషప్రయోగ చిన్తామణి	300-00
సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని	300-00
ఆయుర్వేద వైద్య సంగ్రహం	300-00
వశిష్ఠ సంహిత	360-00
హోమియోపతి గృహవైద్యం	200-00
వ్రతచూడామణి	300-00
వైశ్యధర్మప్రకాశిక	300-00
ఆలయ నిత్యార్చన పద్ధతి	200-00
స్మృతిముక్తాఫలం	300-00
ఆపస్తంబయల్లాజీయమ్	300-00
జ్యోతిషశాస్త్రసంగ్రహము	200-00
కర్మవిపాకాఖ్యయం	360-00
ముహూర్త రత్నావళి	250-00
సుదివిలోచనం	300-00
ఉత్తర కాలామృతం	200-00
సర్వవిషయ సర్వస్వసంగ్రహం	200-00